ఆత్మానుసంధానము



శ్రీ శుక బ్రహ్మాశ్రమము

శ్రీకాళహస్తి

శ్రీ శుక బ్రహ్మాశ్రమ సంస్థాపకులు



శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

మొదటి కూర్పు : 1000 ప్రతులు
1989 సెప్టెంబర్

ప్రతులకు : —
మేనేజరు
శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీ కాళహస్తి
(చిత్తూరు జిల్లా)
(A. P)

Rs. 18/-

ముద్రణ :
శ్రీకృష్ణచిత్ర ప్రింటర్స్,
4, నాగేశ్వరరావు రోడ్డు,
టి. నగర్, మద్రాసు-600 017.
ఫోన్ : 44 12 86

ప్రస్తావన

ఆత్మయొక్క స్వరూపమెట్టిదో, దానిని ఏ ప్రకారము ధ్యానించవలెనో ఈ గ్రంథమునందు విపులముగ పేర్కొనబడినది. ఆత్మానుసంధానమును గూర్చిన అనేక శాస్త్ర ప్రమాణములు, మహనీయుల వాక్యములుకూడ ఇందు ఉల్లేఖింపబడినవి. ఆత్మానుభూతి ఒకటియే దుఃఖరాహిత్యమునకు, ఆనందప్రాప్తికి మార్గము. కావున ముముక్షువు ఆత్మస్వరూపమును పదే పదే మననము చేయవలసియున్నది. అట్టి మననము వలననే ఆత్మానుభవము చక్కగ కలుగుటకు అవకాశమేర్పడును. సాధకుడు తన నిజస్వరూపమగు ఆత్మను గూర్చి నిరంతరము అనుసంధానము సలుపుచు, ఆత్మ విచారణ చేయుచు ఈ జీవితమునందే ఆత్మ సాక్షాత్కారమును బడసి పరమానందమనుభవించును గాక!

ఇట్లు
ప్రకాశకులు

ఓమ్

ఆత్మాను సంధానము

అనువాదకులు

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ కాళహస్తి
1989

ఉపోద్ఘాతము

ఆత్మ యనునది దూరముగ నున్న వస్తువు కాదు. అది దేహముకంటెను, మనస్సుకంటెను కూడ సమీపముగ నున్న వస్తువు. అది తానే అయియున్నాడు. తన స్వరూపమే ఆత్మ. అది జీవునిచే ఎల్లప్పుడు పొందబడియే యున్నది. ఆత్మ సాక్షాత్కారమనగా క్రొత్తగా ఆత్మను పొందుటకాదు. తన స్వరూపముగనేయున్న ఆత్మను తిరిగి అనుభవమునకు తెచ్చుకొనుటయే యగును. కంఠాభరణమును ధరించియు మఱచి దుఃఖించువాని చందమున అజ్ఞాని ప్రవర్తించుచున్నాడు. సంసారమున దుఃఖించుచున్నాడు. అపుడు జ్ఞాని అను ఆప్తుడు వచ్చి 'నాయనా, దుఃఖింపవలదు. నీ యాభరణము ఎచటికిని పోలేదు. నీ మెడలోనే యున్నది' అని పలికినపుడు ఆ దుఃఖించువానికి ఎంత ఆనందము కలుగును?

అట్లే అనాదికాలము నుండి అవిద్యాప్రభావముచే జీవుడు 'నేను దేహమును' అని భావించి, దానితో ఐక్యమొంది కర్మజాలమును విస్తరింపజేసికొనుచు తత్ప్రభావమున జనన మరణములను బొందుచు నానాయాతనలను అనుభవించుచుండగా కర్మపరిపాకముచే సద్గురువు లభించి 'తత్త్వమసి' —నీవు ఆత్మవేకాని దేహము కాదు. అని బోధింప, ఆ గురు

వాక్యమును చక్కగ మననముచేసి, ఆత్మను సాక్షాత్కరించుకొని ధన్యుడు కృతార్థుడగుచున్నాడు. అట్టి ఆత్మచింతనమే ఈ ఆత్మానుసంధానమను గ్రంథమున ప్రధానముగ చెప్పబడినది. ఏ భావమైనను, మననముచేత లెస్సగ దృఢపడును. కాబట్టి అనాదికాలమునుండియు ఉన్న దృశ్యవాసన, దేహవాసన తొలగి ఆత్మభావము కలుగవలెనన్న నిరంతరాభ్యాసము, నిరంతర చింతనము, నిరంతరానుసంధానము చాల అవసరము. శ్రద్ధతో విశ్వాసముతో, ఏకాగ్రతతో, ఓపికతో, ఈ ఆత్మచింతనమును సాధకుడు కావించవలయును. వివేకముచే, విచారణచే అనాత్మనుండి ఆత్మను వేరుపరచి అట్టి ఆత్మయందు సదా స్థితి గలిగియుండవలెను.

ఈ ప్రపంచమున ఆత్మ, అనాత్మ, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, దృక్కు, దృశ్యము అన్నియు ఏకమై అజ్ఞానికి గన్పట్టుచున్నవి. వానిని విడదీయుటయే జ్ఞానము. వానిని విభజించి జడమును జడముగను, చైతన్యమును చైతన్యముగను భావించుటయే జ్ఞానము. కనుకనే 'విభాగ' యోగములను పేరుతో కొన్ని అధ్యాయములు గీతయందు ప్రత్యేకముగ చెప్పబడినవి. (క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము, గుణత్రయ విభాగయోగము, దైవాసుర సంపద్విభాగయోగము, శ్రద్ధాత్రయ విభాగయోగము అని.) 'విభాగ' మనగా కలిసియున్నవానిని విడదీయుట (Division) అని అర్థము. మంచి, చెడ్డ కలిసి

యున్నపుడు వానిని వేరుచేసి మంచిని గ్రహించి చెడ్డను విసర్జించుట లోకములో పరిపాటి. గుజ్జు తొక్క రెండును కలిసియున్న అరటిపండును పిల్లవానికిచ్చినపుడు అతడు వెంటనే దానిని ఒలిచి గుజ్జును తిని, తొక్కను పారవేయును. ప్రతిదినము ఉదయముననే ఇండ్లయందు గృహిణులు బియ్యము, రాళ్ళు కలిసియున్న వస్తువును చేటలో వేసికొని బియ్యము పట్టిపెట్టుకొని రాళ్ళను ఏరి పారవేయుదురు. అట్లే ఆత్మ, అనాత్మ కలిసియున్న ఈ ఉపాధియందుగాని, దృశ్యప్రపంచమునందుగాని వానిని విభజించి ఆత్మయందే చిత్తమును నెలకొల్పి అనాత్మయందు విరక్తి కలిగియుండవలెను. ఇదియే జ్ఞానము. క్షేత్రమునుండి క్షేత్రజ్ఞుని వేరుచేసి క్షేత్రజ్ఞుడే తానని భావించి క్షేత్రము యెడల అనాసక్తిని కలుగజేసికొనవలెను. అస్తి, భాతి, ప్రియ, నామ, రూపములను ఐదింటితో గూడిన ప్రతివస్తువునందును మొదటి మూడును సత్యమనియు, తక్కిన రెండును అసత్యమనియు భావము కలిగియుండవలెను.

ఇక క్షేత్రమనగా నేమియో క్షేత్రజ్ఞుడనగా నెవరో యోచించెదము. పంచమహాభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, శబ్దస్పర్శాది విషయములు, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, దేహేంద్రియాది సమూహము, అంతఃకరణవృత్తులు మున్నగునవి యన్నియు క్షేత్రమనబడును. దీనిని తెలిసికొను ప్రజ్ఞారూపమగు చైతన్యమే క్షేత్రజ్ఞుడు.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత. (13-2)

"ఓ అర్జునా! సమస్త క్షేత్రములందును క్షేత్రజ్ఞుడను నన్నుగా తెలిసికొనుము" అని శ్రీకృష్ణపరమాత్మ [illegible] 'సర్వక్షేత్రేషు', అని [illegible] (జ్ఞానాగ్ని [illegible]).

జ్ఞానము కలిగిన పిమ్మట మానవునిచే ఆచరింపబడు కర్మ కామనారహితమై, నిష్కామమై యుండును. ఫలమునందు బుద్ధికి అతీతమైన (బుద్ధేః పరం) పరమాత్మను ఎరిగినవాడు, ఆత్మస్థితి పొందినవాడు, దేహేంద్రియాది సంఘాతము కంటెను, అంతఃకరణమును సాక్షిగ చూచుచుండును. అట్టి వాడు కర్త కాడు. దేహేంద్రియాదులు తాని వాని పనులను అవి చేసికొనుచుండును వానియందేమియు తగులుకొనక అతడు నాశరహితము సనాతన పరబ్రహ్మమునందే నిలుకడ కలవాడై సచ్చిదానందానుభవము నొందును. అకర్తృబుద్ధి గలిగి యుండును. జ్ఞానియగువాడు ఒక వేళ లోకహితార్థము కర్మ చేసినను అట్టి అకర్తృబుద్ధితోనే, నిర్లిప్తభావనతోనే చేయును. అట్టి ఆ కర్మ పరమ పునీతమై, అత్యద్భుత మహిమతో ప్రకాశించును. జ్ఞాని చేయు కర్మకును, అజ్ఞాని చేయు కర్మకును గల వ్యత్యాసమిదియే. అజ్ఞాని దేహేంద్రియాది సంఘాతముతో ఏకమై, 'దేహమే నేను' అని భావించి కర్తృత్వమై కర్మల నాచరించి బద్ధుడగును. జ్ఞాని "నేను దేహమును గాను, సచ్చిదానంద రూపమై, జనన మరణ రహితమై, సనాతనమై, అవ్యయమైనట్టి ఆత్మయే నేను గాని నశ్వర దేహేంద్రియ సముదాయమును గాను"—"తద్బ్రహ్మ నిష్కలమహం న చ భూతసంఘః" అని దృఢముగ నిశ్చయించి, అహంభావమును పారద్రోలి, మమత్వరహితుడై, కర్తృత్వమును వీడి అకర్తృబుద్ధితో కర్మల నాచరించి ముక్త

మనము, గావున కర్మలు నాచరించుటకు పూర్వము వానియందు కుశలత్వము నెట్లు సంపాదింపగలమో ఆ రహస్యము నెఱుగ వలెను. అట్టి కర్మకుశలత్వము జ్ఞానము వలననే కలుగును.

కనుకనే శ్రీ కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయమున తొలుత జ్ఞానము నుపదేశించి, కర్మయందు కుశలత్వము (Non-attachment) ను సంపాదించు కీలకమును బోధించి ఆపిదప కర్మయోగము నుపక్రమించెను. 'యోగస్థః కురు కర్మాణి'—(ఆత్మయందు నిలుకడ కలిగి అనాసక్త బుద్ధితో కర్మ లను చేయుము) అను మహామంత్రమును అర్జునకు బోధించ మొదలిడెను. కాబట్టియే మహాత్ములు జ్ఞాన ప్రాప్త్యనంతరము చేయు లోకసేవ, సామాన్యులుచేయు సేవకంటె ఎన్నిరెట్లో అధికమై, నిష్కళంకమై యొప్పును. జ్ఞానమును పొందినపిదప వారి వారి సంస్కారము ననుసరించి కొందఱు నివృత్తి నవలంబించుచుందురు. మరికొందరు ప్రవృత్తిని స్వీకరింతురు. అర్జునుడు ప్రవృత్తిని స్వీకరించినప్పటికిని వారికి నివృత్తి ఫలమే కలుగును. శ్రీకృష్ణుడు, జనకుడు, భర్తృహరి మొదలగు చక్రవర్తులు, శంకరాచార్యులు, వివేకానంద మొదలగు సన్న్యాసులు జ్ఞానానంతరము లోకహితార్థము ఎంతయో కర్మకాండ నాచరించిరి. అయినను జ్ఞానప్రభావముచే వారలను కర్మ ఏ మాత్రము బంధింపకుండెను. కాబట్టి ప్రవృత్తికైనను నివృత్తికైనను జ్ఞానము సర్వప్రథమమున అవశ్యము సంపాదింపవలసియున్నది. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ—

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే (4-38)

"జ్ఞానముతో సమానమైన పవిత్రమగు వస్తువీ ప్రపంచమున ఎచటను లేదు.' అని గీతయందు జ్ఞానప్రభావమును ఎలుగెత్తి చాటెను. అయితే అపరోక్ష జ్ఞానము హృదయమున చక్కగ కలుగవలెననిన గీత 13వ అధ్యాయమున చెప్పబడిన అమానిత్వాది జ్ఞానగుణములను సాధకుడు చక్కగ నభ్యసింపవలెను. అట్టి జ్ఞానగుణముల నభ్యసించనిచో జ్ఞేయవస్తువగు పరబ్రహ్మము అనుభూతము కానేరదు.

మఱియు భగవద్గీత ఏడవ అధ్యాయమున నాలుగు రకములగు భక్తులు చెప్పబడిరి—వారు క్రమముగ—ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని పేర్కొనబడిరి.

ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ (7-18)

"వారందరును శ్రేష్ఠులే కాని జ్ఞాని సాక్షాత్ నేనే అని నా అభిప్రాయము." అని శ్రీకృష్ణమూర్తి జ్ఞానము యొక్క సర్వోన్నత స్థితిని వివరించెను. జ్ఞాని సాక్షాత్ భగవంతుడు. భగవంతునకును జ్ఞానికిని ఏ మాత్రము భేదము లేదు—అని ఆ వాక్యముల యొక్క అర్థము. ద్వైత సాధన లన్నియు క్రమ క్రమముగ వికసించి వికసించి అద్వైతము లోనికి గొనిపోవును. ఇక భగవంతుడు, భక్తుడు అను భేద మచట లేదు. ఇరువురును ఒకే సచ్చిదానంద ఘనస్వరూపమై యలరారుదురు. అదియే జీవితము యొక్క చరమ స్థితి.

ఆదియే సాధనల యొక్క అంతిమ దశ. ఆదియే జీవన్ముక్తి. జ్ఞానము యొక్క ఫలితమింత మహిమతో గూడియున్నది. కాబట్టి ప్రతివారును తమ జీవితమునందిట్టి అమోఘమగు జ్ఞానస్థితిని తప్పక సంపాదించవలయును.

జీవుని లక్ష్యమగు అట్టి ఆత్మసాక్షాత్కారము(మోక్ష పదవి) చాల గొప్పది. కాని సమయము చాల స్వల్పము. విఘ్నములు మెండు. కావున అతడు తన కీశ్వరుడిచ్చిన స్వల్ప ఆయుర్దాయమునందే తత్ప్రాప్తికై జ్ఞానసాధనరూప మహా వ్రతయత్న మాచరించవలెను. చక్కటి నియమము లేర్పరచుకొని ఇంద్రియములను మెల్ల మెల్లగ వశీభూత మొనర్చుకొనుచు చిత్తమునందు గల ఆసురిక సంస్కారములను క్రమ క్రమముగ పారద్రోలుచుండవలయును. తన స్వరూపము పాంచభౌతికము గాదనియు, సచ్చిదానంద మనియు మఱల మఱల చింతన జేయవలెను. ఈ ప్రకారముగ నియమము తప్పక ప్రతిదినము సాధన చేయుచుండినచో అచిర కాలములో వతనికి గొప్ప మనశ్శాంతి, పరమానందానుభూతి తప్పక కలుగ గలవు. ఇట్టి పరమ సత్యములను జ్ఞాపకము చేసికొనుచు, స్వస్వరూపానుభవమను పరమ లక్ష్యమును సాధించుటకై జీవుడు ఈ క్రింద తెలుపబడిన ప్రకారము కొన్ని తీవ్రతర ప్రతిజ్ఞలను గావించుకొనవలసి యున్నది

1. తాను ఆత్మయే కాని దేహము కాదు. తనకు ఏ కాలమందును వినాశము లేదు. నశించునది, వికారము నొందునది, మరణించునది దేహమే కాని దేహియగు తాను కాదు. ఈ ప్రకారముగ తన యొక్క 'సత్' అంశమును మాటి మాటికి మననము చేయుచుండవలెను.

2. తాను జడమగు ఒకానొక మట్టిబొమ్మ కాదు. మృణ్మయుడు కాదు. చిన్మయుడు. ప్రజ్ఞాన ఘనస్వరూపుడు. సుషుప్తియందును మేలుకొనియుండు చిద్రూపాత్మయే తాను—ఈ ప్రకారముగ తన యొక్క 'చిత్' అంశమును మఱల మఱల చింతన చేయుచుండవలెను.

3. తాను సంసారదుఃఖములందు పడి క్రుంగిపోవు కీటకము కాదు. ఆనందసాగరమున నోలలాడు బ్రహ్మాండాధిపతి. నిప్పును చెదలు అంటజాలనట్లు దుఃఖశోకము లెవ్వియు తన్ను స్పృశింపజాలవు. ఈ ప్రకారముగ తన యొక్క 'ఆనంద' అంశమును మాటి మాటికి మననము చేయుచుండవలెను.

ఈ రీతిగా తాను 'సత్, చిత్, ఆనంద' రూపుడగు పరబ్రహ్మమే యను పరమ సత్యమును ప్రతి దినము పెక్కుసార్లు జ్ఞాపకము చేసికొనవలయును.

"తద్బ్రహ్మనిష్కలమహం న చ భూతసంఘః"

నిష్కళంకమగు ఆ పరబ్రహ్మమే నేను గాని పంచభూత సముదాయమగు దేహముకాదు' అని శ్రీ శంకర భగవత్పాదు లానతిచ్చినట్లు ప్రతి జీవియు తన నిజరూపమును దినమునకు ఎన్నియో పర్యాయములు స్మృతిపథమునకు తెచ్చుకొనుచుండవలెను. తాను దరిద్రుడు కాదనియు, సమ్రాట్టనియు, మహా చక్రవర్తియనియు విశ్వసామ్రాజ్యాధిపతి యనియు భావించవలెను. ఇదియే జ్ఞానసాధన.

యద్భావం తద్భవతి

తానెట్లు భావించునో అట్లే యగును. కావున ప్రాతఃకాలము నిద్రలేచినది మొదలు మరల పరుండు వఱకును, వ్యవహార మధ్యమున గూడ యిట్టి మహోన్నత గంభీర భావములను పలుసార్లు జ్ఞప్తికి తెచ్చుకొనుచుండవలెను. అట్లు జ్ఞాపకము చేసికొనునపుడు "ఓమ్, ఓమ్, ఓమ్" అని ప్రణవమును గూడ స్మరించుచుండుట ప్రారంభమున చాల సహాయకారిగ నుండగలదు.

మఱియు, జనులు వారి వారి సంస్కారము ననుసరించి కర్మమార్గమును గాని, భక్తి మార్గమును గాని, ధ్యాన మార్గమును గాని, జ్ఞానమార్గమును గాని చేబట్టి, వైరాగ్యమును, సర్వభూతదయను అన్ని మార్గములకు తోడుగ దీసికొని ఆధ్యాత్మికపథమున అగ్రగణ్యులై ఆత్మస్వరూపమును గూర్చిన విజ్ఞానమును చక్కగ బడసి అచిరకాలములోనే

ఆత్మ సాక్షాత్కార రూప చరమలక్ష్యమును సాధించివేయవలెను. అట్టి లక్ష్యసాధనకు మిక్కుటముగ ఉపకరించు ఏ ఆత్మ తత్త్వవిచారణకలదో అద్దానినిపుడు కావించెదము.

ఆత్మ తత్త్వ విచారణ

ఏది వేదము యొక్క సారమై యలరుచున్నదో, సమస్త చరాచర ప్రాణికోట్లును ఏ యానందస్వరూపమును పొందదలంచుచున్నవో, ఎద్దాని ప్రాప్తికై జీవులు భిన్న మార్గముల ననుసరించుచున్నారో అట్టి ధ్యేయాకారమగు పరబ్రహ్మమే ఆత్మ. సర్వవ్యాపకమై, సర్వజీవులందును సాక్షిరూపమున వెలుంగుచు, ప్రపంచమున కంతకును ఆధారభూతమై యొప్పుచు జగత్తు అంతయు నశించినను తాను మాత్రము నశింపక జన్మజరా మరణాది క్లేశములచే గాని, పదార్థముల యొక్క వికారములచే గాని యంటబడక విశుద్ధమై, ఇంద్రియాతీతమై బుద్ధ్యాది సంఘాతమునంతయును గూడ ప్రకాశింపజేయుచు నెయ్యది వెలయుచున్నదో, అదియే ఆత్మ. వ్యాస వసిష్ఠాది మహామునీంద్రులు విహరించు స్థానమదియే. సనకాది మహర్షులు సంచరించు క్షేత్రమయ్యదియే. జీవన్ముక్తులగు యోగీశ్వరులందఱును క్రీడించు దివ్యానందమయ రంగమదియే, ఆ క్షేత్రము బుద్ధికి అవలనున్నది. కావున మనోబుద్ధులకు వశులైన వారికి ఇంద్రియములను జయింపని వారికి అద్దాని తత్త్వము బోధపడనేరదు.

లౌకిక విద్యలెన్ని గడించినను చిత్తశుద్ధి లేనిచో ఆత్మతత్త్వము లేశమైనను అనుభూతము కాదు. ఎట్టి మహాపండితుడైనను నేత్రము లేనిచో వస్తువులను జూడగల్గునా? సకల శాస్త్ర పారీణుడైనను, విద్యాధురంధరుడైనను నిద్రపోవుచో జాగ్రత్ప్రపంచవిషయములాతనికి గోచరించునా? సామాన్యుడైనను నేత్రములుండినచో చూడగల్గునట్లును, మేల్కొనినచో సమస్త వస్తుజాలమును గాంచ గలిగి యితరులను గూడ ప్రబుద్ధులుగ జేయగలుగునట్లును, ఈ ఆత్మ విద్యను గూర్చియు నట్లే యెఱుంగవలెను.

ప్రశ్యన్నపి ప్రస్థలతి శృణ్వన్నపి న బుధ్యతి
పఠన్నపి న జానాతి దేవమాయా విమోహితః.

"చిత్తశుద్ధి గలుగక పూర్వము జనులు మాయావృతులై యున్న కారణమున అట్టివారు పరమార్థతత్త్వమును జూచినను చూడకయే యున్నారు. వినినను తెలియజాలకయే యున్నారు. చదివినను అర్థము చేసికొనజాలకయే యున్నారు" అని విష్ణుభగవానుడు గరుత్మంతున కెఱిగించెను. ఇదియే తక్కిన విద్యలకును ఈ ఆత్మ విద్యకును గల భేదము కనుకనే అనేకులలో నెవడో యొకడు మాత్రమే ఈ విద్యను గూర్చి ప్రయత్నించుటయు, అట్లు ప్రయత్నించిన యనేకులలో నెవడో యొకడు మాత్రమే సఫలుడగుటయు సంభవించుచున్నది. మఱియు పరిపూర్ణ స్థితిని బొంది ఆత్మ వస్తువును

కరతలామలకముగ నెఱిగిన జ్ఞానులు లోకమున బహు కొద్ది మంది మాత్రమే యుండుటకును నిదియే కారణము.

దృశ్యవాసనలన్నియు సంపూర్ణముగ నశించుట చేతను, సంకల్ప వికల్పములన్నియు ఉడిగి మనస్సు ధ్యేయాకారమున సంలగ్నమగుట చేతను, భ్రమరకీట న్యాయమువలె ఆత్మతో తదాకారాకారితమగుట చేతను దప్ప మఱి దేని చేతను ఈ ప్రబలమగు మాయ నశింపదు తక్కిన యోగములు, ధ్యానములు, పూజలు, జపములు అన్నియు అంతఃకరణము నందలి మాలిన్యమును తొలగించి వైచి క్షేత్రమును శుద్ధము చేయును. అట్టి శుద్ధాంతఃకరణమున ఆత్మ ప్రతిబింబించును. అనాత్మ భూతములగు దృశ్యవృత్తులన్నియు తొలగిననే ఆత్మస్థితి ఘటిల్లును. అపుడే ఆత్మ నిరావరణమై భాసిల్లును.

నిజముగ విచారించినచో ఆత్మయొక్క ఆవరణము తొలగించుటయే మన పని గాని, లేని ఆత్మ వస్తువును క్రొత్తగా పొందుట గాదు. శంకరులు వచించినది చూడుడు-

ఆత్మాతు సతతం ప్రాప్తోఽప్య ప్రాప్తవదవిద్యయా,
తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకంఠాభరణం యథా.

అనగా, ఆత్మ ఎల్లప్పుడును జీవులకు సంప్రాప్తించియే యున్నది. కాని అవిద్యచే అయ్యది లేని చందమున వర్తించుచున్నది. ఆ అవిద్య నశించిన వెంటనే మఱచిన నిజ కంఠా

భ్రమణమును వలె తిరిగి దానిని జీవుడు పొందుచున్నాడు. కాబట్టి జీవులందఱును యథార్థముగ ఆత్మ స్వరూపులే. భ్రమచే తాము బద్ధులమని అజ్ఞానులమని తలంచుచున్నారు. ఇయ్యది అతీత బోధ. ఇదియే పరమ సత్యము. రజ్జువునకు ఏ కాలమందును వికారము లేదు. సర్పభ్రమ కలుగక మునుపును, కలుగు కాలమునను, భ్రమ నివారణానంతర మును గూడ అయ్యది ఒకే విధమున నున్నది. ఘటమున్నప్పుడును, లేనప్పుడును అందలి జలము చలించుచున్నపుడును, నిశ్చలముగ నున్నపుడును గూడ సూర్యుడు ఒకే విధముగ ఎల్ల కాలములందును ప్రకాశించుచున్నాడు. అదే రీతిగ మార్పు అంతయు చిత్తమునకు కలుగుచుండ ఆత్మ స్వరూపుడగు జీవుడు అజ్ఞాన కాలమున ఆ మార్పు తనపై నారోపించుకొని ఆ యుపాధితో తాదాత్మ్యమొంది దుఃఖితుడగుచున్నాడు. ఎట్లనగా కదలుచున్నది రైలు బండి, కాని అందున్న బాలుడు చెట్లు కదలుచున్నవని తలంచుచున్నాడు. తిరుగుచున్నది భూమి. కాని ఆ సత్యము తెలియని వాడు సూర్యుడే పరిభ్రమించుచున్నట్లు భావించుచున్నాడు.

"దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ"

అనగా పరుగిడుచున్నవి మేఘములు. కాని అవి [illegible]డుడు పరుగిడుచున్నట్లు తలంచుచున్నాడు. వెయ్యేల - [illegible]విధ శరీరములతోటి తాదాత్మ్యమే జీవునకు బంధ[illegible]వు. దీనిని బట్టి యథార్థముగ ఈ జన్మ పరంపరలు,

సుఖదుఃఖాది ద్వంద్వములు అన్నియు అంతఃకరణమునకే గాని ఆత్మకు కావని స్పష్టమగుచున్నది. ఆత్మ సదా నిర్వికారమై, ఏకరసమైయే యొప్పుచున్నది.

మనస్సునకు ఈవల నుండి చూచిన శరీరము, జగత్తు, బంధము మున్నగునవి యన్నియు గోచరించును. అట్లు మనస్సున కీవల నున్నంత వఱకును జీవుడు సంసార చక్ర పరిభ్రమణము నుండి తప్పించుకొన జాలక, అనేక జన్మ పరంపరాది దుఃఖముల ననుభవింపవలసినదే. దాని నివారించుట కెవరికిని శక్తి లేదు.

ప్రకృతి యొక్క అప్రతిహతమైన నియమమది. అనగా దృశ్యవాసనలు, సంస్కారములుండునంత వఱకును, లింగ శరీరమున్ను ఉండియే తీరును గావున నవుడు జన్మాది దుఃఖములు కలుగుచునే యుండును. ఎపుడు మనస్సును దాటి ఆవలకు పోవునో, అపుడే జగత్తుగాని, దేహము గాని యేవియు నుండవు. ఒకే పరమాత్మ చైతన్యము తానై వెలుగుచుండును. స్వప్నము నుండి మేల్కాంచిన, స్వప్న జగత్తు అసత్యమగునట్లు, మనస్సును దాటినచో మనఃకార్యమగు జగత్తున్ను అసత్యమై, ఒకే సద్వస్తువు ప్రత్యక్షము కాగలదు. అపుడు రెండవ వస్తువే యుండదు. ఆ యేకమగు సద్వస్తువే బ్రహ్మము; అదియే ఆత్మ.

అట్టి ఆత్మయొక్క స్వరూపమేమియో ఒకింత యోచిం

చెదము. అది సాంతమా, అనంతమా! సాకారమా, నిరాకారమా! క్షణికమా, శాశ్వతమా! ఈ మున్నగు విషయములు విచారణీయములు. జాగ్రత్తగ ఏకాగ్రబుద్ధితో పరిశీలించిన ప్రతి వానికిని తనలో ఏదో యొక వస్తువు ఎల్ల కాలములందును సమముగ ఏ మార్పును లేక యున్నట్లు గోచరము కాగలదు. అది 'నేను' 'నేను' 'నేను' అని స్ఫురించునదియే. అదియే ఆత్మ. బాల్యకాలమందు ఏ 'నేను' అనునది కలదో, యౌవనకాలమందును, వృద్ధాప్యమందును ఆ 'నేనే' కలదు. దేహమే పరిణామమొందుచున్నది. కాని ఆ 'నేను' అనునది ఎపుడును, అన్ని దశలందును సమానముగనే యున్నది. అట్లే భూత భవిష్యద్వర్తమాన కాలములందును, జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలందును ఆ 'నేను' నిర్వికారమై సమముగ వర్తించుచున్నది. ఏలయనగా, పూర్వమున్న 'నేను' ఇప్పుడున్న 'నేను' ఒకటి కానిచో పూర్వము చూచిన వస్తువు యొక్క స్మృతి యిపుడు కలుగనేరదు. అదే రీతిగా, 'నేను స్వప్నమును గాంచితిని, నేను హాయిగ నిదురించితిని' అను ప్రత్యగభిజ్ఞ జాగ్రత్తునందు కలుగుట వలన జాగ్రత్స్వప్న సుషుప్తుల మూడిటియందును ఒకే 'నేను' అనువర్తించి యున్నదను సత్యమును అన్వయ వ్యతిరేకముల ద్వారా మనము స్పష్టీకరింపగలుగుచున్నాము. దీనిని బట్టి ఆత్మ ('నేను' అనునది) నిర్వికారమని ఋజువైనది. ఏ వస్తువు నిర్వికారమో అది తప్పక అనంతమై యుండ

వలెను. ఈ విషయమును వైజ్ఞానిక శాస్త్రరీత్యా యిపుడు తేల్చుటకు యత్నించెదము.

ప్రపంచములో నున్న సమస్త పదార్థములును ఆకారముతో గూడినవే, అనగా అనేక అణువుల యొక్క సంఘాతములే అయియున్నవి. ఆ అణువులు స్థూలపంచభూత మయములు అయినను, లేక సూక్ష్మ పంచభూతమయములు అయినను సరియే. కాబట్టి ఏదియో యొక సమయమున ఆ యణువులు తమ కారణరూపమున లీన మొందవలసియే యుండును, అనగా తమ యాకృతి గోల్పోవును. లేక వికారవంతములగును. అట్లుగాక నిర్వికారముగ నున్నచో, ఆ వస్తువు అణువుల సంఘాతము కాక యుండవలెను.

అణువుల సంఘాతము కానిది ఆకారవర్జితమై, అత్యంత సూక్ష్మమై యుండును. ఏది ఆకార వర్జితమో, అత్యంత సూక్ష్మమో అయ్యది తప్పక అనంతమై పరగవలయును. దీనిని బట్టి సర్వావస్థలందును నిర్వికారమై చెన్నొందు ఆత్మ అనంతమనియే స్పష్టమగుచున్నది.

ప్రతివారిలోను ఈ ఆత్మ ('నేను') కలదు. పై నిర్వచనమును బట్టి అందరిలోను అది అనంతమైయే యుండవలెను. అయితే అనంతమైనది ఒకటే యుండును గాని రెండు అనంతములుగాని, అనేక అనంతములు గాని యెప్పటికిని సంభవింపవు. అట్లు సంభవించుచో అది అనంతమనియే చెప్ప

బడదు; సాంతమే యగును. దీనిని బట్టి అందఱి ఆత్మయు ఒకటేయని తేలినది. ఇంతవఱకు విచారించిన దానిని బట్టి ఆత్మ ఏకమని, సత్యమని, నిర్వికారమని, అనంతమని నిశ్చయించినాము.

అయితే ఇక జగత్తు మాట యేమిటి? అది ఎక్కడి నుండి వచ్చినది? ఆత్మ, జగత్తు రెండును ఎట్లు సత్యము కాగలవు? ఒకే రాజ్యమునకు ఇద్దరు చక్రవర్తు లెట్లుండ గలరు? కావున నిది యేమియో విచారించెదము—పాశ్చాత్య సిద్ధాంతమునందు జగత్స్థితిని గూర్చిన రెండు వాదములు కలవు — (i) విజ్ఞానవాదము (Idealism) (ii) భౌతికవాదము (Realism or materialism) అని. మొదటి పక్షము వారు జగత్తు కేవలము భావములచే నేర్పడినదనియు, స్థూలముగ కానుపించు ఈ జగద్రూపము సత్యము కాదనియు చెప్పెదరు. ఈ వాక్యమునందు కొంత సత్యము కలదు గాని అయ్యది పూర్ణసత్యము కానేరదు. ఏలయనిన భావములకు ఆధారమేదేని యుండియే తీరవలెను. భిత్తి లేక చిత్రముండనట్లును, జలము లేక తరంగముండనట్లును, ఆధారమేదేని లేనిచో ఆధేయములగు భావములు నిలువజాలవు. ఆ యాధారమే అనగా అధిష్ఠానమే ఆత్మ. అట్టి ఆత్మయను అధిష్ఠానముపై రజ్జువునందు సర్పమువలె అజ్ఞానముచే కల్పింపబడినదై ఈ జగత్తు పరమార్థదృష్టిచే ఆత్మకంటే వేఱుగాక వర్తించు చున్నదే యగును.

ఇక భౌతిక వాదులు ఈ జగత్తు ఏ రీతి కానుపించు చున్నదో అదియే సత్యమని చెప్పెదరు. ఈ సిద్ధాంతమున్ను సరికాదు. ఏలయనగా, ఈ దృశ్యజగత్తు స్వప్నమున గాని, సుషుప్తియందు గాని లేదు. ఏది సత్యమో అది యెల్లకాలము లందును ఉండవలెను. మఱియు సత్యమైన వస్తువు అందఱికిని అన్ని వేళలందును ఒకే విధముగ గన్పించవలెను. ఈ జగత్తో జంతువుల కొక విధముగను, పక్షుల కొక విధముగను, మనుజుల కొక విధముగను భిన్న భిన్నముగ కానుపించు చున్నది. ఇక మనుజులలో గూడను వారి వారి మనస్తత్త్వము లను బట్టి కొందఱికి ఒకప్పుడు దుఃఖమయముగను, మఱి కొందఱికి ఆనందయుక్తముగను గోచరమగుచున్నది. కాబట్టి ఈ కానుపించు జగత్తు సత్యముకాదు. అజ్ఞానముచే కల్పింపబడిన దేహేంద్రియ మనోరూపమగు ఉపాధివలన ఆత్మయే యీ జగద్రూపమున దృశ్యమానమగుచున్నదనుటయే పూర్ణసత్యము.

అట్లుకాక ఒకవేళ ఆత్మ నుండియే ఈ జగత్తు పుట్టు చున్నదని తలంచుచో అపుడాత్మ వికారవంతమగును మఱియు దాని అనంతత్వ, నిత్యత్వములకున్ను హానియు కలుగును. కాబట్టి ఆ సిద్ధాంతమున్ను సమ్మతము కాదు. నిజమేమనిన ఆత్మ నిర్వికారముగ ఎప్పటి యట్లే నిజ సచ్చిదానంద స్వరూపముతోటి వెలయుచున్నది. మనస్సను అద్దము గుండా జూచువారలకది జగద్రూపమున గోచరించు

చున్నది. కావున నామరూపాత్మకమును, క్షణికమునగు ఈ జగత్తు వలన ఆత్మయొక్క నిత్యత్వ, అనంతత్వ, నిర్వికారత్వములకు ఏ హానియు లేదు.

ఇక ఆత్మ అనంతమను విషయమును మఱియొక విధముగ స్పష్టపఱచెదము-భూతాకాశము, చిత్తాకాశము, చిదాకాశము అను మూడాకాశములు కలవు. అందు చిదాకాశమే ఆత్మ, భూతాకాశమును మ్రింగునది చిత్తాకాశము, చిత్తాకాశమును మ్రింగునది చిదాకాశము. భూతాకాశమే యెంతయో గంభీరమై, విశాలమై, సర్వవ్యాప్తమై, అతిసూక్ష్మమై యుండ ఇక చిదాకాశమెంత మహిమాతిశయము గలిగియుండును! ఈ విషయమునే యిపుడు వివరముగ తెలిసికొందము-అనేక వేల మైళ్ళ విస్తీర్ణముగల భూఖండములును, మహా సముద్రములును గొప్ప గొప్ప పర్వతములును గలిగియున్న ఈ భూగోళము యొక్క నిడివి 8 వేల మైళ్ళు. భూమికంటె సూర్యుడనేక రెట్లు పెద్దది. దాని నిడివి దాదాపు 8 లక్షల మైళ్ళు ఉండును. అంత పెద్దదైనను 9 కోట్ల మైళ్ళ దూరమున నుండుట బట్టి ఆ సూర్యగ్రహము చాల చిన్నదిగ మనకు కనుపించుచున్నది. సూర్యుడు అగ్నిమయము. అపుడపుడందు ప్రచండవాయువులు వీచుటచే అగ్నిజ్వాలలు వీచుచుండును. ఆ విధముగ వీచునట్టి ఒక్కొక్క అగ్నిజిహ్వయందు మన భూగోళము లెన్నియో పట్టును. దీనిచే సూర్య

బింబము యొక్క అతి విశాల రూప మొకింత అవగాహము కాగలదు. ఇక నక్షత్రము లేపదార్థములు, ఆకాశము నలంకరించు చిన్న చుక్కలా? కాదు. ఒక్కొక్క నక్షత్రమున్ను సూర్యుని వంటి అతి విశాల పదార్థమే. ఇంతే కాదు. ఈ సూర్యుని కంటె అనేక రెట్లు పెద్దవగు నక్షత్రములనేకములు కలవు. కాని ఈ మన సూర్యుని కంటె చాలా దూరమున నుండుటచే అయ్యవి చిన్న చుక్కల వగిది దృగ్గోచరమగుచున్నవి. నక్షత్రము లెంత దూరమున నున్నవో యూహించుటకొక మార్గము కలదు. అది యేదనిన — ప్రకాశము యొక్క వేగము సెకండునకు దాదాపు 186 వేల మైళ్ళు. అనగా కనుఱెప్పపాటు కాలములో ప్రకాశము 186 వేల మైళ్ళు పోవునని యర్థము. ఇంత మహా వేగము గల ప్రకాశమున్ను నక్షత్రముల నుండి బయలుదేఱి భూమిని చేరవలెననిన ఎన్నియో సంవత్సరముల కాలము పట్టును. అంతియే కాదు. కొన్ని నక్షత్రముల ప్రకాశము భూమి నింకను చేరలేదనియే కొందఱు ఖగోళశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఆహా! ఎంత వైశాల్యము! అటువంటి అసంఖ్యాకములగు విశాలనక్షత్ర, సూర్య, చంద్ర గ్రహాదులను తన కుక్షియందుంచుకొనిన యీ భూతాకాశమెంత విశాలమైనదో ఒక్క పర్యాయ మూహింపుడు! ఇట్టి యనంతాకాశము చిత్తమున కన్యముగ లేదు. ఏలయనగా సంకల్పము వలననే ఈ జగత్తు ఉద్భూతమగుచున్నది. ఆ చిత్తమో,

"విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్"

అనునట్లు ఆత్మయందెచటనో కల్పితమైయున్నది. ఇక నట్టి ఆత్మ యెంత విశాలమైనదో, అనంతమైనదో యూహింపుడు. ఏ సచ్చిదాకాశమున చిత్తాది సూక్ష్మ ప్రపంచము, స్థూలరూపములగు ఈ యనంతకోటి బ్రహ్మాండములు ఉదయించి, స్థితి గలిగి, తుదకు లయించుచున్నవో అట్టి పరమాత్మ అనంతమని వేరుగా చెప్పవలయునా?

ఇంకను ఆత్మ స్వప్రకాశరూపము గలది; దేని చేతను అది ప్రకాశింపబడదు. అదియే సమస్త దృశ్య పదార్థములను ప్రకాశింపజేయుచున్నది. ఈ ప్రకాశమానుడగు సూర్యునకు గూడ స్వతఃసత్త లేదు. ఆత్మసత్త చేతనే యాతడు ప్రకాశించుచున్నాడు. కాబట్టి సూర్యుడా యాత్మను ప్రకాశింపచేయజాలడు. ఘటము దీపమును ప్రకాశింప చేయగల్గునా? కావుననే శ్రుతులు—

"తమేవభాన్త మనుభాతిసర్వం, తస్యభాసా
సర్వమిదం విభాతి"

అని పేర్కొనినవి. అనగా ఆ యాత్మ యుండుటచేతనే యీ సమస్త పదార్థములును సత్తగలిగియున్నవి కాని, లేకున్న వానికి ఉనికియే సంభవింపదనిభావము. ఘటము నుండి మృత్తికను తీసివైచిన ఇక మిగులునదేది? తరంగము నుండి జలమును తీసివైచిన ఇక తరంగమెచట? కాబట్టి

ప్రతి పదార్థమునందును గల అస్తి, భాతి, ప్రియ, నామ రూపములను అయిదు అంశములలో మొదటి మూడును అనగా అస్తి, భాతి, ప్రియములు (లేక సత్, చిత్ ఆనంద ములు) బ్రహ్మరూపములగుటచే సత్యములును, తక్కిన నామ రూపములు రెండును జగద్రూపములగుటచే మిథ్యయు అయి యున్నవి. చిత్ అనగా ప్రజ్ఞానము, తెలివి.

శ్లో॥ యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ।
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞానముదీరితమ్ ॥

అని ఈ ప్రకారముగ ప్రజ్ఞానముయొక్క స్వరూపము ఉపనిషత్తుల యందు నిర్వచింపబడినది. అనగా, దేనిచే ప్రాణి చూచుచున్నాడో, వినుచున్నాడో, మూర్కొనుచున్నాడో, వచించుచున్నాడో, రుచులను తెలిసికొనుచున్నాడో అట్టి తెలివియే ప్రజ్ఞానము, లేక ఆత్మ. అయితే వినునది, చేయునది, చూచునది ఆత్మకాదు. ఏ తెలివి (ప్రజ్ఞానము) చే వినుచున్నామో, చేయుచున్నామో, చూచుచున్నామో అది ఆత్మ. అట్లుకాక ఆత్మ చేయునది, చూచునది యగుచో త్రిపుటి (జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము) యందంతర్గతమై వికారయుక్తమగును. ఆత్మకు వికారము సమ్మతము కాదు. అయ్యది ఆ త్రిపుటికి విలక్షణమై, దాని కాధారభూతమై, అద్దానని ప్రకాశింప జేయుచు చిద్రూపమై వెలయుచున్నదే యగును.

ఈ ఆత్మ దేహము కాదు, ప్రాణము కాదు, ఇంద్రియములు కాదు, మనోబుద్ధ్యహంకారములు కాదు. వీని యన్నిటికిని పరమై, సాక్షీభూతమై యది ప్రకాశించుచున్నది. ఏలయనగా ఆ దేహాదులన్నియు (జాయతే, వర్ధతే-ఇత్యాది) షడ్వికారములతో గూడినవి కావున నశ్వరములు. ఆత్మయో నాశరహితము. అది వాని వికారములచే నంటబడక, వాని చేష్టలన్నింటిని సాక్షిరూపమున గాంచుచున్నది.

శ్లో॥ దేహేంద్రియమనోబుద్ధి ప్రకృతిభ్యో విలక్షణమ్ ।
తద్వృత్తిసాక్షిణం విద్యాదాత్మానం రాజవత్సదా ॥

అని శ్రీ శంకరులు వచించిన లాగున, రాజు తన యాజ్ఞచే మంత్రులు మున్నగువారు గావించు వ్యవహారములను సాక్షీభూతముగ వీక్షించునట్లు దేహేంద్రియాదులు ఆత్మ సన్నిధాన బలముచే వ్యవహరించుచుండ, వానికి సంబంధింపక ఆ యాత్మ సాక్షిగా జూచుచున్నది. కాబట్టి ఈ దృశ్యమంతయు ఎన్ని వికారములు పొందుచున్నను ఆత్మ నిర్వికారమై, అవ్యయమై, అచంచలమై నాటకమందలి దీపము వలె సదా ఏక రసముగ భాసిల్లుచున్నది. నాటకమందనేక పాత్రధారులు వచ్చిపోయినను దీపము వారల నందఱిని ప్రకాశింప జేయుచు వారల సుఖదుఃఖములచే నంటబడక వారున్నను, లేకున్నను ఏకరీతి వెలుగుచుండును గదా! అట్లే ఈ ఆత్మ జ్యోతియును.

ఆత్మయొక్క స్వరూపతత్త్వ విచారణములందు కపిలుని సాంఖ్యము చాలా వఱకు ఉపకరించును. అది యెట్లో యిపుడు విచారించెదము. ఈ దృశ్యమానమగు పదార్థములన్నియు నిరంతరము పరిణామ మొందుచునే యున్నవి. సూక్ష్మాణువు లహర్నిశము ఆయా పదార్థముల నుండి లేచి అన్య పదార్థములందు ప్రవేశించుచు విశ్రాంతి లేక నిరంతరము సంచరించుచునే యున్నవి. ప్రాణులు భుజించినది మలాదుల ద్వారా బాహ్య ప్రదేశమునకు బోయి యెఱువుగా పరిణమించి మరల యే వృక్షమందో సూక్ష్మరూపమున ప్రవేశించి ఫలాదులగుచున్నది. జలబిందువులు ఆవిరియై మేఘరూపమొందుచున్నవి. ఒకరు ఒదిలిన గాలి మఱియొకరు పీల్చుచుండుటచే ఒకరి యందలి అణువులు మఱియొకరి యందు ప్రవేశించుచున్నవి. ఇపుడున్న ఈ దేహము ఇంకో యేడు వత్సరములకు సంపూర్ణముగ మారి నూతనాణువులతో గూడినదగుచున్నది. ఆ పాత అణువులన్నియు ఇతర జగత్పదార్థములందు జొరబడినవని యర్థము. నేడు ఒకని దేహముపై గల అణువు రేపు జంతువునందో లేక వృక్షమందో ప్రవేశింపవచ్చును. లేదా సూర్యాదిగోళములందు చేరవచ్చును.

ఈ రీతిగ ప్రపంచమున అనవరతము గొప్ప పరిణామము జరుగుచున్నది. కాని స్థూలదృష్టిచే జగత్తు స్థిరముగా నున్నట్లే తోచుచున్నది. మన దేహమందలి

పృథ్వ్యంశమునకును, బాహ్యమందలి పృథ్వ్యంశమునకును, ఏ భేదమున్ను లేదు. అట్లే జలాగ్ని వాయ్వాకాశములను గూర్చియు నెఱుఁగవలెను. కాబట్టి మన స్థూలదేహము సమష్టి స్థూలదేహము (విరాట్) యొక్క అంశమే యగును. విరాట్ సాగరమున మన స్థూలదేహమొక తరంగమువంటిది. అనగా మనుష్య పశు పక్షి క్రిమికీటాదుల శరీరములన్నియు ఆ విరాడ్దేహమను సముద్రమున వివిధ తరంగములని భావము. కావున వాస్తవముగ జూచిన మనుష్య దేహమునకును, జంతు దేహమునకును, కీటక దేహమునకును ఏమియు భేదము లేదు.

అదే రీతిగ వ్యష్టి మనస్సు, సమష్టి మనస్సు (హిరణ్యగర్భుడు) యొక్క ఒక భాగము కాబట్టి మన మనస్సు, జంతువుల మనస్సు అన్నియు ఒకే అపంచీకృత భూత సముదాయమందలి వివిధ భాగములై యున్నవి. ఇపుడు వ్యష్టిని సమష్టియందైక్యపఱచి, అనగా స్థూలశరీరమును విరాడ్దేహము (విశ్వము) నందును, వ్యష్టి మనస్సును సమష్టి మనస్సునందును భావనచే లయమొనర్చి వ్యష్టి సమష్టులకు సాక్షియై విలసిల్లు స్వస్వరూపాత్మ స్థితియందు నెలకొని యుండుటను లెస్సగ అభ్యసించవలెను. అత్తఱి కష్టపరంపర లన్నియు పటాపంచలై పోగలవు. సంసార దుఃఖదావానలము పరిపూర్ణముగ శమించిపోగలదు. ఆత్యంతిక భవదుఃఖోపశమనమునకు ఆత్మతత్త్వవిచారణయే ఏకైక మార్గము.

కాబట్టి ముముక్షువు లెల్లరు అహర్నిశము తత్త్వవిచారణ గావించుచు నిత్యమై, శుద్ధమై, ముక్తమైనట్టి పరంజ్యోతియగు ఆత్మ స్వరూపమును చక్కగ అవగాహన మొనర్చుకొని అట్టి పరతత్త్వమున, స్వస్వరూపమున బాగుగా నిలుకడ గలిగి పరమానందమును బడయువలయును.

చంద్రకళలు వృద్ధినొంది వృద్ధినొంది పౌర్ణమినాడు పరాకాష్ఠస్థితి నందుకొనునట్లు, ఈ ప్రకారముగ మానవుడు తన జీవిత కాలమున స్వప్రయత్నముచే వికాస మొంది వికాస మొంది తుట్టతుదకు దేవుడుగా మారిపోవును. మానవుడు ఏనాటికైనను పూర్ణత్వమును బొందియే తీరవలెను. మానవుడు మాధవుడు కాగలడా యను సంశయము జనులలో పెక్కురికి గలదు. ఆ సంశయమును మహర్షులు తమ జీవిత దిగ్దర్శనముచే పటాపంచలు చేసివైచిరి. అనవరత పురుష ప్రయత్నముచే, సంతతాభ్యాసముచే, గొప్ప పట్టుదలచే మానవుడు తన జీవిత లక్ష్యమును త్రుటిలో సాధించివేయ గలడు. అకుంఠిత దీక్షతో సాధన నుపక్రమించినచో అచిర కాలములో యతడు గమ్యము చేరగలడు.

బియ్యపు గింజపై పొట్టు (ఊక) ఉన్నంతవఱకు అది వంటకు ఉపయోగపడదు. రోటిలో వేసి దంచుట అను క్రియచే ఆ పొట్టు తొలగిపోవ ఉపయోగార్హమగును. అట్లే జీవుడు అజ్ఞానమను ఆవరణచే గప్పబడి యున్నంత వఱకు తనకు గాని, ఇతరులకు కాని ఉపయోగపడడు. పుణ్యకార్య

చరణ, ధ్యానము, ఇంద్రియ నిగ్రహము, మనస్సంయమము, ఆత్మవిచారణ మొదలగు పరమార్థ క్రియలచే అజ్ఞానరూపమగు ఆవరణ తొలగిపోవ, జీవుడు అత్యంత నిర్మలుండై తాను తరించి ఇతరులను గూడ తరింపజేయుచుండును. మఱియు బియ్యపు గింజపై పొట్టు ఉన్నంత వఱకు అది (నేలలో పెట్టినచో) మొలకెత్తుచునే యుండును. అట్లే అజ్ఞానము అవిద్యయను ఆవరణ యున్నంతవఱకు జీవుడు జన్మపరంపరను బొందుచునే యుండును. దానినెట్లైనను తెగద్రుంచి వేయుటకు మనుజుడు విశ్వ ప్రయత్నము గావించవలయును. అది యున్నంతవఱకు జీవునకు చేటు తప్పదు. కనుకనే మహనీయులు అట్టి అవిద్యను త్రుంచివేయు వఱకు ఏమాత్రము విశ్రమించలేదు. తుదకు తమ లక్ష్యమును సాధించివైచిరి. ప్రతి జీవియు దుఃఖరహిత స్థితి చేరుకొనగలడు. నిర్వాణమను పరమానందస్థితి అందరి యొక్కయు జన్మహక్కు. దానిని ఈ జన్మయందే సాధించవచ్చును. మహర్షుల యొక్క ఈ దివ్య సందేశమును ఆలకింపుడు —

"ఓ జీవులారా! ప్రయత్నశీలురు కండు! పవిత్రమగు ఈ మానవజన్మ అంతముకాక పూర్వమే లక్ష్యమగు నిర్వాణమును సాధించివేయుడు! సోమరితనమునకు తిలాంజలి యొసంగుడు! పురుష ప్రయత్నమును జేబట్టుడు! పట్టుదలతో సాధించుడు! మీరు తప్పక గమ్యస్థానమును జేరగలరు!

పాపకార్యములను చేయకుడు! పుణ్యకార్యములను,

ధర్మకార్యములను ఆత్మోన్నతికి హేతుభూతములగు పవిత్రకార్యములను విరివిగ జేయుడు! చక్కటి శీలమును అభివృద్ధి జేసికొనుడు! పుట్టినది భోగములనుభవించుటకు గాదు. ఇంతవఱకెన్నియో జన్మలనుభవించినది చాలదా? ఇక యోగమునకై మఱలుడు! మనస్సును, ఇంద్రియములను నిగ్రహించుడు. భోగవిలాసములనుండి మనస్సును మఱలించుడు! మనస్సు నిగ్రహింపబడినచో, ఇంద్రియములు అదుపులోనున్నచో అఖండమైన ఆనందానుభూతి కలుగగలదు. ఈ వాక్యమును ముమ్మాటికిని నమ్ముడు! ఆత్మ విశ్వాసముకలిగియుండుడు! మిమ్ములను మీరే యుద్ధరించుకొనుడు! పెద్దలయెడల, సద్గురువుల యెడల వినయ విధేయతలు గలిగియుండుడు. పరప్రాణికి మేలుచేయుడు, ఎవరికిని అపకారము చేయకుడు. సర్వభూతదయ, అహింస, సత్యము మొదలగు ఉదాత్తధర్మములను కార్యాన్వితమొనర్పుడు. బాహ్యాభ్యంతర శుచిత్వమును అలవాటు చేసికొనుడు. మిక్కుటమగు ఓర్పుగల్గి ధర్మములన్నిటిని క్రమక్రమముగ సాధించివేయుడు. అట్లు సాధించనిచో జీవితము నిరుపయోగమైపోవును. కావున జాగరూకులై యుండుడు!"

ఇదియే మహర్షులు జనులకు గావించు మహోపదేశము. మనుజుని శీలనిర్మాణము మోక్షరూపలక్ష్యమును సాధించుటయందు అతి ముఖ్యమైనది. శీలము సరిగాలేనిచో సాధన

చతుష్టయ సంపత్తి చక్కగ చేకూరనిచో జ్ఞానబీజములాతని యందెట్లంకురించగలవు? కనుకనే గీతయందును శ్రీకృష్ణ భగవానుడు జనుల శీలనిర్మాణ విషయములో అతిజాగరూకత వహించి అనేక సుగుణములను పొందుపఱచెను.

అగాధమగు ప్రేమ, విశాలమగు హృదయము ప్రతివారును కలిగియుండవలెను. ప్రేమ బంధువర్గమునకే పరిమితముగాక, మానవకోటివఱకే హద్దులు నిర్మించుకొనక, చరాచర ప్రాణికోట్లయందును విస్తరించవలెను. ప్రేమ ప్రవాహము పరిధులు త్రెంచుకొని పరవళ్ళు త్రొక్కుచు బయలుదేరి విశాల ప్రపంచమునంతను ఒక్కుమ్మడి కౌగలించుకొనవలెను, జంతుజాలము యెడల, కృమికీటకాదులు యెడల గూడ ప్రేమ, దయ, కరుణ విస్తరించవలెను. 'హృదయ వైశాల్యము' గలిగియుండవలెను.

సామాన్య మానవుడు ఈ ప్రకారముగ తన ప్రయత్నాతిశయముచే, తీవ్ర అధ్యవసాయముచే, అకుంఠిత దీక్షచే సాక్షాత్ భగవానుడు కాగల్గును. ప్రతిజీవియు తన సత్ప్రయత్నములచే మహోన్నత ఆధ్యాత్మిక శిఖరముల నధిరోహించగలడు కావున మహాత్ముల జీవితముల నాదర్శముగ గైకొని, వారి యడుగుజాడల నడుచుచు వారు కావించిన ధర్మోపదేశములను, అమూల్యబోధనలను జనులు కార్యాన్వితి మొనర్చుకొనుచుండవలెను. ప్రతిబింబమగు విశ్వమును

బట్టి వ్రేలాడక, దృశ్యము వైపునకే అహర్నిశములు పరుగిడక, దృక్స్వరూపమగు చిన్మయ పరమాత్మను గూర్చి సదా విచారణ సల్పుచుండవలయును.

ఏలయనిన విశ్వముకంటె విశ్వేశుడు గొప్పవాడు. ముక్కుపుడకను లావణ్యముగ తయారుచేసిన స్వర్ణకారునికంటె దానికాధారభూతమగు ముక్కును తయారుచేసిన దేవుడు ఇంకను గొప్పవాడు. విశ్వపరిశోధనకంటె విశ్వేశుని గూర్చిన పరిశోధన మహత్తరమైనది. అవశ్యకమైనది. ఆనందమొసంగునది. విశ్వము ప్రతిబింబము. భగవంతుడు బింబము. ప్రతిబింబము క్షణికమై, అస్థిరమై, కాలమునకు అధీనమైయుండును. బింబము శాశ్వతమై, స్థిరమై, దేశకాలాదులకు వశముకాక యుండును. కావున విజ్ఞుడగువాడు బింబభూతుడగు పరమాత్మను ఆశ్రయించి దుఃఖరహితుడై, జననమరణరూప శృంఖలముల నుండి విముక్తిని బడయవలయును. నామరూప ప్రపంచమును బట్టుకొనియే నిరంతరము కాలము గడుపరాదు.

అంత్యకాలమున జీవుని రక్షించునదేదియో ముందుగనే యోచనచేసి దాని విషయమై తగు జాగ్రతలు గైకొనవలెను. 'నహి నహి రక్షతి' అని శ్రీశంకరులు ఉద్ఘాటించినట్లు ప్రాపంచిక విద్యావైదుష్యముగాని, అధికారం కీర్తి ప్రతిష్ఠలు గాని, సంపదలుగాని యమబాధ నుండి జీవుని

తప్పించజాలవు. 'భజ గోవిందమ్' అనునది ఒకటియే శరణ్యము. కావున గోవిందుని ఎంత శీఘ్రముగ భజించిన అంత శ్రేయమును మనుజుడు పడయగలడు. ఆత్మవిజ్ఞానమును ఎంత త్వరితముగ పొందిన అంత కృతకృత్యుడు కాగలడు. తానెవరో, ఈ జగత్తు ఎట్టిదో, బంధవిముక్తికి మార్గమేదియో పెద్దలవలన, శాస్త్రములవలన గ్రహించి సత్యస్వరూపమైన తన ఆత్మయందు నిలుకడ కలిగి జీవితలక్ష్యమును సాధించి వేయవలెను. ఈ పని ఎంత శీఘ్రముగ నెరవేర్చబడిన అంత మంచిది. ఆత్మానుభూతి విషయమందు ఏమాత్రము జాగు చేయరాదు. జీవితము అనేక ఆటంకములతోను, ప్రమాదములతోను, ప్రతిబంధములతోను గూడియున్నది ఇట్టి పరిస్థితులందు విజ్ఞుడగువాడు గొప్ప పట్టుదలతో గూడి, ఎన్ని అవాంతరములు వచ్చినను లెక్కసేయక, ఆత్మసాక్షాత్కారరూపలక్ష్యమును ఈ జీవితమందే త్వరితముగ సాధించి వేయవలెను.

జనులు తమ దృష్టిని యావత్తు బాహ్యవస్తుపరిశోధనమందే నిమగ్నమొనర్చుచున్నారు. కాని అభ్యంతర విచారణయందు కాదు. వారు విశ్వమును శోధించుచున్నారే కాని హృదయమును సంశోధించుటలేదు. బాహ్యమున లక్షల కొలది మైళ్ళు ప్రయాణము సలుపుచున్నారే కాని అంతర్ముఖముగ ఒక్క అంగుళమైనను పోవుటలేదు. శాంతి తనయందే కలదు కాని బాహ్యమున కాదను సత్యమును మనుజు-

-డెంత శీఘ్రముగ గ్రహింపగల్గిన అంత ధన్యుడు కాగలడు. తన స్వరూపమును గూర్చి, తన చిత్తమందలి గుణదోషములను గూర్చి, మనస్సున దాగియున్న బహుజన్మార్జిత సంస్కారములను గూర్చి బాగుగ విచారణ సల్పి దోషభూయిష్ఠమగు దానిని తొలగించివేయవలయును. దీనినే ఆత్మపరిశోధన (Self-introspection) అందురు.

దీపపు చిమ్నీని ప్రతిదినము తుడుచుచుండినచో ఎట్లు శుద్ధముగా నుండునో. రాగిపాత్రను ప్రతిరోజు తోముచుండినచో ఎట్లు నిర్మలముగా నుండునో, అట్లే ప్రతిదినము ఆత్మపరిశోధన చేసికొనుచుండినచో జీవుని యందిక మాలిన్యము ప్రవేశించుటకు అవకాశముండదు. ఆత్మపరిశోధనచే అసుర సంస్కారములను పారద్రోలుటకు, దైవసంస్కారములను రాబట్టుకొనుటకు చక్కని అవకాశమేర్పడగలదు. ఇంటిలో దొంగలు ప్రవేశించి దొరలవలె మెలగుచున్నారు. ఆ దొరలను దొంగలని గ్రహించుటలోనే ఉన్నది మానవుని విజ్ఞత. ఏ క్షణమందు వారు దొంగలుగ ఎఱుంగబడుదురో, ఆ క్షణమందే వారు పలాయనము చిత్తగించుదురు. కామక్రోధాద్యసుర వృత్తులన్నియు ఈ రీతిగనే బహుకాలము నుండియు జీవుని యందు తిష్ఠవేసికొనియున్నవి. ముముక్షువగువాడు ఆత్మ పరిశోధనచే ఆ దుర్వృత్తులను చెండాడి హృదయమును నిష్కంటక మొనర్చుకొనవలెను. ఈ ప్రకారముగ ఆవరణము తొలగినపుడు మలవిక్షేపములు అంతరించినపుడు ఆత్మయొక్క

అనుభూతి ప్రత్యక్షముగ సంభవించగలదు. అదియే మోక్ష స్థితి. కావున అట్టి మహోన్నత లక్ష్యసాధనకై జీవుడు అనవరతము యత్నించుచు, తన హృదయమును నిరంతరము పరిశోధించుకొనుచు, దుర్వృత్తులకు, దృశ్య వ్యామోహమునకు కించిత్తైనను అవకాశ మొసంగక, సదా ఆత్మ పరిశోధన మొనర్చుకొనుచు బహుజాగరూకుడై వర్తించవలెను.

'నాస్తి జాగరతో భయమ్' అని శాస్త్రము ఉద్ఘోషించిన చందమున వివేకదీపమును చేతగైకొని అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయుచు నుండువాని నిక సాంసారిక దుఃఖము లేవియు బాధించ నేరవు. జన్మార్జిత వాసనాబలముచే ఇంద్రియము లెపుడెపుడు చెలరేగునో, మాయాప్రవాహము వైపునకు ఈడ్వఁబోడగునో, అపుడపుడు 'హన్యాత్ వివేకదండేన' అని వసిష్ఠులానతిచ్చినట్లు వివేకమను కఱ్ఱచే వానిని కొట్టి వశపఱచుకొనవలెను. అనగా ఆత్మ పరిశోధన మొనర్చుకొని తత్త్వజ్ఞానము యొక్క సహాయముచే వైరాగ్యమును బడసి ఇంద్రియాదులను స్వాధీనము చేసికొనవలెను.

కస్త్వం కోఽహం కుత ఆయాతః
కా మే జననీ కో మే తాతః
ఇతి పరిభావయ నిజసంసారం
సర్వం త్యక్త్వా స్వప్నవిచారమ్.

"నీవెవడవు? నేనెవరు? మనమెక్కడనుండి వచ్చినాము? నా తల్లి యెవరు? నా తండ్రి యెవరు? ఈ ప్రకారముగ ఆలో-

-చించి స్వప్నప్రాయమగు ఈ దృశ్యవర్గముపై మమత్వమును త్యజించుడు" అని మహనీయులు పలుకుచున్నారు. శాస్త్రములున్ను అట్లే ఆదేశించుచున్నవి. తానెవరో చక్కగ విచారించి తాను పంచకోశములకు సాక్షియై విరాజిల్లు శాశ్వత ఆత్మయే కాని నశ్వర దేహాది దృశ్యరూపము కాదని నిశ్చయించి అట్టి ఆత్మయందే సదా నిలకడ కలిగియుండులాగున చూడవలెను. తాను జడవస్తువు కాదనియు త్రికాలములందును నిర్వికారమై వెలయు చైతన్యమే యనియు నిరంతరము భావించుచుండవలెను. ఇట్టి పరమార్థయత్నముచే అచిరకాలములో జీవునియందు అపూర్వమగు పవిత్రత ఉదయించగలదు. పుటముచే మట్టము బంగారము మేలిమి బంగారముగ మారునట్లు, సామాన్యుడగు జీవుడు ఆత్మపరిశోధనచేతను, ఆత్మవిచారణచేతను సాక్షాత్ శివుడుగ మారిపోగలడు. నరుడు నారాయణరూపుడై చెన్నొందగలడు. బద్ధుడు ముక్తుడై విలసిల్లగలడు. స్వాత్మరూపసింహము చిత్రరూపశృంఖలములను విచ్ఛిన్న మొనర్చివేసి బహుకాలబంధమునుండి తప్పించుకొని, మృత్యు సంసారసాగరమునుండి బయటపడును. అట్టి స్వారాజ్యస్థితి యత్నశీలునకే లభ్యమగునుగాని ఏ సాధనయు చేయని సోమరికి కాదు.

కాబట్టి మానవత్వమను గొప్ప సదవకాశము లభించి శాస్త్ర సజ్జనసాంగత్యమను దివ్యౌషధము సంప్రాప్తమైన ఈ తరుణముననే జనులు ఆత్మతత్త్వ విచారణాదులచే తమ

భవరోగములను బాపుకొని నిత్యశాంతిని అనుభవించవలెను. ప్రాపంచిక దృష్టిని త్యజించి ఆత్మదృష్టిని, దైవదృష్టిని శీఘ్రముగ అలవరచుకొనవలెను.

సమ్యక్–దృష్టి

జనులలో కొందఱికి దేహదృష్టి, కొందరికి మనోదృష్టి, కొందఱికి ఆత్మదృష్టి యుండును. దేహదృష్టి గలవారు అధములు. ఒక ప్రాణిని చూసినప్పుడు ఆ ప్రాణియొక్క దేహ సౌందర్యమును, పరిమాణమును, రూపురేఖలను మాత్రము వారు చూచుచుందురు. మనోదృష్టిగలవారు మధ్యములు. వీరు ప్రాణియొక్క మనోభావములను, పాండిత్య గరిమను చూచుచుందురు. ఇక ఆత్మదృష్టిగలవారు ఉత్తములు. వీరు ఏ ప్రాణిని చూచినను లోని ఆత్మనే వీక్షించుచుందురు. ఇదియే సుదర్శనము. దేహములు, మనస్సులు వేఱువేఱుగానున్నను, పరిణామము నొందుచున్నను సర్వజీవులకును ఆత్మ యొకటియే. కావున ఆత్మదృష్టిగల అట్టి వుత్తములు సమస్త ప్రాణికోట్లయందును సమభావము గలిగియుందురు. సర్వుల యెడల ప్రేమను, దయను వర్షించుచుందురు. విద్యావినయ సంపన్నుడగు బ్రాహ్మణునియందును, గోవునందును ఏనుగునందును, కుక్కయందును, కుక్కమాంసము వండుకుని తిను చండాలునియందును సమదృష్టి కలవారే పండితులని గీతాచార్యుడు పేర్కొనియున్నాడు. అదియే సమ్యక్ దర్శనము.

సుదర్శనము. అట్టి సుదర్శనమును, సమ్యక్ దృష్టిని కలిగియుండుటయే మానవుని లక్ష్యము.

విష్ణువు సుదర్శనచక్రమును ధరించియుండునని చెప్పుదురు. ఆ చక్రమునకు ముల్లోకములందును ఏదియు అడ్డురాదు. ఒకవేళ అడ్డువచ్చినను నిలువనేరదు. అట్లే సుదర్శనము కలిగియుండువాడు అనగా సమ్యక్ దృష్టి, జ్ఞానదృష్టి, ఆత్మదృష్టి, సర్వాత్మభావము గలవారు అవిద్యనంతను పటాపంచలు చేసి, తమస్సును, అజ్ఞానమును విధ్వంసమొనర్చి సర్వత్ర పరమాత్మనే వీక్షించుచు, ఆధ్యాత్మిక విజయదుందుభిని మ్రోగించుచు బ్రహ్మానందయుతుడై వెలుగుచుండును. వెయ్యేల, సుదర్శనము (సమ్యక్–దృష్టి) గలవాడు సుదర్శనధారియే (సాక్షాత్ విష్ణువే) అయి చెన్నొందుచుండును.

కాబట్టి ప్రయత్నాతిశయముచే, అభ్యాస ప్రాబల్యముచే మనుజుడు తన జీవితమందే దైవదృష్టిని సమ్యక్-దృష్టిని, సుదర్శనమును చక్కగ పెంపొందింపజేసికొనవలెను. నామరూపములను మిథ్యగను, అధిష్ఠానమగు ఆత్మను సత్యముగను వీక్షించవలెను. దృశ్యము లేనిదనియు, ఏనాటికైన మరుగైపోవుననియు భావించి భోగలాలసను పరిత్యజించి, విషయముల యెడల విరక్తి కలిగి ఆత్మోన్ముఖుడు కావలయును. బాహ్యదృష్టిని తగ్గించుకొనుచు అంతర్దృష్టిని అభివృద్ధిపఱచుకొనుచుండవలెను.

'ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్' అను గీతావాక్యరూప మహామంత్రమును సదా జపించుచు, బయటకు పరుగెత్తుకొని పోవుచుండు మనస్సును విచారణా బలముచే లోనికి తీసుకొని వచ్చి ఆత్మయందు స్థాపించి పునః విషయములపై దూకకుండ చేయవలెను. దేహాదిదృశ్య వస్తువులందుగలజన్మ, మృత్యు, జరా, వ్యాధిరూప దుఃఖములను పదే పదే చింతనజేయుచు, అట్టి దోషానుదర్శనముచే వైరాగ్యమును బలపఱచుకొనుచుండవలెను. అట్లే ఆత్మయొక్క శాశ్వతత్వ, ఆనందరూపత్వములనుగూడ లెస్సగ భావించుచుండవలెను. ఈ రెంటియొక్క అభ్యాసముచే, అనగా దృశ్యముయొక్క అల్పత్వమును చింతన జేయుటచేతను దృక్స్వరూపమగు ఆత్మయొక్క గాంభీర్యమును భావన యొనర్చుటచేతను సమ్యక్-దృష్టి లెస్సగ చేకూరి 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అనునట్లు సాధకుడు సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడై విలసిల్లును. కాబట్టి జనులు తమ ప్రయత్నాతిశయముచే ఆత్మదృష్టిని చక్కగ బలపరచుకొని, సుదర్శనయుతులై, విష్ణువుయొక్క సుదర్శనము మాడ్కి ప్రపంచంలో ఎదురులేనివారై, ప్రశాంతహృదయులై సర్వత్ర బ్రహ్మమునే వీక్షించుచు జీవితమును దైవమయముగ నొనర్చుకొనవలెను.

ఈ ప్రకారముగ ఆత్మదృష్టి బడయుటకై తీవ్రతర యత్నమును సలుపుచు మనుజుడు దేహాభిమానమును పూర్తిగ

తొలగించుకొనవలెను. తాను జడమైన దేహముకాదనియు నిత్యశుద్ధబుద్ధ ముక్త ఆత్మస్వరూపమేయని అహర్నిశము భావించుచుండవలెను. ఆత్మ సత్యవస్తువు. దేహము కల్పిత వస్తువు. సత్యవస్తువునకు ఉన్న విలువ కల్పితవస్తువునకు లేదు.

మనుష్యునకు ఉన్న విలువ మనుష్యుని నీడకు లేదు. బింబమునకు ఉన్న విలువ ప్రతిబింబమునకు లేదు. అట్లే ఆత్మకున్న విలువ దేహమునకు లేదు. దేహము క్షణకాలము ఉండిపోవునది. అట్టి మూడున్నరమూర్ల, దేహమును ధరించి జగన్నాటకమాడి మరల తెరవెనుకకు పోవువాడు, కర్మబంధమున తగుల్కొని వున్నవాడు. అల్పశక్తి గలవాడు అగు జీవుడు అజ్ఞానవశమున తన్నుమించినవాడు లేడని మిడిసిపడుచుండును. అధికార గర్వముచే ధనమదముచే, సౌందర్య మదముచే, దేహాభిమానముచే పాండిత్యదర్పముచే ఎదుటి వానిని లెక్కసేయక తన్నుమించినవాడు త్రిభువనములందు లేడని ప్రవర్తించుచుండును.

దీనికి కారణము పెద్దల సాంగత్యము లేకుండుటయే. చక్కని శాస్త్ర పరిజ్ఞానము కొఱతపడుటయే. ఆధ్యాత్మిక అనుభూతి లేకపోవుటయే.

సత్యము నెఱుగనంతవఱకే మనుజునకు తన అల్పశక్తులనుగూర్చిన గర్వముదయించుచుండుచు. సమ్యక్-జ్ఞానముదయించినచో, దేహముయొక్క నశ్వరత్వమును గూర్చిన

పరిజ్ఞానము కలిగినచో, ఇక అభిమానము, గర్వము, మదము మున్నగునవి వెంటనే కాలికి బుద్ధిచెప్పగలవు. కావున జీవుని గర్వభంగమునకు సమ్యగ్జ్ఞానమే ముఖ్యహేతువై యున్నది. అట్టి జ్ఞానమేదియో తెలిసికొందము—

'జ్ఞానం సమ్యగవేక్షణం' — అను ఉపనిషద్వాక్యము సమ్యక్ దృష్టియే జ్ఞానమని నిర్వచించుచున్నది. అనగా ఉన్న దానిని ఉన్నట్లుగను, లేనిదానిని లేనట్లుగను చూచుటయే జ్ఞానమనబడును. ఆత్మసత్యము, దేహాది నామరూపములు అసత్యములు— అని యెఱుఁగుటయే జ్ఞానము. ఇట్టి సమ్యక్-జ్ఞానము వలన పరమాత్మ యెడల భక్తి, జగత్తుపై విరక్తి సహజముగనే కలుగుచుండును. అట్టి జ్ఞానము లేనివారికి 'ఊర్ధ్వమూలం అధఃశాఖం' అనునట్లు అంతయు తల్లక్రిందులుగనే గోచరించుచుండును. ఉన్నది లేనిదిగను, లేనిది ఉన్నట్లుగను గన్పట్టును. త్రికాలములందు సత్యమై, తనక్రింద, తన పైన, తనప్రక్కల, తనలోపల అంతటను వ్యాపించియున్న దైవమును, ఆత్మను గుర్తెఱుఁగక, తాను ధరించిన బుట్టబొమ్మను (దేహమును) మాత్రము సత్యమని తలంచి దాని సౌందర్యము, దాని అందము, దాని చందము చూచి కులుకుచుండును. ఎంత వెఱ్ఱి! రేపోమాపో కాటికిచేరి పదికట్టెలలో ఒక కట్టెగా రూపొందు తన పాంచభౌతిక కాయముపై ఏ మమత్వము, ఏ అభిమానము, ఏ అహంభావము జీవునకు కలదో అదియే అతని పతనమునకు మూలకారణమగు

చున్నది. ఆ ప్రీతి, ఆ ఆసక్తి, ఆ అభిమానము తన ఆత్మపై నున్నచో మనుజుడు ఏనాడో మోక్షము పొందియుండెడి వాడు.

అయితే బహుకాలమునుండి జీవుని హృదయమందు రూఢిపడియున్న ఈ దేహాభిమానమును, తజ్జనితమగు గర్వాదికము తొలగుట ఎట్లు? గాఢముగ జీర్ణించియున్న ఈ దుర్వాసన వెడలిపోవు మార్గమేది? విచారణ చేయవలెను. విచారణచేతనే హ్రస్వదృష్టి అంతరించగలదు. 'ఈ అనంతమగు విశ్వములో నేనెంత, నా దేహమెంత, నా ఊరెంత, నా పరిజనమెంత?'— అని మరల మరల చింతనచేయవలెను. ఇట్టి విచారణయందు ఈ క్రింది అంశములు చక్కగ ఉపకరించగలవు—

రైలుబండియొక్క వేగము 1 గంటకు దాదాపు 60 మైళ్ళు. విమానముయొక్క వేగము 1 గంటకు దాదాపు 300 మైళ్ళు. కాంతియొక్క వేగము 1 గంటకు దాదాపు 67 కోట్ల మైళ్ళు.

ఒక సంవత్సరకాలమునకు కాంతి (Light) ఎంత దూరము ప్రయాణముచేయునో దానిని కాంతిసంవత్సరము (Light year) అందురు. అనగా ఒకకాంతి సంవత్సరమునకు 5865696000000 మైళ్ళు (అనగా దాదాపు 6 లక్షలకోట్ల మైళ్ళు). ఖగోళశాస్త్రజ్ఞులు ఆకాశముపై గల అగణిత

నక్షత్రరాసులయొక్క దూరమును ఈ కాంతి సంవత్సరమను అడుగుబద్దతో కొలిచెదరు. మనకు అతిసమీపమున గల నక్షత్రముయొక్క దూరము 4 కాంతిసంవత్సరములు. అనగా 4×5366696000000 మైళ్ళు (అనగా దాదాపు 23 లక్షల కోట్ల మైళ్ళు) ఆకాశమున ముగ్గుతో అలికినట్లు కానిపించు పాలపుంతలో ఎన్నికోట్ల నక్షత్రములు కలవో చెప్పతరము గాదు; మన సూర్యుడున్ను ఒక నక్షత్రమే. అయితే అతి సమీపమున నుంటుటబట్టి తేజోవంతముగ గన్పట్టుచున్నాడు. భూమినుండి సూర్యుని దూరము దాదాపు 9 కోట్ల మైళ్ళు. మన సూర్యునిచుట్టు, ఒక్కొక్క నక్షత్రము చుట్టు ఎన్నెన్ని గ్రహములు తిరుగుచున్నవో! వానిలో మనవలెనే ఎన్నెన్ని జీవరాసులున్నవో! ఒక పర్యాయము రాత్రికాలమున ఆకాశమును పరికించినచో, కోటానుకోట్ల మైళ్ళు దూరమున ప్రశాంతముగ పరిభ్రమించుచున్న ఆ తేజోరాసులను వీక్షించినచో, ఆయాగ్రహ తారామండలమును గూర్చి ఊహించినచో, అనంతవిశ్వముయొక్క గాంభీర్యము, భగవానునియొక్క సర్వజ్ఞత సర్వశక్తిమత్వములు దృగ్గోచరములు కాగలవు. అవుడే గర్వము పలాయనమై దైవభక్తి ఉదయించగలదు.

మానవుడు అపుడపుడు ఈ అనంత బ్రహ్మాండ కుహరమును గూర్చి విచారించుచు తనలో తానిట్లు వితర్కించుకొనవలెను— "ఈ అనంతాకాశములో మన సూర్యుడెంత! సూర్యునిచెంత నలుసువలె గోచరించు ఈ భూమి యెంత! భూగోళములో ఆసియా ఖండములో భారతదేశమెంత! భారతదేశములో ఆంధ్రప్రాంతమెంత! ఆంధ్రప్రాంతములో నా జిల్లా ఎంత! నా జిల్లాలో నా ఊరెంత! నా ఊరిలో నా ఇల్లెంత! నా యింటిలో నేనెంత!"— అని ఈ ప్రకారముగ ఆలోచించినచో ఇక గర్వమునకు, అహంకారమునకు చోటే లేకుండును. ఇట్టి విషయములు యోచించని కారణముచేతనే అల్పుడగు జీవునియందు దర్పము ప్రవేశించుచున్నది. మఱియు నాస్తికుడై సర్వజ్ఞుడగు పరమాత్మను విస్మరించుచుండుటయు సంభవించుచున్నది. అనంత విశ్వమందేచోటనో మూలపడియుండు జానెడు జీవుడు, రేపో మాపో నామరూపములు లేకుండ అదృశ్యమైపోవు దేహము గల ఈ క్షణిక జీవి, శాశ్వతుడై సర్వజ్ఞుడై, బ్రహ్మాండ వ్యాపకుడైనట్టి పరమాత్మను విస్మరించి దర్పముతో వ్యవహరించుట చాల శోచనీయము. ఇట్టి అహంకారము ఎంత శీఘ్రముగ విలయమైపోయిన అంత శ్రేయస్కరము.

కావున, విజ్ఞుడగువాడు నశ్వరమగు తన ఉపాధి యొక్క ఘనతను గూర్చి చింతింపక శాశ్వతమగు తన హృదయస్థ ఆత్మను గూర్చియే పర్యాలోచించుకొనుచు, గర్వాదులను వీడి భగవద్భక్తియుతుడై, సర్వేశ్వరుని యొక్క అపార కృపకు పాత్రుడై ఆత్మానంద మనుభవించవలెను. దేహాభిమానమును పూర్తిగ విడనాడవలయును. దేహముపై

మమత్వమును తొలగించుకొనవలెను. వాస్తవముగ ఈ దేహమునకు తనకు ఏ మాత్రము సంబంధము లేదు. దేహము జడమైనది, పంచభూతాత్మకమైనది.

దేహము-దేహి

ఈ దేహము ఎవరిది? అని భాగవతమునందు ఒక ప్రశ్న లేవదీయబడినది.

దేహః కిమన్నదాతుః స్వం నిషేక్తుర్మాతురేవ చ
మాతుః పితుర్వా బలినః క్రేతురగ్నేః శునోఽపి వా. 1
ఏవం సాధారణం దేహమవ్యక్తప్రభవాప్యయమ్
కో విద్వానాత్మసాత్ కృత్వా హన్తి జన్తూనృతేఽసతః. 2
(భాగవతము 10-10-11,12,)

ఈ దేహము ఎవరిది?

అన్నము పెట్టి పోషించువానిదా? పుట్టించిన తండ్రిదా? తొమ్మిది నెలలు మోసిన తల్లిదా? తల్లిని కనినట్టి తాతదా? దీనిచేత పని చేయించు బలవంతునిదా? శ్మశానములో దీనిని కాల్చివేయు అగ్నిదా? రుద్రభూమి యందు దీనిని కొరికి కొరికి తినివేయు కుక్కలదా? అని భాగవతకారుడు నిలదీసి ప్రశ్నించెను. భాగవతము దశమస్కంధములో నారదుడు నలకూబర, మణిగ్రీవులను దేవపుత్రులకు కావించిన హితోపదేశ సందర్భమున ఈ ప్రశ్న కావింపబడెను. ఈ ప్రశ్నకు నారదులే ఈ ప్రకారముగ సమాధానము ఒసంగివైచిరి—

నాయనలారా! ఈ దేహము ఎవరిదీ కాదు. ఇది యొక సామాన్యమైన జడవస్తువు. మృత్తికా నిర్మితమగు ఘటము వంటిది. ప్రకృతి నుండి పుట్టి ప్రకృతిలో లయమై పోవుచున్నది. ఇట్టి అల్పవస్తువును 'నేను' అని తలంచి ఇతరులకు కీడు చేయదలంచు వారు ఎంత అవివేకులు? కావున నశ్వరమై, పాంచభౌతికమైనట్టి ఈ శరీరము తాను కాదనియు శాశ్వతమగు చిన్మయ ఆత్మయే తాననియు బాగుగ నిశ్చయించుకొని, సర్వప్రాణులు తన స్వరూపమేయని భావించుకొని, ఎవరికిని అపకారము చేయక జీవితమును గడుపవలయును.

మానవునికి కలుగుచున్న దుఃఖమంతటికిని కారణము ఈ దేహాభిమానమే. దేహముపైనను, దేహమునకు బయట గల పదార్థములపైనను గల మమత్వమే దుఃఖమునకు హేతువు. జీవుడు ఉపాధిని ధరించి లోకమున వ్యవహరించుచున్నప్పటికిని ఆ ఉపాధితోగాని, లోక వ్యవహారములతోగాని సంగములేనివాడై, వానియందు తగుల్కొనక బహు జాగ్రతగ వర్తించుచుండవలెను. పంచకోశ వివేకము చేతను, సాంఖ్య విచారణచేతను ఆత్మస్వరూపుడగు తనయొక్కయు, అనాత్మ స్వరూపమగు ప్రపంచముయొక్కయు యథార్థ స్వరూపము చక్కగ తెలిసికొని, దేహాదులతో వాస్తవముగ తనకు ఏ మాత్రము సంబంధము లేదని గ్రహించి, నాటకములో దీపము భంగి తాను సర్వసాక్షిగా ఈ జగన్నాటక

మును వీక్షించు తటస్థుడేయని గుర్తెఱింగి ప్రశాంతముగ జీవితమును గడుపవలెను. కార్యము చేయుచున్నను అకార్యమునందు తగుల్కొనకుండుటయే మానవుని విజ్ఞత. దేహమునందున్నను తాను దేహాతీతుడని తెలిసికొని దేహమును సాక్షిగా జూడగల్గుటయే మానవుని గొప్పతనము. అభ్యాసముచే ఇట్టి స్థితి జనులకు తప్పక ఏర్పడగలదు. ఇట్టి దేహాభిమానరాహిత్యముచే జీవుడు అనుభవించు ఆనందము వర్ణనాతీతము. దుఃఖము లవలేశమైనను అత్తఱి అతనికి సోకకుండును.

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే.

అని గీతాచార్యుడు అట్టి మహోన్నతస్థితిని గూర్చి వర్ణించి యున్నాడు. దేనిని పొందినచో ఇక ఇతరమగు లాభము లన్నిటిని అంత గొప్పగా చూడడో, దేనియందు నిలుకడ గలిగియున్నచో ఘోరదుఃఖము వచ్చి నెత్తిన పడినప్పటికి ఏమాత్రము చలింపడో అట్టి ఆత్మస్థితి దేహాభిమానరహితులకే సిద్ధించగలదుగాని అన్యులకు కాదు. తాను జడమైన దేహమని తలంచుకొనుచుండువాడెవడును అట్టి పవిత్రస్థితిని బడయజాలడు. సంసార సాగరముయొక్క ఆవలి యొడ్డును చేరజాలడు.

శరీరపోషణార్థీ సన్య ఆత్మానం దిదృక్షతి
గ్రాహం దారుధియా ధృత్వానదీం తర్తుం స గచ్ఛతి.

ఒకానొక యాత్రికుడు పాదచారియై తీర్థయాత్ర చేసికొనుచు పోవుచుండ త్రోవలో ఒకనది అడ్డువచ్చెనట. ఆ సమయమున సూర్యుడస్తాద్రిఁ గ్రుంకెను. చీకటి నలుదెసల వ్యాపించెను. నదియొడ్డున ఒక్క పడవగాని, పడవనడుపు మనుష్యుడుగాని ఎవరును లేరు. కాని దూరముగ ఒకచోట నదియొడ్డున నల్లటిమొద్దు ఒకటి పడియుండుటనుగాంచి అది కొయ్యయని భావించి దానిపై కూర్చొని అతడు నెమ్మదిగ దానిని నీటిలోనికి నెట్టెను. అది కదలి పోవుచుండెను. ఈ ప్రకారముగ అతడు నదీ మధ్యభాగమువఱకు రాగా, ఆకాశము మేఘావృతమై మెఱుపు మెఱయుగా, ఆ మెఱుపు కాంతిలో ఆ కొయ్యమొద్దును పరికింప అది కొయ్యకాదనియు మొసలి యనియు తెలినది. ఇట్టి పరిస్థితియందు ఆ యాత్రికుడు ఆవలి యొడ్డుకు చేరగలడా యని శ్రీ శంకరాచార్యులవారు ప్రశ్నించుచున్నారు. ఎన్నటికిని చేరలేడు. భయంకరమైన ఆ మొసలి త్రోవలోనే అతనిని కబళించివైచును. అట్లే 'నేను దేహమును' అనుభావము కలవాడెవడును ఆత్మను దర్శింపలేడు. సంసార సముద్రమును దాటలేడు, దుఃఖజాలమును తొలగించుకొనలేడు.

ఈ శరీరము వాస్తవముగ బంకమట్టితో చేయబడిన ఒకానొక ఇల్లు. ఇది కొద్దికాలము నివసించుటకొఱకు భూదేవి నుండి బదులుగ తీసికొనబడినది. తిరిగి ఆ భూదేవికి దీనిని సమర్పించి వేయవలసియున్నది. ఎల్ల కాలము దీనిలో నివసించు

టకు అనుమతిలేదు. ఇది సొంత ఇల్లుకాదు. అద్దెకొంప. అద్దెకొంపలలో శాశ్వతనివాసము సాధ్యపడదు. ఏదియో యొక కాలములో లేవవలసినదే. అట్టిచో దానిపై అంత మమత్వమేల? బాగుగ విచారించి చూచినచో దేహముపైగాని, దేహము నాశ్రయించుకొని యుండిన బాహ్య వస్తువులపైగాని, బంధ్వాదులందుగాని మమత్వము కేవలము కల్పితమే యని తేలుచున్నది. కాబట్టి అట్టి కల్పితభావములను విస్తరించి తాను జడమైన పదార్థము కాదనియు నిత్యశుద్ధ బుద్ధముక్త ఆత్మస్వరూపమే యనియు దృఢముగ నిశ్చయించవలయును. దుఃఖరాహిత్యమునకు బంధవిముక్తికి ఇదియొకటియే మార్గము.

నాన్యః పన్థా విద్యతేఽయనాయ.

దేహాభిమానమను పాశముచే జీవుడు అనాది కాలము నుండియు బద్ధుడై, తత్ఫలితముగ ఈ జననమరణరూప ప్రవాహమందు దిక్కులేక కొట్టుకొనిపోవుచున్నాడు. సుకృతవశమున లభించిన ఈ పరమపవిత్ర మానవ జన్మయందు ప్రయత్నపూర్వకముగ జ్ఞానమను ఖడ్గమును సంపాదించి 'నేను దేహమును కాదు, దేహసాక్షియగు ఆత్మను' అను వివేకమును లెస్సగబడసి, దేహాహంభావ రూపపాశమును ఆ ఖడ్గముచే ఛేదించివైచి పరమసుఖమును పొందవలయును. తాను జడస్వరూపుడు కాదనియు, కేవలము చిదాత్మయే యనియు మరల మరల మననము చేయుచుండవలెను.

చిదానందరూపః శివోఽహం శివోఽహమ్.

అని ఎలుగెత్తి పాడుచుండవలెను. జన్మాంతర సంస్కారమువలన తాను దేహమనుభావన కలిగినప్పుడెల్ల, తద్విరోధియగు ఆత్మ సంస్కారమును మరల మరల తెచ్చుకొనుచు అవివేకమును పారద్రోలుచుండవలెను.

నాస్తి జాగరతో భయమ్.

జాగ్రతగనున్నవానికి, వివేక విషయమున మేలుకొనియున్నవానికి, దుఃఖమును గూర్చిన భయము లవలేశమైనను ఉండనేరదు. కాబట్టి ముముక్షువులగువారు దేహాభిమానమును దరికిజేర్చక ఆత్మచింతనపరులై, జీవితమును పరమానందమయముగ నొనర్చుకొనవలయును. దేహమను రథమందు తాను చిన్మయమూర్తియగు దేహియై విలసిల్లుచున్నట్లు భావించుకొనవలెను.

కొన్ని పెద్ద పెద్ద దేవాలయములకు సంబంధించి కొన్ని రథములుండును. సంవత్సరమున కొక పర్యాయమో, లేక రెండు మూడు పర్యాయములో దేవతామూర్తిని (ఉత్సవ విగ్రహమును) రథముపై ఆసీనులుగ జేసి ప్రధాన వీధులగుండా ఊరేగించుదురు. మందిరములలో జరుగుచుండు ప్రధాన దైవ కైంకర్యములలో ఇది యొకటి. ఆ రథోత్సవ సమయమున ఊరిలోని పిన్నలు, పెద్దలు అందఱు హర్షాతి

శయముతో భక్తి పూర్వకముగ రథము వెంట పురవీధులలో జనుచు భగవానునకు తమ భక్త్యంజలి ఘటించుచుందురు.

రథోత్సవములో ప్రధానమైనది రథము కాదు, జనము కాదు, లాగువారు కాదు, అలంకరణము కాదు. రథములో నున్న దివ్యమూర్తియే ప్రధానము. ఆ మూర్తి కొఱకే దారి పొడుగునా టెంకాయలు, పండ్లు కానుకలు సమర్పింపబడుచుండును. అదియే ముఖ్యము. తక్కినదంతయు గౌణము. కాని రథోత్సవ సమయమున జన సామాన్యము యొక్క దృష్టి సాధారణముగ బహిర్ముఖముగనే చనుచుండును. వేడుకలు, అలంకారములు, నృత్యములు—వీనిపైనే వారి దృష్టి హెచ్చుగ కేంద్రీకరింపబడుచుండును. ఏ కొలది మందియో మహనీయులు తమ చిత్తములను ఏకాగ్రపఱచి రథాంతర్గత దివ్యమూర్తి యొక్క పదకమలములపై దానిని కేంద్రీకరించుదురు. ఇట్టి రథోత్సవములు సంవత్సరమునకు ఎప్పుడో ఒక పర్యాయము మాత్రమే జరుగుచుండును.

కాని ఈ ప్రపంచములో ఇంకొక రథము కలదు. దాని ఉత్సవము ప్రతి దినము జరుగుచుండును. అదియే శరీరము. 'శరీరం రథమేవ తు' అని ఉపనిషత్తు లెప్పుడో ఈ సత్యమును బాహాటముగ చెప్పి వైచినవి. శరీర మొక రథము, బుద్ధిసారథి ఇంద్రియములు గుఱ్ఱములు విషయములు దారి, ప్రత్యగాత్మ యజమాని. ఇట్టి రథములు ఒకటి కాదు, రెండు

కాదు, పందలు కాదు, వేలు కాదు. కోటాను కోట్లు ప్రతి దినము లోకమున సంచరించుచున్నవి. ఇంతవఱకెన్ని కోట్లో ఇట్టి రథోత్సవములు గడచిపోయినవి, ఇపుడు గడచుచున్నవి, ముందు గడవనున్నవి. కాని వీనిని గూర్చి ఎవరైన పట్టించుకొనుచున్నారా! రథికుడు ప్రత్యగాత్మకెవరైన జోహారు లర్పించుచున్నారా? అటులకాక కనీసము రోజునకొక పర్యాయమయినా వందనము సమర్పించుచున్నారా? దేహము(శరీరము) యొక్క అలంకరణములోనే కాలమంతయు గడచిపోవుచున్నది. ఇక పరమాత్మ చింతన యెప్పుడు? ఈ విషయమై గొప్ప ఆలోచన చేయవలసియున్నది.

విజ్ఞులగువారు పంచతత్త్వోపాదికమైన ఈ శరీర రథమును గూర్చి దీర్ఘముగ యోచించి, రథముపై మమత్వ ముంచక అభిమానమును కలుగజేసికొనక, రథాంతర్గతుడగు పరమాత్మయందే తన దృష్టిని మఱలించి దేహము నడచుచున్నను, కూర్చొనుచున్నను, మాట్లాడుచున్నను, భుజించుచున్నను అవి యన్నియు ఉపాధిజనిత క్రియలే యనియు, తాను నిష్క్రియుడై, నిర్మలుడై, సర్వసాక్షియైనట్టి ఆత్మయే యనియు సదా భావించుచుండవలెను. మఱియు ఆ ఉపాధికి సంబంధించిన సుఖదుఃఖములను తనపై ఆరోపించుకొనక నిస్సంగుడై వ్యవహరించవలెను.

ఒక్క మానవ దేహమే కాదు, ప్రపంచములోని సమస్త చరాచర దేహములున్ను రథములేయని భావించ

వలెను. ఆవు శరీరము ఒక రథము, కుక్క శరీరము ఒక రథము, ఏనుగు శరీరము ఒక రథము. అట్లే చీమ శరీరమున్ను ఒక రథమే యగును. ఆయా ప్రాణులు కదలుచున్నపుడు రథోత్సవములు జరుగుచున్నట్లు భావన చేయవలెను. ఆయా రథములను సందర్శించినపుడు అందున్న రథికుడగు ప్రత్యగాత్మను సందర్శించు విజ్ఞతను జీవుడు సంపాదించవలెను. అపుడే సర్వ జీవరాసులందును దయ, ప్రేమ, కరుణ మనుజునకు కలుగగలవు. అపుడే ద్వేషము, వైరము, అంతరించి పోగలవు. సద్గుణావలంబనమున కిదియొక చక్కటి ఉపాయము. లోకములో ప్రాణికోట్ల రూపమున నున్న అగణిత రథములందు ఒకే చిదాత్మరూప దివ్యమూర్తి ఆసీనుడై యుండ, ఇక ఎవరిపై క్రోధము? ఎవరిపై ద్వేషము?

యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవా భూద్విజానతః
తత్ర కో మోహః కః శోక ఏకత్వమను పశ్యతః
(ఈశావాస్యోపనిషత్తు)

ఉపనిషత్తులు పని కట్టుకొని ఈ ప్రకారముగ బోధించుచుండ ఇక జనులు 'వాడు వేఱు, వీడు వేఱు' అను భేద దృష్టిని గలిగియుండుట, వైరభావమును ప్రదర్శించుట హాస్యాస్పదమే యగును. మణులందు దారమువలె భగవానుడు అన్ని ఉపాధులందు అనుస్యూతముగ వర్తించుచున్నాడు. 'సూత్రే మణిగణా ఇవ' అను గీతావాక్యము యొక్క అర్థమిదియే. కాబట్టి జనులిట్టి సత్యమును గుర్తెఱిగి

విశాల భావమునే అలవాటు చేసుకొని వైరద్వేషాదులను పారద్రోలవలెను. సర్వభూతహితమునే వాంఛింపవలెను.

రథోత్సవ సమయమున రథాంతర్గత దేవతామూర్తిని జనులెట్లు సేవింతురో, అట్లే ప్రపంచములో ఏ ఉపాధిని చూచినను అది భగవంతుని యొక్క రథమేయని భావించి లోనగల ప్రత్యగాత్మకు భక్త్యంజలి సమర్పించవలెను.

'ప్రణమేద్దండవద్భూమావాశ్వ చండాలగోఖరమ్' అని భాగవతము వచించిన చందమున గుఱ్ఱము, ఆవు, గాడిద – వెయ్యేల సమస్త ప్రాణికోట్లకు మానసికముగ సాష్టాంగ వందన మాచరించవలెను. అపుడే విశ్వప్రేమ, విశ్వ సౌభ్రాతృత్వము, సర్వజీవకారుణ్యము చక్కగ అభ్యాసము కాగలవు. జనులలో విద్వేషము తొలగిపోగలదు. రామరాజ్యము స్థాపింపబడగలదు. అట్టి సర్వ సమత్వరూప మహోన్నత లక్ష్యము కొఱకై పాటుపడి సర్వక్షేత్రములందును వెలయు క్షేత్రజ్ఞుడైన పరమాత్మను సాక్షాత్కరించుకొని భవబంధనము నుండి విముక్తులు కావలయును.

రథికుడైన ఆత్మనుగూర్చిన ఇట్టి పరిజ్ఞానము రణరంగమున సైనికునకు కవచము మాడ్కి వ్యవహార క్షేత్రమందు సాధకునకు చక్కగ ఉపకరించును. జీవితమొక యుద్ధరంగము. మాయ, అవిద్య, అజ్ఞానము అను శత్రువుతో ముముక్షువు భీకరమగు పోరుసలుపుచున్నాడు. ఈ యుద్ధమున

స్వీయరక్షణార్థము ఒక కవచము అతనికి అత్యావశ్యకమై యున్నది. అదియే దైవకవచము, బ్రహ్మకవచము, నారాయణ కవచము.

బ్రహ్మకవచము

దేవదానవ సంగ్రామ సమయమున దేవతలకు విజయము లభించు నిమిత్తము దేవపురోహితుడగు విశ్వరూపుడు ఇంద్రునకు నారాయణ కవచమును ఉపదేశించెనని భాగవతము షష్ఠమ స్కంధమున పేర్కొనబడినది. నారాయణ కవచ ప్రభావముచే ఇంద్రుడు రణమందు విజయశ్రీని జేబట్టగలెను. దానవులు భయభ్రాంతులై పలాయనమును చిత్తగించిరి.

కవచధారణ యోధులకు అత్యవసరము. శత్రువుల ఆయుధ ప్రయోగములనుండి, ఆఘాతములనుండి కవచము దేహమును సంరక్షించును. భౌతిక కవచములకే ఇంతటి అమోఘశక్తి యున్నపుడు ఇక ఆధ్యాత్మిక కవచమును గూర్చి వేఱుగ చెప్పవలయునా? విశ్వరూపుడు దేవేంద్రునకు బోధించినది ఆధ్యాత్మిక కవచము. దానినే నారాయణ కవచమందురు. ప్రతివారును ఇట్టి పరమార్థ కవచమును ధరించియే లోకమున వ్యవహరించవలసియున్నారు.

జీవుడు అనాదికాలము నుండి ఒకానొక భీషణ సంగ్రామములో పాల్గొనుచున్నాడు. ఏ యుద్ధమైనను కొలది రోజులలో సమాప్తమై పోవును. కాని జీవుడు తగుల్కొనిన

ఈ ప్రకృతి సమరము అనాదికాలమున ప్రారంభమై ఇంకను తెమలకయున్నది. కామక్రోధాది శత్రువులతో అతడు ఎడతెరపి లేక పోరాడుచున్నాడు. దేహభ్రాంతి, దేహాభిమానము అహంకార, మమకారములను ప్రతిపక్షులతో జీవుడు అనవరతము పోరు సల్పుచున్నాడు. శత్రుపక్షము మహాశక్తివంతమై యుండుటఁ బట్టియు, స్వపక్షమున తగినంత బలము లేకుండుటఁ బట్టియు జీవుడు ఈ ప్రకృతి సంగ్రామమున విజయము గాంచలేకున్నాడు. పైగా శత్రుప్రహారములచే నానా బాధల నొందుచున్నాడు. ఇట్టి స్థితిలో జీవుడు తన్ను తాను సంరక్షించుకొనుటకై ఏదియో విధముగ యత్నము సలుపవలసియున్నది. ఇందులకు కవచము చక్కగ ఉపకరించును. లోహములచే నిర్మితమగు కవచము కాదు. దైవ కవచము, ఆత్మకవచము, నారాయణ కవచము. భౌతిక కవచము భౌతిక దేహమునే సంరక్షించును గాని మానసిక బాధలను అది ఏ మాత్రము తొలగింపజాలదు. భవదుఃఖమును బాపుటకు ఆత్మ కవచమే శరణ్యము. నానావిధ కల్లోలములతో గూడిన ఈ సంసార రణక్షేత్రమున జ్ఞాన కవచమును ధరింపనిదే, దైవ కవచమును ఆశ్రయింపనిదే జీవుడు శాంతిని నోచుకొనలేడు.

'రక్తమాంసములతో గూడిన ఈ క్షణిక దేహమును నేను కాను, దేహసాక్షియగు ఆత్మయే నేను' అని నిరంతరము భావించుటయే కవచధారణయగును. 'నాలుగు

మూరల చిన్న అస్థిపంజరము నేను కాదు, విశ్వవ్యాపక ఆత్మయే నేను' అని సతతము సంస్మరించుటయే దైవకవచమును పరిగ్రహించుట యగును. 'పుట్టుచు, చచ్చుచు కర్మాధీనమై అస్వతంత్రమైయున్న ఈ ఉపాధి నేను కాదు. జననమరణరహితమై, సర్వస్వతంత్రమై, దేశకాల క్రియలకు ఒకింతైనను సంబంధము లేని నిర్వికల్ప చిదాత్మయే నేను' అను పరిజ్ఞానము కలిగియుండుటయే బ్రహ్మకవచమును ధరించుట యగును.

ఇట్టి ఆత్మకవచమును, దైవకవచమును ధరింపని వారికి ఈ సంసారక్షేత్రమున దెబ్బలు తప్పవు దుఃఖము తప్పదు, బాధ తప్పదు. ఎందఱో సత్యము నెఱుగక, తమ నిజాత్మభావమును మఱచి ఈ దెబ్బలు తినుచు, బాధలు పొందుచు సంసార భారమును ఈడ్చుకొని పోవుచు జీవయాత్రను కొనసాగించుచున్నారు. దుఃఖముచే కుమిలిపోవుచున్నారు. మానవుడు దుఃఖించుట కొఱకు కాదు, ఈ అపూర్వ జన్మను బడసినది, దుఃఖమును పోగొట్టుట కొఱకు. ఆత్మజ్ఞానమొకటియే ఇక్కార్యమును సాధింపగలదు. దైవకవచమొక్కటియే శాంతిని ప్రసాదించగలదు. మాయకు ఆధీనుడగు జీవుడు మాయాతీతుడగు పరమేశ్వరుని ఆశ్రయించినపుడు మాత్రమే మాయాప్రభావమగు దుఃఖమునుండి విముక్తుడు కాగల్గును. గొడుగు వేసికొనిన వానికి వర్షబాధ యెట్లుండదో, చెప్పులు తొడుగుకొనినవానికి కంటకముల బాధ

యెట్లుండదో, కవచమును ధరించిన వానికి బాణప్రహారజనిత బాధ యెట్లుండదో అట్లే మాయాతీతుడగు పరమేశ్వరుని ఆశ్రయించిన వారికి, ఆత్మజ్ఞానము కలిగియున్న వారికి సంసార బాధ లెవ్వియు ఉండవు. ఇట్టి ఆత్మజ్ఞానమును యుక్తి లేనిచో ఈ మహాసాంసారిక కల్లోలయందు జీవితమే అత్యంత దుర్భరముగా పరిణమించును.

జనక భూపాలుడు సంసారమందున్నప్పటికిని ఈ జ్ఞానరూపకవచమును ధరించియే శాంతిని బొందగలిగియున్నాడు. అర్జునుడు రణరంగమున శత్రువులను సాహసోపేతముగ ఎదుర్కొనుచు వివిధ కార్యముల నాచరించినప్పటికిని 'మామనుస్మరయుధ్యచ' (నన్ను స్మరించుచు యుద్ధము చేయుము) అను గీతాబోధను స్మృతిపథమునందుంచుకొని, సదా శ్రీకృష్ణుని తన చిత్తకుహరమున ధ్యానించుచు అట్టి భక్తికవచముచే యుద్ధమును యజ్ఞముగ మార్చివైచెను. భయంకర యుద్ధమాచరించినను పరమశాంతినే పడయగల్గెను శ్రీకృష్ణుని అనవరత సంస్మరణముచే వ్యవహార సంకులిత క్షేత్రమును విజనారణ్య ప్రశాంత వాతావరణమయముగ నొనర్చుకొనగల్గెను.

భయంకరమగు ఈ సంసారపథమున జను ప్రతి జీవికిని అట్టి దైవకవచరూప రక్షణ అవసరము కావున ముముక్షువు లెల్లరు అద్దానిని పరిగ్రహించి జీవితమును ఆనంద ప్రపూర్ణముగ గావించుకొనవలెను. మిత్ర బాంధవులు దేహమున్నంత

వఱకే ఒకింత ఆదుకొనగలరు. ఆ తదుపరి జీవునకు దిక్కెవరు? దేహమున్నను, పోయినను సర్వకాల సర్వావస్థలయందును జనులను కాపాడునది నారాయణుడే. ఆ నారాయణుని ఆశ్రయించిన వారికి, ఆ నారాయణ కవచమును ధరించిన వారికి ఇక ఏలాటి ఆపదలు, భయములు ఉండనేరవు. భగవద్భక్తియే ఆ నారాయణ కవచము. ఆత్మజ్ఞానమే ఆ నారాయణకవచము. నిరంతర దైవస్మరణమే ఆ నారాయణ కవచము. అట్టి మహోన్నత అధ్యాత్మ కవచమును ధరించి, నిత్య వ్యవహార మాచరించుకొనుచు, దైవదృష్టిని ఏ కాలమందును వదలక జీవుడు సంసార రంగమున పరమ శాంతిని బొందవలయును.

ఇట్టి బ్రహ్మకవచధారణచేత జీవునకు గల దుఃఖము లన్నియు, భయములన్నియు సమూలముగ తొలగిపోగలవు. అజ్ఞానియగు జీవునకు ఉదయము నిద్రలేచినది మొదలు, రాత్రి పరుండు వఱకును ఎన్నియో భయములు పీడించుచున్నవి. అవి యేవియును ఆత్మ విచారణా తత్పరుడగు జ్ఞానిని బాధించనేరవు

ప్రపంచములో గల భయములన్నిటిలోను మరణ భయము అతితీవ్రమైనది. మరణమను మాట వినుటతోడనే జనులు దద్దరిల్లిపోవుదురు. కాని అట్టి భయమును ఉపనిషత్తులు, గీతాది సద్గ్రంథములు ఆత్మజ్ఞాన ప్రబోధము ద్వారా సంపూర్ణముగ తొలగించి వైచినవి. "ఓ జీవుడా! నీవు జనన మరణ రహితుడవగు అమృత స్వరూపుడవే. నీకు మరణమను

దదియే లేదు" అని అవి బోధించినవి. 'చనిపోయెను' అను వాక్యములోని 'చనుట' అను పదమునకు పోవుట, వెళ్ళుట అనియే అర్థము కలదు. అనగా జీవుడు ఒక దేహమును వదలి మఱియొక దేహమును గ్రహించుటకు ఇంకొక చోటునకు వెడలెననియే అర్థము. (పాత వస్త్రమును తీసివైచి క్రొత్త వస్త్రమును ధరించులాగున) దీనిలో 'నశించుట' అను అర్థమున కాస్కారమే లేదు. కావున మరణమనగా జీవుని దేహపరిస్థితి యొక్క ఒకానొక మార్పేకాని వినాశమెన్నటికిని గాదు. ఇట్టి అపూర్వ సత్యములను మహర్షులు వెల్లడించి జనులకు గొప్ప ఆశ్వాసమును గలుగజేసిరి.

ఆత్మ ఒకటి తప్ప ప్రపంచములోని ప్రతివస్తువు షడ్భావ వికారములకు లోనై యుండును. శరీరమున్ను దృశ్య ప్రపంచములో నంతర్భావమే కావున అదియు వికారముల నుండి తప్పించుకొనజాలదు. కాబట్టి అదియు పుట్టుట, గిట్టుట కలిగియుండును. ఆత్మమాత్రము నిర్వికారమై చెన్నొందు చుండును. మంచుకు శీతలత్వమెట్లు స్వభావమో, అగ్నికి ఉష్ణత్వమెట్లు స్వభావమో, అట్లే శరీరమునకున్ను జనన మరణములు స్వభావములై యున్నవి. అందుచే మరణమును గూర్చి యెవరును భయపడనవసరము లేదు

రామతీర్థులొకపుడు ఒకానొక సభలో ఉపన్యసించుచుండ మధ్యలో ఎవరో ఒక చీటీ తెచ్చి వారికి అందజేసిరి.

రామతీర్థులది చదువుకొని దానిని ప్రక్కనబెట్టి మరల ఉపన్యాసమును కొనసాగించెను. సభ పూర్తి అయిన వెనుక ఒకరు 'అయ్యా! ఆ చీటీలోని విషయములేమి?' అని రామతీర్థులనడుగ, 'నాకు ఒకడే కుమారుడు కలడు; అతడు మరణించెనను వార్త దాని యందు గలదు' అని చెప్పెను. 'దానిచే తమకు దుఃఖము కలుగలేదేమి?' అని వారడుగ 'నిప్పు వేడిగా నున్నది' అను వార్తచే గాని, 'మంచు చల్లగా నున్నది' అను కబురుచే గాని ఎవరికైన శోకము జనించునా? జనింపదు. ఏలయనిన అవి వానికి సహజ గుణములు. అట్లే పుట్టిన వస్తువు గిట్టినది అను వార్తచే విజ్ఞునకు దుఃఖమెన్నటికిని గలుగదు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అను గీతా వాక్యానుసారము 'పుట్టిన దేహము ఎప్పటికైనను నశించియే తీరును' అని రామతీర్థులు గంభీరముగ పలికిరి. మహాత్ముల యొక్క అనుభవ వాక్యము లిట్లే యుండును.

ఇంతవరకు దేహమును గూర్చి విచారించితిమి. ఇక ఆత్మను గూర్చి యోచించెదము. ఆత్మ నాశరహితమైనది. షడ్భావవికారములు లేనిది. శాశ్వతమైనది. సనాతన స్వరూపమై వెలుగొందునది. ఈ సత్యమునే క్రింది గీతా శ్లోకము నిరూపించుచున్నది.

న జాయతే మ్రియతే వా కదా చి
న్నాయం భూత్వా భవితా వా న భూయః

అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే. (2-20)

ఇట్టి ఆత్మయే జీవుని యథార్థస్వరూపము. జీవుడు 'దేహి' యే కాని 'దేహము' కాదు. వస్త్రమును ధరించువాడే కాని వస్త్రము కాదు ఇంటిలో వుండే వాడే కాని ఇల్లు కాదు. పొలము (క్షేత్రమును) చూచువాడే కాని పొలము కాదు. ఇట్టి నిగూఢ తత్త్వమును మహర్షులు స్వానుభవము ద్వారా జన సామాన్యమునకు అంద జేసి, ధైర్య, వీర్య, గాంభీర్యాదులను వారికి కలుగ జేసిరి.

వాస్తవముగ అఖండ ధైర్యము, నిర్భయత్వము, ఆత్మ జ్ఞానముచే దప్ప మఱి దేనిచేతను గలుగనేరవు. 'ద్వితీయాద్వై భయం భవతి' అను శ్రుతి ప్రకారము ఆత్మ కంటె వేరుగ మఱియొక వస్తువును సత్యమని నమ్మినచో వెంటనే భయముదయించును. అజ్ఞాని జనులు దేహాది దృశ్య పదార్థములను సత్యమని నమ్మి భయమును, దుఃఖమును పొందుచున్నారు. జ్ఞాని దేహాదులను నశ్వరములుగను, ఆత్మను శాశ్వతముగను నమ్మి నిర్భయత్వమును, అనంతానందమును బడయుచున్నాడు. ఈ సందర్భమున వివేకానందులు పలికిన ఈ క్రింది వాక్యములు స్మరణీయములై యున్నవి –

It is strength and strength that we want, and the first step in getting the strength is touphold the upanishads and believe that 'I am the Atman'.

'మనకు కావలసినది బలము! అట్టి బలమును సంపాదించుటకు ఏకైక మార్గము ఉపనిషత్తులను విశ్వసించి తాను ఆత్మనని తలంచుటయే.' కనుకనే శ్రీకృష్ణపరమాత్మ దుర్బలత్వమును, నిరుత్సాహమును, దేహాహంభావమును పొందియున్న అర్జునునకు మొమ్మొదట ఆత్మజ్ఞానమునే ఉపదేశించులకు కారణము.

ఈ ప్రకారముగ ఆత్మవిజ్ఞానమును బడసి తన యథార్థ స్వరూపము యొక్క పరిచయము గలిగి మృత్యు భయమును దూరీకరించుకొనవలెను. మానవుడు జన్మించినది భయములతో క్రుంగిపోవుటకు గాదు. ఉదయము లేచినది మొదలు ఎన్నియో భయములచే మనుజుడు సతమతమగుచున్నాడు. ఇట్టి దౌర్భాగ్యస్థితి యాతని కెన్నటికిని తగదు. కాలమునకు, ప్రకృతికి లోబడిన ఒకానొక అల్పవస్తువు కాదు మానవుడు. మృత్యువు యొక్క చెప్పు చేతలలో అణగియుండు తుచ్ఛ వస్తువు కాదు. అతడు బ్రహ్మాండములన్నిటిని ఆవరించి కాలునకు కాలుడై, మృత్యువును గూడ చప్పరించి వేయగల శక్తి సామర్థ్యములు గలవాడతడు. ఈ సత్యమును తెలియక, తాను నాలుగు మూరల దేహపంజరమని భ్రమించి జీవుడు నానాబాధలకు లోనగుచున్నాడు. అడుగడుగునకు ఏదియో భయముచే నావరింపబడుచున్నాడు. కాబట్టి జీవుడు తాను నిత్య శుద్ధముక్త ఆత్మయే కాని దేహము కాదని మరల మరల చింతన జేయవలెను. 'తద్బ్రహ్మ నిష్కలమహం న చ

భూత సంఘః' అను శంకరుల వాక్యమును పదే పదే స్మరించుచుండవలెను. దీనిచే ఒక మరణ భయమే కాదు, ఏ భయమైనప్పటికిని పటాపంచలై పోగలదు.

ప్రతి దినము ఉదయము నిద్రలేవగనే పడకపై కూర్చుండి మూడు పర్యాయములు ఓంకారము నుచ్చరించి నిజాత్మ స్వరూపమును గూర్చి లెస్సగ భావన జేసి తదుపరి మాత్రమే దినచర్య ప్రారంభించవలెను. దానిచే అఖండ ధైర్యము చేకూరుటయే గాక దినచర్య నిర్దుష్టముగను కొనసాగగలదు.

ఆత్మాను సంధానము

(సాధకులు ఈ క్రింది భావములను నిరంతరము మననము చేయుచుండవలెను.)

మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్
మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయ మస్మ్యహమ్
(కైవల్యోపనిషత్–పే 37–శ్లో 19)

నా యందే (ఆత్మయందే) సమస్తము కలుగుచున్నది, నా యందే సమస్తము ఉండియున్నది, తిరిగి నా యందే సమస్తము లయించుచున్నది. అట్టి అద్వయ బ్రహ్మము నే నేను అయియున్నాను.

అణోరణీయానహమేవ తద్వన్మహానహం విశ్వమహం విచిత్రమ్
పురాతనోఽహం పురుషోఽహమీశో హిరణ్మయోఽహం శివరూపమస్మి.
(" 37–20)

నేను అణువుకంటెను సూక్ష్మముగను, మహత్తుకంటెను మహత్తరమైయు ఉన్నాను. విచిత్రమైన ఈ ప్రపంచము నేనే. పురాతన స్వరూపుడను నేనే. ఈశ్వరుడను నేనే. నేను జ్యోతి స్వరూపుడను, మంగళరూపుడను అయియున్నాను.

అపాణిపాదోఽహమచిన్త్యశక్తిః పశ్యామ్యచక్షుస్సశృణోమ్యకర్ణః
అహం విజానామి వివిక్తరూపో న చాస్తి వేత్తా మమ చిత్సదాహమ్.
(" 37-21)

నేను చేతులు, కాళ్ళు లేనివాడను; చింతింపనలవికాని శక్తి కలవాడను, నేను కన్నులులేకనే చూచుచున్నాను, చెవులులేకనే వినుచున్నాను. నేను సమస్తమును ఎఱుంగుచున్నాను. నేను ఒకే విధమైన రూపముకలవాడను. నన్ను తెలిసికొనువాడు లేడు. నేను సదా చిన్మాత్రుడను.

వేదైరనేకైరహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్
న పుణ్యపాపే మమనాస్తి నాశో న జన్మదేహేన్ద్రియ బుద్ధిరస్తి.
(" 37-22)

అనేక వేదములచే తెలియబడువాడను నేనే. వేదాంత ప్రవర్తకుడను నేనే. వేదవేద్యుడను నేనే. నాకు పుణ్యపాపములులేవు. నాకు నాశములేదు. నాకు జన్మము, దేహము, ఇంద్రియములు, బుద్ధి లేవు.

న భూమి రాపోన చ వహ్నిరస్తి న చానిలో మేఽస్తి న చాంబరం చ
ఏవం విదిత్వా పరమాత్మరూపం గుహాశయం నిష్కళమద్వితీయమ్
(" 37-23)

నాకు భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, అను పంచభూతములు లేవు. హృదయ గుహయందున్నదియు, ఆకారరహితమైనదియు, అద్వితీయమైనదియు, సమస్తమునకు సాక్షియు, సత్తు, అసత్తు లేనిదియు పరిశుద్ధమైనదియునగు

పరమాత్మ స్వరూపమును తెలిసికొని, జీవుడు అట్టి పరమాత్మ స్వరూపమును పొందుచున్నాడు.

పరబ్రహ్మస్వరూపోఽహం పరమానందమస్మ్యహమ్
కేవలం జ్ఞానరూపోఽహం కేవలం పరమోఽస్మ్యహమ్
([illegible] 3-1)

నేను పరబ్రహ్మ స్వరూపుడను పరమానందరూపుడను. కేవలము జ్ఞానరూపుడను, కేవలము పరమాత్మ స్వరూపుడను అయియున్నాను.

కేవలం శాంతరూపోఽహం కేవలం చిన్మయోఽస్మ్యహమ్
కేవలం నిత్యరూపోఽహం కేవలం శాశ్వతోఽస్మ్యహమ్
(" III-2)

నేను కేవలము శాంతస్వరూపుడను. కేవలము చిన్మయ స్వరూపుడను. కేవలము నిత్యరూపుడను. నేను కేవలము శాశ్వతమగు ఆత్మయే అయియున్నాను.

కేవలం సత్త్వరూపోఽహమహం త్యక్త్వాహ మస్మ్యహమ్
సర్వహీనస్వరూపోఽహం చిదాకాశమయోఽస్మ్యహమ్
(" III-3)

నేను కేవలము సత్త్వరూపుడను. అహంకారమును త్యజించినవాడను. సమస్తదృశ్య రహితుడను. చిదాకాశమయుడను అయియున్నాను.

నిర్వికల్పస్వరూపోఽస్మి నిరీహోఽస్మి నిరామయః
సదానంద స్వరూపోఽస్మి నిర్వికారోఽహ మవ్యయః
(" III-6)

నేను నిర్వికల్ప స్వరూపుడను, నిశ్చలుడను, నిరామయుడను, సదానందస్వరూపుడను, నిర్వికారుడను, అవ్యయుడను అయియున్నాను.

సదైకరస రూపోఽస్మి సదా చిన్మాత్రవిగ్రహః
అపరిచ్ఛిన్న రూపోఽస్మి హ్యనంతానందరూపవాన్
(" III-7)

నేను సదా ఏకరూపుడను, సదా చిన్మాత్రరూపుడను, నేను అపరిచ్ఛిన్న స్వరూపుడను, అనంతానంద స్వరూపుడను అయియున్నాను.

నిత్యశుద్ధచిదానందసత్తామాత్రోఽహ మవ్యయః
నిత్యబుద్ధ విశుద్ధైక సచ్చిదానంద మస్మ్యహమ్
(" III-11)

నేను నిత్య, శుద్ధ, చిదానంద స్వరూపుడను, నేను సత్తామాత్రస్వరూపుడను, నేను నిత్య, బుద్ధ, విశుద్ధ, ఏకరూప చిదానందస్వరూపుడను అయియున్నాను.

భూమానందస్వరూపోఽస్మి భాషాహీనోఽస్మ్యహం సదా
సర్వాధిష్ఠానరూపోఽస్మి సర్వదా చిద్ఘనోఽస్మ్యహమ్.
(" III-13)

నేను భూమానంద స్వరూపుడను, నేను సదాభాషా

రహితుడను, నేను ప్రపంచమునకంతను అధిష్ఠానరూపుడను, నేను ఎల్లపుడు చిద్ఘనరూపుడనై యున్నాను.

దేహభావవిహీనోఽస్మి చిన్తాహీనోఽస్మి సర్వదా
చిత్తవృత్తివిహీనోఽహం చిదాత్మైకరసోఽస్మ్యహమ్.
(" III-14)

నేను దేహభావరహితుడను, చింతావర్జితుడను, సర్వాధిష్ఠానరూపుడను, సదాచిద్ఘన ఆత్మస్వరూపుడను అయియున్నాను.

సర్వదృశ్యవిహీనోఽహం దృగ్రూపోఽస్మ్యహమేవ హి
సర్వదా పూర్ణరూపోఽస్మి నిత్యతృప్తోఽస్మ్యహం సదా
(" III-15)

నేను సర్వదృశ్యరహితుడను, దృగ్రూపుడను, సదా పరిపూర్ణరూపుడను, నిత్యతృప్తుడను అయియున్నాను.

అహమేవ మహానాత్మా హ్యహమేవ పరాత్పరః
అహమన్యవదాభామి హ్యహమేవ శరీరవత్
(" III-17)

నేను మహత్తర ఆత్మస్వరూపుడను, పరాత్పరుడను. నేను మఱియొకదానివలె తోచుచున్నాను (వాస్తవముగ శరీరమును కాను. నేను అఖండాత్మను)

మయాతిరిక్తం యద్యద్వా తత్తన్నాస్తీతి నిశ్చిను
అహం బ్రహ్మాస్మి సిద్ధోఽస్మి నిత్యశుద్ధోఽస్మ్యహం సదా.
(" III-20)

నాకంటె (ఆత్మకంటె) అన్యమైనది ఏదియు లేదని నిశ్చయించుము. నేను బ్రహ్మను, సిద్ధుడను, నిత్యశుద్ధుడను అయియున్నాను.

స్వస్వాత్మని స్వయం రంస్యే స్వాత్మన్యేవ విలోకయే
స్వాత్మన్యేవ సుఖాసీనస్స్వాత్మమాత్రావశేషకః
(" III-24)

నేను నా ఆత్మయందే స్వయముగా రమించుచున్నాను. నేను నా ఆత్మయందే నన్ను నేను దర్శించుకొనుచున్నాను. నేను నా ఆత్మయందే సుఖముగ నాసీనుడై యున్నాను. నేను స్వాత్మమాత్రుడనై శేషించియున్నాను.

స్వ చైతన్యే స్వయం స్థాస్యే స్వాత్మరాజ్యే సుఖే రమే
స్వాత్మసింహాసనే స్థిత్వా స్వాత్మనోఽన్య న్న చిన్తయే
(" III-25)

నేను నా చైతన్యమందు నిలచియుందును. స్వాత్మ రాజ్యమందు సుఖముగా క్రీడింతును. స్వాత్మసింహాసనముపై ఆసీనుడనై స్వాత్మకంటె ఇతరమైనదానిని దేనిని చింతింపను.

చిద్రూపమాత్రం బ్రహ్మైవ సచ్చిదానందమద్వయమ్
ఆనందఘన ఏవాహమహం బ్రహ్మాస్మి కేవలమ్
(" III-26)

నేను చిన్మాత్రమగు బ్రహ్మమునే అయియున్నాను. నేను అద్వయమగు చిదాత్మనే అయియున్నాను. నేను

ఆనందఘనస్వరూపుడనే అయియున్నాను, నేను కేవలము బ్రహ్మమునే అయియున్నాను.

అహమేవ హృదాకాశే చిదాదిత్య స్వరూపవాన్
ఆత్మనాత్మని తృప్తోఽస్మి హ్యరూపోఽస్మ్యహమవ్యయః
(" III-28)

నేను హృదయాకాశమునందు చైతన్యము అను సూర్యుడనై యున్నాను. నేను నా ఆత్మయందే తృప్తికలిగి యున్నాను నేను రూపరహితుడను, నాశరహితుడను అయి యున్నాను.

సర్వప్రకాశరూపోఽహం పరాపర సుఖోఽస్మ్యహమ్
సత్తామాత్రస్వరూపోఽహం శుద్ధమోక్షస్వరూపవాన్
(" III-30)

నేను సర్వప్రకాశరూపుడను, పరావర సుఖ స్వరూపుడను, సత్తామాత్రరూపుడను, శుద్ధ మోక్షస్వరూపుడను అయి యున్నాను.

బ్రహ్మమాత్ర మిదం సర్వం బ్రహ్మణోఽన్య న్న కించన
తదేవాహం సదానందం బ్రహ్మైవాహం సనాతనమ్
(" III-31)

ఈ సమస్తము బ్రహ్మముమాత్రమే అయియున్నది. బ్రహ్మముకంటె వేఱుగ ఇచట ఒకింతైనను లేదు. సదానందమై, సనాతనమైనట్టి ఆ బ్రహ్మమే నేను అయియున్నాను,

అతిభావస్వరూపోఽహమహమేవ సుఖాత్మకః
సాక్షివస్తువిహీనత్వాత్సాక్షిత్వం నాస్తి మే సదా
(" III-34)

నేను భావాతీతుడను, నేను కేవలము సుఖస్వరూపుడను అయియున్నాను. సాక్షి వస్తువు లేనందువలన నాయందు ఎప్పుడును సాక్షిత్వము కూడ లేదు.

న బుద్ధిర్న వికల్పోఽహం న దేహాదిత్రయోఽస్మ్యహమ్
న జాగ్రత్స్వప్నరూపోఽహం న సుషుప్తిస్వరూపవాన్
(" III-45)

నేను బుద్ధిని కాను, వికల్పము కాను, దేహత్రయమున్ను కాను, నేను జాగ్రద్రూపుడను కాను. నేను సుషుప్తి రూపుడను కాను.

అసత్యం హి మనోరూపమసత్యం బుద్ధిరూపకమ్
అహంకారమసద్విద్ధి నిత్యోఽహం శాశ్వతోహ్యజః
(" III-48)

మనస్సు యొక్క స్వరూపము మిథ్య. బుద్ధియొక్క స్వరూపమున్ను మిథ్యయే. అహంకారము కూడ మిథ్యయే. నేను నిత్యుడను, శాశ్వతుడను, జన్మరహితుడను అయియున్నాను.

బ్రహ్మాహమితి యస్యాన్తస్స జీవన్ముక్త ఉచ్యతే
(" IV-12)

నేను బ్రహ్మమును అను అనుభూతి ఎవరికి ఉండునో అతడు జీవన్ముక్తుడని చెప్పబడును.

ఆనందఘనరూపోఽస్మి పరానందఘనోఽస్మ్యహమ్
యస్య దేహాదికం నాస్తి యస్య బ్రహ్మేతి నిశ్చయః
పరమానంద పూర్ణో యః స జీవన్ముక్త ఉచ్యతే
(" IV-3)

నేను ఆనందఘనరూపుడను, పరమానందఘనుడను. ఎవనికి దేహాదుల భావన లేదో, ఎవనికి తాను బ్రహ్మమను నిశ్చయము కలదో. ఎవడు పరమానంద పరిపూర్ణుడై యుండునో, అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

బ్రహ్మైవ సర్వం నాన్యోఽస్తి తదహం తదహం తథా
తదేవాహం తదేవాహం బ్రహ్మైవాహం సనాతనమ్
(" VI-31)

సమస్తము బ్రహ్మమే. మఱియొకటి లేదు. ఆ బ్రహ్మమే నేను. నేను సనాతనమైన బ్రహ్మమును.

బ్రహ్మైవాహం న సంసారీ బ్రహ్మైవాహం నమే మనః
బ్రహ్మైవాహం నమే బుద్ధిర్బ్రహ్మైవాహం న చేన్ద్రియమ్.
(" VI-32)

నేను బ్రహ్మమునే గాని సంసారిని కాను. నేను బ్రహ్మమునే అయియున్నాను. నాకు వాస్తవముగా మనస్సు లేదు. నేను బ్రహ్మమునే అయియున్నాను. నాకు వాస్తవ

ముగా బుద్ధి అనునది లేదు. నేను బ్రహ్మమునే అయియున్నాను. నాకు వాస్తవముగా ఇంద్రియములు లేవు.

బ్రహ్మైవాహం న దేహోఽహం బ్రహ్మైవాహం న గోచరః
బ్రహ్మైవాహం న జీవోఽహం బ్రహ్మైవాహం న భేదభూః
(" VI-33)

నేను బ్రహ్మమునే అయియున్నాను. నేను దేహమును కాను. నేను బ్రహ్మమునే అయియున్నాను. నేను అగోచరుడను. నేను బ్రహ్మమునే అయియున్నాను. నేను జీవుడను కాను. నేను బ్రహ్మమునే అయియున్నాను. నాకు భేదమనునది లేదు.

చైతన్య మాత్రమోంకారం బ్రహ్మైవ సకలం స్వయమ్
అహమేవ జగత్సర్వమహమేవ పరంపదమ్
(" VI-43)

ఓంకారము చైతన్యమాత్రమే అయియున్నది. అంతయును స్వయముగ అట్టి బ్రహ్మమే యగును. నేనే ఈ జగత్తంతయును. నేనే పరమగు ఆత్మపదమును.

అహమేవ గుణాతీత అహమేవ పరాత్పరః
అహమేవ పరంబ్రహ్మ అహమేవ గురోర్గురుః
(" VI-44)

నేనే గుణాతీతుడను, నేనే పరాత్పరుడను, నేనే పరబ్రహ్మమును. నేనే గురోర్గురువును.

అహమేవాఖిలాధార అహమేవ సుఖాత్సుఖమ్
ఆత్మనోఽన్యజ్జగన్నాస్తి ఆత్మనోఽన్యత్సుఖం చ న
(" VI-45)

ఆత్మనోఽన్యా గతిర్నాస్తి సర్వ మాత్మమయం జగత్
ఆత్మనోఽన్య న్నహి క్వాపి ఆత్మనోఽన్య త్తృణం నహి
(" VI-46)

ఆత్మ తప్ప వేరొక గతిలేదు. జగత్తంతయు ఆత్మమయమే అయియున్నది. ఆత్మకన్యముగ ఎచటను ఏమియును లేదు. ఆత్మకంటె వేఱుగ తృణమైనను లేదు.

బ్రహ్మణోఽన్యదహం నాస్తి బ్రహ్మణోఽన్యత్ఫలం నహి
(" VI-½ 49)

నేను బ్రహ్మము కంటె వేరు కాక యున్నాను. నాకు బ్రహ్మము కంటే వేరగు ఫలము ఏమియు లేదు.

చిదాకారం చిదాకాశం చిదేవ పరమం సుఖమ్
ఆత్మైవాహ మసన్నాహం కూటస్థోఽహం గురుః పరః
(" VI-62)

నేను చైతన్య స్వరూపుడను, చిదాకాశరూపుడను అయియున్నాను. పరమ సుఖ స్వరూపమగు చైతన్యాత్మయే నేను. నేను సద్రూపమగు ఆత్మయే గాని అసత్తును కాను. నేను నిశ్చలుడను. కూటస్థుడను, పరమ గురు స్వరూపుడను అయియున్నాను.

సచ్చిదానందమాత్రోఽహ మనుత్పన్నమిదం జగత్
కాలం నాస్తి జగన్నాస్తి మాయాప్రకృతి రేవ న

(" VI-63)

నేను సచ్చిదానంద మాత్రస్వరూపుడను. ఈ జగత్తు వాస్తవముగ ఉత్పన్నమే కాలేదు. కాలము గాని, జగత్తు గాని వాస్తవముగ లేవు. అట్లే మాయగాని, ప్రకృతి గాని కూడ లేవు.

అహమేవ హరిస్సాక్షాదహమేవ సదాశివః
శుద్ధ చైతన్య భావోఽహం శుద్ధసత్త్వానుభావనః

(" VI-64)

నేనే సాక్షాత్తు హరిని, నేనే సదాశివుడను, నేనే శుద్ధ చైతన్యరూపుడను, శుద్ధసత్త్వము యొక్క అనుభవము కల వాడను.

సర్వాంతర్యామి రూపోఽహం సర్వసాక్షిత్వలక్షణః

(" VI-65)

నేను సర్వాంతర్యామిని, సర్వసాక్షిని అయియున్నాను, సర్వాంతర్యామిత్వము సర్వసాక్షిత్వము నా యొక్క లక్షణములై యున్నవి.

సర్వవేదాంత సారోఽహం సర్వశాస్త్రసునిశ్చితః

(" VI-67)

నేను సమస్త వేదముల యొక్క సారమే (ఆత్మయే)

స్వరూపముగ గలవాడను. సమస్త శాస్త్రములందును లెస్సగ నిశ్చయింపబడిన ఆత్మయే నేను అయియున్నాను.

చిదక్షరోఽహం సత్యోఽహం వాసుదేవోఽజరోఽమరః

(" VI-69)

నేను అక్షర చైతన్య స్వరూపుడను, సత్యస్వరూపుడను జనన మరణ రహితుడగు వాసుదేవుడను అయియున్నాను.

మత్తోఽన్యదస్తి చేన్మిథ్యా యథా మరు మరీచికా
వంధ్యాకుమారవచనే భీతిశ్చేదస్తి కించన

(" VI-73)

నాకంటే వేఱుగ ఏదేని ఉండునేని అది ఎండమావుల వలె మిథ్యయే యగును. గొడ్రాలి కొడుకు మాటయందు భయము కలుగునా !

విషయానందవాంఛా మే మాభూదానందరూపతః
దారిద్ర్యాశా యథా నాస్తి సంపన్నస్య తథా మమ

(ఆత్మబోధోపనిషత్ - 16)

ఆనంద స్వరూపుడనైన నాకు విషయానందవాంఛ కలుగకుండును గాక ! ధనసంపన్నునకు దారిద్ర్యాశ కలుగ నేరదు కదా !

విషం దృష్ట్వాఽమృతం దృష్ట్వా విషం త్యజతి బుద్ధిమాన్
ఆత్మానమపి దృష్ట్వాహమనాత్మానం త్యజామ్యహమ్

(" - 17)

విషమును చూచి, అమృతమును చూచి బుద్ధిమంతుడు విషమును వదలివేయుచున్నాడు. అట్లే నేను ఆత్మను గాంచి అనాత్మను విడనాడుచున్నాను.

ఘటావభాసకో భానుర్ఘటనాశే న నశ్యతి
దేహావభాసకః సాక్షీ దేహనాశే న నశ్యతి

(" - 18)

ఘటమును ప్రకాశింపజేయు సూర్యుడు ఘటము నశించుటచే నశింపడు. అట్లే దేహమును ప్రకాశింపజేయు సాక్షియైన ఆత్మ దేహము నశించుటచే నశింపదు.

న మే బంధో న మే ముక్తిర్న మే శాస్త్రం న మే గురుః
మాయామాత్రవిలాసత్వాన్మాయాతీతోఽహ మద్వయః

(" - 19)

నాకు బంధము లేదు, మోక్షము లేదు, శాస్త్రము లేదు, గురువు లేదు. ఇది యంతయు మాయా విలాసము. నేను మాయాతీతుడనైన అద్వయ ఆత్మను.

ప్రాణాశ్చలన్తు తద్ధర్మైః కామైర్వా హన్యతాం మనః
స్వభావానంద పూర్ణస్య మమ దుఃఖం కథం భవేత్

(" - 20)

ప్రాణములు వాని ధర్మములతో చలించుగాక ! మనస్సు కామములచే హతమగు గాక ! ఆత్మానంద పరిపూర్ణుడనైన నాకు దుఃఖమెట్లు కలుగును !

ఆత్మాన మంజసావేద్మి క్వాప్యజ్ఞానం పలాయితమ్
కర్తృత్వమపి మే నష్టం కర్తవ్యం వాపి న క్వచిత్

(" - 21)

నేను ఆత్మను వాస్తవముగా తెలిసికొంటిని. అజ్ఞాన మెచటికో పారిపోయినది. నాకు కర్తృత్వము కూడ నశించి పోయినది. నాకు కర్తవ్య మేదియును లేదు.

బ్రాహ్మణ్యం కులగోత్రే చ నామసౌందర్యజాతయః
స్థూలదేహగతా ఏతే స్థూలాద్భిన్నస్య మే నహి

(" - 22)

బ్రాహ్మణత్వము, కులగోత్రములు, నామము, సౌందర్యము, జాతి మొదలైనవి స్థూల శరీరమునకు చెందినవి. స్థూల శరీరము కంటె వేరైన నాకు అవియేవియును లేవు.

క్షుత్పిపాసాన్ధ్యబాధిర్య కామక్రోధాదయోఽఖిలాః
లింగదేహగతా ఏతే హ్యలింగస్య న విద్యతే

(" - 23)

ఆకలి, దప్పిక, గ్రుడ్డితనము, చెవుడు, కామము, క్రోధము మొదలైనవి సూక్ష్మదేహమునకు చెందినవి. సూక్ష్మ దేహరహితుడనగు నాకివి లేవు.

జడత్వప్రియమోదత్వధర్మాః కారణదేహగాః
న సన్తి మమ నిత్యస్య నిర్వికారస్వరూపిణః

(" - 24)

జడత్వము, ప్రియత్వము, మోదత్వము మొదలైన ధర్మములు కారణ దేహమునకు చెందినవి. నిత్యుడను, నిర్వికారుడను అయిన నాకవి లేవు.

యథాఽమృతం విషాద్భిన్నం విషదోషైర్న లిప్యతే
న స్పృశామి జడాద్భిన్నో జడదోషాన్ప్రకాశతః
(" - 27)

విషము కంటె వేరైన అమృతము విషదోషములచే అంటబడనట్లు, జడము కంటె వేరై ప్రకాశస్వరూపుడనైన నేను జడదోషములను తాకుట లేదు.

చిద్రూపత్వాన్నమే జాడ్యం సత్యత్వాన్నానృతం మమ
ఆనందత్వాన్నమే దుఃఖమజ్ఞానాద్భాతి సత్యవత్.
(" - 30)

జ్ఞానస్వరూపుడనగుటచే నాకు జడత్వము లేదు. సత్యస్వరూపుడనగుటచే నాకు అసత్యము లేదు. ఆనంద స్వరూపుడనగుటచే నాకు దుఃఖము లేదు. అజ్ఞానవశమున అసత్యమైన జగత్తు సత్యముగ తోచుచున్నది.

సంవిన్మాత్ర స్థితశ్చాహమజోఽస్మి కిమతః పరమ్
వ్యతిరిక్తం జడం సర్వం స్వప్నవచ్చ వినశ్యతి
(స్కందోపనిషత్ - 3)

నేను జ్ఞానమాత్రస్వరూపుడను, అజడను అయియున్నాను. ఇంకేమి కావలయును? నా కంటె వేరైన ఈ జడ జగత్తు స్వప్నమువలె నశించును.

అహం సచ్చిత్పరానంద బ్రహ్మైవాస్మి న చేతరః
(మహోపనిషత్ - ½ 11)

'నేను సచ్చిదానంద స్వరూపమగు బ్రహ్మమునే కాని మఱి యేమియు కాదు.'

నాహం దుఃఖీ నమే దేహో బంధః కోఽస్యాత్మని స్థితః
ఇతి భావానురూపేణ వ్యవహారేణ ముచ్యతే
(" - 12)

'నేను దుఃఖిని కాను, నాకు దేహము లేదు, ఆత్మయందు బంధమెచట? — అను నిట్టి భావములతో కూడిన వ్యవహారము చేత జీవుడు ముక్తుడగుచున్నాడు.

ధన్యోఽహం ధన్యోఽహం నిత్యం స్వాత్మానమంజసా వేద్మి
ధన్యోఽహం ధన్యోఽహం బ్రహ్మానందో విభాతి మే స్పష్టమ్
(అవధూతోపనిషత్ - 27)

నేను ధన్యుడను, ధన్యుడను సదా ఆత్మ స్వరూపమును నేను చక్కగ నెఱుంగుచున్నాను బ్రహ్మానందము నాకు స్పష్టముగ గోచరించుచున్నది (అనుభూతమగుచున్నది).

ధన్యోఽహం ధన్యోఽహం దుఃఖం సాంసారికం న వీక్షేఽద్య
ధన్యోఽహం ధన్యోఽహం స్వస్యాజ్ఞానం పలాయితం క్వాపి
(" - 28)

నేను ధన్యుడను, ధన్యుడను. సాంసారిక దుఃఖమును నేనిపుడు అనుభవించుట లేదు. నా అజ్ఞానమిపుడు ఎచటికో పలాయనమై పోయినది.

ధన్యోఽహం ధన్యోఽహం కర్తవ్యం మేన విద్యతే కించిత్
ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం సర్వమత్రసంపన్నమ్
(” - 29)

నేను ధన్యుడను. ధన్యుడను. నాకిపుడు కర్తవ్యమేమియు ఒకింతైనను లేదు. నేను పొందదగిన దానినంతయు పొందితిని.

ధన్యోఽహం ధన్యోఽహం తృప్తేర్మే కోపమా భవేల్లోకే
ధన్యోఽహం ధన్యోఽహం ధన్యో ధన్యః పునః పునర్ధన్యః
(” - 30)

నేను ధన్యుడను, ధన్యుడను పరమ తృప్తుడను అయియున్నాను. ఈ ప్రపంచమున నా యొక్క తృప్తికి సామ్యమే లేదు. నేను ధన్యుడను, ధన్యుడను, ముమ్మాటికిని ధన్యుడను అయియున్నాను.

అహోపుణ్యమహో పుణ్యం ఫలితం ఫలితం దృఢమ్
అస్య పుణ్యస్య సంపత్తేరహో వయమహో వయమ్
(” - 31)

ఆహా ! నా పుణ్యము చక్కగ ఫలించినది. ఆహా ! ఈ పుణ్య సంపత్తి ఆశ్చర్యకరమైనది !

అహోజ్ఞానమహో జ్ఞానమహో సుఖమహో సుఖమ్
అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః
(”—32)

ఆహా ! ఈ జ్ఞానమెంత గొప్పది ! ఈ సుఖమెంత గొప్పది ! ఈ శాస్త్రమెంత గొప్పది ! ఈ గురువు ఎంత గొప్పవాడు.

ఆత్మానుసంధానము

ద్వితీయభాగము

వాచా వక్తు మశక్య మేవ మనసా మన్తుం నవా శక్యతే
స్వానన్దామృతపూరపూరిత పరబ్రహ్మాంబుధే ర్వైభవమ్.
అమ్భోరాశివిశీర్ణవార్షికశిలాభావం భజన్మే మనో
యస్యాంశాంశలవేవిలీన మధునాఽఽనన్దాత్మనానిర్వృతమ్
(వివేకచూడామణి-483)

ఆత్మానందమను అమృతప్రవాహముతో పరిపూర్ణమైనట్టి పరబ్రహ్మమను సముద్రముయొక్క మహిమను నోటితో వర్ణించుటకు శక్యముకాదు. మనస్సుతో తలంచుటకును వీలుకాదు. సముద్రమునందు పడి కరిగిపోయిన వడగండ్లవలె ఆ బ్రహ్మమునందు లీనమైనట్టి నా మనస్సు ఆ బ్రహ్మానందములోని ఒకానొక భాగముయొక్క ఇంచుకంతలో చేరి ఇప్పుడు ఆ పరబ్రహ్మ సాక్షాత్కారమను ఆనందముతో సుఖించుచున్నది.

క్వ గతం కేన వానీతం కుత్ర లీన మిదం జగత్.
అధునైవ మయా దృష్టం నాస్తి కిం మహ దద్భుతమ్.
(''-484)

ప్రపంచము ఎచటికేగినది? ఎవనిచే గొనిపోబడి

నది? ఎచట లయించినది? ఇది యంతయు నేనిపుడే తిలకించితిని. ఇదియొక గొప్ప ఆశ్చర్యముగా తోచలేదు.

కిం హేయం కిముపాదేయం కిమన్యత్కిం విలక్షణమ్.
అఖణ్డానన్ద పీయూషపూర్ణే బ్రహ్మమహార్ణవే.
(''-485)

అఖండానందమను అమృతముతో పరిపూర్ణమైన బ్రహ్మమను మహాసముద్రమునందు విడవదగినదిగాని, గైకొనదగినదిగాని, విలక్షణమైనదిగాని వేరొకటిగాని కానరాదు.

న కిఞ్చిదత్ర పశ్యామి న శృణోమి న వేద్మ్యహమ్,
స్వాత్మనైవ సదానన్దరూపేణాస్మి విలక్షణః
(''-486)

నేను నాలో నిత్యానంద స్వరూపముతో అన్నిటికంటె భిన్నుడుగా నున్నాను. నేనిచట వేరొకటి చూచుటలేదు. వినుటలేదు. తెలిసికొనుటలేదు.

ధన్యోఽహం కృతకృత్యోఽహం
విముక్తోఽహం భవగ్రహాత్
నిత్యానన్ద స్వరూపోఽహం
పూర్ణోఽహం త్వదనుగ్రహాత్.
('' -489)

గురుదేవా! తమ అనుగ్రహమువలన నేను ధన్యుడను, కృతకృత్యుడను, విముక్తుడను, నిత్యానందస్వరూపుడను, పరిపూర్ణుడను అయియున్నాను.

అసంగోఽహ మనఙ్గోఽహ మలిఙ్గోఽమభఙ్గురః
ప్రశాన్తోఽహ మనన్తోఽహ మతాంతోఽహం చిరన్తనః

(" —490)

నేను అసంగుడను, దేహము లేనివాడను, సూక్ష్మ శరీరము లేనివాడను, నాశరహితుడను, ప్రశాంతుడను. అనంతుడను, శాశ్వతుడను.

అకర్తాఽహ మభోక్తాఽహ మవికారోఽహ మక్రియః
శుద్ధబోధస్వరూపోఽహం కేవలోఽహం సదాశివః.

(" —491)

నేను కర్తను కాను, భోక్తను కాను, నిర్వికారుడను, అక్రియుడను, శుద్ధబోధస్వరూపుడను, ఒక్కడనై ఉండువాడను, సదా శివుడను.

ద్రష్టుశ్శ్రోతుర్వక్తుః కర్తుర్భోక్తు ర్విభిన్న ఏ వాహమ్.
నిత్య నిరన్తర నిష్క్రియ నిస్సీమాసఙ్గ పూర్ణబోధాత్మా

(" —492)

నేను చూచువానికంటెను, వినువానికంటెను, చెప్పువానికంటెను, చేయువానికంటెను, అనుభవించువానికంటెను వేరైనవాడను. నేను నిత్యమై సర్వవ్యాపకమై నిష్క్రియమై హద్దులేనిదై, అసంగమై, పరిపూర్ణమై జ్ఞానస్వరూపమైనట్టి ఆత్మను అయియున్నాను.

నాహ మిదం నాహ మదోఽప్యుభయో రవభాసకం పరం శుద్ధమ్,
బాహ్యాభ్యన్తరశూన్యం పూర్ణం బ్రహ్మాద్వితీయమే వాహమ్.

(" —493)

నేను 'ఇదికాదు, అదికాదు' ఆ రెండిటికి ప్రకాశకమై, పరమై, శుద్ధమై, బాహ్యాభ్యంతరములందు దృశ్యశూన్యమై, పూర్ణమై, అద్వితీయమైనట్టి బ్రహ్మమే అయియున్నాను.

నిరుపమమనాదితత్త్వంత్వమహమిదమద ఇతి కల్పనాదూరమ్
నిత్యానన్దైకరసం సత్యం బ్రహ్మాద్వితీయ మే వాహమ్

(" —494)

ఉపమానములేనిదియు, అనాదితత్త్వమైనదియు; నీవు, నేను, ఇది, అది అను భేదములేనిదియు, ఎడతెగని నిత్యానంద స్వరూపమును, సత్యమును అగు అద్వితీయ బ్రహ్మమునే నేను.

నారాయణోఽహం నరకాన్తకోఽహం పురాన్తకోఽహం
పురుషోఽహ మీశః.
అఖణ్డబోధోఽహ మశేషసాక్షీ నిరీశ్వరోఽహం నిరహం చ నిర్మమః.

(" —495)

నేను నారాయణుడను, త్రిపురాంతకుడను, ఆదిపురుషుడను, ఈశ్వరుడను, అఖండబోధ స్వరూపుడను, అన్నిటికిని సాక్షి అయినవాడను, ప్రభువులేనివాడను, అహంకార మమకారము లేనివాడను అయియున్నాను.

సర్వేషు భూతే ష్వహ మేవ సంస్థితో
జ్ఞానాత్మనాఽన్తర్బహి రాశ్రయస్సన్,
భోక్తా చ భోగ్యం స్వయ మేవ సర్వం
తద్య త్పృథ గ్దృష్ట మిదం తయా పురా.

(" —496)

సమస్త ప్రాణులందును నేనే యున్నాను. నేను జ్ఞాతృ స్వరూపముతో నున్నాను, బాహ్యాభ్యంతరములందు వ్యాపించియున్నాను. భోక్తయు, భోజ్యమును, సమస్తము నేనై యున్నాను. పూర్వము ఏ వస్తువును వేరుగా ఉంచితినో ఆ వస్తువును, దానిని అనుభవించువాడను నేనే అయి యున్నాను.

మ య్యఖణ్డసుఖామ్భోధౌ బహుధా విశ్వవీచయః,
ఉత్పద్యన్తే విలీయన్తే మాయామారుత విభ్రమాత్.
(" —497)

అఖండసముద్ర రూపుండనగు నాయందు మాయ యను గాలివలన అనేకవిధములగు జగత్తులను అలలు పుట్టుచు, లయించుచున్నవి.

స్థూలాదిభావా మయి కల్పితా భ్రమా
దారోపితా ను స్ఫురణేన లోకైః,
కాలే యథా కల్పకవత్సరాయ
నర్త్వాదయో నిష్కలనిర్వికల్పే.
(" —498)

భాగరహితమై, అవిచ్ఛిన్నమైనట్టి కాలమునందు కల్పములు, సంవత్సరములు, అయనములు, ఋతువులు, కల్పింపబడినట్లు; నిష్కలమై, నిర్వికల్పమైనట్టి నాయందు జనులచే భ్రమవలన స్థూలాది భావములు కల్పించబడినవి.

ఆకాశవ త్కల్పవిదూరగోఽహ
మాదిత్యవ ద్భాస్యవిలక్షణోఽహమ్,
అహార్యవ న్నిత్య వినిశ్చలోఽహ
మంభోధివ త్పారవివర్జితోఽహమ్.
(" —500)

నేను ఆకాశమువలె దేనితోను సంబంధము లేనివాడను. సూర్యునివలె ప్రకాశింపబడనివాడను. పర్వతము వలె సదా నిశ్చలుడను. సముద్రమువలె అపారమైనవాడను.

న మే దేహేన సంబంధో మేఘే నేవ విహాయసః,
అతః కుతో మే తద్ధర్మా జాగ్రత్స్వప్న సుషుప్తయః
(" —501)

ఆకాశమునకు మేఘముతో సంబంధము లేనట్లు, నాకు దేహముతో సంబంధము లేదు. కాబట్టి ఆ దేహముయొక్క ధర్మములగు జాగ్రత్, స్వప్న, సుషుప్తులు నాకెట్లుండగలవు?

ఉపాధి రాయాతి స ఏవ గచ్ఛతి స ఏవ కర్మాణి కరోతి భుఙ్క్తే,
స ఏవ జీవన్మ్రియతే సదాఽహం కులాద్రివ న్నిశ్చల ఏవ సంస్థితః
(" —502)

ఉపాధి (దేహాదులు) వచ్చుచున్నది, అదియే పోవుచున్నది, అదియే కర్మలను చేయుచున్నది. అదియే అనుభవించుచున్నది, అదియే బ్రతుకుచున్నది, అదియే మరణించుచున్నది. నేనో కుల పర్వతము వలె నిశ్చలముగ నున్నాను.

న మే ప్రవృత్తి ర్న చ మే నివృత్తిః
సదైకరూపస్య నిరంశకస్య,
ఏకాత్మకో యో నిబిడో నిరన్తరో
వ్యోమేవ పూర్ణః స కథం ను చేష్టతే.
(" —503)

సదా ఏకరూపుడనై, నిరంశకుడనై నట్టి నాకు ప్రవృత్తి లేదు, నివృత్తి లేదు అంతటను దట్టముగ క్రమ్ముకొని, నిరంతరము ఏకాకారముతో ఆకాశము వలె వెలయునట్టి ఆ పరమాత్మ ఎట్లు కదలును ?

పుణ్యాని పాపాని నిరిన్ద్రియస్య
నిశ్చేతసో నిర్వికృతే ర్నిరాకృతేః
కుతో మ మాఖణ్డ సుఖానుభూతే
ర్బ్రూతే హ్యనన్వాగత మిత్యపి శ్రుతిః
(" —504)

నేను ఇంద్రియములు లేనివాడను, మనస్సు లేని వాడను, వికారము లేని వాడను, ఆకారము లేని వాడను అయియున్నాను. అఖండ సుఖము ననుభవించు నాకు (ఆత్మకు) పుణ్యముగాని, పాపముగాని లేవు. ఈ విషయమును శ్రుతి తెలుపుచున్నది కదా !

రవే ర్యథా కర్మణి సాక్షిభావో
వహ్నే ర్యథా వాఽయసి దాహకత్వమ్,

రజ్జో ర్యథాఽఽరోపితవస్తుసఙ్గ
స్తథైవ కూటస్థచిదాత్మనో మే.
(,, —507)

సూర్యునకు కర్మలందు సాక్షిభావము ఎట్లు కలదో, అగ్నికి ఇనుమునందు దహనశక్తి ఎట్లు కలదో, త్రాటికి ఆరోపితవస్తువు (సర్పము) తో సంబంధము ఎట్లు కలదో, అట్లే కూటస్థ చిదాత్మయగు నాకు ఈ ప్రపంచముతో సంబంధము కలదు.

కర్తాఽపి వా కారయితాఽపి నాహం
భోక్తాఽపి వా భోజయితాఽపి నాహమ్,
ద్రష్టాఽపి వా దర్శయితాఽపి నాహం
సోఽహం స్వయం జ్యోతి రనీదృగాత్మా.
(,, —508)

నేను చేయువాడను కాను, చేయించువాడను కాను, అనుభవించువాడను కాను, అనుభవింప జేయువాడను కాను చూచువాడను కాని, చూపించువాడను కాని కాదు. స్వయం జ్యోతియగు ఆత్మనే నేను.

జలే వాపి స్థలే లుఠ త్వేష జడాత్మకః,
నాహం విలిప్యే తద్ధర్మైర్ఘటధర్మై ర్నభో యథా.
(,, —510)

జడస్వరూపమగు ఈ దేహము జలమందు గాని, స్థలమందుగాని పొరలు గాక ! ఘటధర్మములచే ఆకాశము అంటబడునట్లు, ఆ దేహధర్మములచే నేను అంటబడను.

కర్తృత్వ భోక్తృత్వ ఖలత్వ మత్తతా
జడత్వ బద్ధత్వ విముక్తతాదయః,
బుద్ధే ర్వికల్పా న తు సన్తి వస్తుతః
స్వస్మిన్ పరే బ్రహ్మణి కేవలేఽద్వయే.

(,, —511)

కర్తృత్వము, భోక్తృత్వము, దుర్జనత్వము, ప్రమత్తత్వము, జడత్వము, బద్ధత్వము, విముక్తత్వము మొదలగునవి బుద్ధియొక్క వికల్పములు. కేవలమై అద్వయమైనట్టి పరబ్రహ్మమగు నా యందవి వాస్తముగ లేవు.

సన్తు వికారాః ప్రకృతేర్దశధా శతధా సహస్రధా వాపి.
తైః కింమేఽసంగచితేర్నహ్యంబుదడంబరోఽమ్బరంస్పృశతి.

(,, —512)

ప్రకృతి యొక్క వికారములు, పదులు, వందలు, వేలు ఉండుగాక! అసంగ చిద్రూపుడనగు నాకు వానితో ఏమి సంబంధము? మేఘము యొక్క ఆడంబరములు ఆకాశమును అంటవు కదా!

అవ్యక్తాదిస్థూల పర్యన్త మేత
ద్విశ్వం యత్రాభాసమాత్రం ప్రతీతమ్.
వ్యోమ ప్రఖ్యం సూక్ష్మ మాద్యన్తహీనం
బ్రహ్మాద్వైతం యత్తదే వాహ మస్మి.

(,, —513)

అవ్యక్తము మొదలుకొని స్థూలము వఱకు గల ఈ ప్రపంచమంతయు దేనియందు ఆభాసమాత్రమై తోచుచున్నదో, అట్టిదియు, ఆకాశము వంటిదియు, సూక్ష్మమైనదియు, ఆద్యంతరహితమైనదియు నగు ఏ బ్రహ్మము కలదో అదియే నేను.

సర్వాధారం సర్వవస్తు ప్రకాశం
సర్వాకారం సర్వగం సర్వశూన్యమ్.
నిత్యం శుద్ధం నిశ్చలం నిర్వికల్పం
బ్రహ్మాద్వైతం యత్తదే వాహ మస్మి.

(,, —514)

సమస్తమునకు ఆధారమై, సమస్త వస్తువులను ప్రకాశింపజేయునదై, సర్వాకారమై, సర్వ వ్యాపకమై, సర్వవస్తు శూన్యమై, నిత్యమై, శుద్ధమై, నిశ్చలమై, నిర్వికల్పమై, అద్వయమైనట్టి ఏ బ్రహ్మము కలదో, అదియే నేను.

యత్రప్రత్యస్తాశేషమాయా విశేషం
ప్రత్యగ్రూపం ప్రత్యయాగమ్యమానమ్.
సత్యజ్ఞానానన్త మానన్ద రూపం
బ్రహ్మాద్వైతం యత్తదే వాహ మస్మి.

(;, —515)

మాయా భేదములన్నిటికిని దూరమైనదియు, ప్రత్యగాత్మ స్వరూపమును, ఇంద్రియములకు గోచరము కానిదియు సత్యజ్ఞానస్వరూపమును, అనంతమును, ఆనందరూపమును, అద్వితీయమునగు ఏ బ్రహ్మము కలదో, అదియే నేను.

నిష్క్రియోఽస్మ్య వికారోఽస్మి నిష్కలోఽస్మి నిరాకృతిః
నిర్వికల్పోఽస్మి నిత్యోఽస్మి నిరాలంబోఽస్మి నిర్ద్వయః
(„ —516)

నేను నిష్క్రియుడను, వికారరహితుడను, నిష్కళుడను. నిరాకారుడను, నిర్వికల్పుడను, నిత్యుడను, ఆధారరహితుడను, అద్వయుడను అయియున్నాను.

సర్వాత్మకోఽహం సర్వోఽహం సర్వాతీతోఽహ మద్వయః,
కేవలాఖణ్డ బోధోఽహ మానన్దోఽహం నిరన్తరః.
(„ —517)

నేను సర్వాత్మకుడను, సర్వ స్వరూపుడను, సర్వాతీతుడను, అద్వయుడను, కేవలాఖండ బోధ స్వరూపుడను, నిరంతరానంద రూపుడను (బ్రహ్మమును) అయియున్నాను.

అహో నిరంజనశ్శాంతో బోధోఽహం ప్రకృతేః పరః।
ఏతావంతమహం కాలం మోహేనైవ విడంబితః ॥
(అష్టావక్రగీత - 33 పే - 1 శ్లో)

నేను దోషరహితుడను, శాంత స్వరూపుడను, జ్ఞాన స్వరూపుడను, ప్రకృతికి పరమైన వాడను. అహో! ఇంతకాలము వరకు నేను అజ్ఞానము చేత మోసపోయితిని.

యథా ప్రకాశయామ్యేకో దేహమేనం తథా జగత్।
అతో మమ జగత్సర్వమథవా న చ కించన ॥
(„ — 34 — 2)

ఈ దేహమును నేనెట్లు ప్రకాశింపజేయుచున్నానో, అట్లే ఈ జగత్తును గూడ ప్రకాశింపజేయుచున్నాను. కాబట్టి ఈ జగత్తంతయు నా సంబంధమైనదిగానున్నది, లేక ఆరోపితమైనదగుటచే ఈ దృశ్యమేమియు నాయందు లేకయే యున్నది,

స శరీరమహో విశ్వం పరిత్యజ్య మయాఽధునా।
కుతశ్చిత్కౌశలాదేవ పరమాత్మా విలోక్యతే ॥
(„ — 36 — 3)

శరీరసహితమైన ఈ జగత్తును మిథ్యగా తెలుసుకొని, పరిత్యజించి జ్ఞానస్వరూపమగు ఆత్మను నేనిపుడు అవలోకించుచున్నాను.

యథైవేక్షురసే క్లృప్తా తేన వ్యాప్తైవ శర్కరా।
తథా విశ్వం మయి క్లృప్తం మయా వ్యాప్తం నిరంతరమ్ ॥
(„ — 39 — 6)

చెఱకురసమునందు ఉన్న చక్కెర ఆ చెఱకురసముచే వ్యాప్తమై యున్నట్లు నాయందు కల్పితమైన ఈ ప్రపంచము నాచేత వ్యాప్తమైయున్నది.

అహో వికల్పితం విశ్వమజ్ఞానాన్మయి భాసతే।
రూప్యం శుక్తౌ ఫణీ రజ్జౌ వారి సూర్యకరే యథా ॥
(„ — 42 — 9)

ముత్యపుచిప్పయందు వెండియు, త్రాటియందు సర్ప

మున్న, సూర్యకిరణములందు జలమున్న కల్పింపబడి ఎట్లు తోచుచున్నవో అట్లే ఈ ప్రపంచమున్న అజ్ఞానముచే నాయందు కల్పింపబడి తోచుచున్నది. ఆశ్చర్యము.

మత్తో వినిర్గతం విశ్వం మయ్యేవ లయమేష్యతి ॥
మృది కుంభో జలే వీచిః కనకే కటకం యథా ॥
(,, — 43 — 10)

మట్టియందు కుండయు, జలమందు తరంగములున్న, బంగారమునందు ఆభరణములున్న లీనమొందునట్లు నానుండి ఉత్పన్నమైన ఈ జగత్తున్న నాయందే విలీనమగుచున్నది.

అహో అహం నమో మహ్యం వినాశో యస్య నాస్తి మే ।
బ్రహ్మాది స్తంబపర్యంతం జగన్నాశేఽపి తిష్ఠతః ॥
(,, — 45 — 11)

ఆహా! బ్రహ్మదేవుడు మొదలుకొని, తృణము వరకు గల ఈ ప్రపంచము నశించినను నాకు నాశనము లేదు. అట్టి నాశరహితుడనగు నాకు (ఆత్మకు) నమస్కారము.

అహో అహం నమో మహ్యమేకోఽహం దేహవానపి।
క్వచిన్న గంతా నాగంతా వ్యాప్య విశ్వమవస్థితః ॥
(,, — 46 — 12)

నేను దేహధారినైనప్పటికిని అద్వితీయుడను. నేను ఎచటికిని పోవువాడను కాను, వచ్చువాడను కాను, నేను ఈ ప్రపంచమును ఆవరించియున్నాను. ఆహా! ఆశ్చర్యము!

అహో అహం నమో మహ్యం దక్షో నాస్తీహ మత్సమః ।
అసంస్పృశ్య శరీరేణ యేన విశ్వం చిరం ధృతమ్ ॥
(,, — 47 — 13)

ఈ శరీరమును అంటక ఈ విశ్వమునంతయు నేను ధరించుచున్నాను. ఈ కారణముచేత నాతో సమానమైన వాడు ఎవడును లేడు. ఆహా! అట్టి ఆశ్చర్యరూపుడనగు నాకు నమస్కారము.

అహో అహం నమో మహ్యం యస్య మే నాస్తి కించన।
అథవా యస్య మే సర్వం యద్వాఙ్మనసగోచరమ్ ॥
(,, 48-14)

ఈ దృశ్య పదార్థములేవియు నాకు లేవు. వాక్కునకు, మనస్సునకు గోచరమగు ఈ సమస్తమున్న వాస్తవముగ మిథ్యయై యున్నది. అట్టి ఆశ్చర్యరూపుడనగు నాకు నమస్కారము.

జ్ఞానం జ్ఞేయం తథా జ్ఞాతా త్రితయం నాస్తి వాస్తవం ।
అజ్ఞానాద్భాతి యత్రేదం సోఽహమస్మి నిరంజనః ॥
(,, 49-15)

ఎచట జ్ఞాతజ్ఞానము జ్ఞేయము అను త్రిపుటి వాస్తవముగ లేదో మఱియు ఎచట అజ్ఞానము వలన ఈ మూడున్న తోచుచున్నదో అట్టి నేను నిరంజనుడనై వెలయుచున్నాను.

ద్వైతమూలమహో దుఃఖం నాన్యత్తస్యాస్తి భేషజం ।
దృశ్యమేతన్మృషా సర్వమేకోఽహం చిద్రసోఽమలంః ॥
(,, 50-16)

దుఃఖమునకు కారణము ద్వైతము. ఆ దుఃఖమునకు జ్ఞానము తప్ప వేఱొక ఔషధములేదు. ఈ సమస్త దృశ్యము మిథ్య. నేను (ఆత్మ) ఒక్కడినే చిద్రూపుడను, నిర్మలుడను– అను జ్ఞానమే, దుఃఖనిర్మూలనమునకు ఔషధము.

బోధమాత్రోఽహ మజ్ఞానాదుపాధిః కల్పితో మయా ।
ఏవం విమృశతో నిత్యం నిర్వికల్పే స్థితిర్మమ ॥
(" 51-17)

నేను జ్ఞానైకస్వరూపుడను, నా చేతనే అవిద్యవలన ఉపాధి కల్పింపబడినది– ఈ ప్రకారముగ నిత్యము విచారణ చేయుచున్న నాకు నిర్వికల్ప సమాధియందు స్థితి సంభవించుచున్నది.

అహో మయి స్థితం విశ్వం వస్తుతో న మయి స్థితం ।
న మే బంధోఽస్తి మోక్షో వా భ్రాంతిశ్శాంతా నిరాశ్రయా ॥
(" 52-18)

నాకు వాస్తవముగ బంధముగాని మోక్షముగాని లేవు. నాయందు (కల్పితమై) యున్న ఈ జగత్తు యథార్థముగ లేనేలేదు. ఆశ్చర్యము! ఈ విధముగ విచారణ చేయుటవలన భ్రాంతి శమించిపోవుచున్నది.

శరీరం స్వర్గనరకౌ బంధమోక్షౌ భయం తథా ।
కల్పనామాత్రమేవై తత్కిం మే కార్యం చిదాత్మనః ॥
(" 53-20)

ఈ శరీరము స్వర్గము, నరకము, బంధము, మోక్షము,

భయము కల్పనామాత్రములే అయియున్నవి. చిదాత్మ రూపుడగు నాకు వీనితో ఏమిపని ?

అహో జనసమూహేఽపి న ద్వైతం పశ్యతో మమ ।
అరణ్యమివ సంవృత్తం క్వ రతిం కరవాణ్యహమ్ ॥
(" 56-21)

ఆహా ! జనసమూహమందును నేను ద్వైతమును చూచుటలేదు. ఇది అంతయు అరణ్యమువలె శూన్యముగ తోచుచున్నది. అట్టి నేను ఇక దేనియందు ఆసక్తి కలిగియుండగలను ?

నాహం దేహో న మే దేహో జీవో నాహ మహం హి చిత్ ।
అయమేవ హి మే బంధ ఆసీద్యా జీవితే స్పృహా ॥
(" 57-22)

నేను దేహమును కాను. నాకు దేహములేదు. నేను, జీవుడను కాను. నేను చిద్రూపుడను. ఆశకలిగియుండుట ఏది కలదో అదియే బంధము.

అహో భువనకల్లోలై ర్విచిత్రైర్ద్రాక్సముత్థితం
మయ్యనంతమహాం బోధౌ చిత్తవాతే సముద్యతే ॥
(" 59-23)

ఆహా ! అపార సుఖసముద్రరూపుడనగు నాయందు మనస్సను గాలివీచుటచే కల్లోలితములగు ప్రపంచములను తరంగములు ఉత్పన్నములగుచున్నవి

మయ్యనంతమహాంభోధౌ చిత్తవాతే ప్రశామ్యతి।
అభాగ్యాజ్జీవవణిజో జగత్పోతో వినశ్వరః ॥
(” 60-24)

అపార సుఖసముద్రరూపుడనగు నాయందు చిత్తమను వాయువు శమింప జీవజగత్తులు రెండును కూడ శమించి పోవుచున్నవి.

మయ్యనంత మహాంభోధావాశ్చర్యం జీవవీచయః।
ఉద్యంతి ఘ్నంతి ఖేలంతి ప్రవిశంతి స్వభావతః ॥
(” 61-25)

అనంత సుఖసముద్రడనైన నాయందు జీవులను తరంగములు ఉత్పన్నములగుచు, వ్యవహరించుచు, లయించుచు నున్నవి. ఆశ్చర్యము !

మయ్యనంత మహాంభోధౌ విశ్వపోత ఇతస్తతః ।
భ్రమతి స్వాంతవాతేన న మమాస్త్యసహిష్ణుతా ॥
(” 97-1)

అనంత సుఖస్వరూపుడనగు నాయందు మనస్సను గాలిచే జగత్తను నావ ఇటు నటు తిరుగుచున్నది. దానిచే నాకు అశాంతి ఏమియు లేదు.

మయ్యనంత మహాంభోధౌ జగద్వీచిః స్వభావతః ।
ఉదేతు వాఽస్తమాయాతు న మే వృద్ధిర్న చ క్షతిః ॥
(” 98-2)

అనంత మహాసముద్రుడనగు నాయందు జగత్తను తరంగము స్వభావముగ ఉత్పన్నమగుగాక ! లేక నశించుగాక ! దానివలన నాకువృద్ధిగాని, క్షయముగాని లేదు.

మయ్యనంత మహాంభోధౌ విశ్వం నామ వికల్పనా ।
అతిశాంతో నిరాకార ఏతదేవాహమాస్థితః ॥
(” 99-3)

అనంత సుఖ మహాసముద్రరూపుడనగు నాయందు ఈ ప్రపంచము కల్పింపబడియున్నది. నేను వాస్తవముగ మహా శాంతరూపుడను. నిరాకారుడను, ఆత్మస్వరూపుడను అయియున్నాను.

నాత్మా భావేషు నో భావస్తత్రానంతే నిరంజనే।
ఇత్యసక్తోఽస్పృహశ్శాంత ఏతదేవాహమాస్థిత ॥
(” 99-4)

ఆత్మ దేహాదులయందు లేదు, దేహాదులు అనంతమై నిరంజనమైనట్టి ఆత్మయందు లేవు. నేను సంగరహితమై శాంతమైనట్టి ఆత్మయే అయియున్నాను.

అహో చిన్మాత్రమేవాహమింద్రజాలోపమం జగత్ ।
అతో మమ కథం కుత్ర హేయోపాదేయ కల్పనా ॥
(” 100-5)

నేను చిన్మాత్రస్వరూపుడను. ఈ ప్రపంచము ఇంద్ర జాలముతో సమానమయియున్నది. కాబట్టి త్యాజ్యమును,

గ్రాహ్యమును అగు కల్పన నాచే దేనియందు ఎట్లు చేయబడ గలదు.

యోసావ సౌపురుషస్సోహ మస్మి ॥

(మహావాక్య రత్నావళి 138-1)

ఏ పురుషుడు (ఆత్మ) సూర్యమండలమునందున్నాడో అతడే నా శరీరమునందును సాక్షిగానున్నాడు. అతడే నేను అయియున్నాను.

తద్యోహం యోసా సోహం ॥ (" 138-2)

ఏ బ్రహ్మము వేదశాస్త్రములందు ప్రసిద్ధమై యలరుచున్నదో ఆ బ్రహ్మమే నేను అయియున్నాను,

తంశాంత మచల మద్వయా
నంద చిద్ఘన ఏవాహ మస్మి ॥ (" 138-3)

శాంతమై, నిశ్చలమై, అద్వయమై, ఆనందరూపమయినట్టి, చిద్ఘనమయినట్టి సచ్చిదానందరూపమే నేనై యున్నాను.

తత్పూర్ణా నందైకబోధ
స్తద్బ్రహ్మై వాహమస్మి ॥ (" 138-4)

పూర్ణానందబోధ స్వరూపమగు ఆ పరబ్రహ్మమే నేను అయియున్నాను.

త్వం వాహమస్మి భగవోదేవ
తేహం వైత్వ మసి ॥ (" 138-5)

ఓ భగవంతుడగు దేవా! నీవే నేను, నేనే నీవు అయియున్నాము.

సచ్చిదానందాత్మ కోహమజోహం
పరిపూర్ణోహ మస్మి ॥ (" 138-6)

నేను సచ్చిదానందమయి, జన్మరహితమయి, పరిపూర్ణమయినట్టి ఆత్మనై యున్నాను.

శుద్ధాద్వైత బ్రహ్మహం ॥ (" 138-7)

నేను శుద్ధమయి, అద్వితీయమయినట్టి బ్రహ్మమే అయియున్నాను.

వాచామగోచర నిరాకార
పరబ్రహ్మ స్వరూపోహమేవ ॥ (" 138-8)

వాక్కులకు అగోచరమయి, నిరాకారమయినట్టి పరబ్రహ్మమే నేను అయియున్నాను.

సదోజ్వలోఽవిద్యాతత్కార్య హీనస్స్వాత్మ బంధ
హరస్సర్వదా ద్వైతరహిత ఆనందరూపస్సర్వాధిష్ఠాన
చిన్మాత్రో నిరస్తాఽవిద్యాతమో మోహో హమే
వాహ మోంతత్సద్య త్పరంబ్రహ్మ రామచంద్రశ్చి

దాత్మకస్సోహ మోంతద్రామ భద్రః పరంజ్యోతి స్సో
హమోం తత్పరః పరమపురుషః పురాణ పురుషో త్తమో
నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్సత్య పరమానం తాద్వయః
పరిపూర్ణః పరమాత్మా బ్రహ్మై వాహం రామోస్మి ॥
(" 140-9)

సద్రూపమయినదియు, ప్రకాశస్వరూపమయినదియు, అవిద్యారహితమయినదియు, దురభిమానమును హరించునదియు, అద్వితీయమయినదియు, ఆనందస్వరూపమయినదియు, సమస్త ప్రపంచమునకు ఆధారభూతమయిన చిదాకాశరూపమయినదియు, అజ్ఞానమును పోగొట్టునదియు అగు బ్రహ్మమే నేను. ప్రణవస్వరూపమైన సద్రూపబ్రహ్మమే నేను. రామచంద్రస్వరూపమైనదియు, చిత్కాకారరూపమయినదియు అగుబ్రహ్మమే నేను. శ్రీరామచంద్రుడు ప్రణవస్వరూపమై, పరంజ్యోతిస్వరూపమైనట్టి బ్రహ్మమే, ఆరాముడే నేను. అతడు సర్వస్వమునకు అతీతుడు. ఉత్తముడు, పురాణపురుషుడు, పురుషోత్తముడు, నిత్యుడు, నిర్మలుడు, సమస్తము తెలిసినవాడు, తెలిసికొనదగినవాడు, అవిద్యాసంబంధము లేనివాడు, సత్యస్వరూపుడు, అనంతుడు, అద్వయుడు. ఆనందరూపుడు, పరిపూర్ణుడు, బ్రహ్మస్వరూపుడు. ఆ బ్రహ్మస్వరూపుడగు రాముడే నేను అయియున్నాను. రాముడే బ్రహ్మము. ఆ బ్రహ్మమే నేను. బ్రహ్మమునకు, రామునకు, నాకు ఒకింతైనను భేదములేదు.

త్రిషుధామసు యద్భోజ్యం
భోక్తా భోగశ్చయద్భవేత్
తేభ్యోవి లక్షణ స్సాక్షీ
చిన్మాత్రో హంసదా శివః ॥ (" 141-10)

జాగ్రత్, స్వప్న, సుషుప్తులను మూడు అవస్థలందును అనుభవింపబడునదియు. అనుభవించువాడును, అనుభవమున్ను అగు సమస్తమునకున్ను విలక్షణమై, సాక్షియైన, చిన్మాత్రమైన బ్రహ్మమే, సదాశివుడే నేను.

మయ్యేవ సకలం జాతం
మయిసర్వం ప్రతిష్ఠితం ॥
మయిసర్వం లయం యాతి
తద్బ్రహ్మాదయ మస్మ్యహం ॥ (" 141-11)

నాయందే సమస్తప్రపంచము పుట్టినది, నాయందే ప్రతిష్ఠితమైయున్నది. నాయందే లయించుచున్నది. అట్టి అద్వయబ్రహ్మమునే నేను.

నిర్వాణోస్మి నిరీహో స్మి
నిరంశోస్మి నిరీప్సితః ॥
చిదాత్మాస్మి నిరంశోస్మి
పరాపర వివర్జితః ॥ (" 141-12)

నేను మోక్షస్వరూపుడను. కోరికలు లేనివాడను. అంశరహితుడను, సంకల్పములు, ఆశలు లేనివాడను. చిదాత్మను. పరావర రహితుడను,

బ్రహ్మైవాహం సర్వవేదాంత వేద్యం
నాహం వేద్యం వ్యోమవాతాది రూపం ॥
రూపం నాహం నామనాహం న కర్మ
బ్రహ్మైవాహం సచ్చిదానంద రూపమ్ ॥
(" 142-13)

నేను బ్రహ్మమును, సమస్త వేదాంతవేద్యుడను. ఆకాశము, వాయువు మున్నగువానివలె రూపముకలవాడను కాను. ఇంద్రియాదులచే తెలియబడువాడను కాను. నేను నామరూపరహితుడను. కర్మ వివర్జితుడను. 'నేను సచ్చిదానందరూపమగు బ్రహ్మమునే అయియున్నాను'.

నిత్యశ్శుద్ధో బుద్ధముక్త స్వభావస్సత్య
స్సూక్ష్మస్సర్వ భూశ్చాద్వితీయః ॥
ఆనందాబ్ధిర్య త్పరస్సోహ మస్మి
ప్రత్యక్‌ధాతుర్నాత్ర సంసీతిరస్తి ॥ (" 143-14)

నేను నిత్యుడను, శుద్ధుడను, బుద్ధుడను, ముక్తుడను, సత్యస్వభావుడను, సూక్ష్మస్వరూపుడను, సర్వవ్యాపకుడను, అద్వితీయుడను, ఆనందసముద్రుడను. ప్రపంచముకంటె వేఱైనవాడను. ప్రత్యగాత్మస్వరూపుడను. ప్రపంచమునకు ఆధారభూతమైనవాడను, ఇందు సంశయము లేదు.

సోహమర్కః పరంజ్యోతి రర్క
జ్యోతిరహం శివః ॥

ఆత్మజ్యోతి రహం శుక్ర
స్సర్వజ్యోతి రసావహం ॥ ("143-15)

పరంజ్యోతి స్వరూపుడనైన సూర్యుడను నేను, సూర్యునియందుగల జ్యోతి నేనే. నేను శివుడను. నేను ఆత్మజ్యోతిని. చిత్కాశస్వరూపుడను, సర్వజ్యోతిని.

ద్వైతభావ విముక్తోస్మి సచ్చిదానంద లక్షణః ॥
శుద్ధబోధస్వరూపోహం కేవలోహం సదాశివః ॥
(" 143-16)

నేను ద్వైతభావరహితుడను. సచ్చిదానంద స్వరూపుడను. శుద్ధబోధస్వరూపుడను. కేవలుడను, సదాశివుడను.

నిష్క్రియోస్మ్య వికారోస్మి
నిర్గుణోస్మి నిరాకృతిః ॥
నిర్వికల్పోస్మి నిత్యోస్మి
నిరాలంబోస్మి నిర్ద్వయః ॥ (" 144-17)

నేను నిష్క్రియుడను, నిర్వికారుడను, నిర్గుణుడను, ఆకారరహితుడను, నేను వికల్పరహితుడను, నిత్యుడను, ఆధారరహితుడను, రెండవది లేనివాడను.

కేవలాఖండ బోధోహం
స్వానందోహం నిరంతరః ॥
సత్యం జ్ఞానమనంతం
యత్పరం బ్రహ్మాహ మేవతత్ ॥ (" 144—18)

నేను కేవలము అఖండబోధ స్వరూపుడను, నిరంతరము స్వానందరూపుడను, సత్యమై, జ్ఞానస్వరూపమై, అనంతమైనట్టి ఏ పరబ్రహ్మముకలదో అదియే నేను.

కేవలం చిత్సదానంద
బ్రహ్మైవాహం జనార్దనః ॥
అశుభశ్శుభ సంకల్పః
సశాంతోస్మి నిరామయంః ॥ (" 145—19)

నేను కేవలము చిద్రూపసదానంద బ్రహ్మమునే అయియున్నాను. నేను జనార్ధనుడను. నేను సంకల్ప రహితుడను. శాంతుడను, నిర్వికారుడను.

నష్టేష్టా నిష్టకలన స్సచ్చిన్మాత్ర పరోస్మ్యహం
అంతర్యామ్యహ మగ్రాహ్యో
నిర్దేశ్యోహ మలక్షణః ॥ (" 145—20)

నేను ఇష్టానిష్ట వృత్తిరహితుడను. సచ్చిన్మాత్ర స్వరూపుడను. ప్రపంచమునకు పరమమైనవాడను. నేను అంతర్యామిని. నేను గ్రహింపదగినవాడను. నిర్దేశింపదగని వాడను. చిహ్నములు లేనివాడను.

అద్వైతోహ మపూర్ణోహ
మబాహ్యోహ మనంతరః ॥
అద్వయానంద విజ్ఞాన
ఘనశ్చాహ మవిక్రియః ॥ (" 145—21)

నేను రెండవవస్తువు లేనివాడను, పరిపూర్ణుడను, బాహ్యాభ్యంతరము లేనివాడను, అద్వయానంద విజ్ఞాన ఘనుడను, నిష్క్రియుడను.

అవిద్యాకార్య హీనోహ
మవాఙ్మానస గోచరః ॥
ఆత్మా చైతన్య రూపోహ మహ
మానంద చిద్ఘనః ॥ (" 146—22)

నేను అవిద్యాకార్యము లేనివాడను, వాక్కులకు మనస్సునకు గోచరింపబడనివాడను, ఆత్మస్వరూపుడను, చైతన్యరూపుడను, ఆనందచిద్ఘనస్వరూపుడను.

ఆప్తకామోహ మాకాశ
త్పరమాత్మేశ్వరోస్మ్యహం ॥
చిదానందోస్మ్యహం చేతా
చిద్ఘనశ్చిన్మయోస్మ్యహం ॥ (,, 146—23)

నేను ఆప్తకాముడను (కోరికలన్నిటిని పొందినవాడను). ఆకాశముకంటెను—పరమైన ఆత్మను. ఈశ్వరుడను చిదానంద స్వరూపుడను, చైతన్యరూపుడను. చిద్ఘన స్వరూపుడను, చిన్మయుడను.

జ్యోతిర్మయో స్మ్యహం జ్యాయా
జ్యోతిషాం జ్యోతిరస్మ్యహం ॥

నిత్యోహం నిరవద్యోహం
నిష్క్రియోస్మి నిరంజనః ॥ (,, 146—24)

నేను జ్యోతిర్మయుడను గొప్పవైన సూర్యచంద్రాది జ్యోతులకున్న జ్యోతిని. నేను నిత్యుడను, హానిలేనివాడను, నిష్క్రియుడను. నిరంజనుడను.

నిర్మలో నిర్వికల్పోస్మి
నిరాఖ్యాతోస్మినిశ్చలః ॥
నిర్వికారో నిత్యపూతో నిర్గుణో
నిస్పృహో స్మ్యహం ॥ (,, 147 — 25)

నేను నిర్మలుడను, నిర్వికల్పుడను. నామసంకేతికములు లేనివాడను, నిశ్చలుడను, నిర్వికారుడను. ఎల్లప్పుడు పవిత్రమైనవాడను నిర్గుణుడను, సంకల్పరహితుడను.

నిరింద్రియో నియంతాహం
నిరపేక్షోస్మి నిష్కళః ॥
పురుషఃపరమాత్మాహం
పురాణః పరమోస్మ్యహం ॥ (" 147—26)

నేను ఇంద్రియరహితుడను, సమస్తప్రాణులందుండి వారిని ప్రేరణచేయువాడను, ఏ అపేక్షయులేనివాడను, శరీరత్రయమునందుండు పరమపురుషుడను. నేను పరమాత్మను, పురాణపురుషుడను, ఉత్తమమైనవాడను.

పూర్ణానందైక బోధోహం
ప్రత్యగే కరసోస్మ్యహం ॥
ప్రజ్ఞాతోహం ప్రకాశోహం
ప్రకాశః పరమేశ్వరః ॥ (" 148-27)

నేను పూర్ణానందైక బోధస్వరూపుడను, ప్రత్యగాత్మను ఏకనిర్వికార స్వరూపుడను, ఉత్తమజ్ఞాతను (తెలుసుకొను వాడను), ప్రకాశస్వరూపుడను, పరమేశ్వరుడను.

ఏకథా చింత్య మానోహం
ద్వైతా ద్వైత విలక్షణః ॥
శుద్ధోస్మి శుక్రశ్శాంతోస్మి
శాశ్వతోస్మి శివోస్మ్యహం ॥ (,, 148—28)

నేను (ఆత్మ) ఏకాకారముగ ధ్యానించదగినవాడను, ద్వైత విలక్షణుడను, శుద్ధుడను, సానుభూతుడను. శాంతుడను శాశ్వతుడను, శివస్వరూపుడను,

ద్వైతాద్వైత విహీనోస్మి
ద్వంద్వ హీనోస్మి సోస్మ్యహం ॥
భావాభావ విహీనోస్మి
భావహీనోస్మి భాస్మ్యహం ॥ (" 148—29)

నేను ద్వైతాద్వైత రహితుడను, శీతోష్ణాది ద్వంద్వములు లేనివాడను, పరమాత్మనే నేను, నేను భావాభావ రహితుడను, ప్రకాశరూపుడను.

శూన్యా శూన్య విహీనోస్మి
శోభనా శోభనోస్మ్యహం ॥
సదసద్భేద హీనోస్మి
సంకల్ప రహితోస్మ్యహం ॥ (" 148—30)

నేను అన్యరహితుడను, ద్వంద్వ వర్జితుడను, సదసద్భేద వర్జితుడను, సంకల్పరహితుడను.

నానాభేద విహీనోస్మి
హ్యఖండానంద విగ్రహః ॥
బంధమోక్ష విహీనోస్మి
శుద్ధం బ్రహ్మాస్మి సోస్మ్యహం ॥ (" 149-31)

నేను సకలభేదవర్జితుడను, అఖండానంద స్వరూపుడను, బంధమోక్ష రహితుడను, శుద్ధ బ్రహ్మస్వరూపుడను, ఆ పరమాత్మనే నేను.

చిత్తాది సర్వహీనోస్మి
పరమోస్మి పరాత్పరః ॥
సదా విచార రూపోస్మి
నిర్విచారోస్మి సోస్మ్యహం ॥ (" 149-32)

నేను చిత్తాది సమస్త పదార్థరహితుడను, ఉత్తముడను, పరాత్పరుడను, సదా విచారణా స్వరూపుడను, నిర్విచార రూపుడను, ఆ పరమాత్మనే నేను.

ధ్యాతృధ్యాన విహీనోస్మి
ధ్యేయహీనోస్మి సోస్మ్యహం ॥
లక్ష్యాలక్ష్య విహీనోస్మి
లయ హీన రసోస్మ్యహం ॥ (" —150-33)

నేను ధ్యాత, ధ్యానము, ధేయము లేనివాడను. ఆ పరమాత్మనే నేను. నేను లక్ష్యాలక్ష్య విహీనుడను. నాశ రహితుడను, బ్రహ్మరస స్వరూడను.

మాతృమాన విహీనోస్మి
మేయహీనశ్శివో స్మ్యహం ॥
సర్వేంద్రియ విహీనోస్మి
సర్వకర్మ కృదప్యహం ॥ (" —150-34)

నేను ప్రమాత, ప్రమాణము, ప్రమేయము అను త్రిపుటిలేనివాడను, శివుడను; సమస్తకర్మలు చేయుచున్నప్పటికిని నేను సర్వేంద్రియరహితుడను.

ముదితా ముదితాఖ్యోస్మి
సర్వమౌనఫలోస్మ్యహం ॥
షడ్వికార విహీనోస్మి
షట్కోశ రహితో స్మ్యహం ॥ (" —151-35)

నేను సంతోషాదినామములు కలవాడను, సమస్త మౌనఫలము నేనే. నేను షడ్వికారరహితుడను, షట్కోశ వివర్జితుడను.

దేశకాల విముక్తోస్మి దిగంబర సుఖోస్మ్యహం ॥
అఖండాకాశరూపోస్మి హ్యఖండాకారరూపధృత్ ॥
(" 151-36)

నేను దేశకాల రహితుడను, సుఖస్వరూపుడను, అఖండాకాశరూపుడను, అఖండాకారరూపమును ధరించినవాడను.

ప్రపంచముక్త చిత్తోస్మి
ప్రపంచరహితోస్మ్యహం ॥
సర్వప్రకాశ రూపోస్మి
చిన్మాత్రజ్యోతిరస్మ్యహం ॥ (" —151-37)

నేను ప్రపంచరహిత చిత్తుడను, ప్రపంచ వివర్జితుడను, సర్వ ప్రకాశరూపుడను, చిన్మాత్ర జ్యోతిని.

కాలత్రయ విముక్తోస్మి
కామాది రహితోస్మ్యహం ॥
ముక్తిహీనోస్మి ముక్తోస్మి
మోక్షహీనోస్మి సర్వదా ॥ (" —152-38)

నేను కాలత్రయ రహితుడను, కామాది వర్జితుడను, ముక్తుడను, సదాబంధ మోక్షరహితుడను.

గంతవ్య దేశహీనోస్మి గమనాది వివర్జితః ॥
సర్వదా సమరూపోస్మి
శాంతోస్మి పురుషోత్తమః ॥ (" —152-39)

నేను వెళ్ళవలసిన ప్రదేశము లేనివాడను గమనాది రహితుడను, సదా సమరూపుడను, శాంతుడను, పురుషోత్తముడను.

చిదకరోహం సత్యోహం
వాసుదేవోఽజరామరః ॥
అహమేకాక్షరం బ్రహ్మవాసు
దేవాఖ్య మవ్యయం ॥ (" —152-40)

నేను చిద్రూపుడను, నాశరహితుడను, సత్యస్వరూపుడను, వాసుదేవుడను, వార్ధక్యమరణములు లేనివాడను, నేను ఏకాక్షరమైన అక్షర పరబ్రహ్మను, వాసుదేవుడను పేరుగల అవ్యయ పరమాత్మను.

పరబ్రహ్మ స్వరూపోహం
పరమానంద మస్మ్యహం ॥
కేవలం జ్ఞానరూపోహం
కేవలం పరమోస్మ్యహం ॥ (" —153-41)

నేను పరబ్రహ్మస్వరూపుడను, పరమానందమే నేను. నేను కేవలము జ్ఞానస్వరూపుడను, సర్వోత్తముడను.

కేవలం శాంతరూపోహం
కేవలం చిన్మయోస్మ్యహం ॥
కేవలం నిత్యరూపోహం
కేవలం శాశ్వతోస్మ్యహః ॥ (" —153-42)

నేను కేవలము శాంతరూపుడను, చిన్మయుడను, నిత్యుడను, శాశ్వతుడను.

కేవలం సత్యరూపోహ మహం
త్యక్త్వాహ మస్మ్యహం ॥
కేవలం తుర్యరూపోస్మి
తుర్యాతీతోస్మి కేవలః ॥ (" —153-43)

నేను కేవలము సత్యస్వరూపుడను, అహంభావమును త్యజించినవాడను, నేను కేవలము తురీయాతీతుడను,

కేవలాకార రూపోస్మి
శుద్ధరూపోస్మ్యహం సదా ॥
నిర్వికల్ప స్వరూపోస్మి
నిరీహోస్మి నిరామయః ॥ (" —154-44)

నేను కైవల్యస్వరూపుడను, శుద్ధరూపుడను, నిర్వికల్ప స్వరూపుడను, ఆశలేనివాడను, నిరామయుడను, రాగ రహితుడను.

అపరిచ్ఛిన్న రూపోస్మి
హ్యనంతా నంద రూపవాన్ ॥
ఆత్మారామ స్వరూపోస్మి
హ్యహమాత్మా సదాశివః ॥ (" —154-45)

నేను పరిచ్ఛిన్నరూపము లేనివాడను, అనంతానంద రూపుడను, సదాశివుడను.

ఆదిమధ్యాంత శూన్యోస్మి
హ్యాకాశ సదృశోస్మ్యహం ॥
నిత్యశుద్ధ చిదానంద సత్తా
రూపోహ మద్వయః ॥ (" —154-46)

నేను ఆదిమధ్యాంత రహితుడను, ఆకాశమువంటి వాడను, నిత్యశుద్ధ చిదానంద సత్యస్వరూపుడను, అద్వయుడను.

నిత్య శుద్ధ విశుద్ధైక సచ్చిదానంద మస్మ్యహం ॥
భూమానంద స్వరూపోహం
భాషాహీ నోస్మ్యహం సదా ॥ (" —155-47)

నేను నిత్యశుద్ధ ఏకసచ్చిదానంద రూపుడను, భూమానంద స్వరూపుడను, వాక్కులకు అతీతుడను.

సర్వాధిష్ఠాన రూపోస్మి
సర్వథా చిద్ఘనోస్మ్యహం ॥
చిత్తవృత్తి విహీనోహం
చిదాత్మైక రసోస్మ్యహం ॥ (" —155-48)

నేను సర్వాధిష్ఠాన రూపుడను. సదా చిద్ఘనుడను. నేను చిత్తవృత్తి రహితుడను, చిదాత్మైక రసస్వరూపుడను.

అహం బ్రహ్మైవ సర్వం
స్యాదహం చైతన్య మేవహి ॥

అహమే వాహమే వాస్మి
భూమాకాశ స్వరూపవాన్ ॥ (" —155-49)

నేను, ఈ సమస్తము బ్రహ్మమే అయియున్నాము. నేను చైతన్యమే అయియున్నాను. నేను పరమాత్మనే అయియున్నాను. నేను భూమాకాశ స్వరూపుడను.

అహమేవ మహానాత్మా
హ్యహమేవ పరాత్పరః ॥
అహమన్య వదాభామి
హ్యహమేవ శరీరవాన్ ॥ (" —156-50)

నేను మహత్తరమగు ఆత్మను. నేను పరాత్పరుడను. నేను శరీరధారినై అన్యుడను వలె కనిపించుచున్నాను.

అహం శిష్యవదా భా
మ్యహంలోకత్రయాశ్రయః ॥
అహం కాలత్రయాతీత
అహం వేదైరు పాసితః ॥ (" —156-51)

నేను శిష్యుడనువలె కనుపించుచున్నాను. నేను ముల్లోకములకు ఆశ్రయమై యున్నాను. నేను కాలత్రయాతీతుడను. వేదములచే నేను ప్రతిపాదింపబడి ఉపాసింపబడు చున్నాను.

అహం శాస్త్రేణ నిర్ణీత
అహం చిత్తేవ్యవస్థితః ॥

ఆనందఘన ఏవాహ
మహం బ్రహ్మాస్మి కేవలః ॥ (" —157-52)

నేను శాస్త్రములచేత నిర్ణయింపబడినాను. నేను చిత్తమందున్నాను, నేను ఆనంద ఘనస్వరూపుడను, నేను కేవలము బ్రహ్మమే అయియున్నాను.

ఆత్మనాత్మ నిత్యప్తోస్మి
హ్యరూపోహ్యహ మవ్యయః ॥
ఆకాశాదపి సూక్ష్మోహ
మాద్యంతా భావ వానహం ॥ (" —157-53)

నేను ఆత్మయందు తృప్తికలిగియున్నాను. నేను రూప రహితుడను. అవ్యయుడను, ఆకాశముకంటె సూక్ష్మమై ఉన్నాను. ఆద్యంతములు లేనివాడను.

సత్తా మాత్రస్వరూపోహం
శుద్ధమోక్ష స్వరూపవాన్ ॥
సత్యానంద స్వరూపోహం
జ్ఞానానంత ఘనోస్మ్యహం ॥ (" —157-54)

నేను సత్తామాత్రి స్వరూపుడను, శుద్ధ మోక్ష రూపుడను, సత్యానందరూపుడను, జ్ఞానానందఘనుడను.

నామ రూపవిముక్తోహ
మహమానంద విగ్రహః ॥

ఆదిచైతన్య మాత్రోహ
మఖండైక రసోస్మ్యహం ॥ (" —158-55)

నేను నామరూపరహితుడను, ఆదిచైతన్యమాత్రుడను, అఖండైకరసస్వరూపుడను.

సర్వత్ర పూర్ణ రూపోహం
పరామృత రసోస్మ్యహం॥
ఏకమే వాద్వితీయ్యంసత్
బ్రహ్మైవాహం నసంశయః॥ (" —158-56)

నేను సర్వత్ర పూర్ణరూపుడను, ఉత్తమ అమృతరస స్వరూపుడను, ఏకమై, అద్వయమై, సత్యస్వరూపమైనట్టి బ్రహ్మమే నేను, అయియున్నాను. ఇందు సంశయము లేదు.

అహమేవ పరంబ్రహ్మ
హ్యహమేవ గురోర్గురు॥
సర్వజ్ఞాన ప్రకాశోస్మి
ముఖ్య విజ్ఞాన విగ్రహః॥ (" —158-57)

నేను పరబ్రహ్మమును, గురోర్గురుడను, సర్వజ్ఞాన ప్రకాశుడను, మహత్తర విజ్ఞానస్వరూపుడను.

తుర్యాతుర్య ప్రకాశోస్మి
తుర్యాతుర్య వివర్జితః॥
దృశిస్వరూపం గగనోపమం పరం
సకృద్విభాతం త్వజమేక మక్షరం॥

అలే పకం సర్వగతం యదద్వయం
తదేవచాహం సకలం విముక్తం॥ (" —159-58)

నేను తుర్యాతుర్యములను ప్రకాశింపజేయువాడను. దృక్స్వరూపుడను, ఆకాశమువంటివాడను, జగత్తునకు పరమైనవాడను, ప్రకాశస్వరూపుడను, జన్మరహితుడను. నేను, ఏకమైనవాడను, నాశరహితమైనవాడను, దేనియందును తగుల్కొననిదియు, సర్వవ్యాపకమైనదియు, రెండవది లేనిదియు, విముక్తమైనదియు, సర్వస్వరూపమును అగు బ్రహ్మమేదికలదో అదియే నేనైయున్నాను.

అహమేవపరంబ్రహ్మ వాసుదేవాఖ్యమవ్యయం ।
ఇతిస్యాన్నిశ్చితో ముక్తో బద్ధ ఏవాన్యథా భవేత్ ॥
(బ్రహ్మానుచింతనం-371-1)

వాసుదేవుడను పేరుగల నాశరహితమైన పరబ్రహ్మమునే నేను అయియున్నాను—ఈ ప్రకారముగ నిశ్చయించువాడు ముక్తుడగును. మఱియొక విధముగ భావనచేసినచో (నేను దేహాదులను అని తలంచినచో) బద్ధుడగును.

అహమేవ పరంబ్రహ్మ నిశ్చితం జీవచిత్త చింత్యతాం ॥
చిద్రూపత్వాదసంగత్వా దబాధ్యత్వాత్ప్రయత్నతః ॥
(" —372-2)

ఓ చిత్తమా! నేను పరబ్రహ్మమునేకాని, జీవచిత్తాదులు కాను- అని చింతన చేయవలయును. చిద్రూపము

కలిగియుండుటవలన, అసంగమై యుండుటవలనను, కాల త్రయమునందు నశింపనిది అగుటవలనను, నేను ఆ బ్రహ్మమునే అయియున్నాను— ఈ ప్రకారముగ ప్రయత్నపూర్వకముగ చింతన చేయవలయును.

అహమేవ పరంబ్రహ్మ న చాహం బ్రహ్మణః పృథక్ ॥
ఇత్యేవం సముపాసీత బ్రాహ్మణో బ్రహ్మణి స్థితః॥
(" —373-3)

నేను పరబ్రహ్మమునే అయియున్నాను. నేను బ్రహ్మముకంటె వేరుగ ఏమియు కాను. ఈ ప్రకారముగ బ్రహ్మనిష్ఠుడు బ్రహ్మమునందు స్థితిగలవాడై లెస్సగ ఉపాసించవలయును.

సర్వోపాధి వినిర్ముక్తం చైతన్యం చ నిరంతరం।
తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా కథం వర్ణాశ్రమీభవేత్ ॥
(" —373-4)

సమస్త ఉపాధిరహితమై నిరంతరము చైతన్యరూపమై యున్న బ్రహ్మమే తానని తెలుసుకొనువానికి ఇక వర్ణ భేదము, ఆశ్రమభేదము ఎట్లు కలుగును?

అహంబ్రహ్మాస్మియో వేద ససర్వం భవతీత్యిదం।
నాహిూత్వా ఈశతే దేవాస్తేషామాత్మాభవేద్దిసః ॥
(" —373-5)

'నేను బ్రహ్మమును అయియున్నాను' — అని ఎవడు తెలుసుకొనునో అతడు సర్వాత్మత్వము, సర్వాంతరత్వము

కలవాడు అగుచున్నాడు. (సమస్త దేవతలందున్న సామర్థ్యము చైతన్యబ్రహ్మమునందే కలదు. కాబట్టి బ్రహ్మజ్ఞానము కలవారికి సర్వాంతరత్వము సిద్ధించినదగుచున్నది.)

అన్యోసావహ మన్యోస్మి త్యుపాస్తేయోన్య దేవతాం।
ననవేదపరోబ్రహ్మ సదేవానాం యథాపశుః ॥(" —374-6)

సమస్త జగత్తు చిదాకాశమునందున్నవలన సకల జనులందున్న చైతన్యము ఏకమైయున్నది. ఇట్లు తెలియక తాము వేఱు, దేవతలు వేఱు అను భేదజ్ఞానముతో జనులు ఆయా దేవతలను ఉపాసించుచున్నారు. బ్రహ్మము తమ నిజస్వరూపమని వారు తెలియకయున్నారు. భేదజ్ఞానము కలవారు పశువులతో సమానులు.

అహమాత్మా నచాన్యోస్మి బ్రహ్మైవాహం నశోకభాక్ ।
సచ్చిదానందరూపోహం నిత్యముక్తస్వభావవాన్ ॥
(" —375-7)

'నేను ఆత్మను, ఇతరుడను కాను, నేను బ్రహ్మమును అను జ్ఞానము కలవాడు దుఃఖమును ఎన్నటికి పొందడు. నేను సచ్చిదానంద స్వరూపుడను, నిత్యముక్త స్వభావుడను అయియున్నాను,

ఆత్మానం సతతంబ్రహ్మ సంభావ్య విహరంతియే।
నతేషాం దుష్కృతం కించిత్ దుష్కృతోద్దాన చాపదః ॥
(" —375-8

తన్ను ఎల్లప్పుడు బ్రహ్మముగ భావించుచు విహరించు వారికి ఒకింతైనను పాపముగాని దానివలన కలుగు ఆపదలుగాని యుండవు.

ఆత్మానం సతతం బ్రహ్మసంభావ్య విహరేత్సుఖం ।
క్షణం బ్రహ్మాహమస్మీతియః కుర్యాదాత్మ చింతనం ॥
(" —375-9)

తన్ను బ్రహ్మముగా ఎల్లప్పుడు తలంచుకొనుచు విహరించువారికి, సుఖముకలుగును. 'నేను బ్రహ్మమును అయియున్నాను' అని క్షణకాలమైనను ఆత్మచింతన చేయువారికి పరమ సుఖము కలుగును.

తన్మహాపాతకం హంతి తమస్సూర్యోదయో యథా ।
అజ్ఞానాద్బ్రహ్మణో జాతమాకాశం బుద్బుదోపమం ॥
(" —376-10)

సూర్యోదయము, చీకటిని నశింపజేయునట్లు అట్టి బ్రహ్మచింతనము మహాపాపమును నశింపచేయును. బ్రహ్మమను సముద్రమునుండి ఆకాశమను బుడగ అజ్ఞాన (మాయ) వలన జనించినది.

ఆకాశాద్వాయురుత్పన్నో వాయోస్తేజ స్తతః పయః ।
అద్భ్యశ్చ పృథివీజాతా తతో వ్రీహి యవాదికం ॥
(" —376-11)

ఆకాశమునుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్ని నుండి జలము జలమునుండి భూమి, భూమినుండి ధాన్యాదులు క్రమముగ ఉత్పన్నమైనవి.

పృథివ్యప్సుపయోవహ్నౌ వహ్నిర్వాయౌ నభస్యసౌ ।
నభోవ్యవ్యాకృతే తచ్చశుద్ధే శుద్ధోస్మ్యహం హరిః ॥
(" —376-12)

(కార్యము కారణమునందు లీనమగును కావున) భూమి నీటియందును, నీరు అగ్నియందును, అగ్ని వాయువునందును, వాయువు ఆకాశమునందును, ఆకాశము అవ్యాకృతమునందును (మూలప్రకృతియందు), అవ్యాకృతము శుద్ధమగు బ్రహ్మమునందును లీనమగును. అట్టి బ్రహ్మమే అట్టి శ్రీహరియే నేను అయియున్నాను.

అహం విష్ణురహం విష్ణురహం విష్ణురహం హరిః ।
కర్తృ భోక్త్రాదికం సర్వం తదవిద్యోత్థమేవచ ॥
(" 377-13)

నేను విష్ణువును, నేను శ్రీహరిని, కర్తభోక్త మున్నగునవి అన్నియు అవిద్యవలన కలిగినవే యగును.

అచ్యుతోహ మనంతోహం గోవిందోహమహం హరిః ।
ఆనందోహ మశేషోహం అజోహ మమృతోస్మ్యహం ॥
(" —377-14)

నేను అచ్యుతుడను, అనంతుడను, గోవిందుడను,

శ్రీహరిని. నేను ఆనందస్వరూపుడను, సమస్త ప్రపంచము నేనే, నేను జన్మరహితుడను, మృత్యురహితుడను.

నిత్యోహం నిర్వికల్పోహం నిరాకారోహ మవ్యయః।
సచ్చిదానందరూపోహం పంచకోశాతి గోప్యహం ॥
(" —378-15)

నేను నిత్యుడను, వికల్పరహితుడను, నిరాకారుడను, నాశరహితుడ, సచ్చిదానంద స్వరూపుడను, పంచకోశములకు అతీతుడను.

అకర్తాహ మభోక్తా హ మసంగః పరమేశ్వరః।
సదామత్సన్నిధానే నచేష్టతే సర్వమింద్రియం ॥
(" —378-16)

నేను కర్తకాను, భోక్తకాను, సంగరహితుడను, పరమేశ్వరుడను, నా సన్నిధానముచేత ఇంద్రియములన్నియు సదా చేష్టలు సలుపుచున్నవి.

ఆదిమధ్యాంతముక్తోహం నబద్ధోహం కదాచన।
స్వభావ నిర్మలశ్శుద్ధ స్స ఏవాహం నసంశయః ॥
(" —378-17)

నేను ఆదిమధ్యాంతరహితుడను, నేను ఎవ్వడును బద్ధుడను కాను, నిర్మలశుద్ధ స్వభావమునే నేను, అట్టి నిర్మల బ్రహ్మమునే నేను; ఇందు సంశయము లేదు.

బ్రహ్మైవాహం న సంసారీ ముక్తోహమితి భావయేత్।
అశక్నువన్‌భావయితుం వాక్యమే తత్సదాభ్యసేత్ ॥
(" —379-18)

నేను బ్రహ్మమునే కాని సంసారిని కాదు నేను ముక్తుడను అని భావన చేయువలయును ఒకవేళ భావన చేయలేనిచో అహం బ్రహ్మాస్మి (నేను బ్రహ్మమును) అను వాక్యమునైనను సదా అభ్యసించుచుండవలయును.

యదాభ్యాసేన తద్భావో భవేద్భ్రమరకీటవత్।
అత్రాపహాయ సందేహ మభ్యసేత్కృత నిశ్చయః ॥
(" —380-19)

ఇట్టి అభ్యాసము చేత భ్రమరకీటక న్యాయమువలె ఆ బ్రహ్మభావము కలుగును. ఇందు సంశయము లేదు. కావున మనుజుడు కృతనిశ్చయుడై ఇట్టి బ్రహ్మభావమును అభ్యసించవలయును.

యావజ్జీవం సదాభ్యాసా జ్జీవన్ముక్తో భవేద్యతిః।
నాహందేహో నచప్రాణో నేంద్రియాణి తథైవచ ॥
(" —381-21)

యావజ్జీవితమును సదా ఇట్టి బ్రహ్మాభ్యాసము చేసినచో యతి (ప్రయత్నశీలుడు) జీవన్ముక్తుడు అగును. నేను దేహమును కాను అట్లే ప్రాణములుకాని ఇంద్రియములు కాని నేను కాను.

నమనోఽహం నబుద్ధిశ్చనై వచిత్తమహంకృతిః ।
నాహం పృథ్వీన సలిలం నచవహ్నిస్తథానిలః ॥
నచాకాశో నశబ్దశ్చ నచస్పర్శస్తథారసః ।
నాహంగంధో నరూపంచ నమాయాహం నసంసృతిః ॥
(" —381-22,23)

నేను మనస్సుగాని, బుద్ధిగాని చిత్తముగాని కాను. అట్లే నేను భూమికాని, జలముకాని, అగ్నికాని, వాయువుకాని, ఆకాశముకాని. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు కాని, మాయకాని, సంసారముకాని కాను.

సదాసాక్షి స్వరూపత్వాచ్ఛివ ఏవాస్మి కేవలః ।
మయ్యేవ సకలం జాతం మయిసర్వం ప్రతిష్ఠితం ॥
మయిసర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయ మస్మ్యహం ।
సర్వజ్ఞోహ మనంతోహం సర్వేశస్సర్వశక్తిమాన్ ॥
(" —382-24,25)

సదా సాక్షి స్వరూపము కలిగియుండుటవలన నేను కేవలము శివుడనే అయియున్నాను. నాయందే సమస్త ప్రపంచము పుట్టి, స్థితికలిగి లయించుచున్నది. అట్టి అద్వితీయ బ్రహ్మమునే నేను. నేను సర్వజ్ఞుడను, అనంతుడను, సర్వేశ్వరుడను, సర్వశక్తిమంతుడను అయియున్నాను.

ఆనందస్స్వర్వబోధోహమితి బ్రహ్మానుచింతనం
అయం ప్రపంచో మిథ్యైవ సత్యం బ్రహ్మాహమద్వయం ॥
(" —382-26)

'నేను ఆనందస్వరూపుడను, సర్వబోధస్వరూపుడను'— అని ఇట్లు ధ్యానించుటయే బ్రహ్మానుచింతనము అయియున్నది. ఈ ప్రపంచము మిథ్య, సత్యమై, అద్వితీయమైనట్టి బ్రహ్మమునే నేను. అట్టి బ్రహ్మమే సత్యమైనది.

అత్రప్రమాణం వేదాంతగురవోఽనుభవస్తథా ।
బ్రహ్మైవాహం న సంసారీ న చాహం బ్రహ్మణః పృథక్ ॥
(" —383-27)

ఇట్టి భావములకు ప్రమాణము వేదాంతము, గురువులు, అనుభవము అయియున్నవి. నేను బ్రహ్మమునే. సంసారిని కాను, నేను బ్రహ్మమునకంటె వేఱుగాను.

నాహందేహో నమే దేహః కేవలోహం సనాతనః ।
ఏకమేవా ద్వితీయం బ్రహ్మనేహ నానాస్తి కించన ॥
(" —383-28)

నేను దేహమును కాను. నాకు దేహము లేదు. కేవలము సనాతన బ్రహ్మము నేను. అద్వితీయమగు బ్రహ్మ మొకటియే ఇచట కలదు ఇచట అనేకత్వము ఒకింతైనను లేదు.

అహమేవావ్యయోఽనన్తః శుద్ధో విజ్ఞాన విగ్రహః ।
సుఖం దుఃఖం న జానామి కథం కస్యాపి వర్తతే ॥
(అవధూతగీత3-పే-7శ్లో)

నేను నాశరహితుడను, అనంతుడను, శుద్ధుడను, విజ్ఞానస్వరూపుడను, సుఖము దుఃఖము నేనెఱుంగను అవి ఎవరికి ఎట్లు కలుగునో నాకు తెలియదు.

న మానసం కర్మ శుభాశుభం మే।
న కాయికం కర్మ శుభాశుభం మే॥
న వాచికం కర్మ శుభాశుభం మే।
జ్ఞానామృతం శుద్ధమతీన్ద్రియోఽహమ్॥ (" —3-8)

నాకు శుభ, అశుభ మానసిక కర్మలు యెవ్వియు లేవు. అట్లే శారీరక వాచికకర్మలున్ను నాకు లేవు. నేను జ్ఞానస్వరూపుడను, అమృతస్వరూపుడను, శుద్ధుడను, ఇంద్రియాతీతుడను.

ఆదిమధ్యాన్తముక్తోఽహం న బద్ధోఽహం కదాచన।
స్వభావనిర్మలః శుద్ధ ఇతి మే నిశ్చితా మతిః।
(" —13-14)

నేను ఆదిమధ్యాంతరహితుడను, నేను ఎల్లప్పుడును బద్ధుడను కాను. నేను స్వభావముగ నిర్మలుడను, శుద్ధుడను— ఈ ప్రకారముగ నాకు నిశ్చితబుద్ధి కలదు.

మహదాది జగత్సర్వం న కించిత్ప్రతిభాతి మే।
బ్రహ్మైవ కేవలం సర్వం కథం వర్ణాశ్రమస్థితిః॥
(" —13-45)

మహదాది ఈ జగత్తు అంతయు నాకు ఒకింతైనను తోచుటలేదు. సమస్తము కేవలము బ్రహ్మమే అయియున్నది. ఇక వర్ణాశ్రమములు ఎట్లుండగలవు?

న జాతోఽహం మృతో వాపి న మే కర్మ శుభాశుభమ్।
విశుద్ధం నిర్గుణం బ్రహ్మ బన్ధో ముక్తిః కథం మమ॥
(" —17-59)

నేను జన్మించలేదు, మరణించలేదు. నాకు శుభాశుభ కర్మలెవ్వియు లేవు. నేను విశుద్ధమైన నిర్గుణ బ్రహ్మమే అయినాయున్నాను నాకిక బంధముగాని, మోక్షముగాని ఎట్లుండగలవు?

నాహం కర్తా న భోక్తా చ న మే కర్మ పురాఽధునా।
నమే దేహో విదేహో వా నిర్మమేతి మమేతి చ॥
(" —19-56)

నేను కర్తను కాను, భోక్తను కాను. నాకు పూర్వముగాని, ఇపుడుగాని కర్మ ఏదియు లేదు. నాకు దేహముగాని, విదేహముగాని, నిర్మమత్వముగాని, మమత్వముగాని లేవు.

న మే రాగాదికో దోషో దుఃఖం దేహాదికం న మే।
ఆత్మానం విద్ధి మామేకం విశాలం గగనోపమమ్॥
(" —19-67)

నాకు రాగాది దోషములు లేవు, దేహాది దుఃఖములు

లేవు. నేను ఏకమై, విశాలమై, ఆకాశము వంటిది అయినట్టి ఆత్మయే నేనని తెలిసికొనుము.

అహమేవ పరం యస్మాత్పరాత్పరతరం శివమ్।
గమాగమవినిర్ముక్తం నిర్వికల్పం నిరాకులమ్॥
(" —24-5)

నేను సారముకంటె సారమైనదియు గమన ఆగమన రహితమైనదియు, నిర్వికల్పమైనదియు నిరాకులమైనదియు అగు శివస్వరూపమే నేను కావున సమస్తముకంటె పరమైనవాడను.

మనోబుద్ధ్యహఙ్కారచిత్తాని నాహం
న శ్రోత్రం న జిహ్వా చ న ఘ్రాణనేత్రమ్,
న చ వ్యోమ భూమిర్న తేజో న వాయు
శ్చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్
(శంకర గ్రంథరత్నావళి–117–1)

నేను మనస్సుగాని, బుద్ధిగాని, అహంకారముగాని చిత్తముగాని కాను. చెవి కాని, నాలుక కాని, ముక్కు కాని, కన్ను కాని నేను కాను. ఆకాశము కాని, భూమి కాని, అగ్ని కాని, వాయువు కాని నేను కాను. నేను చిదానందరూపమై, శివస్వరూపమైన ఆత్మనే నేను.

అహం ప్రాణసంజ్ఞో నవై పఞ్చవాయు
...ర్న వా సప్తధాతుర్నవా పఞ్చకోశః

న వాక్ పాణిపాదౌ న చోపస్థపాయూ
చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్. (" —117-2)

నేను ప్రాణసమూహము కాని, పంచవాయువులు కాని, సప్తధాతువులు కాని, పంచకోశములు కాని కాదు, నేను వాక్కుగాని, హస్తములుగాని, పాదములుగాని, పాయూపస్థేంద్రియములుగాని కాను. నేను చిదానందరూపమైన శివస్వరూపమగు ఆత్మనే నేను.

న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం
న మన్త్రో న తీర్థం న వేదా న యజ్ఞాః
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా
చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్. (" —118-3)

నాకు పుణ్యముగాని, పాపముగాని, సౌఖ్యముగాని, దుఃఖముగాని లేవు. అట్లే మంత్రములుగాని, తీర్థముగాని, వేదములుగాని, యజ్ఞములుగాని లేవు. నేను భోజనముగాని, భోజ్య పదార్థముగాని, భోక్తగాని కాదు. చిదానందరూపమైన శివస్వరూపమగు ఆత్మ నేను.

న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ
మదో నైవ మే నైవ మాత్సర్యభావః
న ధర్మో న చార్థో న కామో న మోక్ష
శ్చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్. (" —118-4)

నాకు రాగద్వేషములు గాని, లోభమోహములుగాని,

మదముగాని, మాత్సర్య భావముగాని లేవు. అట్లే ధర్మార్థ కామ మోక్షములున్ను లేవు. చిదానంద రూపమైన శివస్వరూపమైన ఆత్మనే నేను.

న మృత్యుర్న శఙ్కా న మే జాతిభేదః
పితా నైవ మే నైవ మాతా న జన్మ.
న బన్ధు ర్న మిత్రం గురుర్నైవ శిష్య
శ్చిదానన్దరూపః శివోఽహంశివోఽహమ్. (" —118-5)

నాకు మృత్యువుగాని, భయముగాని, సందేహముగాని, జాతి భేదముగాని లేవు. నాకు తండ్రిగాని, తల్లిగాని, జన్మగాని, బంధువుగాని, మిత్రుడుగాని, గురువుకాని, శిష్యుడుకాని లేరు. చిదానందరూపమైన శివస్వరూపమగు ఆత్మనే నేను.

అహం నిర్వికల్పో నిరాకారరూపో
విభుత్వాచ్చ సర్వత్ర సర్వేన్ద్రియాణామ్.
న వా బన్ధనం నైవ ముక్తిర్నబన్ధః
చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్. (" —119-6)

నేను నిర్వికల్పుడను, నిరాకారుడను, సర్వత్ర సర్వేంద్రియములకు నేను ప్రభువును, సాక్షిని, నాకు బంధముగాని, మోక్షముగాని లేవు. చిదానంద రూపమైన శివస్వరూపమగు ఆత్మనే నేను.

అహమానందసత్యాది లక్షణః కేవలః శివః.
అనానందాదిరూపం యత్ తన్నాహమచలోఽద్వయః.
(" —19-3)

నేను ఆనంద సత్యాది లక్షణములు గలిగినవాడను, కేవలము శివుడను. ఆనందాది రూపముకానిది నేనుకాదు. నేను అచలుడను, అద్వయుడను.

నానావిధేషు కుంభేషు వసేదేకం నభో యథా.
నానావిధేషు దేహేషు తథైవైకో వసామ్యహమ్.
(" —25-29)

అనేక విధములైన కుండలందు ఆకాశము ఒకటిగానే ఎట్లుండునో, అనేకవిధములైన దేహములందు నేను ఒకడనే నివసించుచున్నాను.

నానావిధత్వం కుంభానాం న యాత్యేవ యథా నభః.
నానా విధత్వం దేహానాం తద్వదేవ న యామ్యహమ్.
(" —25-30)

ఘటములయొక్క నానావిధత్వమును ఆకాశము పొందనట్లు, దేహములయొక్క నానావిధత్వమును నేను పొందుట లేదు.

యథా ఘటేషు నష్టేషు ఘటాకాశో న నశ్యతి.
తథా దేహేషు నష్టేషు నైవ నశ్యామి సర్వగః.
(" —25-31)

ఘటములు నశించినచో ఘటాకాశము నశించనట్లు, దేహాదులు నశించినచో, సర్వవ్యాపకుడనగు నేను నశించుట లేదు.

ఉత్తమాదీని పుష్పాణి వర్తన్తే సూత్రకే యథా,
ఉత్తమాద్యాస్తథా దేహావర్తన్తే మయి సర్వగే

(" —25-32)

దారమునందు ఉత్తమాధమ మధ్యమములగు వివిధ పుష్పములు ఉండునట్లు, ఉత్తమాది దేహములు సర్వ వ్యాపకుడనగు నాయందు ఉన్నవి.

యథాన సంస్పృశేత్ సూత్రం పుష్పాణాముత్తమాదితా,
తథానైవం సర్వగం మాం దేహానాముత్తమాదితా.

(" —25-33)

దారమును పుష్పములయొక్క ఉత్తమాదిత్వము స్పృశించనట్లు, సర్వవ్యాపకుడనగు నన్ను దేహాదులయొక్క ఉత్తమాదిత్వము స్పృశించుటలేదు.

పుష్పేషు తేషు నష్టేషు యద్వత్ సూత్రం న నశ్యతి,
తథా దేహేషు నష్టేషు నైవ నశ్యామి సర్వగః

(" —26-34)

పుష్పములునశింప, దారములు నశించనట్లు దేహములు నశించినచో సర్వవ్యాపకుడునగు నేను నశించుటలేదు.

రజ్జు రన్ధ్రస్థదోషాది సూర్యాభం నస్పృశేద్ యథా.
తథాక్షేత్రస్థదోషాది సర్వగం మాం న సంస్పృశేత్.

(" —26-36)

రజ్జువు, రంధ్రము మున్నగువానియందుండు దోషము సూర్యకాంతిని తాకనట్లు, నానావిధ శరీరములందుండు దోషములు సర్వవ్యాపకుడనగు నన్ను స్పృశించనేరవు.

తద్ రజ్జురన్ధ్రనాశేషు నైవ నశ్యతి సూర్యభా.
తథాక్షేత్రవినాశేషు నైవ నశ్యామి సర్వగః

(" —26-37)

రజ్జువు, రంధ్రము నశించినను సూర్యప్రకాశము నశించనట్లు శరీరాదులు నశించినను సర్వవ్యాపకుడనగు నేను నశించుటలేదు.

దేహోనాహం ప్రదృశ్యత్వాద్భౌతికత్వాన్న చేంద్రియమ్,
ప్రాణో నాహమనేకత్వాన్మనో నాహం చలత్వతః.

(" —26-38)

దేహము దృశ్యమానమగుటవలన అది నేను కాను. ఇంద్రియములు భౌతిక పదార్థములగుటవలన నేను అవి కాను. ప్రాణము అనేకమగుటవలన నేను అదికాను. చంచలమగుట వలన మనస్సును నేనుకాను.

బుద్ధిర్నాహం వికారిత్వాత్ తమో నాహం జడత్వతః.
దేహేంద్రియాదికం నాహం వినాశిత్వాద్ ఘటాదివత్.

(" —27-39)

వికారమగుటవలన బుద్ధిని నేనుకాను. జడమగుటవలన

తపస్సును నేను కాను. ఘటాదులవలె నశించునవి యగుటవలన దేహేంద్రియాదులు నేను కాను.

దేహేంద్రియప్రాణమనో బుద్ధ్యజ్ఞానాని భాసయన్,
అహంకారం తథా భామి చైతేషాం జ్ఞాభిమానినమ్.
(" 27-40)

దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధి, అజ్ఞానము, మున్నగువానిని ప్రకాశింపజేయుచు ఈ శరీరాదులందు అభిమానమును వహించెడి అహంకారమును కూడ నేనే ప్రకాశింపచేయుచున్నాను.

సర్వం జగదిదం నాహం విషయత్వాదికం ధియః,
అహం నాహంసుషుప్త్యాదౌ అహమః సాక్షితః సదా.
(" —27-41)

ఈ జగత్తంతయు నేను కాదు. అట్లే విషయములు మున్నగునవియు, బుద్ధియు నేను కాదు. సుషుప్తియందు సాక్షిరూపమున నా సత్తయే ప్రకాశించుచున్నది.

సుప్తౌ యథా నిర్వికారస్తథావస్థాద్వయేఽపి చ,
ద్వయోర్మాత్రాదియోగేన న వికారీ భవామ్యహమ్.
(" —27-42)

సుషుప్తియందు నేను ఎట్లు నిర్వికారుడనో, అట్లే జాగ్రత్స్వప్నముల యందుకూడ నేను నిర్వికారుడను. స్వప్న

జాగ్రత్తులందలి విషయములస్పర్శచే నేను వికారమును బొందను.

స్ఫటికే రక్తతా మిథ్యా మృషా ఖే నీలతా యథా,
తథా జగదిదం మిథ్యా త్వేకస్మిన్నద్వయే మయి.
(" —33-73)

స్ఫటికమందు ఎఱుపురంగు, ఆకాశమునందు నీలత్వము, మిథ్య అయినట్లు, ఏకమై, అద్వయమైనట్టి నా యందు ఈ జగత్తు మిథ్యయే అయియున్నది.

గుణమూర్తిత్రయం భాతి పరస్పర విలక్షణమ్,
సత్త్వాది లక్షణో యస్మిన్ స ఏవాహం నిరంశకః.
(" —35-82)

పరస్పర విలక్షణములును, గుణమయములును అగు మూడు దేహములు ప్రకాశించుచున్నవి. వీనిలో సత్త్వాది లక్షణములు కలదియు, అంశరహితమైనదియు (పరిపూర్ణమైనదియు) వీనిని ప్రకాశింపజేయునదియు ఏదికలదో అదియే నేను.

దేహత్రయమిదం భాతి యస్మిన్ బ్రహ్మణి సత్యవత్,
తదేవాహం పరబ్రహ్మ దేహత్రయ విలక్షణమ్.
(" —35-83)

ఏ బ్రహ్మమునందు ఈ మూడు దేహములు సత్యములుగ

భాసించుచున్నవో, దేహత్రయ విలక్షణమైనట్టి ఆ పరబ్రహ్మమే నేను.

జాగ్రదాదిత్రయం యస్మిన్ ప్రత్యగాత్మని సత్యవత్,
స ఏవాహం పరంబ్రహ్మ జాగ్రదాది విలక్షణః
(" —36-84)

ఏ ప్రత్యగాత్మయందు జాగ్రదాది అవస్థలు మూడును సత్యములుగ తోచుచున్నవో, జాగ్రదాది విలక్షణమైన ఆ పరబ్రహ్మమే నేను.

విశ్వాదికం త్రయం యస్మిన్ పరమాత్మని సంస్థితమ్.
స ఏవ పరమాత్మాహం విశ్వాదిక విలక్షణః(" —36-85)

ఏ పరమాత్మయందు విశ్వతైజసప్రాజ్ఞులను ముగ్గురు స్థితి కల్గియున్నారో, విశ్వతైజసాది విలక్షణమైన ఆ పరమాత్మయే నేను.

విరాడాదిత్రయం భాతి యస్మిన్ బ్రహ్మణి నశ్వరమ్.
స ఏవ సచ్చిదానందలక్షణోఽహం స్వయం ప్రభః.
(" —36-86)

ఏ బ్రహ్మమునందు నశ్వరమగు విరాడాదిత్రయము ప్రకాశించుచున్నారో, సచ్చిదానందలక్షణమై, స్వయం ప్రకాశమైనట్టి ఆ పరబ్రహ్మమే నేను.

నాహం దేహో నేన్ద్రియాణ్యన్తరఙ్గః
నాహఙ్కారః ప్రాణవర్గో న బుద్ధిః.
దారాపత్య క్షేత్ర విత్తాదిదూరః
సాక్షీ నిత్యః ప్రత్యగాత్మా శివోఽహమ్. (" — 43-1)

నేను దేహమును కాను, ఇంద్రియములు కాను, అంతఃకరణము కాను—నేను అహంకారము కాను. ప్రాణసమూహము కాను, బుద్ధి కాని కాను. భార్య కాని, సంతానము కాని, పొలములు కాని, ధనము మున్నగునవి కాను. సాక్షియు, నిత్యమును, శివస్వరూపమును అగు ప్రత్యగాత్మయే నేను.

రజ్జ్వజ్ఞానాద్ భాతి రజ్జౌ యథాఽహిః
స్వాత్మాజ్ఞానాదాత్మనో జీవభావః.
ఆప్తోక్త్యాఽహి భ్రాన్తి నాశే స రజ్జుః
జీవో నాహం దేశికోక్త్యా శివోఽహమ్. (" — 43-2)

త్రాడు అని తెలియక పోవుటవలన త్రాటియందు పాము ఎట్లు గోచరించునో, అట్లే స్వాత్మను గూర్చిన జ్ఞానము లేకపోవుటవలననే ఆత్మయందు జీవభావము కలుగుచున్నది. ఆప్తుని యొక్క వచనముచే భ్రాంతి నశించుటవలన త్రాడు త్రాడే యగుచున్నట్లు గురువాక్యముచే 'నేను జీవుడను కాను, శివస్వరూపుడనని తెలిసికొంటిని.

మత్తో నాన్యత్ కిఞ్చిదత్రాస్తి విశ్వం
సత్యం బాహ్యం వస్తు మాయోపక్లృప్తమ్.

ఆదర్శాన్తర్భాసమానస్య తుల్యం
మయ్యద్వైతే భాతి తస్మాచ్ఛివోఽహమ్.
(" —43-3)

నా కంటె వేఱుగ ఈ ప్రపంచము ఒకింతైనను లేదు. సత్యవస్తువు మాయచేత కప్పఁబడి బాహ్యమున నున్నట్లు తోచుచున్నది. అద్దము లోపల వస్తువు ప్రతిబింబించునట్లు అద్వైతరూపుడనగు నా యందు ఈ జగత్తు భాసించుచున్నది. కనుక నేను శివస్వరూపమగు ఆత్మయే (బ్రహ్మమే) అయియున్నాను.

అభాతీదం విశ్వమాత్మన్యసత్యం
సత్య జ్ఞానానన్దరూపే విమోహాత్,
నిద్రామోహాత్ స్వప్నవత్ తన్న సత్యం
శుద్ధః పూర్ణో నిత్య ఏకః శివోఽహమ్
(" —44-4)

నిద్రయందు అజ్ఞానముచే స్వప్నవస్తువు సత్యముకాకపోయినను, సత్యముగా తోచునట్లు సత్యజ్ఞానానందస్వరూపుడనగు నా యందు ఈ జగత్తు గోచరించుచున్నది. ఈ జగత్తు సత్యమైనదికాదు మిథ్యయే అయియున్నది. నేను శుద్ధుడను, పూర్ణుడను, నిత్యుడను, ఏకస్వరూపుడను అగు శివుడనే అయియున్నాను.

నాహం జాతో నప్రవృద్ధో న నష్టో
దేహస్యోక్తాః ప్రాకృతాః సర్వధర్మాః,
కర్తృత్వాదిశ్చిన్మయస్యాస్తి నాహం
కారస్యైవ హ్యాత్మనో మే శివోఽహమ్
(" —44-5)

నేను జన్మించలేదు, పెరగలేదు, ఈ పుట్టుట మొదలగునవి యున్నియు ప్రాకృతములైన దేహధర్మములై అయియున్నవి. చిన్మయ స్వరూపుడనగు నాకు కర్తృత్వాదులు లేవు. ఈ కర్తృత్వాదులు అహంకార ధర్మములై యున్నవి. నేను శివస్వరూపుడను అయియున్నాను.

నాహం దేహో జన్మమృత్యూః కుతో మే
నాహం ప్రాణో క్షుత్పిపాసా కుతో మే
నాహంచిత్తం శోకమోహౌ కుతో మే
నాహం కర్తా బన్ధ మోక్షౌ కుతో మే. (" —44-6)

నేను దేహమును కాను, ఇక నాకు జన్మమృత్యువు లెచట? నేను ప్రాణమును కాను, ఇక నాకు ఆకలి దప్పిక లెచట? నేను చిత్తమును కాను. ఇక నాకు శోకమోహము లెచట? నేను కర్తను కాను, ఇక నాకు బంధమోక్షము లెచట?

కిం జ్యోతిస్తవ భానుమానహని మే రాత్రౌ ప్రదీపాదికం
స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతిరాఖ్యాహి మే.
చక్షుస్తస్య నిమీలనాదిసమయే కిం ధీర్ధియోదర్శనే
కిం తత్రాహమతో భవాన్ పరమకం జ్యోతిస్తదస్మిప్రభో.
(" —62-1)

గురువు – నాయనా! నీకు (వస్తు ప్రకాశకమగు) జ్యోతి ఏది?

శిష్యుడు – పగలు సూర్యుడు, రాత్రి దీపము మొదలగునవి.

గురువు – మంచిది. అయితే ఆ సూర్యుడు, దీపము మొదలగు వానిని ప్రకాశింపజేయు జ్యోతి ఏదియో చెప్పుము.

శిష్యుడు – నేత్రము.

గురువు – ఆ నేత్రము మూయునపుడు నీకు జ్యోతి ఏది?

శిష్యుడు – బుద్ధి.

గురువు – ఆ బుద్ధిని చూచునది ఏది?

శిష్యుడు – నేను (ఆత్మ)

గురువు – కాబట్టి నీవు పరమజ్యోతివి.

శిష్యుడు – ప్రభూ! అట్లే నేను పరమజ్యోతి స్వరూపమగు ఆత్మనే అయియున్నాను.

న భూమిర్న తోయం న తేజో న వాయు
ర్న ఖం నేన్ద్రియం వా న తేషాం సమూహః,
అనైకాన్తికత్వాత్ సుషుప్త్యేకసిద్ధ
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —120-1)

నేను భూమి కాదు, జలము కాదు, అగ్ని కాదు, వాయువు కాదు, ఇంద్రియములు కాదు, వాని సమూహము కాదు. ఏలయనిన, అవి వికారవంతములు, వినాశశీలములు అయియున్నవి. నేను సుషుప్తికి ఏకమాత్ర సాక్షిగ నున్నాను. నేను అద్వితీయుడను, అన్నియు నశింపగా మిగులు

వదియే నేను. నేను కేవలము శివస్వరూపుడను అయియున్నాను.

న వర్ణా న వర్ణాశ్రమాచారధర్మా
న మే ధారణాధ్యానయోగాదయోఽపి,
అనాత్మాశ్రయాఽహం మమాధ్యాస హానాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —120-2)

నాకు వర్ణములు కాని, వర్ణాశ్రమ ధర్మములు కాని లేవు. నాకు ధారణ, ధ్యాన యోగాదులున్ను లేవు. అనాత్మను ఆశ్రయమగు అధ్యాసము నాకు తొలగుట వలన నేను అద్వితీయుడను, అవశిష్టుడను, (శేషించిన వాడను) నేను కేవలము శివస్వరూపుడను అయియున్నాను.

న మాతా పితా వా న దేవా న లోకా
న వేదా న యజ్ఞా న తీర్థం బ్రువన్తి,
సుషుప్తౌ నిరస్తాతిశూన్యాత్మకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —120-3)

నాకు సుషుప్తియందు సమస్తదృశ్యము తొలగిపోవుట వలన తల్లిగాని, తండ్రిగాని, దేవతలుగాని, లోకములుగాని, వేదములుగాని, యజ్ఞములుగాని, తీర్థములుగాని నాకు ఉండవు. అని శ్రుతివాక్యములు పలుకుచున్నవి. ఆ సుషుప్తికాలమున అద్వితీయుడనగు నేనే శేషించియున్నాను. అట్టి కేవల శివ స్వరూపుడనే నేను

న సాఙ్ఖ్యం న శైవం న తత్ పాఞ్చరాత్రం
న జైనం న మీమాంసకాదేర్మతం వా,
విశిష్టానుభూత్యా విశుద్ధాత్మకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్ (" —121-4)

నాకు సాంఖ్యముగాని, శైవముగాని పాంచరాత్రము గాని, జైనముగాని మీమాంస తార్కికాదిమతములు నాకు లేవు. విశిష్టమగు అనుభూతితో కూడి విశుద్ధమైనట్టి ఆత్మను. అద్వితీయుడను, అవశిష్టుడను కేవలము శివస్వరూపుడను అయియున్నాను.

న చోర్ధ్వం న చాధో న చాన్తర్న బాహ్యం
న మధ్యం న తిర్యఙ్ న పూర్వాపరా దిక్,
వియద్ వ్యాపకత్వాదఖణ్డైకరూప
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్ (" —121-5)

నాకు పైనగాని, క్రిందగాని, లోనగాని, వెలుపలగాని, మధ్యముగాని, అడ్డముగాని, తూర్పు పడమర దిక్కులుగాని లేవు. నేను ఆకాశమునంతటిని వ్యాపించి అఖండైకరూపుడనై యున్నాను. అట్టి ఏకమై, శేషించినదై కేవలము శివస్వరూపమైనట్టి ఆత్మయే నేనై యున్నాను.

న శుక్లం న కృష్ణం న రక్తం న పీతం
న కుబ్జం న పీనం న హ్రస్వం న దీర్ఘమ్,
అరూపం తథా జ్యోతిరాకారకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్ (" —122-6)

నాకు తెలుపుగాని, నలుపుగాని, ఎరుపుగాని, పీతవర్ణములుగాని లేవు. నాకు సన్నముగాని, లావుగాని, హ్రస్వముగాని, దీర్ఘముగాని లేవు. రూపరహితమై, జ్యోతులకును జ్యోతియై, ఏకమై శేషించినదైనట్టి కేవల శివస్వరూపమే నేను.

న శాస్తా న శాస్త్రం న శిష్యో న శిక్షా
న చ త్వం న చాహం న చాయం ప్రపఞ్చః,
స్వరూపావబోధో వికల్పాసహిష్ణు
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —122-7)

నాకు శాసకుడుగాని, శాస్త్రముగాని, శిష్యుడుగాని శిక్షణగాని, నీవు, నేను అనునవిగాని, ఈ ప్రపంచముగాని లేవు నేను జ్ఞానస్వరూపమై, వికల్పరహితమై, ఏకమై, అవశిష్టమై కేవలము శివస్వరూపమైనట్టి ఆత్మయే నేను.

న జాగ్రన్న మే స్వప్నకో వా సుషుప్తిః
న విశ్వో న వా తైజసః ప్రాజ్ఞకో వా,
అవిద్యాత్మకత్వాత్ త్రయాణాం తురీయ
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —122-8)

నాకు జాగ్రత్తుగాని స్వప్నముగాని, సుషుప్తిగాని, విశ్వుడుగాని, తైజసుడుగాని, ప్రాజ్ఞుడుగాని లేరు. అవిద్యారూపములగుట వలన ఆ మూడిటికిని సాక్షియైన తుర్యాత్మస్వరూపుడనే నేను. ఏకమై, శేషించినదై కేవలము శివస్వరూపమైనట్టి బ్రహ్మమే నేను.

అపి వ్యాపకత్వాద్ హితత్వ ప్రయోగాత్
స్వతః సిద్ధ భావాదనన్యాశ్రయత్వాత్,
జగత్ తుచ్ఛమేతత్ సమస్తం తదన్యత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్. (" —122-9)

ఈ జగత్తు అంతయు తుచ్ఛమై, మిథ్యయైయున్నది. ఈ జగత్తు కంటె వేఱై వ్యాపకమై స్వతస్సిద్ధమై అన్య ఆశ్రయరహితమై ఏకమై అవశిష్టమై కేవలము శివస్వరూపమైనట్టి ఆత్మయే నేను.

న చైకం తదన్యద్ ద్వితీయం కుతః స్యాత్
న వాఽకేవలత్వం న చాఽకేవలత్వమ్,
న శూన్యం న చాఽశూన్యమద్వైత కత్వాత్
కథం సర్వ వేదాన్త సిద్ధం బ్రవీమి. (" —122-10)

ఆత్మ అద్వైత స్వరూపమగుట వలన ఏకత్వ సంఖ్యా విశిష్టము కాదు. కనుక తద్భిన్నమైన ద్వితీయ వస్తువు ఎచట నుండి వచ్చును. ఆత్మకు ఏకత్వముగాని, శూన్యత్వములుగాని లేవు. కనుక సమస్త వేదాంత సిద్ధమగు (ఆత్మ) వస్తువును గూర్చి వాక్కులో ఎట్లు చెప్పగలను?

అహం నామరో నైవ మర్త్యో న దైత్యో
న గన్ధర్వయక్షః పిశాచప్రభేదః,
పుమాన్ నైవన స్త్రీ తథా నైవ షణ్ఢః
ప్రకృష్టః ప్రకాశస్వరూపః శివోఽహమ్. (" —124-1)

నేను దేవతను కాను, మనుష్యుడను కాను, దైత్యుడను కాను, గంధర్వుడను కాను, యక్షుడను కాను, పిశాచము లలో ఎవరిని కాను. పురుషుడను కాను, స్త్రీని కాను, నపుంస కుడను కాను. శ్రేష్ఠుడను, ప్రకాశస్వరూపుడను అగు శివుడనే (ఆత్మ) నేను.

అహం నైవ బాలో యువా నైవ వృద్ధో
న వర్ణీనచ బ్రహ్మచారీ గృహస్థః,
వనస్థోపి నాహం న సన్న్యస్తధర్మా
జగజ్జన్మనాశైక హేతుః శివోఽహమ్. (" —124-2)

నేను బాలుడను కాను, యువకుడను కాను, వృద్ధుడను కాను. నాకు వర్ణము లేదు. నేను బ్రహ్మచారిని కాను, గృహస్థుడను కాను. వానప్రస్థుడను కాను, సన్న్యాసిని కాను. జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు ఏకమాత్ర కారణమగు శివుడనే నేను.

అహం నైవ మేయస్తిరోభూతమాయా
తథైవేక్షితుం మాం పృథఙ్ నాస్త్యుపాయః,
సమాశ్లిష్టకాయత్రయోఽప్యద్వితీయః
సదాతీన్ద్రియః సర్వరూపః శివోఽహమ్. (" —124-3)

నేను ఏ విధమైన ప్రమాణమునకు విషయము కాను. నేను అప్రమేయుడను. నా నుండి మాయ అంతర్ధానమైనందున దృశ్యాదులు లేవు. నన్ను వీక్షించుటకు వేరుగ ఏ ఉపాయ

మును లేదు. నేను శరీరత్రయమును ఆవరించుకొని యున్నను, అద్వితీయుడనే అయియున్నాను. నేను సదా అతీంద్రియ స్వరూపుడను, సర్వరూపుడను, శివుడను అయియున్నాను.

అహం నైవ మన్తా న గన్తా న వక్తా
న కర్తా న భోక్తా న ముక్తాశ్రమస్థః,
యథాహం మనోవృత్తిభేద స్వరూపః
తథా సర్వవృత్తి ప్రదీపః శివోఽహమ్. (" —124-4)

నేను చింతించువాడను కాను, గమనము కలవాడను కాను, మాట్లాడువాడను కాను, కర్తగాని భోక్తగాని కాను, ఆశ్రమస్థుడను కాను, మనోవృత్తులన్నిటిని ప్రకాశింపచేయువాడను, శివుడను నేను.

నమే లోకయాత్రాప్రవాహప్రవృత్తిః
నమే బన్ధబుద్ధ్యా దురీహానివృత్తిః,
ప్రవృత్తేర్నివృత్తస్య చిత్తస్య వృత్తిః
యతస్త్వహం తత్స్వరూపః శివోఽహమ్.
(" —125-5)

సంసారయాత్రా ప్రవాహమునందు నాకు ప్రవృత్తి లేదు. నాకు బంధముక్తులు లేవు. చిత్తవృత్తులను ప్రకాశింపజేయు శివుడను నేను.

నిదానం యదజ్ఞాన కార్యస్య కార్యం
వినా యస్య సత్త్వం స్వతో నైవ భాతి,

యదాద్యన్త మధ్యాన్తరాలాన్తరాల
ప్రకాశాత్మకం స్యాత్ తదేవాహమస్మి. (" —125-6)

అజ్ఞాన కార్యమగు సంసారమును ప్రకాశింపజేయునదియు, హృదయము యొక్క ఆద్యంత మధ్యాంతరాళములను ప్రకాశింపజేయునదియైన శివస్వరూపమే నేను.

యతోఽహం న బుద్ధిర్నమే కార్యసిద్ధిః
యతో నాహమఙ్గం నమే లిఙ్గభఙ్గమ్,
హృదాకాశవర్తీ గతాఙ్గత్రయార్తిః
సదా సచ్చిదానన్దమూర్తిః శివోఽహమ్. (" —126-7)

నేను బుద్ధిని కాను, కనుక కార్యసిద్ధిని గూర్చిన చింత నాకు లేదు. నేను శరీరమును కాను. కనుక ఏ అవయవము అయిన పోవునా అనుచింత లేదు. నేను హృదయాకాశవర్తిని. నాకు శరీరత్రయ సంబంధమగు బాధ లేదు. నేను సదా సచ్చిదానందమూర్తియగు శివుడనే అయియున్నాను.

యదాసీద్విలాసాద్ వికారం జగత్ యద్
వికారాశ్రయం నాద్వితీయత్వతః స్యాత్.
మనోబుద్ధిచిత్తాహమాకారవర్తిః
ప్రవృత్తిర్యతః స్యాత్ | తతేవాహమస్మి. (" —126-8)

అవిద్యావికారమగు ఈ జగత్తు లేదు కావున వికారాశ్రయము అగు వస్తువేదియు లేదు. దేనినుండి మనోబుద్ధి

చిత్త అహంకారములు ప్రవృత్తములగుచున్నవో అట్టి ఆత్మయే నేను.

యదన్తర్బహిర్వ్యాపకం నిత్యశుద్ధం
యదేకం సదా సచ్చిదానన్దకన్దమ్,
యతః స్థూల సూక్ష్మ ప్రపఞ్చస్య భానం
యతస్తత్ ప్రసూతిస్త దేవాహమస్మి. (" —126-9)

ఏది బాహ్యాభ్యంతరములందు వ్యాపించియున్నదో ఏది నిత్యశుద్ధమైనదో ఏది ఏకమై సదా సచ్చిదానందరూపమై యున్నదో, దేని వలన స్థూల సూక్ష్మ ప్రపంచము ప్రకాశించుచున్నదో దేని నుండి ఈ ప్రపంచము ఉత్పన్నమైనదో అట్టి ఆత్మయే నేను.

యదర్కేన్దు విద్యుత్ప్రభాజాలమాలా
విలాసాస్పదం యత్ స్వభేదాది శూన్యమ్,
సమస్తం జగద్ యస్య పాదాత్మకం స్యాద్
యతః శక్తిభానం తదేవాహమస్మి. (" —127-10)

ఏది సూర్యచంద్రవిద్యుత్ సమూహామునకు ఆశ్రయమైయున్నదో ఏది జాతీయాదిభేదములు లేక యున్నదో, ఈ జగత్తంతయు దేనియొక్క అంశమై యున్నదో, దేని నుండి సమస్త శక్తియు ప్రకాశించు చున్నదో అదియే (ఆత్మయే) నేను.

యతః కాలమృత్యుర్బిభేతి ప్రకామం
యతశ్చిత్త బుద్ధీన్ద్రియాణాం విలాసః
హరి బ్రహ్మ రుద్రేన్ద్ర చన్ద్రాదినామ
ప్రకాశో యతఃస్యాత్ తదేవాహమస్మి. (" —127-11)

దేనిని చూచి కాలరూపమగు మృత్యువుకూడ మిగుల భీతినొందునో, దేని వలన చిత్తము బుద్ధి, ఇంద్రియములు ప్రకాశించుచున్నవో హరిహరబ్రహ్మ ఇంద్ర చంద్రాదులు దేని వలన ప్రకాశము నొందుచున్నారో అదియే (అట్టి బ్రహ్మమే) నేను అయియున్నాను.

యదాకాశవత్ సర్వగం శాన్తరూపం
పరంజ్యోతిరాకారశూన్యం వరేణ్యమ్,
యదాద్యన్తశూన్యం పరం శఙ్కరాఖ్యం
యదన్తర్విభావ్యం తదేవాహమస్మి. (" —127-12)

ఏది ఆకాశమువలె సర్వ వ్యాపకమైయున్నదో, ఏది శాంతరూపమైనదో, ఏది పరంజ్యోతిగా, ఏది ఆకార రహితమైయున్నదో, ఏది శ్రేష్ఠమైనదో, ఏది ఆద్యంతరహిత మైనదో, ఏది హృదయాంతరమున ధ్యానింపదగియున్నదో అట్టి శ్రేష్ఠమైన శంకర స్వరూపమే నేను అయియున్నాను.

ప్రౌఢ-ప్రౌఢనిజానుభూతిగలితద్వైతేన్ద్రజాలో గురు
ర్గూఢం గూఢమఘౌఘదుష్టకుధియాం స్పష్టం సుధీశాలినామ్,

స్వాంతే సమ్యగ్ ఇహానుభూతమపి సచ్ఛిష్యావబోధాయ తత్
సత్యం సంస్మృతవాన్ సమస్తజగతాం నైజం నిజాలోకనాత్.
(" —161-1)

సత్య స్వరూపమగు ఆత్మ పాప కలుషితమైన బుద్ధులకు చాల గూఢమైయున్నది. కాని జ్ఞానులు దానిని తమయందు చక్కగ అనుభవమునకు తెచ్చుకొని మహా ప్రౌఢమగు ఈ దృఢమైన అనుభూతి వలన ద్వైతభావములను తొలగించి వేయుచున్నారు. సత్యమైన ఇట్టి ఆత్మయొక్క అనుభూతిని పొందిన ఒకానొక గురువు ఉత్తమ శిష్యుల ప్రబోధము కొఱకై సమస్త జగత్తు యొక్క పారమార్థిక స్వరూపమగు ఆ సత్యాత్మను స్మరించుచున్నాడు.

ద్వైతం మయ్యఖిలం సముత్థితమిదం మిథ్యా మనఃకల్పితం
తోయం తోయవివర్జితే మరుతలే భ్రాన్త్యైవ సిద్ధం నహి,
యద్యేవం ఖలు దృశ్యమేతదఖిలం నాహం న వా తన్మమ
ప్రౌఢానన్దచిదేకసన్మయవపుః శుద్ధోఽస్మ్యఖణ్డోఽస్మ్యహమ్.
(" —161-2)

మిథ్యయు, మనస్సుచేత కల్పింపబడినదియు, ద్వైతరూపమైనదియు, అగు ఈ జగత్తు నా యందు ఆవిర్భవించియున్నది. పొరపాటుననైనను జలములేని దారియందు జలము ఆవిర్భవించదు గదా! ఈ దృశ్యమంతయు నేను కాదు. అది నాదియును కాదు. ప్రౌఢమైన సచ్చిదానంద స్వరూపుడనగు నేను శుద్ధుడను, అఖండ స్వరూపుడను.

దేహో నాహమచేతనోఽయమనిశం కుడ్యాది వన్నిశ్చితో
నాహంప్రాణమయోఽపి వా దృతిధృతో వాయుర్యథానిశ్చితః,
సోఽహం నాఽపి మనోమయః కపిచలః కార్పణ్యదుష్టో నవా
బుద్ధిర్బుద్ధకువృత్తికేవ కుహనా నాజ్ఞానమన్ధం తమః.
(" —162-3)

గోడ మున్నగు వానివలె జడమైన ఈ శరీరము నేను కాను అను విషయము నిశ్చితమైనది. కమ్మరివాని కొలిమి తిత్తివలె వాయుపూరితమగు ప్రాణమయ కోశము కూడ నేను కాను. కోతివలె చంచలమును, కార్పణ్యాదోషములతో గూడినదియు మనోమయకోశము కూడ నేను కాను. అట్లే అంధకార సదృశములగు విజ్ఞాన, ఆనందమయ కోశములున్ను నేను కాను.

నాహం ఖాదిరపి స్ఫుటం మరుతలభ్రాజత్పయఃసామ్యత
స్తేభ్యో నిత్యవిలక్షణోఽఖిలదృశః సౌరప్రకాశో యథా,
దృశ్యైః సఙ్గవివర్జితో గగనవత్ సంపూర్ణరూపోఽస్మ్యహం
వస్తుస్థిత్యనురోధతస్త్వహమిదం విద్యాది సిద్ధర్యథా. (" —162-4)

మరుభూమియందు జలమువలె మిథ్య అయిన ఈ ఆకాశాది పంచభూతములు కూడ నేను కాను వస్తువులను ప్రకాశింపజేయు సూర్యకాంతి ఆ వస్తువుల కంటె వేఱుగా నున్నట్లు నేను ఈ ఆకాశాదులను ప్రకాశింపజేయుచు వాని కంటె వేఱుగా నున్నాను. నేను ఆకాశమువలె నిస్సంగుడను, పూర్ణస్వరూపుడను అయియున్నాను. సముద్రమునందు తరం

గాదులవలె ఈ సమస్తము నా యందు ఆరోపితమై తోచుచున్నది.

నిర్ద్వైతోఽస్మ్యహమస్మి నిర్మలచిదాకాశోఽస్మి పూర్ణోఽస్మ్యహం
నిర్దేహోఽస్మి నిరింద్రియోఽస్మి నితరాం నిష్ప్రాణవర్గోఽస్మ్యహమ్.
నిర్ముక్తాశుభమానసోఽస్మి విగలద్విజ్ఞానకోశోఽస్మ్యహం
నిర్మాయోఽస్మి నిరన్తరోఽస్మి విపులప్రౌఢప్రకాశోఽస్మ్యహమ్.
(" —163-5)

నేను ద్వైతరహితుడను, నిర్మల చిదాకాశ స్వరూపుడను, పూర్ణుడను, నేను దేహ, ఇంద్రియ, ప్రాణసమూహ రహితుడను, అశుభమైన మనస్సు లేనివాడను, విజ్ఞానమయ కోశరహితుడను, మాయారహితుడను, నేను నిరంతరము స్థితి కలిగియున్నవాడను, మహా ప్రౌఢ ప్రకాశరూపుడను అయియున్నాను.

మత్తోఽన్యన్న హి కిఞ్చిదస్తియది చిద్భాస్యం తతస్తన్మృషా
గుఞ్జావహ్నివదేవ సర్వకలనాధిష్ఠానభూతోఽస్మ్యహమ్.
సర్వస్యాపి దృగస్మ్యహం సమరసః శాన్తోఽస్మ్యపాపోఽస్మ్యహం
పూర్ణోఽస్మి ద్వయవర్జితోఽస్మి విపులాకాశోఽస్మి నిత్యోఽస్మ్యహమ్.
(" —163-6)

నా కంటె వేఱగు వస్తువు ఏదియు ఒకింతయైనను లేదు. ఉండినచో అది చైతన్యముచే ప్రకాశింపబడుట వలన గురివింద గింజలయందు అగ్నివలె మిథ్యయే అగును. సమస్త

కల్పనలకున్ను అధిష్ఠానమును నేనే. సమస్తమునకున్ను ద్రష్టయు నేనే. నేను సమరస స్వరూపుడను, శాంతుడను, పాపరహితుడను, పూర్ణుడను, ద్వైతవర్జితుడను, విశాల ఆకాశరూపుడను, నిత్యుడను అయియున్నాను.

మయ్యస్మిన్ పరమార్థకే శ్రుతిశిరోవేద్యే స్వతో భాసకే
కా వా విప్రతిపత్తిరేతదఖిలం భాత్యేవ యత్సన్నిధేః.
సారాలోకవశాత్ ప్రతీతమఖిలం పశ్యన్ను తస్మిన్ జనః
సన్దిగ్ధోఽస్త్యత ఏవ కేవలశివః కోఽపి ప్రకాశోఽస్మ్యహమ్.
(" —164-7)

ఎవని యొక్క సాన్నిధ్యముచే ఈ సమస్త పదార్థములు ప్రకాశించుచున్నవో, అట్టి పరమార్థరూపుడనగు నాయందు అన్యథాజ్ఞానము ఎట్లుండగలదు? నేను వేదాంత వేద్యుడను, స్వప్రకాశరూపుడను, సమస్తము సూర్యప్రకాశముచే గోచరించబడుచుండగా ఆ ప్రకాశమును ఎవరును సందేహింపరు గదా! నేను కేవలము శివస్వరూపుడను, ప్రకాశ స్వరూపుడను అయియున్నాను.

నిత్యస్ఫూర్తిమయోఽస్మి నిర్మల సదాకాశోఽస్మి శాన్తోఽస్మ్యహం
నిత్యానందమయోఽస్మి నిర్గతమహామోహాన్ధకారోఽస్మ్యహమ్.
విజ్ఞాతం పరమార్థతత్త్వమఖిలం నైజం నిరస్తాశుభం
ముక్తప్రాప్యమపాస్తభేదకలనాకైవల్య సంజ్ఞోఽస్మ్యహమ్.
(" —164-8)

నేను నిరంతర ప్రకాశమయుడను, నిర్మల సదాకాశ రూపుడను, శాంతుడను, నిత్యానందమయుడను. మహా మోహాంధకార రహితుడను అశుభము లేని నానిజస్వరూప మును పరమార్థతత్త్వమును నేను తెలిసికొంటిని. ఇది ముక్తుడు పొందదగిన స్థితియు, భేదకల్పనా రహితస్థితియు అయియున్నది. అట్టి కైవల్య స్వరూపుడను నేను.

స్వాప్నద్వైతవదేవ జాగ్రతమపి ద్వైతం మనోమాత్రకం
మిథ్యేత్యేవ విహాయ సచ్చిదమలం స్వానైకరూపోఽస్మ్యహమ్,
యద్వా వేద్యమశేషమేతదనిశం మద్రూపమేవేత్యపి
జ్ఞాత్వాత్యక్తమరున్మహోదధిరివ ప్రౌఢో గభీరోఽస్మ్యహమ్.

(" —164-9)

స్వప్నమునందు అనుభవింపబడు ద్వైతమువలెనే ఈ జాగ్రత్తునందు అనుభవింపబడు ద్వైతము కూడ మనో మాత్రమై, మిథ్యయైయున్నది. కావున దానిని వదలి స్వాంతస్థ సచ్చిదానంద నిర్మల ఆత్మ స్వరూపమునందే స్థితి గలిగియుండును. అట్టి ఆత్మ స్వరూపుడనే నేను అయి యున్నాను. లేక ఈ వస్తు సముదాయమంతయు నా స్వరూపమేయని ఎఱింగి వాయురహితమగు మహాసముద్రము వలె ప్రౌఢుడనై గంభీరుడనై యుండును.

గన్తవ్యం కిమిహాఽస్తి సర్వపరిపూర్ణస్యాప్యఖణ్డాకృతేః
కర్తవ్యం కిమిహాఽస్తి నిష్క్రియతనోర్మోక్షైకరూపస్య మే

నిర్ద్వైతస్య న హేయమన్యదపి వా నో వాప్యుపేయాన్తరం
శాన్తోఽద్యాస్మి విముక్తతోయ విమలో మేఘో యథా నిర్మలః

(" —165-10)

నేను సమస్త పదార్థములందును పరిపూర్ణముగ వ్యాపించి అఖండాకారముతో విరాజిల్లుచున్నాను. ఇక నాకు గంతవ్యమగు స్థానమెచట? నేను నిష్క్రియరూపుడను, మోక్షస్వరూపుడను, ఇక నాకు కర్తవ్యమేమి యుండగలదు? నేను ద్వైతరహితుడను. ఇక నాకు గ్రహింపదగినది గాని త్యజింపదగినది గాని లేదు. జలరహితమగు మేఘమువలె ఇపుడు నేను శాంతుడనై, నిర్మలుడనై యున్నాను.

కిన్నుప్రాప్తమితః పురా కిమధునా లబ్ధం విచారాదినా
యస్మాత్ తత్సుఖరూపమేవ సతతం జాజ్వల్యమానోఽస్మ్యహమ్,
కిం వాపేక్ష్యమిహాపి మయ్యతితరాం మిథ్యా విచారాదికం
ద్వైతాద్వైత వివర్జితే సమరసే మౌనం పరం సమ్మతమ్.

(" 166-11)

విచారణాదులచే ఇంతకు ముందు నేను పొందిన వస్తువు ఏది? ఇప్పుడు పొందినది ఏమి? ఏలయనిన, ఎల్లప్పుడు జాజ్వల్యమానమైన ప్రకాశస్వరూపుడను, సుఖస్వరూపుడను నేను అయియున్నాను. ద్వైతాద్వైతరహితుడను, సమరస స్వరూపుడను అగు నాకు మిథ్యారూపములగు ఈ ప్రాపంచిక పదార్థములతో ఏమి పని? కనుక మహామౌనమే నాకు సమ్మతము.

శ్రోతవ్యం చ కిమస్తి పూర్ణసుదృశో మిథ్యాపరోక్షస్య మే
మన్తవ్యం చ న మేఽస్తి కిఞ్చిదపి వా నిఃసంశయజ్యోతిషః
ధ్యాతృధ్యేయ విభేదహాని వపుషో న ధ్యేయమస్త్యేవ మే
సర్వాత్మైక మహారసస్య సతతం నో వా సమాధిర్మమ.

(" 166-12)

పరిపూర్ణదృష్టినై, బ్రహ్మకంటె అన్యమగు దానిని మిథ్యగా చూచు నాకు ఇక శ్రవణ మొనర్పదగినది ఏది కలదు! నిస్సంశయ జ్యోతిస్స్వరూపుడనగు నాకు ఇక మనన మొనర్పదగినది ఏమియు ఒకింతయైనను లేదు. ధ్యాతృధ్యేయ భేదరహితుడనగు నాకు ధ్యేయమేదియు లేదు నిరంతరము సర్వాత్మైక మహారసస్వరూపుడనగు నాకు సమాధియును లేదు.

ఆత్మానాత్మ వివేచనాపి మమనో విద్వత్కృతా రోచతేఽ
నాత్మా నాస్తి యదస్తి గోచరవపుః కో వా వివేక్తుం క్షమీ.
మిథ్యా వాదవిచారచిన్తనమహో కుర్వన్త్యదృష్టాత్మకా
భ్రాన్తా ఏవ న పారగా దృఢధియస్తూష్ణీం శిలావత్ స్థితాః

(" —167-13)

విద్వాంసులొనర్చు ఆత్మానాత్మ వివేచన యెడలకూడ నాకు ఆసక్తి లేదు. ఏలయనిన. నా దృష్టిలో అనాత్మయే లేదు. ఏది కలదో అది ప్రత్యక్షమగు ఆత్మయే దానిని వివేకించుటకు ఎవడు సమర్థుడు! ఆత్మను దర్శింపనివారే మిథ్యయగు వాద వివాద చింతనము చేయుదురు. వారు భ్రాంత చిత్తులే

కాని పారంగతులు కారు. దృఢచిత్తులగువారు శిలవలె అచలురై మౌనము దాల్చియుందురు.

వస్తున్నిత్యనిరోధతస్త్వహమహో కశ్చిత్ప్రవార్తో న చా-
ప్యేవం కోఽపి విభామి సన్తతదృశో వాఙ్మానసాగోచరః.
నిష్పాపోఽస్మ్యభయోఽస్మ్యహం విగతదుశ్శఙ్కాకలఙ్కోఽ
స్మ్యహం
సంశాన్తానుపమానశీతలమహః ప్రౌఢప్రకాశోఽస్మ్యహమ్.

(" —167-14)

వాస్తవముగ నేను అను వస్తువే లేదు. నేను సదా దృక్ స్వరూపుడను అవాఙ్మానస గోచరుడను, పాపరహితుడను, అభయ స్వరూపుడను, దుశ్శంకాకళంకరహితుడను, అనుపమాన శాంత శీతల తేజస్కుడను, మహా ప్రకాశ స్వరూపుడను అయియున్నాను.

యోఽహం పూర్వమితః ప్రశాన్తకలనాశుద్ధోఽస్మి బుద్ధోఽస్మ్యహం
యస్మాన్మత్త ఇదం సముత్థితమభూ దేతన్మయా ధార్యతే,
మయ్యేవ ప్రలయం ప్రయాతి నిరధిష్ఠానాయ తస్మై సదా
సత్యానన్ద చిదాత్మకాయ విపుల ప్రజ్ఞాయ మహ్యం నమః.

(" 167-15)

ఇంతకు పూర్వమే భేదజ్ఞానము నశించినందు వలన నేను శుద్ధుడను, బుద్ధుడను అయియున్నాను. నా యందే ఈ జగత్తు ఉదయించి, నా చేత ధరింపబడి నా యందే విలయ మొందుచున్నది. అట్టి సత్యానంద చిదాత్మ స్వరూపుడను,

అధిష్ఠాన రహిత మహా ప్రజ్ఞాన స్వరూపుడను అగు నాకు సదా నమస్కారము.

సత్తా చిత్సుఖరూపమస్తి సతతం నాహం చ న త్వం మృషా
నేదం వాపి జగత్ ప్రదృష్టమఖిలం నాస్తీతి జానీహి భో.
యత్ప్రోక్తం కరుణావశాత్త్వయి మయాతత్సత్యమేతత్స్ఫుటం
శ్రద్ధత్స్వానఘ శుద్ధబుద్ధిరసి చేతన్మాత్రాస్తు తే సంశయః.

(" —168-16)

నేను సదా సచ్చిదానంద స్వరూపుడను, నేను, నీవు అను భేదము అసత్యము. ఈ కానుపించు జగత్తంతయు లేదని ఎఱుంగుము. పాపరహితుడా! కరుణచే నీకు నేను బోధించిన ఈ విషయములు మహా సత్యములని శ్రద్ధతో నమ్ముము. నీవు నిర్మల బుద్ధిగలవాడవు. నీవు నిక్కముగ చైతన్య ఆత్మ స్వరూపుడవు అయియున్నావు.

స్వారస్యైకసుబోధచారుమనసే ప్రౌఢానుభూతిస్త్వియం
దాతవ్యా న తు మోహముగ్ధకుధియే దుష్టాన్తరజ్ఞాయ వై.
యేయం రమ్యవిదర్భితోత్తమశిరఃప్రాప్తా చకాస్తిస్వయం
సా చేన్మర్కట హస్త దేశపతితే కిం రాజతే కేతకీ.

(" —168-17)

స్వారస్య మెఱింగిన ఉత్తమ చిత్తునకే ఈ ప్రౌఢానుభూతి ఒసంగవలెను కాని మోహకలుషిత చిత్తునకు గాని, దుష్టునకుగాని ఒసంగ రాదు. కేతకీ పుష్పము (మొగలిపువ్వు)

రమణీయమగు వ్యక్తి యొక్క శిరస్సును పొందినచో మిగుల విరాజిల్లును కాని, అదియే కోతి చేతబడినచో ప్రకాశించునా?

సకృద్ శ్రవణమాత్రేణ బ్రహ్మజ్ఞానం యతో భవేత్
బ్రహ్మజ్ఞానావలీమాలా సర్వేషాం ముక్తిసిద్ధయే.

(" —169-1)

ఒక్కసారి వినినంత మాత్రము చేత దేనివలన బ్రహ్మజ్ఞానము కలుగునో అట్టి బ్రహ్మజ్ఞానావలీమాలను సర్వుల మోక్షసిద్ధికై చెప్పుచున్నాను.

అసఙ్గోఽహమసఙ్గోఽహమసఙ్గోఽహం పునః పునః.
సచ్చిదానన్దరూపోఽహమహమేవాహమవ్యయః.

(" —169-2)

నేను అసంగుడను, ముమ్మాటికి అసంగుడను, సచ్చిదానందరూపుడను, నేను ఆత్మనే అయియున్నాను. నేను నాశరహితుడను.

నిత్యశుద్ధవిముక్తోఽహం నిరాకారోఽహమక్షరః.
భూమానన్దస్వరూపోఽహమహమేవాహమవ్యయః.

(" —169-3)

నేను నిత్యశుద్ధుడను, విముక్తుడను, నిరాకారుడను, నాశరహితుడను భూమానంద స్వరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

నిత్యోఽహం నిరవద్యోఽహం నిరాకారోఽహమక్షరః.
పరమానన్దరూపోఽహమహమేవాహ మవ్యయః.

(" —169-4)

నేను నిత్యుడను, దోషరహితుడను, నిరాకారుడను, నాశరహితుడను, పరమానందరూపుడను, అవ్యయుడను, నేను నేనే (ఆత్మయే) అయియున్నాను.

శుద్ధచైతన్యరూపోఽహమాత్మారామోఽహ మేవ చ.
అఖణ్డానన్దరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —170-5)

నేను శుద్ధచైతన్యరూపుడను, ఆత్మారాముడను, అఖండానందరూపుడను, అవ్యయుడను, నేను నేనే (ఆత్మనే) అయియున్నాను.

స్వయం ప్రకాశరూపోఽహం చిన్మయోఽహం పరోఽస్మ్యహం.
అద్వైతానన్దరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —170-6)

నేను స్వయంప్రకాశరూపుడను, చిన్మయుడను, సమస్తమునకు పరమైనవాడను, అద్వైతానందరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

ప్రత్యక్ చైతన్యరూపోఽహం శాన్తోఽహం ప్రకృతేః పరః.
శాశ్వతానన్దరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —170-7)

నేను ప్రత్యక్ చైతన్యరూపుడను, శాంతుడను, ప్రకృతికి పరమైనవాడను, శాశ్వత ఆనందరూపుడను. నేను ఆత్మనే అయియున్నాను.

తత్త్వాతీతః పరాత్మాఽహం మధ్యాతీతః పరః శివః.
మాయాతీతః పరంజ్యోతి రహమేవాహ మవ్యయః.

(" —170-8)

నేను భౌతిక తత్త్వములకు అతీతుడను, పరాత్మను, శరీరాతీతుడనగు పరమశివుడను, మాయాతీతుడను, పరంజ్యోతిని, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

నామరూపవ్యతీతోఽహం చిదాకారోఽహ మచ్యుతః.
సుఖప్రకాశరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —170-9)

నేను నామరూపాతీతుడను, చిదాకారుడను, అచ్యుతుడను, సుఖ స్వరూపుడను, ప్రకాశరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

మాయాతత్కార్యదేహాదిర్మమ నాస్త్యేవ సర్వదా.
స్వప్రకాశైకరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —170-10)

మాయయు, మాయాకార్యమగు దేహాదులున్ను నాకు ఎప్పుడును లేవు. నేను స్వప్రకాశైక స్వరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

గుణత్రయవ్యతీతోఽహం బ్రహ్మాదీనాఞ్చ సాక్ష్యహమ్,
అనన్తానన్దరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —171-11)

నేను గుణత్రయాతీతుడను. బ్రహ్మాదులకును సాక్షిని. అనంతానందరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

అన్తర్యామిస్వరూపోఽహం కూటస్థః సర్వగోఽస్మ్యహమ్.
పరమానన్దరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" 171-12)

నేను అంతర్యామి స్వరూపుడను. కూటస్థుడను, సర్వవ్యాపకుడను, పరమానందరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

ద్వన్ద్వాదిసాక్షిరూపోఽహమచలోఽహం సనాతనః,
సర్వసాక్షిస్వరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —171-13)

నేను ద్వంద్వములకు సాక్షిని, అచలుడను, సనాతనుడను, సర్వసాక్షి స్వరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

నిష్కలోఽహం నిష్క్రియోఽహం సర్వాత్మా చ సనాతనః
అక్షర స్వరూపశ్చాహ మహమేవాహ మవ్యయః.

(" —171-14)

నేను నిష్కలుడను, నిష్క్రియుడను, సర్వాత్మస్వరూపుడను, సనాతనుడను, అక్షర స్వరూపుడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

ప్రజ్ఞానఘన ఏవాహం విజ్ఞానఘన ఏవ చ,
అకర్తాఽహమభోక్తాఽహ మహమేవాహ మవ్యయః.

(" —172-15)

నేను ప్రజ్ఞాన ఘనుడను, విజ్ఞాన ఘనుడను, అకర్తను, అభోక్తను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

నిరాధారస్వరూపోఽహం సర్వాధారోఽహమేవ చ,
ఆప్తకామస్వరూపోఽహ మహమేవాహ మవ్యయః.

(" —172-16)

నేను ఆధారరహితుడను, సర్వాధారుడను, ఆప్తకాముడను, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

తాపత్రయ విముక్తోఽహం దేహత్రయ విలక్షణః,
అవస్థాత్రయసాక్ష్యస్మి చాహమేవాహ మవ్యయః.

(" —172-17)

నేను తాపత్రయ రహితుడను, దేహత్రయ విలక్షణుడను అవస్థాత్రయసాక్షిని, అవ్యయుడను, నేను ఆత్మనే అయియున్నాను.

దృగ్దృశ్యౌద్వౌ పదార్థౌస్తః పరస్పర విలక్షణౌ,
దృగ్ బ్రహ్మ దృశ్యం మాయేతి సర్వవేదాన్త డిణ్డిమః.
(" —172-18)

దృక్కు, దృశ్యము అను రెండు పదార్థములు పరస్పర విలక్షణములు అయియున్నవి. అందు దృక్కు బ్రహ్మము. దృశ్యము మాయ అయియున్నవి. అని సమస్త వేదాంతములు ఘోషించుచున్నవి.

అహం సాక్షీతి యోవిద్యాద్ వివిచ్యైవ పునః పునః,
స ఏవ ముక్తోవిద్వాన్ స ఇతి వేదాన్తడిణ్డిమః.
(" —172-19)

నేను సాక్షిని అనియే విద్వాంసుడు మరల మరల వివేచించి తెలుసుకొనునో అతడే ముక్తుడు. అతడే విద్వాంసుడు అని వేదాంత భేరి మ్రోగుచున్నది.

ఘటకుడ్యాదికం సర్వం మృత్తికామాత్రమేవహి,
తద్వద్ బ్రహ్మ జగత్సర్వమితి వేదాన్తడిణ్డిమః
(" —173-20)

కుండ, గోడ మున్నగునవి అన్నియు మృత్తికామాత్రములే అయియున్నవి. అట్లే జగత్తంతయు బ్రహ్మమే అని వేదాంత భేరి ఘోషించుచున్నది.

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః,
ఇదమేవతు సచ్ఛాస్త్రమితి వేదాన్తడిణ్డిమః
(" —173-21)

బ్రహ్మము సత్యము; జగత్తు మిథ్య; జీవుడు బ్రహ్మమే అయియున్నాడు. బ్రహ్మము కంటె వేఱు కాడు-ఇదియే సచ్ఛాస్త్రముల సారము. అని వేదాంత భేరి మ్రోగుచున్నది.

అన్తర్జ్యోతిర్బహిర్జ్యోతిః ప్రత్యగ్జ్యోతిః పరాత్పరః,
జ్యోతిర్జ్యోతిః స్వయంజ్యోతిరాత్మజ్యోతిః శివోఽస్మ్యహమ్.
(" —173-22)

అంతర్జ్యోతియు, బహిర్జ్యోతియు, పరాత్పరమగు ప్రత్యక్ జ్యోతియు, జ్యోతులకు జ్యోతియు, స్వయంజ్యోతియు ఆత్మజ్యోతియు, శివరూపమును నేనే అయియున్నాను.

తపోయజ్ఞదానాదిభిః శుద్ధబుద్ధిః
విరక్తోనృపాదౌ పదే తుచ్ఛబుద్ధ్యా,
పరిత్యజ్య సర్వం యదాప్నోతి తత్త్వం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —239-1)

తపస్సు, యజ్ఞములు, దానములు మొదలగు వానిచే నిర్మలమైనట్టి బుద్ధికలవాడును, విరక్తుడను సార్వభౌమాది పదవులను తుచ్ఛముగ పరిగణించువాడును. సమస్తమును పరిత్యజించి నిత్యమైన ఏ పరబ్రహ్మతత్త్వమును పొందుచున్నాడో అట్టి పరబ్రహ్మమునే నేను అయియున్నాను.

దయాలుం గురుం బ్రహ్మనిష్ఠం ప్రశాన్తం
సమారాధ్య భక్త్యా విచార్య స్వరూపమ్,
యదాప్నోతి తత్త్వం నిదిధ్యాస్య విద్వాన్
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —239-2)

దయామూర్తియు, బ్రహ్మనిష్ఠుడును, ప్రశాంతుడును, అగు గురువును భక్తితో ఆరాధించి స్వస్వరూపమును విచారించి పరమార్థసత్యములను నిధి ధ్యాస మొనర్చి విద్వాంసుడు నిత్యమైన ఏ పరబ్రహ్మతత్త్వమును పొందుచున్నాడో, అట్టి పరబ్రహ్మము నేనే అయియున్నాను.

యదానన్దరూపం ప్రకాశస్వరూపం
నిరస్తప్రపఞ్చం పరిచ్ఛేదశూన్యమ్.
అహం బ్రహ్మవృత్త్యేకగమ్యం తురీయం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —239-3)

ఆనందరూపమై, ప్రకాశస్వరూపమై, ప్రపంచరహితమై పరిచ్ఛేదశూన్యమై, అహంబ్రహ్మాస్మి (నేనే బ్రహ్మమును) అను చిత్తవృత్తి ఒక దాని చేతనే పొందబడునదియు, తురీయ స్వరూపమును అగు నిత్యమగు బ్రహ్మమేదికలదో అదియే నేను అయియున్నాను.

యదజ్ఞానతో భాతి విశ్వం సమస్తం
వినష్టం చసద్యో యదాత్మప్రబోధే,
మనోవాగతీతం విశుద్ధం విముక్తం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —240-4)

దేనిని తెలిసికొనక పోవుటవలన ఈ సమస్త ప్రపంచము తోచుచున్నదో, ఏ ప్రపంచము ఆత్మ ప్రబోధముచే వెంటనే వినష్టమై పోవుచున్నదో, అట్టి విశుద్ధమై, మనోవాక్కులకు

అతీతమై, విముక్తమై, నిత్యమైనట్టి పరబ్రహ్మమే నేను అయియున్నాను.

నిషేధే కృతే నేతి నేతీతి వాక్యైః
సమాధిస్థితానాం యదాభాతి పూర్ణమ్.
అవస్థాత్రయాతీతమేకం తురీయం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —240-5)

'ఇది ఆత్మ కాదు, ఇది ఆత్మ కాదు' అను వాక్యములచే సమస్త దృశ్యము నిషేధింపబడగా సమాధి స్థితులగు వారికి ఏది అనుభూతమగుచున్నదో అట్టి పూర్ణమై, అవస్థాత్రయాతీతమై, ఏకమై, తురీయమై, నిత్యమైనట్టి బ్రహ్మమేది కలదో అదియే నేను అయియున్నాను.

యదానన్దలేశైః సమానన్ది విశ్వం
యదాభాతి సత్త్వే తదాభాతి సర్వమ్.
యదాలోకనే రూపమన్యత్ సమస్తం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —240-6)

దేనియొక్క ఆనంద లేశములచే ప్రపంచమంతయు ఆనందమును పొందుచున్నదో, దేనియొక్క ప్రకాశము వలన సత్తవలన సమస్త ప్రపంచము ప్రకాశించుచున్నదో సత్త కలిగియుండుచున్నదో, దేనిని వీక్షించినచో ప్రపంచము అంతయు అన్యవిధముగ తోచునో, అట్టి నిత్యమైన పరబ్రహ్మమే నేను అయియున్నాను.

అనన్తం విభుం సర్వయోనిం నిరీహం
శివం సఙ్గహీనం యదోఙ్కారగమ్యమ్,
నిరాకార మత్యుజ్జ్వలం మృత్యుహీనం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —241-7)

అనంతమై, సర్వవ్యాపకమై, సమస్తమునకు కారణమై నిశ్చలమై, శివస్వరూపమై, ఓంకార వేద్యమై, నిరాకారమై, మహోజ్జ్వలమై, మృత్యురహితమై, నిత్యమైనట్టి పరబ్రహ్మమే నేను అయియున్నాను.

యదానన్దసిన్ధౌ నిమగ్నః పుమాన్ స్యాద్
అవిద్యావిలాసః సమస్త ప్రపఞ్చః
తదా న స్ఫురత్యద్భుతం యన్నిమిత్తం
పరం బ్రహ్మ నిత్యం తదేవాహమస్మి. (" —241-8)

ఏ ఆనంద సముద్రమునందు మనుజుడు నిమగ్నమైనచో అవిద్యా విలాసమగు ప్రపంచము తోచకుండునో, ఏది ఈ ప్రపంచమునకు కారణభూతమైనదో అట్టి నిత్యమైన పరబ్రహ్మమే నేను అయియున్నాను.

యస్యప్రసాదాదహమేవ విష్ణు
ర్మయ్యేవ సర్వం పరికల్పితఞ్చ,
ఇత్థం విజానామి సదాత్మరూపం
తస్యాం ఘ్రి యుగ్మం ప్రణతోస్మి నిత్యమ్ (" 1-19-2)

ఎవని అనుగ్రహముచే 'నేనే విష్ణువును - నాయందే సమస్త ప్రపంచము కల్పింపబడినది' - అని తెలిసికొను చున్నానో, నా యొక్క సదాత్మరూపమును ఎఱుగు చున్నానో అట్టి గురుదేవుని పాదద్వయమునకు నిరంతరము ప్రణమిల్లుచున్నాను.

నమో నమస్తే గురవే మహాత్మనే
విముక్తసంగాయ సదుత్తమాయ,
నిత్యాద్వయానన్దరస స్వరూపిణే
భూమ్నే సదాఽపారదయామ్బుధామ్నే.
(వివేక చూడామణి - 487 శ్లో)

సంసారమునందు సంగము లేని వాడవును, మహాత్ముడవును, ఉత్తముడవును, అద్వైత బ్రహ్మానంద రసస్వరూపుడవును, సర్వవ్యాపక స్వరూపుడవును, సదా అపార దయా సముద్రుడవును అగు గురుదేవా! మీకు నమస్కారము,

యత్కటాక్ష శశిసాన్ద్ర చన్ద్రికా
పాతధూత భవతాపజశ్రమః
ప్రాప్తవా నహ మఖణ్డవైభవా
నన్ద మాత్మపద మక్షయం క్షణాత్. ("-488)

మహాత్మా! మీ యొక్క క్రీగంటి చూపు అను నిండు వెన్నెల సోకుట వలన, సంసార తాపము వలన కలిగిన శ్రమను పోగొట్టుకొన్నవాడనై నేను అఖండ వైభవముతో కూడిన ఆనందరసరూపమును, నాశరహితమును అగు ఆత్మ పదమును పొందితిని.

స్వారాజ్య సామ్రాజ్యవిభూతి రేషా
భవత్కృపా శ్రీ మహిమ ప్రసాదాత్,
ప్రాప్తామయా శ్రీ గురవే మహాత్మనే
నమోనమస్తేఽస్తు పునర్నమస్తే (" - 518)

మహాత్మా! మీ యొక్క కృపామహిమ అనుగ్రహముచే మోక్ష సామ్రాజ్య ఐశ్వర్యము నాకు కలిగినది. గురుదేవుడవగు అట్టి మీకు మరల మరల నమస్కారము.

మహాస్వప్నే మాయాకృతజని జరామృత్యుగహనే
భ్రమన్తం క్లిశ్యన్తం బహులతరతాపై రనుకలమ్,
అహఙ్కారవ్యాఘ్రవ్యథిత మిమ మత్యన్త కృపయా
ప్రబోధ్య ప్రస్వాపా త్పరమవితవాన్మా మసి గురో.
(" -181-519)

గురుదేవా! మాయచే కల్పింపబడిన జనన వార్ధక్య మరణములచే దట్టమైన మహా స్వప్నరూపమగు ఈ సంసారమున తిరుగాడుచు అనేక తాపములచే బాధపడుచు అహంకారమను పెద్ద పులిచే బాధింపబడుచు పెక్కు ఇక్కట్లను బడయుచున్న నన్ను మీరు దయాదృష్టితో లేపి జ్ఞానమును ఉపదేశించి కాపాడితిరి.

నమ స్తస్మై సదేకస్మై నమశ్చిన్మహసే ముహుః,
య దేత ద్విశ్వరూపేణ రాజతే గురురాజతే.
(" —182-520)

గురుదేవా! సద్రూపుడవును, ఏకస్వరూపుడవును, చిన్మూర్తివియు, విశ్వరూపముగ ప్రకాశించువాడవును అగు గురూత్తమా! మీకు మరల మరల నమస్కారము.

ఓం సచ్చిదానందబోధైకరూపిణం సకలేప్సితం।
సద్గురుం తమహం వందే మోక్ష సామ్రాజ్యదం పరమ్ ॥
(అష్టావక్రగీత-1-1)

సచ్చిదానంద బోధైక స్వరూపుడును, సమస్త వాంఛలను నెరవేర్చువాడును, ఉత్తమమగు మోక్ష సామ్రాజ్య పదవిని ఒసంగువాడును, అగు సద్గురువైన మీకు నమస్కారము.

నమో నమస్తే గురవే నిత్యానందస్వరూపిణే।
ముక్తసంగాయ శాంతాయ త్యక్తాహంతాయతే నమః
(సర్వ వేదాంత సిద్ధాంత సంగ్రహము-915)

నిత్యానంద స్వరూపుడవును. సంగరహితుడవును, శాంతుడవును, అహంకార వర్జితుడవును, ప్రభువును అగు గురుదేవా! మీకు నమస్కారము!

దయాధామ్నే నమోభూమ్నే మహిమ్నః పారమస్యతే।
నైవాప్తి యత్కటాక్షేణ బ్రహ్మైవాభవ మద్వయం ॥
(" -916)

గురుదేవా! మీ కటాక్షముచే నేను పరబ్రహ్మమునే

అయితివి. మీ మహిమకు అంతము లేదు. దయామూర్తివగు అట్టి మీయొక్క మహిమకు నమస్కారము.

అకర్తాహ మభోక్తాహ మవికారోఽహ మక్రియః ।
ఆనందఘన ఏవాహ మసంగోఽహం సదాశివః ॥ (" -920)

నేను కర్తను కాను, భోక్తను కాను. నేను వికార రహితుడను, అక్రియుడను, ఆనందఘనుడను, అసంగుడను, సదాశివుడను.

కస్త్వం శిశో ! కస్య కుతోఽసి గన్తా
కిం నామ తే త్వం కుత ఆగతోఽసి,
ఏతద్ వద త్వం మమ సుప్రసిద్ధం
మత్ప్రీతయే ప్రీతివివర్ధనోఽసి.

(హస్తామలకమ్ — 292-1)

శ్రీ శంకరాచార్యులవారు హస్తామలకుని ఇట్లు అడిగిరి —ఓ బాలుడా ! నీ వెవరవు? ఎవని కుమారుడవు? ఎక్కడ నుండి వచ్చితివి? ఎక్కడికి వెళ్ళుచున్నావు? నీ పేరేమి? నా ప్రీతికొరకై ఈ విషయములన్నిటిని తెలియజేయుము.

నాహం మనుష్యో న చ దేవ యక్షౌ
న బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాః,
న బ్రహ్మచారీ న గృహీ వనస్థో
భిక్షుర్న చాహం నిజబోధరూపః. (" -292-2)

హస్తామలకుడు — మహాత్మా ! నేను మనుష్యుడను

కాను, దేవతను కాను, యక్షుడను కాను, బ్రాహ్మణుడను కాను, క్షత్రియుడను కాను, వైశ్యుడను కాను, శూద్రుడను కాను, బ్రహ్మచారిని కాను, గృహస్థుడను కాను, వానప్రస్థుడను కాను, సన్న్యాసిని కాను, నిజబోధ స్వరూపమగు ఆత్మనే నేను అయియున్నాను.

నిమిత్తం మనశ్చక్షురాది ప్రవృత్తౌ
నిరస్తాఖిలోపాధి రాకాశకల్పః,
రవిర్లోక చేష్టానిమిత్తం యథా యః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. ("-293-3)

మనస్సు, నేత్రములు మొదలగువాని ప్రవృత్తియందు నిమిత్తమాత్రమైనదియు, సమస్త ఉపాధిరహితమైనదియు, ఆకాశము వంటిదియు, సూర్యుడు లోకవ్యవహారమునకు నిమిత్తమాత్రముగ నుండునట్లు జగద్వ్యవహారమునకు నిమిత్తమాత్రముగ సాక్షిగ నుండునదియు, ఏది ఎల్లప్పుడు పొందబడియే యున్నదో, నిత్యబోధస్వరూపమైనదో అట్టి ఆత్మయే నేను.

యమగ్న్యుష్ణవన్నిత్య బోధస్వరూపం
మనశ్చక్షురాదీన్యబోధాత్మకాని,
ప్రవర్తన్త ఆశ్రిత్య నిష్కమ్ప మేకం
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —293-4)

అగ్నికి ఉష్ణత్వమువలె నిత్యజ్ఞానము దేనియొక్క

సహజ స్వరూపమో నిశ్చలమున్న, ఏకమును అగు దేనిని ఆశ్రయించి జడములగు మనస్సు నేత్రము మొదలగు ఇంద్రియములు తమ తమ కార్యములందు ప్రవర్తించుచున్నవో ఏది ఎల్లప్పుడు పొందబడియే ఉన్నదో అట్టి నిత్యబోధస్వరూపమగు ఆత్మయే నేను.

ముఖాభాసకో దర్పణే దృశ్యమానో
ముఖత్వాత్ పృథక్త్వేన నైవాస్తి వస్తు,
చిదాభాసకో ధీషు జీవోఽపి తద్వత్
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —293-5)

అద్దమునందు ప్రతిబింబించు ముఖము వాస్తవముగ ముఖమునుండి వేఱుకానట్లు, బుద్ధియందు ప్రతిబింబించిన బుద్ధ్యాదులయందు ప్రతిబింబించిన చిదాభాసుడుగ తోచుచు జీవుడు కూడ ఏ ఆత్మకంటె వేఱుకాదో ఏది నిత్యము పొంద బడియే యున్నదో ఏది నిత్యబోధస్వరూపమైనదో అట్టి ఆత్మ నేను.

యథా దర్పణాభావ ఆభాసహానౌ
ముఖం విద్యతే కల్పనాహీన మేకం,
తథా ధీవియోగే నిరాభాసకో యః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా (" —294-6)

అద్దము లేనిచో ప్రతిబింబ కల్పనలేని ముఖము ఒక్కటియే ఉండునట్లు, బుద్ధి విలీనమైనచో రెండవ కల్పనయు,

దానిని ప్రకాశింపజేయుట అను కార్యమును లేకుండ ఏది ప్రకాశించుచున్నదో ఏది నిత్యము పొందబడియే యున్నదో అట్టి నిత్యజ్ఞాన స్వరూపమగు ఆత్మయే నేను.

మనశ్చక్షురాదేర్వియుక్తః స్వయం యో
మనశ్చక్షురాదే ర్మనశ్చక్షు రాదిః.
మనశ్చక్షురాదే రగమ్యస్వరూపః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —294-7)

ఏది స్వయము మనస్సు నేత్రాది ఇంద్రియములు లేనిదియు ఏది మనస్సునకు మనస్సో ఏది మనస్సుచే నీకు నేత్రాది ఇంద్రియములచే అగమ్యమై యున్నదో ఏది నిత్యము పొంద బడియే ఉన్నదో అట్టి నిత్యబోధ స్వరూపమగు ఆత్మయే నేను.

య ఏకో విభాతి స్వతః శుద్ధచేతాః
ప్రకాశస్వరూపోఽపి నానేవ ధీషు,
శరావోదకస్థో యథా భానురేకః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —294-8)

ఏది స్వతః శుద్ధ చైతన్యరూపమై, ఏకమై, ప్రకాశ స్వరూపమై వెలయుచున్నదో విభిన్న జలకలశములందు ఒకే సూర్యుడు ప్రకాశించునట్లు ఏది భిన్నభిన్న బుద్ధిఉపాధులందు అనేకములుగా తోచుచున్నదో ఏది నిరంతరము పొందబడియే ఉన్నదో అట్టి నిత్యబోధ స్వరూపమగు ఆత్మయే నేను.

యథానేకచక్షుః ప్రకాశో రవిర్న
క్రమేణ ప్రకాశీకరోతి ప్రకాశ్యమ్,
అనేకాధియో యస్తథైక ప్రబోధః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —295-9)

సూర్యుడు అనేక నేత్రములను క్రమముగ కాక ఒకే సమయమున ప్రకాశింపజేయుచున్నట్లు అనేక బుద్ధులను ఏది ఒకే పర్యాయము ప్రకాశింపజేయుచున్నదో ఏది ఎల్లప్పుడు పొందబడియే యున్నదో అట్టి నిత్యజ్ఞాన స్వరూపముగు ఆత్మయే నేను.

వివస్వత్-ప్రభాతం యథా రూపమక్షం
ప్రగృహ్ణాతి నాభాతమేవం వివస్వాన్,
యదాభాత ఆభాసయత్యక్షమేకః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా (" —295-10)

నేత్రేంద్రియము సూర్యప్రకాశముచే ప్రకాశితమైన వస్తువునే గ్రహించుచున్నదిగాని తదప్రకాశముగు వస్తువును గ్రహింపలేదు. అట్టి సూర్యుడుకూడ దేనివలన ప్రకాశము బొంది నేత్రాది ఇంద్రియములను ప్రకాశింపజేయుచున్నాడో ఏది ఎల్లప్పుడు పొందబడియే యున్నదో అట్టి నిత్యబోధ స్వరూపమైన ఆత్మయే నేను.

యథా సూర్య ఏకోఽప్స్వనేకశ్చలాసు
స్థిరా స్వప్యనన్వగ్ని భావ్యస్వరూపః,

చలాసు ప్రభిన్నాసు ధీష్వేవ మేకః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —295-11)

ఆకాశమునందు సూర్యుడొక్కడే వెలుగుచుండినను, కదలుచుండు నీళ్ళలో పెక్కులుగా తోచుచున్నదో ఏది తాను ఒక్కటే అయియున్నను చంచలముగు బుద్ధులలో అనేకము తోచుచున్నదో ఏది ఎల్లప్పుడు పొందబడియే యున్నదో అట్టి నిత్యజ్ఞాన స్వరూపముగు ఆత్మయే నేను.

ఘనచ్ఛన్న దృష్టిర్ఘనచ్ఛన్న మర్కం
యథా నిష్ప్రభం మన్యతే చాతిమూఢః,
తథాబద్ధవద్భాతి యో మూఢదృష్టేః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా. (" —296-12)

మేఘములు సూర్యునకు అడ్డురాగా సూర్యుడే మేఘములచే కప్పబడి కాంతిని పోగొట్టుకొనినాడని మహామూర్ఖులు తలంచునట్లు ఏ ఆత్మ మూఢుని దృష్టికి బద్ధునివలె భాసించుచున్నదో, ఏది ఎల్లప్పుడు పొందబడియే యున్నదో అట్టి నిత్యబోధ స్వరూపముగు ఆత్మయే నేను.

సమస్తేషు వస్తుష్వనుస్యూత మేకం
సమస్తాని వస్తూని యన్న స్పృశన్తి,
వియద్వత్ సదా శుద్ధ మచ్ఛ స్వరూపం
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా (" —296-13)

ఏది ఏకమై, సమస్త పదార్థములందు అనుస్యూత

మగుచు సమస్త పదార్థములచే స్పృశింపబడక ఆకాశమువలె సదా శుద్ధమై, నిర్మలమైనట్టి స్వరూపము గలిగియున్నదో, ఏది సదా పొందబడియే యున్నదో అట్టి నిత్యబోధ స్వరూపమైనదో అట్టి ఆత్మయే నేను.

ఉపాధౌ యథా భేదతా సన్మణీనాం
తథా భేదతా బుద్ధిభేదేషుతేఽపి,
యథా చంద్రికాణాం జలే చఞ్చలత్వం
తథా చఞ్చలత్వం తవా పీహ విష్ణో (" —296-14)

విష్ణుస్వరూపా! శుద్ధమైన స్ఫటికమణి పుష్పాది ఉపాధి భేదముచే వర్ణభేదమును పొందినట్లు నీయందే విభిన్నములగు బుద్ధులవలనను భేదము కల్పించబడుచున్నది. మరియు జల తరంగములందు చంద్రకిరణములు కదలుచుండినట్లు తోచు విధముగ బుద్ధిచాంచల్యము గూడ నీయందే కల్పింపబడుచున్నది. వాస్తవముగ నీవు నిర్మలుడవు.

1. ప్రజ్ఞానం బ్రహ్మ

(ఋగ్వేదము, ఐతరేయోపనిషత్తు లక్షణ (విధి) వాక్యము)

ఓమ్ యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ ।
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞానముదీరితం ॥
(స్తోత్రమంజరి — 114-1)

ఏ చైతన్యమువలన మనుజుడు చూచుచున్నాడో, వినుచున్నాడో, వాసన చూచుచున్నాడో, శబ్దములను ఉచ్ఛ

రించుచున్నాడో, స్వాదు అస్వాదు రసములను ఎరుంగుచున్నాడో ఆ చైతన్యమే ప్రజ్ఞానమని చెప్పబడినది.

చతుర్ముఖేన్ద్రదేవేషు మనుష్యాశ్వ గవాదిషు
చైతన్యమేకం బ్రహ్మతః ప్రజ్ఞానం బ్రహ్మ మయ్యపి ॥
(" —114-2)

బ్రహ్మదేవునియందును, ఇంద్రునియందును, దేవతలయందును, మనుష్యులందును, గుఱ్ఱములందును, గోవులు మొదలగు వానియందును గల ఏకమగు చైతన్యమే బ్రహ్మము అయియున్నది. కాబట్టి నాయందుగల ప్రజ్ఞానమున్ను బ్రహ్మమే యగును.

2. అహం బ్రహ్మాస్మి

(యజుర్వేదము, బృహదారణ్యకోపనిషత్తు, అనుభవవాక్యము)

పరిపూర్ణః పరాత్మాఽస్మిన్ దేహే విద్యాధికారిణి।
బుద్ధేస్సాక్షితయా స్థిత్వా స్ఫురన్నహమితీర్యతే ॥
(" —115-3)

పరిపూర్ణమై, పరమాత్మ జ్ఞానసంపాదనకు యోగ్యమైనట్టి, ఈ మనుష్యదేహమునందు బుద్ధికి సాక్షిగా ప్రకాశించుచు నుండి 'నేను' అని చెప్పబడుచున్నాను.

స్వతః పూర్ణః పరాత్మాఽత్ర బ్రహ్మశబ్దేన వర్ణితః !
అస్మీత్యైక్యపరామర్శస్తేన బ్రహ్మ భవామ్యహం ॥
(" —115-4)

స్వతః పరిపూర్ణమైనట్టి ఆ పరమాత్మ ఈ మహావాక్యము నందు బ్రహ్మమను పదముచే చెప్పబడుచున్నాడు. అసి (అయి తివి) అను పదము జీవబ్రహ్మ ఏకత్వమును తెలుపుచున్నది. కావున నేను బ్రహ్మము నే అగుచున్నాను.

3. తత్త్వమసి

(సామవేదము, ఛాందోగ్యోపనిషత్తు, ఉపదేశవాక్యము)

ఏకమేవాద్వితీయం సన్నామరూపవివర్జితం।
సృష్టేః పురాఽధునాఽప్యస్య తాదృక్త్వం తదితీర్యతే॥
(" —116-5)

సృష్టికి పూర్వము ఏకమైనదియు, అద్వితీయమైనదియు, నామరూపములు లేనిదియు అగు ఏ సద్వస్తువు ప్రతిపాదింపబడి యున్నదో ఆ సద్వస్తువునకు ఇప్పుడును అట్టి స్వభావమే. తత్ (అది) అను పదముచేత చెప్పబడుచున్నది.

శ్రోతుర్దేహేన్ద్రియాతీతం వస్త్వత్ర త్వం పదేరితం।
ఏకతా గ్రాహ్యతేఽసీతి తదైక్యమనుభూయతామ్॥
(" —116-6)

ముముక్షువు యొక్క దేహేంద్రియములకు అతీతమైన సద్వస్తువు ఇచట త్వమ్ (నీవు) అను పదముచేత చెప్పబడు చున్నది. అసి (అయితివి) అను పదముచేత ఐక్యము గ్రహింప

బడుచున్నది. ఆ తత్త్వము అను పదముల యొక్క ఏకత్వ మును ముముక్షువులచే అనుభవింపబడును గాక!

4. అయమాత్మా బ్రహ్మ

(అథర్వణవేదము, మాండూక్యోపనిషత్తు, సాక్షాత్కారవాక్యము)

స్వప్రకాశాపరోక్షత్వమయమిత్యుక్తితో మతం।
అహంకారాది దేహాన్తాత్ప్రత్యగాత్మేతి గీయతే॥
(" —117-7)

అయం (ఈ) అను పదముచేత ఆత్మకు స్వప్రకాశము అపరోక్షత్వము వ్యక్తిపూర్వకముగ చెప్పబడినది. అహంకారము మొదలుకొని స్థూలదేహము వరకుగల ప్రపంచము కంటె వేరుగా నుండుటవలన అది ప్రత్యగాత్మ అని చెప్పబడు చున్నది.

దృశ్యమానస్య సర్వస్య జగతస్తత్త్వమీర్యతే।
బ్రహ్మశబ్దేన తద్బ్రహ్మ స్వప్రకాశాత్మరూపకం॥
(" —117-8)

ఈ కనబడుచుండు సమస్త జగత్తునకు అధిష్ఠానరూపము బ్రహ్మ శబ్దముచే చెప్పబడుచున్నది. ఆ బ్రహ్మము స్వప్రకాశమగు ప్రత్యగాత్మయే స్వరూపముగా గలది అయి యున్నది.

గురు వందనము

యస్యాన్తం నాదిమధ్యం న హి కరచరణం
నామగోత్రం న సూత్రం
నో జాతిర్నైవ వర్ణో న భవతి పురుషో
నో నపుంసో న చ స్త్రీ।
నాకారం నో వికారం న హి జనిమరణం
నాస్తి పుణ్యం న పాపం
నో తత్త్వమేకం సహజ సమరసం
సద్గురుం తన్నమామి॥ (" —140-9)

ఎవనికి ఆది, మధ్య, అంతములు లేవో, ఎవనికి వాస్తవముగ కరచరణాద్యవయవములు లేవో, ఎవనికి నామముగాని గోత్రముగాని, సూత్రమున్ను లేవో, ఎవనికి జాతిగాని, వర్ణముగాని లేవో, ఎవడు పురుషుడుగాని–స్త్రీగాని, నపుంసకుడు గాని కాడో, ఎవనికి ఆకారముగాని, వికారముగాని, జనన మరణములు గాని, పుణ్యాపాపములుగాని లేవో, ఎవనికి (భౌతిక) తత్త్వము లేదో, ఎవడు కేవలము యథార్థతత్త్వరూపము కలవాడో, ఏకస్వరూపుడో అట్టి సహజ సమరస్వరూపుడగు గురుదేవునకు నమస్కరించుచున్నాను.

నేను ఎవరనగా—

ఓమ్ జాగ్రత్ప్రత్యుద్భూత బాహ్యేన్ద్రియ విషయ సము-
ల్లాస సాక్షి శివోఽహమ్।

స్వప్నే దృష్ట ప్రపంచ ప్రతి ఫలన మనో-
వృత్తిసాక్షి శివోఽహమ్।
సుప్తౌ చిత్తే ప్రలీనే ప్రబలతమమహా-
మోహసాక్షి శివోఽహమ్
నిత్యానన్దే తురీయే విగతకలిమల-
స్సర్వసాక్షి శివోఽహమ్॥ (" —19-24)

నేను జాగ్రదవస్థయందు జనించిన బాహ్యేంద్రియ విషయ సముదాయమునకు సాక్షియైన శివస్వరూపమగు ఆత్మను. అట్లే స్వప్నమందు గాంచబడిన ప్రపంచ ప్రతిఫలన రూపములగు మనోవృత్తులకు సాక్షియైన శివస్వరూపమగు ఆత్మను. సుషుప్తియందు చిత్తము లెస్సగ విలీనముకాగా ప్రబల తమోరూపమగు మహా మోహమునకు సాక్షియైన శివస్వరూపమగు ఆత్మను. మఱియు నేను నిత్యానందమయమగు తురీయ స్థితియందు మాయాదోషరహితమై సర్వసాక్షియైనట్టి శివస్వరూపమగు ఆత్మను అయియున్నాను

బ్రహ్మాత్మ తత్త్వాను సంధానము

దర్శనం శ్రవణం జ్ఞానం యత్ర నాన్యస్య విద్యతే।
అఖణ్డైక రసం శాన్తం బ్రహ్మ తత్సముపాస్మహే॥
(" —30-1)

ఎచట ఇతర వస్తువుయొక్క దర్శనముగాని, శ్రవణముగాని, జ్ఞానము గాని ఉండదో, ఏది అఖండైకరస స్వరూపమై

శాంతమై యున్నదో అట్టి బ్రహ్మమును మేము లెస్సగ ఉపాసించుచున్నాము.

నిత్యం నిరన్తరానన్దం చిద్ఘనం బ్రహ్మ నిర్భయం।
శ్రుత్వా తర్కానుభూతిభ్యా మహమస్మ్యద్వయం సదా॥
(" —30-2)

నిత్యమై, నిరంతరము ఆనందస్వరూపమై, చిద్ఘనమై, నిర్భయమై, అద్వయమైనట్టి బ్రహ్మమే నేను సదా అయియున్నాను. అని శ్రుతివలనను, తర్క, అనుభవముల వలనను విస్పష్టముగ తెలుచున్నది.

దేహేన్ద్రియమనోబుద్ధి ప్రకృతిభ్యో విలక్షణం।
సచ్చిదానన్దమద్వైతం పరం బ్రహ్మాఽస్మి కేవలమ్॥
(" —30-3)

నేను కేవలము దేహేంద్రియ మనోబుద్ధులకంటెను ప్రకృతికంటెను విలక్షణమైనదియు, సచ్చిదానంద రూపమైనదియూ అద్వయమైనదియునగు పరబ్రహ్మమునే అయియున్నాను.

పూర్ణం బ్రహ్మగురుః పూర్ణః పూర్ణోఽహ మఖిలం జగత్।
పూర్ణం సర్వమిదం జ్ఞాత్వా సదానన్దో భవేద్యతిః॥
(" —31-4)

బ్రహ్మము పూర్ణమైనది. గురువు పూర్ణమైనవాడు, 'నేను పూర్ణుడను'. ఈ జగత్తంతయు పూర్ణమైనది. ఈ సమస్తము పూర్ణమైనది. అని యెఱిఁగి యత్నశీలుడు పరమానందమయుఁడై విలసిల్లును.

హృదయకమలమధ్యే దీపవద్వేద సారం
ప్రణవమయమతర్క్యం యోగిహృద్ధ్యానగమ్యమ్।
హరి గురు శివయోగం సర్వభూతస్థమేకం
సకృదపి మనసా యశ్చిన్త యేత్స్యాత్స ముక్తః॥
(" -31-5)

హృదయకమల మధ్యమున దీపమువలె వెలుగునదియు వేదసారమైనదియు, ప్రణవమయమైనదియు, తర్కములకు అతీతమైనదియు, యోగులకు హృదయమున ధ్యానముచే పొందబడునదియు, హరి గురు శివ సంయోగ స్వరూపమైనదియు, సమస్త ప్రాణులందును ఉండునదియు, ఏకమైనదియు నగు పరమాత్మను ఎవడు ఒక్కసారియైనను మనస్సుతో ధ్యానించునో అట్టివాడు ముక్తుడగును.

యజ్జిజ్ఞాసా యజ్ఞదానాదిభి స్స్యాత్
శ్రుత్వా మత్వా చిన్తయా యత్ప్రబోధః।
యస్మిన్ బుద్ధే బాధ్యతేఽనర్థమూలం
తం భూమానం భావయే స్వస్వరూపమ్॥ (" -31-6)

యజ్ఞ దానాదులచే మనస్సు శుద్ధమయినవాడు దేనిని గూర్చిన జిజ్ఞాస గలిగియుండునో, శ్రుతియొక్క చింతన చేతను, బుద్ధి కుశలతచేతను, దేనినిగూర్చిన ప్రబోధము

కలుగునో, దేనిని తెలిసికొనినచో అనర్థముయొక్క మూలము తొలగిపోవునో, సర్వవ్యాపకమయిన అట్టి స్వస్వరూపమగు ఆత్మను ధ్యానించెదను.

అశుభాని నిరాచష్టే తనోతి శుభసన్తతిం।
స్మృతిమాత్రేణ యత్పుంసాం బ్రహ్మతన్మఙ్గళం పరమ్॥
(" —31-7)

దేనియొక్క స్మరణమాత్రముచే జనులకు అశుభములు తొలగునో, శుభములు విస్తరించునో, అట్టి బ్రహ్మము మహా మంగళకరమయినది.

అతి కళ్యాణరూపత్వాన్నిత్య కళ్యాణ సంశ్రయాత్।
స్మర్తౄణాం వరదత్వాచ్చ బ్రహ్మతన్మఙ్గళం విదుః॥
(" —31-8)

మహా మంగళస్వరూపము అగుటవలనను, నిత్య మంగళప్రదమయినది అయియుండుటవలనను, స్మరించు వారలకు అభీష్టదాయకమై యుండుటవలనను బ్రహ్మము మహా మంగళకరమయినది అయియున్నది

'అహం బ్రహ్మాస్మి మంత్రమహిమ'

అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
బుద్ధివ్యాధిం వినాశయేత్।
అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
చిత్తబంధం వినాశయేత్॥

అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
చిత్తవృత్తిం వినాశయేత్।
అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
సంకల్పాదీన్వినాశయేత్॥
అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
కోటిదోషం వినాశయేత్।
అహం బ్రహ్మాఽస్మి మంత్రోఽయం
కామాదీన్నాశయేత్ క్షణాత్॥

'అహం బ్రహ్మాఽస్మి' (నేను బ్రహ్మమునే అయియున్నాను) అను ఈ మంత్రము బుద్ధివ్యాధిని తొలగించును. చిత్తబంధమును నివారించును. చిత్తవృత్తులను నశింపజేయును, సంకల్పాదులను తొలగించును. అనేక దోషములను పరిహరించును. క్షణకాలములో కామాదులన్నిటిని లెస్సగ నశింపజేయును.

కేవలం తుర్యరూపోఽస్మి తుర్యాతీతోఽస్మి కేవలం
సదా చైతన్యరూపోఽస్మి చిదానందమయోఽస్మ్యహమ్॥
(127-1)

తురీయాతీతుడను, ఎల్లప్పుడు చైతన్యరూపుడు, చిదానందమయుడను.

నిర్వికల్ప స్వరూపోఽస్మి నిరీహోఽస్మి నిరామయః
సదా చాసంగరూపోఽస్మి నిర్వికారోఽహ మవ్యయః॥
(127-2)

నేను నిర్వికల్పస్వరూపుడను, చేష్టారహితుడను, రోగరహితుడను, సదా అసంగరూపుడను, నిర్వికారుడను, అవ్యయుడను.

సదైకరసరూపోఽస్మి సదా చిన్మాత్రవిగ్రహః।
అపరిచ్ఛిన్నరూపోఽస్మి హ్యఖండానందరూపవాన్ ॥

(127-3)

నేను సదా ఏకరస స్వరూపుడను, సదా చిన్మాత్ర రూపుడను, అపరిచ్ఛిన్న స్వరూపుడను, అఖండానంద రూపుడను.

ఆత్మాను సంధానము

తృతీయ భాగము

యన్మిథ్యైవాస్తు తన్మిథ్యా కస్య నామ కిమాగతమ్

(శ్రీ వసిష్ఠగీత (యోగవాసిష్ఠం) 43 శ్లో)

ఏది మిథ్యయౌగా అది మిథ్యగనే యుండుగాక! అట్లు మిథ్యగ నుండుటచే ఎవరికిని ఏ హానియును లేదు.

కోఽహం కథమయం దోషః సంసారాఖ్య ఉపాగతః
న్యాయేనేతి పరామర్శో విచార ఇతి కథ్యతే.

(" —159-31)

"నేనెవడను? (ఈ శరీరాదులు నేనా? లేక తద్భిన్నుడనా?)" ఈ జగత్తను దోషమెట్లేర్పడినది? (అధిష్ఠానమగు ఆత్మయందెట్లేర్పడినది? — ఈ ప్రకారముగ శ్రుతి, గుర్వాదులు తెలిపిన రీతి పరామర్శచేయుట విచారణయని చెప్పబడుచున్నది.

నాహం బ్రహ్మేతి సంకల్పాత్సుదృఢాద్బధ్యతే మనః
సర్వం బ్రహ్మేతి సంకల్పాత్సుదృఢాన్ముచ్యతే మనః.

(" —281-3)

"నేను బ్రహ్మమును గాను" అను సుదృఢ సంకల్పముచే మనస్సు బంధనమును పొందుచున్నది. "అంతయు

స్వాత్మయగు బ్రహ్మమే" అను సదృఢ సంకల్పముచే మనస్సు ముక్తి నొందుచున్నది.

కృశోఽతిదుఃఖీ బద్ధోఽహం హస్తపాదాదిమానహమ్
ఇతి భావానురూపేణ వ్యవహారేణ బధ్యతే.

(" —282-5)

"నేను కృశించినవాడను, మహాదుఃఖవంతుడను, బద్ధుడను, హస్త పాదాది సంయుతుడను" — ఇట్టి భావములతో గూడి తదను రూపముగ వ్యవహరించుటచే జీవుడు బంధనమున తగుల్కొనును.

నాహం దుఃఖీ న మే దేహో బన్ధః కస్యాత్మనః స్థితః
ఇతి భావానురూపేణ వ్యవహారేణ ముచ్యతే.

(" —282-6)

"నేను దుఃఖినిగాను, నాకు దేహము లేదు. ఆత్మకు బంధమెట్లుండగలదు!" — ఇట్టి భావములు గలిగి తదనుసారముగ వ్యవహరించుటచే జీవుడు ముక్తుడగును.

తిర్యగూర్ధ్వమధస్తాచ్చ వ్యాపకో మహిమా మమ
ద్వితీయో న మమాస్తీతి యః పశ్యతి స పశ్యతి

(" —331-133)

"ప్రక్కల" పైన, క్రింద ఎల్లడల నా మహిమ వ్యాపించియున్నది. నాకు రెండవ వాడు లేడు" అని ఇట్లు చూచువాడే నిజముగ చూచువాడగును.

మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ
చిత్తం తు నాహమేవేతి యః పశ్యతి స పశ్యతి.

(" —331-134)

"దారమునందు మణులు గ్రుచ్చబడినట్లు, ఈ సమస్త జగత్తున్న నాయందు గుచ్చబడియున్నది. నేను చిత్తమును గాను" అని ఇట్లు కాంచువాడే నిజముగ చూచువాడగును.

నాహం న చాన్యదస్తీతి బ్రహ్మైవాస్తి నిరామయమ్
ఇత్థం సదసతోర్మధ్యే యః పశ్యతి స పశ్యతి.

(" —331-135)

"అహంకారముగాని, ఇతరములు దృశ్యములుగాని ఏదియు లేదు. నిర్వికార, దుఃఖరహితమగు (ఆత్మరూప) బ్రహ్మమే కలదు" - అని ఇట్లు వ్యక్తావ్యక్తముల రెండిటి యందును వ్యాపించియున్న తన ఆత్మ స్వరూపమును నెవడెఱుంగునో అతడే నిజముగ ఎఱింగినవాడు.

కోఽహం కథమిదం జాతం సంసారాడమ్బరం విభో
ప్రవిచార్య ప్రయత్నేన ప్రాజ్ఞేన సహ సాధుభిః

(" —410-138)

ఉత్తము సాధువులతో గూడి సేవాది ప్రయత్నముల ద్వారా ప్రాజ్ఞుడగు గురువును ప్రసన్నునిగ జేసికొని, "ప్రభూ! నేనెవడను? ఈ సంసార ఆడంబరమంతయు ఎట్లు జనించినది?" ఇత్యాది వినయ పూర్వక ప్రశ్నలను అతనినడిగి లెస్సగ విచారణ సలుపవలయును.

అపర్యన్తస్య కాలస్య కోఽప్యంశో జీవ్యతే మయా
తస్మిన్నాస్థం నిబధ్నామి ధిఙ్మామధమ చేతనమ్

(" —432-83)

అనంతమగు కాలముయొక్క ఒకానొక అంశమున నా ఈ జీవితము కలదు. అట్టి స్వల్ప కాల జీవితమందును ఆశ గలిగియున్నట్టి ఈ అధముఁడగు నాకు ధిక్కారమగు గాక!

కియన్మాత్రమిదం నామ రాజ్యమాజీవితం మమ
కిమేతేన వినాదుఃఖం తిష్ఠామి హతధీర్యథా

(" —432-84)

ఈ నా జీవిత పర్యంతపు రాజ్యమున్ను ఎంత మాత్ర మైనది? (అల్పమని భావము) ఇంత మాత్రము చేతనే నేను సంతుష్టుఁడనై నశించిన బుద్ధిగలవాని (మూర్ఖుని) వలె భావికాల దుఃఖ వినాశమును గూర్చిన చింత లేక ఏల ఇట్లు పడియున్నాను!

ఆదావన్తేఽప్యనన్తోఽహం మధ్యే పేలవజీవితః
బాలశ్చిత్రేన్దునేవాహం కిం ముధా ధృతిమాస్థితః.

(" —432-85)

ఆదియందును, అంతమందును, నేను అనంత స్వరూపుఁడను; మధ్య ఈ అల్పజీవితము ఉపాధి సంబంధముచే తాత్కాలికముగ ఏర్పడినది; కావున చిత్రమందలి చంద్రుని నిజచంద్రునిగ భావించి అద్దానిని గ్రహించు బాలకునివలె,

అనాత్మయగు ఈ దేహాదులందాత్మ బుద్ధి గలిగి వ్యర్థముగ దానియందేల ధైర్యము (విశ్వాసమును) ను గలిగియున్నాను.

యద్వస్తు యచ్చిరరమ్యం యదుదారమకృత్రిమమ్
కించిత్తదిహ నాస్త్యేవ కిన్నిష్ఠేహ మతిర్మమ.

(" —432-86)

ఏద్దానియందు నా బుద్ధి విశ్రాంతిని పొందగల్గునో, అట్టి సత్యమైనట్టియు, అపరిచ్ఛిన్నమైనట్టియు, అకృత్రిమము (అజన్య) మైనట్టియు వస్తువేదియు ఈ ప్రపంచమున లేదు.

దూరస్థమప్యదూరస్థం యన్మే మనసి వర్తతే
ఇతి నిశ్చిత్య బాహ్యార్థభావనాం సంత్యజామ్యహమ్.

(" —432-87)

సత్యవస్తువగు ఆత్మ అజ్ఞానుల దృష్టియందు దూరమున నున్నను, వాస్తవముగ సమీపమున నున్నదే యగును. ఏలయనిన, అయ్యది నా మనస్సునందే స్థితి గలిగియున్నది— ఈ ప్రకారముగ నిశ్చయించి బాహ్యపదార్థముల భావనను నేను లెస్సగ త్యజించి వేయుచున్నాను.

లోకాజవం జవీభావః సలిలావర్తభఙ్గురః
దృష్టోఽప్యపి హి దుఃఖాయ కేయమాస్థా సుఖంప్రతి.

(" —433-88)

జనులయొక్క భోగము కొఱకైన ధనార్జనాది ప్రవృత్తి రూపవేగము జలముయొక్క ఆవర్తము (సుడి) వలె

క్షణభంగురమై, నశ్వరఫల దాయకమై, దుఃఖహేతువై యున్నట్లు నేటికిని ప్రత్యక్షముగ జూడఁబడుచున్నది. అట్టిచో అట్టి విషయ సుఖము యెడల నాకు విశ్వాసమేల?

ప్రత్యబ్దం ప్రతిమాసం చ ప్రత్యహం చ ప్రతిక్షణం
సుఖాని దుఃఖపిణ్డాని దుఃఖాని తు పునః పునః
(" 433-89)

ప్రతి సంవత్సరము, ప్రతి మాసము, ప్రతి దినము, ప్రతి క్షణము మరల మరల ఏ (విషయ) సుఖములు కలుగుచున్నవో, అవి యన్నియును సంతాపమయములగు మహా దుఃఖములే యగును.

పరామృష్టం విశిష్టం హి దృష్టం నష్టం న భావితమ్
అత్రస్థం న తదస్తీహ సతాం యత్రాస్తు సంస్థితిః.
(" —433-90)

ఈ ప్రపంచమున గల ప్రతి వస్తువున్ను శీఘ్రముగ వినాశ మొందుచున్నది. కావున నా రాజ్యాదులున్ను తుచ్ఛములే యగును. ఏలయనిన ప్రసిద్ధములగు పదములున్ను తత్త్వదృష్టిచే నశ్వరములుగనే గన్పట్టుచున్నవి. కాబట్టి వివేకుల చిత్తము నిరంతరము విశ్రాంతి బొందునట్టి పదార్థ మెద్దియు నీ ప్రపంచమున లేదు.

ఆద్య యే మహతాం మూర్ధ్నితే దినైర్నిపతన్త్యధః
హతచిత్తమహత్తాయాం కైషా విశ్వస్తతా బత.
(" 433-91)

నేడు ఏవి గొప్ప గొప్పవారి శిరస్సుపై నున్నవో, అవియే కొలది దినములకు క్రిందకు పడిపోవుచున్నవి. కావున ఈ పాడు చిత్తము యొక్క రాజ్యాధి వైభవరూపమగు గొప్పతనమందు విశ్వాసమేలకో వచింపుము?

క ఇమే మే మహాభోగాః క ఇమే మమ బాన్ధవాః
బాలో భూతమయేనేవ సంకేతే నాహ మాకులః
(" —433-92)

ఈ నా భోగములేమి! ఈ నా బంధువు లెవరు! బేతాళునిచే బాలునివలె ఈ మమత్వాదుల కల్పనచే నేను వ్యాకులుఁడనగుచున్నాను.

స్వయమేవ నిబధ్నామి జరామరణ రాగిణీమ్
కిమిమామహమేతేషు ధృతిముద్వేగ కారిణీమ్.
(" —434-93)

జరామరణములను గలుగఁజేయునదియు భయదాయకమయిన భోగాదులందలి విశ్వాసమును నేనేల స్వయముగ కల్పించుకొనుచున్నాను!

యాతు తిష్ఠతు వా సమ్యఙ్మైతాం ప్రతి కోగ్రహః
బుద్బుద శ్రీరివైషా హి మిథ్యైవేత్థముపస్థితా.
(" —434-94)

ఈ బాంధవాది సంపదలన్నియు పోవుగాక, లేక చక్కగ నుండుగాక—వానియెడల నాకు పట్టుదల ఏమి? ఇవియన్నియు

బుద్బుదములవలె క్షణభంగురములై మిథ్యారూపములై ఇవ్విధమున స్థితిగలిగి యున్నవగును.

తే మహావిభవా భోగాస్తే సన్తః స్నిగ్ధబాన్ధవాః
సర్వం స్మృతిపథం ప్రాప్తం వర్తమానేఽపి కాధృతిః.
(" —434-95)

ఆ మహారాజాధిరాజులయొక్క మహాభోగములు; ఆ వైభవములు, ఆ పరమ ప్రేమసహితులైన బంధువులు, అంతయు నేడు స్మరణమాత్రమయిపోయెనే! అట్టిచో ఇక ఈ వర్తమానకాలిక భోగాదులందు విశ్వాసమేల?

క్వ ధనాని మహీపానాం బ్రహ్మణః క్వ జగన్తి వా
ప్రాక్తనాని ప్రయాతాని కేయం విశ్వస్తతా మమ.
(" —434-96)

పూర్వకాలపు ఆ రాజులయొక్క ధనము నిపు డెచటి కేగినవి! మఱియు పూర్వము బ్రహ్మదేవునిచే సృష్టింపబడిన ఆ అనేక జగత్తులు ఇపుడేమయినవి! అవియన్నియు నశించి పోయినవి. ఇక ఈ నా ధనాదులందును విశ్వాసమేల?

గలితానీన్ద్రలక్షాణి బుద్బుదానీవ వారిణి
మాం జీవిత నిబద్ధాస్థం విహసిష్యన్తి సాధవః
(" —434-97)

నీటియందు బుడగలవలె లక్షలకొలది ఇంద్రులు (కాలగర్భమున) నశించిపోయిరి; ఇక నా ఈ స్వల్పజీవితము శాశ్వతమని తలంచి అందు నేను విశ్వాసము గలిగియున్నచో సాధువులు (విజ్ఞులు) నన్నుజూచి నవ్వుదురు.

బ్రహ్మణాం కోటయో యాతా గతాః సర్గపరమ్పరాః
ప్రయాతాః పాంసువద్భూపాః కా ధృతిర్మమ జీవితే
(" —435-98)

కోట్లకొలది బ్రహ్మదేవులు గతించిపోయిరి; సృష్టిపరంపరలనేకములు గడచిపోయినవి; అనేక రాజులు దుమ్మువలె ఎగిరిపోయిరి. ఇక నా జీవితమున విశ్వాసమేల?

సంసారరాత్రిదుఃస్వప్నే చేత్యే దేహమయే భ్రమే
ఆస్థాం చేదనుబధ్నామి తత్రేమాంతు ధిగస్తితమ్.
(" —435-99)

సంసారమను రాత్రియందలి దుఃస్వప్నభూతములగు దృశ్యవిషయములందును దేహ, అహంకార, మమకారాది భ్రమయందును నేను విశ్వాసము గలిగియున్నచో, అట్టి నా అవివేకమునకు ధిక్కారమగుగాక!

అయం సోఽహమితి వ్యర్థకల్పనాఽసత్యరూపిణీ
అహంకారపిశాచేన కిమజ్ఞవదహం స్థితః.
(" —435-100)

ఈ పుత్రాదులు, ఆ ధనాదులు, ఈ దేహేంద్రియాదులు—ఈ మున్నగువాని కల్పనయంతయు వ్యర్థమై అసద్రూపమైయున్నది. నేనీ అహంకారమను పిశాచముచే మోహితుడనై ఇంతకాలము అజ్ఞానివలె ఏల పడియున్నాను?

హతం హతమిదం కస్మాదాయురాతతయానయా
పశ్యన్నపి న పశ్యామి సూక్ష్మయా కాలలేఖయా.

(" —435-101)

క్షణ, నిమేష, ముహూర్తాది సూక్ష్మకాల పంక్తిచే ఈ ఆయువు క్షణ క్షణము భిన్నమైపోవుటను చూచియు దానిఁ గూర్చి నేనేల విచారణ గలుగుట లేదు?

పాదపీఠే కృతేశానాః శార్ఙ్గిక్రీడన కన్దుకాః
కాల కాపాలికాగ్రస్తాః కిమాస్థే మయి వల్గసి.

(" —435-102)

ఏ దేవునిచే బ్రహ్మాదులున్ను బ్రహ్మాండాసనమున ప్రతిమల వలె గావింపబడిరో, విష్ణ్వాదులెవ్వానిచే క్రీడా కందుకము వలె ఆకాశమున యుద్ధాది వ్యవహారములందు ప్రవర్తింప జేయబడిరో, ఏది మహారుద్రులను గూడ భక్షించి వైచెనో అట్టి కల్పనారూపమైన కాలమందు ఓ జీవితాశా! నీ వేల నా ఎదుట విజృంభించుచున్నావు?

అజస్రముపయాన్త్యేతే యాన్తి చాద్యాపి వాసరాః
అవినష్టైక సద్వస్తుర్దృష్టో నాద్యాపి వాసరః

(" —436-103)

దినములు నిరంతరము వచ్చుచున్నవి, పోవుచున్నవి. కాని దోషరహితమగు ఆనందరూపమైన సద్వస్తువు లభించిన దినమొక్కటైనను నేటి వఱకు జాడలేదు.

కష్టాత్కష్టతరం ప్రాప్తో దుఃఖాద్దుఃఖతరం గతః
అద్యాపి న విరక్తోఽస్మి హా దిఙ్మామధమాశయమ్.

(" 436-105)

అల్పకష్టమునుండి అధిక కష్టమును, అల్పదుఃఖము నుండి అధిక దుఃఖమును పొందినప్పటికిని ఇంతవఱకీ సంసారము యెడల నేను విరక్తుఁడను గాకయుంటిని. హా! అధమచిత్తుఁడ నగు ఈ నాకు ధిక్కారమగు గాక!

యేషు యేషు దృఢా బద్ధా భావనా భవ్యవస్తుషు
తాని తాని వినష్టాని దృష్టాని కిమిహోత్తమమ్

(" —435-106)

ఏ యే రమణీయ పదార్థములందు నేను మహాప్రీతి గలిగియుంటినో, అవి యన్నియును నశించిపోయినవి! ఇక ఈ దృశ్య ప్రపంచమున చిరస్థాయియగు ఉత్తమ వస్తువేది కలదు! (ఏదియును లేదని భావము)

యన్మధ్యే యచ్చ పర్యన్తే యదాపాతే మనోరమమ్
సర్వమేవాపవిత్రం తద్వినాశామేధ్యదూషితమ్.

(" -436-107)

ఏది మధ్య కాలమందును, ఏది అంతమందును, ఏది విచారింపని కారణము చేతను మనోహరముగ తోచుచున్నదో, అది యంతయు (విషయాదులన్నియు) వినాశమను మలముచే దూషితమై యుండుటచే అపవిత్రమే యగును.

యేషు యేషు పదార్థేషు ధృతిం బధ్నాతి మానవః
తేషు తాష్వేవ తస్యాయం దృష్టో నాశోదయో భృశమ్.
(" -437-108)

ఏ యే పదార్థములందు మనుజుడు తన విశ్వాసమును బంధించుకొనుచున్నాడో ఆయా పదార్థములందు తరచు దుఃఖమే ఆతనికి గలుగుచుండుట గాంచుచున్నాము.

అజ్ఞానైకహతో బాల్యే యౌవనే మదనాహతః
శేషే కలత్రచిన్తార్తః కిం కరోతి కదా జడః.
(" —437-109)

మనుజుడు బాల్యకాలమున కేవలము అజ్ఞానముచే పీడితుడగుచున్నాడు. యౌవన కాలమున మన్మథునిచే బాధింపబడుచున్నాడు. వార్ధక్యమున కుటుంబ చింతచే పీడితుడగుచున్నాడు. ఇక అట్టి జడుడు తన ఉద్ధారమును గూర్చి ఎపుడు ప్రయత్నము సల్పును?

రాజసూయాశ్వమేధాద్యైరిష్ట్వా యజ్ఞశతైరపి
మహాకల్పాన్తమప్యంశం స్వర్గం ప్రాప్నోతి నాధికమ్.
(" —437-111)

రాజసూయ, అశ్వమేధాదులను వందలకొలది యజ్ఞముల నాచరించినను (బ్రహ్మదేవాదులగు భోగ్యములు) మహాకల్పాంతము వఱకైన స్వర్గము సంప్రాప్తించునే గాని అంతకంటె నధికముగ ఏమియును గాదు. అదియో అనంత కాలమందు క్షణకాల భోగ్యప్రాయమై, అల్పమైనదేయగును.

సతోఽసత్తా స్థితా మూర్ధ్ని మూర్ధ్ని రమ్యేష్వరమ్యతా
సుఖేషు మూర్ధ్ని దుఃఖాని కిమేకం సంశ్రయామ్యహమ్.
(" —439-112)

ఈ వర్తమాన దృశ్యము యొక్క శిరస్సుపై వినాశమున్ను, రమణీయ పదార్థముల శిరస్సుపై అరమణీయత్వమున్ను, సుఖముల శిరస్సుపై దుఃఖములున్ను తిష్ఠవేసికొనియున్నవి. కావున శాశ్వతమై, దుఃఖరహితమైనట్టి ఏ పదార్థమును నేనాశ్రయింతును?

యేషాం నిమిషోన్మేషైర్జగతాం ప్రలయోదయౌ
తాదృశాః పురుషాః సన్తి మాదృశాం గణనైవ కా.
(" —438-115)

ఎవరు కనురెప్ప తెరచుటచే జగత్తుయొక్క సృష్టియు, మూయుటచే జగత్తు యొక్క ప్రళయమున్ను సంభవించుచున్నవో, అట్టి మహామహులగు పూర్వపు బ్రహ్మాదులిపుడేరి! (కాల గర్భమున విలీనులై పోయిరి) అట్టి వారే లేనపుడు ఇక మా బోంట్లవారి యొక్క లెక్కయేమి?

సన్తి రమ్యతరాద్రమ్యాః సుస్థిరాదపి సుస్థిరాః
చిన్తాపర్యవసానేయం పదార్థశ్రీః కిమీహసే.
(" —438-116)

అత్యంత రమణీయములైనట్టియు, అత్యంత స్థిరములైనట్టియు పదార్థములు కలవు. కాని వాని యన్నింటి యొక్క

పర్యవసానము (అర్జన రక్షణ వియోగాదుల వలన) చింతయే (దుఃఖమే) అయియున్నది. కాబట్టి ఓ చిత్తమా! అట్టి పదార్థముల నేల వాంఛించెదవు?

సంపదశ్చ విచిత్రా యాస్తాశ్చేచ్చిత్తేన సంమతాః
తత్తా అపి మహారమ్యా హన్త మన్యే మహాపదః.
(" —433-117)

విచిత్రములైన ధనదారాది సంపదలను చిత్తము గొప్పగా తలంచుచో, అది పొరబాటు. ఏలయనిన అవి ఆరంభమున గొప్పగాను, సుఖముగాను తోచి తుదకు దుఃఖప్రదములై నశ్వరములై పర్యవసించుటం బట్టి వానిని మహా ఆపదలుగనే నేను భావించుచున్నాను.

ఆపదోఽపి విచిత్రా యాస్తాశ్చేన్మనసి సంమతాః
తత్తా అపి మహారమ్యా మన్యే మనసి సంపదః.
(" —439-118)

విచిత్రములగు ఆపదలున్ను సాధుసంగ తీర్థాదుల ప్రాప్తి ద్వారా శ్రేయమేయని మనస్సు తలంచిన, అది సత్యము. ఏలయనిన అయ్యవి వైరాగ్యాది జనకములగుటచే సంపదలనియే నేను భావించుచున్నాను.

జయత్తాచ్ఛిన్నతప్తాను సుఖనామ్నీమ దృష్టిమ
కాస్యైతాస్వనురక్తోఽస్మి పతంగోఽగ్ని శిఖాస్వివ.
(" —439-119)

దేశకాల వస్తువులచే పరిచ్ఛిన్నమై త్రివిధతాపములచే సంతప్తమైన అగ్నిశిఖ వంటి ఈ సాంసారిక దశలందు మిడుత వలె నేనేల అనురక్తుడనై యున్నాను?

సంకల్పమేవ తన్మన్యే సంకల్పోపశమేన తత్
శోషయామి యథా శోషమేతి సంసార పాదపః
(" —439-123)

ఆ మనస్సు యొక్క రూపము సంకల్పమే యని నేను తలంచుచున్నాను. కాబట్టి సంకల్పము యొక్క శమనము ద్వారా ఆ మనస్సును, తద్ద్వారా సంసారవృక్షమును నేను శోషింపజేసెదను.

అకారమాత్ర రమ్యాసు మనో మర్కట వృత్తిషు
పరిజ్ఞాతాస్వహాద్యైవ న రమే నాశనిష్వహమ్-
(" —440-124)

ఆకారమాత్రముచే రమణీయములగు, మనస్సను కోతి యొక్క వృత్తులును, నాశవంతములుగ నెఱుంగబడినవియునగు ఈ (సంసార) దృశ్య విషయములందు నేనిక నుండి రమింపను.

హా హతోఽస్మి వినష్టోఽస్మి మృతోస్మీతి పునః పునః
శోచితం గతమేవాహమిదానీం నానురోధిమి.
(" —440-125)

"ఆహా! చంపబడితిని, నశించితిని" ని ఇట్లు పరితాప

మును జెందు సమయమిప్పుడు గతించినది. ఇక ఈ సాంసారిక వస్తువులకై నేను దుఃఖింపను.

ప్రబుద్ధోఽస్మి ప్రహృష్టోఽస్మి దృష్టశ్చోరోఽయమాత్మనః
మనో నామ నిహన్మ్యేనం మనసాస్మి చిరం హతః
(" —440-126)

నేనిపుడు ప్రబుద్ధుడనైతిని, ప్రసన్నుడనైతిని, పరమార్థ ధనమగు ఆత్మను దొంగలించు చోరుని నేనిపుడు కనుగొంటిని, అతడు మనస్సే; అతనిని నేనిపుడు చంపెదను. ఏలయనిన అతనిచే చిరకాలము నేను కొట్టబడితిని.

వివిధైః సాధుభిః సిద్ధైరహం సాధు ప్రబోధితః
ఆత్మాన మనుగచ్ఛామి పరమానన్ద సాధనమ్.
(" —440-127)

అనేక సాధువులచేతను, సిద్ధుల చేతను లెస్సగ బోధింపబడినవాడనై నేనిపుడు పరమానంద సాధనమగు ఆత్మను గూర్చి అన్వేషించుచున్నాను.

ఆత్మానం మణిమేకాన్తే లబ్ధ్వై వాలోక యన్సుఖమ్
తిష్ఠామ్యస్తమితాన్యేహః శరదీవా చలేఽమ్బుదః.
(" —440-128)

ఆత్మయను మణిని బొంది అద్దాని నవలోకించుచు (ధ్యానించుచు) ఇతర చేష్టలెవ్వియును లేనివాడనై, శరత్కాలమున పర్వతముపై మేఘమువలె, ఏకాంతమున సుఖపూర్వకముగ నుండెదను.

అయమహ మిదమాతతం మమేతి
స్ఫురితమపాస్య బలాద సత్యమన్తః
రిపుమతిబలినం మనో నిహత్య
ప్రశమముపైమి నమోఽస్తుతే వివేక. (" —441-129)

"ఈ దేహము నేను, ఈ ధనరాజ్యాదులు నావి" అను నీ ప్రకారముగ స్ఫురించు మహా అసత్యరూపమును జ్ఞానబలముచే అంతఃకరణమున తొలగించివైచి, మహాబలి యగు మనస్సను శత్రువును వివేకముచే చంపి ప్రశాంతి నొందెదను. కాబట్టి అట్టి ఓ వివేకమా! నీకు నమస్కారము!

కియన్మాత్రమిదం నామ రాజ్యం సుఖమితిస్థితమ్
న ప్రయోజన మేతేన మమేహ క్షణభఙ్గినా.
(" —441-130)

ఈ రాజ్యము, ఈ (విషయ) సుఖము ఎంత మాత్రము! క్షణభంగురములైనట్టి వీనిచే నాకిచట ఏ ప్రయోజనమున్ను లేదు.

సర్వమేవ పరిత్యజ్య మిథ్యాకమ్బరడమ్బరమ్
ఏకాన్త ఏవ తిష్ఠామి సంశాన్త ఇవ వారిధిః.
(" —441-131)

మిథ్యలైన, మాయాడంబరమైనట్టి ఈ సమస్తమును పరిత్యజించి ప్రశాంత సముద్రము వలె ఏకాంతమున నిశ్చలముగ నుండెదను.

చిత్త చాతుర్య మే తస్మాద్భోగా భ్యాసకు సంభ్రమాత్
త్యజ జన్మజరాజాడ్య జాలజమ్బాల శాన్తయే.

(" 441-132)

ఓ చిత్తమా! జన్మ, వార్ధక్య జడత్వ సమూహమను పంకము (బురద) శమించుట కొఱకై నీవు ఈ భోగాభ్యాసమను దుష్ట సంభ్రమము నుండి (సుఖలేశము నాస్వాదించు) నీ చాతుర్యమును విడనాడుము.

దశాను స్వాసు యాస్వేవ సంభ్రమం చిత్త పశ్యసి
తాభ్య ఏవాభిరచితం పరమం దుఃఖమేష్యసి.

(" —441-133)

ఓ చిత్తమా! విషయాభిలాష, తత్ప్రియత్న, తదుపభోగ, తత్స్మరణాదులను నీ యొక్క ఏ యే దశలయందు నీవు సుఖాస్వాదనమును గూర్చిన ఉత్సాహమును గాంచుచున్నావో, వాని నుండి పరమ దుఃఖమునే నీవు పొందగలవు.

తస్మాత్పాపాలమనయా తుచ్ఛయా భోగచిన్తయా
భవత్య కృత్రిమా తృప్తిర్యేనాభిపత తం తతః.

(" —442-135)

కాబట్టి ఓ పాపిష్ఠి చిత్తమా! ఇక ఈ తుచ్ఛమగు భోగచింతను కట్టిపెట్టి, కృత్రిమ సుఖముచే అనర్థము కలుగును కావున, దేనిచే అకృత్రిమమగు తృప్తి కలుగునో, అద్దాని (ఆత్మ) వైపునకు మరలుము.

క్రియావన్క్రియోవాస్తు కాయో ఽయమసదుత్థితః
సమస్థితస్య శుద్ధస్య చితః కా నామ మే క్షతిః.

(" —442-136)

అసద్రూపమున ఆవిర్భవించిన ఈ శరీరము కర్మలు చేయుగాక, లేక చేయకుండుగాక, దేహము యొక్క అయా చంచల, నిశ్చల స్థితుల రెండింటియందును సమానమైన స్థితి నొందియుండు శుద్ధ చిద్రూపుడనగు నాకు దానిచే ఏమి హాని!

నాభివాఞ్ఛామ్యసంప్రాప్తం సంప్రాప్తం న త్యజామ్యహమ్
స్వస్థ ఆత్మని తిష్ఠామి యన్మమాస్తి తదస్తు మే.

(" 442-137)

సంప్రాప్తింపని దానిని గూర్చి నేను కోరను; సంప్రాప్తించిన దానిని త్యజించను; కేవలము ఆత్మయందు నిశ్చింతగ స్థితినొంది యుండెదను. ఏ నిరతిశయానంద ఆత్మరూపము నాదై యున్నదో, అదియే నాకుండుగాక! అన్యమగు బాహ్యము ఎద్దియును గాదు!

యో నిశ్చయోఽన్తః పురుషస్య రూఢః
క్రియాస్వసౌ తన్మయతాముపైతి
అనామయం మే పదమాహతా ధీ
రధీరతామన్తరలం త్యజామి (" —443-140)

మనుజుని అంతఃకరణమున కర్తయనిగాని, భోక్తయనిగాని, ఏ నిశ్చయము రూఢిపడియుండునో, క్రియలందాతిడట్టి

నిశ్చయముతో తన్మయత్వమును బొందును. ఇపుడు నా బుద్ధి యీ నిర్వికారమగు (కర్తృత్వ భోక్తృత్వాది రోగ రహితమగు) ఆత్మ పదమున దృఢనిశ్చయమును బొందినది. కాబట్టి ఇక చిత్తమున (ఇష్టానిష్టములఁ గూర్చిన) అధైర్యమును సంపూర్ణముగ త్యజించి వేయుచున్నాను.

చిత్తచఞ్చల సంసారం ఆత్మనో న సుఖాయతే
శమ మేహి శమాచ్ఛాన్తం సుఖం సారమ వాప్స్యతే.

(" —444-144)

ఓ చిత్తమా! ఈ చంచల సంసారము ఆత్మకు సుఖదాయకము కాదు. కావున నీవు శమించుము. నీవు శమించి వచో విక్షేపరహితమై, సారభూతమైనట్టి ఆత్మసుఖము లభించును.

యథా యథా వికల్పౌఘాన్సంకల్పయసి హేలయా
తథా తథైతి స్ఫారత్వం సంసారస్తవ చిన్తయా.

(" —444-145)

ఓ చిత్తమా! నీవు ఏయే ప్రకారము లీలగా వికల్ప సమూహములను సంకల్పించుచుందువో, ఆయా ప్రకారము నీయొక్క విషయ చింతనచే ఈ సంసారమున్ను నీకు పెరుగుచునే యుండును.

శతశాఖత్వ మాయాతి సేకేన విటపీ యథా
అనన్తాధిత్వమాయాసి శత భోగేచ్ఛయా తథా.

(" —444-146)

ఓ మూర్ఖచిత్తమా! నీరు పోయుటచే వృక్షము అనేక శాఖలను బొందునట్లు, భోగేచ్ఛచే నీవు అనేక మానసిక వ్యథలను బొందెదవు.

చిన్తాజాల విలాసోత్థా జన్మసంసార సృష్టయః
తస్మాత్త్యక్త్వా విచిత్రాం త్వం చిన్తాముపశమం వ్రజ.

(" —444-147)

ఈ రీతిగ జనన మరణాదిరూప సంసార సృష్టులు విషయచింతా సమూహమునుండి జనించిన వగుటచే నీవా విచిత్రములగు విషయ చింతలను త్యజించివైచి ఉపశమమును బొందుము.

సంసార సృష్టితరలామిమాం తులయ సున్దర
అస్యాం చేత్సార మాప్నోషి తదేతా మేవ సంశ్రయ.

(" —444-148)

ఓ వివేకవంతమగు చిత్తమా! ఈ చంచల సంసార సృష్టిని, ఉపశమ సుఖమును రెంటిని త్రాసునందు తూచి చూడుము. (ఏది సారవంతమయినదో బాగుగ పరీక్షింపుము). అందు సంసార దృష్టియందే సారము గలదని నీవెఱిఁగిన దానినే ఆశ్రయింపుము. (సంసార సృష్టి నశ్వరమయినది గావున అయ్యది అసారమే యగును; కాబట్టి ఉపశమ సుఖమునే ఆశ్రయింపుమని భావము.)

ఆస్తాం యస్మాత్పరిత్యజ్య దృశ్య దర్శనలాలసాత్
మైతద్గృహాణ మాముఞ్చ స్వేచ్ఛయా విహరేచ్ఛయా.

(" —445-149)

ఇట్లీ సంసారము అసారము కావున దానియందలి ఆసక్తిని పరిత్యజించి, దృశ్యమును ప్రియమని తలంచి గ్రహింపకుము, అప్రియమని తలంచి ద్వేషముచే త్యజింపకుము. రెండిటికిని సాక్షియగు స్వాత్మ మాత్రమును గూర్చిన ఇచ్ఛ గలదానవై నీ ఇచ్ఛచొప్పున విహరింపుము.

మనాగపి న సంబన్ధస్తవ దృశ్యేన వస్తునా
అవిద్య మానరూపేణ సంబన్ధః కోఽయమీదృశః.

(" —445-150)

ఓ చిత్తమా! ఈ దృశ్యవస్తువులో నీ కొంకింతైనను సంబంధము లేదు. ఏలయనిన, లేనిపదార్థములో సంబంధ మెట్లు కలుగును?

అసత్త్వమేతచ్చ న సద్వయోరేవాసతోః సతోః
సంబన్ధ ఇతి చిత్రేయమపూర్వైవాక్షరావలీ.

(" 445-151)

ఓ మనస్సా! నీవు అసత్తు; ఈ దృశ్యమున్ను సత్తు గాదు; ఇట్లు మీ ఇరువురును వంధ్యాపుత్రునివలె అసత్తై యుండ, స్వరూప శూన్యులగు ఆ మీ రిరువురకు సద్వస్తువగు ఆత్మతో సంబంధము గలదను వాక్యము మిగుల చిత్రముగను ఆశ్చర్యముగను నున్నది.

తస్మాన్మహాధిం ముఞ్చ త్వం మూకముల్లాసమాహర
సంక్షుబ్ధామ్బుధిమా విష్టాం త్యజాభవ్యామిమాం స్థితిమ్.

(" —445-152)

కాబట్టి ఓ మనస్సా! మహాదుఃఖరూపమగు ఈ సంసారమును త్యజింపుము; తూష్ణీభూతమగు పరాత్మ స్వరూపస్థితిని బొందుటకై ఉత్సహింపుము; సంక్షోభము (విక్షేపము)తో గూడిన సంసార సముద్ర ప్రవేశమును ఈ నీచస్థితిని వదలి వేయుము.

న తదిహాస్తి సమున్నతముత్తమం
వ్రజసి యేన పరాం పరిపూర్ణతామ్,
తదవలమ్బ్య బలాదతిధీరతాం
జహిహి చఞ్చలతాం శఠ రే మనః. (" —445-153)

ఓ మూర్ఖ మనస్సా! దేనిని పొందుటచే పరిపూర్ణత్వమును నీవు బడయగలవో, అట్టి ఉత్తమ మహోన్నత పదార్థ మెద్దియు ఈ దృశ్యవర్గమున లేదు. కాబట్టి అభ్యాస వైరాగ్య బలముచే దృగ్రూపమగు ఆత్మనే అవలంబించి మహాధీరత్వమును పొందినదానవై చంచలత్వమును విడనాడుము.

మహతా మమ రాష్ట్రేణ త్రైలోక్యాద్భుతకారిణా
కిం వా భవతి భుక్తేన భూరిభోగాతి హారిణా

(" —492-7)

ముల్లోకములందును అద్భుతకార్యముల నొనర్చునదియు, అనేక భోగములచే మనోహరమైనదియు నగు

ఈ నా మహారాజ్యమును అనుభవించుటవలన నాకు కలుగునది ఏమి? (ఏ ప్రయోజనమున్నూ లేదని భావము)

ఆపాత మాత్ర మధుర మావశ్యక పరిక్షయమ్
భోగోపభోగమాత్రం మే కిం నామేదం సుఖావహమ్

(" —492-8)

పైకి మాత్రము మధురము (రమణీయము)గా తోచునవియు, తప్పక వినాశమొందునవియునగు ఈ భోగములన్నింటిని అనుభవించుట నాకేమి సుఖదాయకము?

పునర్దినైకకలనా శర్వరీ సంస్థితిః పునః
పునస్తాన్యేవ కర్మాణి లజ్జాయై న చతుష్టయే.

(" —492-9)

మరల అదియే పగలు, మరల అదియే రాత్రి, వచ్చుచు పోవుచునున్నవి; (స్నానభోజనశయనాదులను) ఆ చేసిన పనులనే మరల మరల చేయుచున్నాము; ఇది యంతయు తలంచుకొనిన సిగ్గే కలుగును గాని సంతోషము కాదు.

సఫలమేకం మహోదారం నేహ పశ్యామి కించన
కార్యమ ప్రీతరత్ప్రాప్తే యస్మిన్నామ న కించన.

(" —493-14)

దేనిని పొందుటచే ఇతరమగు కార్యమొకింతయైనను చేయదగినది మిగిలియుండదో, అటువంటి ఏకమగు మహోన్నత ఫలమిచ్చుట నేనేమియు గాంచకున్నాను.

దృష్టాన్యపృష్టయో దృష్టా భుక్తం భోక్తవ్యముక్షతమ్
ఆక్రాన్తమఖిలం భూతం జాతం కిమివ శోభనమ్

(" —503-66)

మహా వైభవములను జూచితిని; ఇతరులచే ఆక్రమింపబడని గొప్ప రాజ్యాదులను పాలించి మహాభోగముల ననుభవించితిని; ప్రాణికోట్లన్నిటిని నా సామర్థ్యముచే ఆక్రమించి వానిని నాకు అణకువగ జేసితిని. ఇంత జేసినను ఉత్తమమైనది (శాశ్వత సుఖము) ఏది నాకు కలిగినది?

సర్వమేవ పరిత్యజ్య పరిహృత్య ధియా స్వయమ్
స్వస్థ ఏవావతిష్ఠేఽహం పూర్ణాత్పూర్ణ ఇవాత్మని

(" —504-68)

సమస్తమును పరిత్యజించి, బుద్ధిచే స్వయముగ ఈ దృశ్యమునంతను తొలగించివైచి, పూర్ణస్వరూప (ఆత్మ) బోధచే ఆత్మయందు పరిపూర్ణుడనై హాయిగ నుండెదను.

ఏతావన్త మహం కాలం భృశం బాలోఽభవం పురా
యః కుర్వన్ద్వేషమమరైస్తుచ్ఛయా జగదిచ్ఛయా.

(" —504-70)

ఇంతకాలము వఱకు నేను మహాబాలకుడనై (మూర్ఖుడనై) యుంటిని. ఏలయనిన ఈ తుచ్ఛజగత్తు యొక్క ఆధిపత్యము కొఱకై దేవతలతో పూర్వము ద్వేషము కల్పించుకొంటిని.

కిమనేన శరీరేణ కాష్ఠలోష్ఠసమేన మే
అశేష జగదేకాత్మా చిదహం చేతనాత్మకః

(" —507-84)

కొయ్యతోను, మట్టిగడ్డతోను సమానమయినట్టి ఈ శరీరముతో నాకేమి ప్రయోజనము? ఉపాధిరహితమయి, సమస్త జగదాత్మకమై, చేతనరూపమైనట్టి చిద్వస్తువే (ఆత్మయే) నేను.

అహం చిదమ్బరే భానావహం చిద్భూతపఞ్జరే,
సురాసురేషు చిదహం స్థావరేషు చరేషు చ.

(" —507-85)

ఆకాశమందును, సూర్యుని యందును, పంచభూతములందును, దేవతాసురుల యందును, స్థావరములందును, జంగమములందును, ఏ సద్రూపచైతన్యముగలదో అదియే నేను.

బలినామ్నః శరీరస్య ఛిన్నే శిరసి భాసురే
చితః కిం తద్భవేచ్ఛిన్నం సర్వలోకావపూరణాత్

(" —507-87)

బలియను పేరుగల ఈ శరీరము యొక్క ప్రకాశమానమగు ఈ శిరస్సు ఛేదింపబడినను, సర్వలోకములందును వ్యాపించియున్నట్టి అసంగ చిద్రూపుడనగు నేను ఎట్లు ఛేదింపబడుదును! (ఎన్నటికిని ఛేదింపబడజాలనని భావము.)

న ద్వేషోఽస్తి న రాగోఽస్తి నమనో నాస్య వృత్తయః
చిన్మాత్రస్యాతి శుద్ధస్య వికల్పకలనా కుతః

(" —507-88)

చిద్రూపుడనగు నాకు వాస్తవముగ ద్వేషము లేదు; రాగము లేదు. మనస్సు లేదు; మనోవృత్తులు లేవు. ఏ యునిన అతి శుద్ధమగు చిన్మాత్రరూపమునకు వికల్పముయొక్క కల్పనయే యెచట?

చిదహం సర్వగో వ్యాపీ నిత్యానందమయాత్మకః
వికల్పకలనాతీతో ద్వితీయాంశ వివర్జితః

(" —508-89)

సర్వవ్యాపకమై, నిత్యానందమయ స్వరూపమై, వికల్పకల్పనాతీతమై, రెండవ వస్తువెద్దియు లేనిదైనట్టి చైతన్యమే (ఆత్మయే) నేను.

దృశ్య దర్శన నిర్ముక్త కేవలామలరూపవాన్
నిత్యోదితో నిరాభాసో ద్రష్టాస్మి పరమేశ్వరః

(" —508-90)

దృశ్యదర్శన వర్జితుడును, కేవలము నిర్మల రూపుడను, నిత్యోదితుడు (శాశ్వతుడు)ను, ఆభాసశూన్యుడు (సత్య స్వరూపుడు)ను, ద్రష్టయునగు పరమేశ్వరుడనే నేను.

భారూపైక స్వరూపేఽస్మి స్వరూపేణ జయామ్యహమ్
చేత్యరఞ్జనరిక్తాయ విముక్తాయ మహాత్మనే
ప్రత్యక్చేతనరూపాయ స్వరూపాయ నమోఽస్తుతే.

(" —50[?]-91)

ఈ కేవల ప్రకాశ స్వరూపముచే నేను జీవాది దృశ్య భావమును జయించివైచుచున్నాను. ఈ ప్రకారముగ జీవాది

భావరహితమై, విముక్తమై, మహాత్మరూపమై, చిద్రూపమై నట్టి నా యొక్క ప్రత్యగాత్మ స్వరూపమునకు నమస్కారము! (జీవాది దృశ్యభావరహితమగు స్వాత్మయే పరమేశ్వరుడు. కావున అద్దానికి నమస్కరించుచున్నానని భావము.)

చితయే చేత్యముక్తాయ యుక్త్యా యుక్తాయ యోగ్యయా
సర్వావభాసదీపాయ మహ్యమేవ నమోస్తుతే.

(" —508-92)

విషయవర్జితమును, చిద్రూపమును, మనన నిదిధ్యాసన సమాధిరూపయుక్తి సహితమునగు నా సాక్షి చైతన్యమునకు నమస్కారము. సర్వప్రకాశకమైన జ్యోతిరూపమగు నాకు నమస్కారము.

చేత్యనిర్ముక్త చిద్రూపం విష్వగ్విశ్వావపూరకమ్
సంశాన్త సర్వసంవేద్యం సచ్చిన్మాత్రమహం మహత్
అకాశవదనన్తోఽహమప్యణోరణురాతతః.

(" —508-93)

నేను దృశ్యవర్జితమగు చిద్రూపమును; బ్రహ్మాండ మంతటను వ్యాపించియున్నట్టియు, సర్వదృశ్యరహితమై నట్టియు, మహత్తరమయినట్టియు సచ్చిన్మాత్రుడను నేను. అణువుకంటెను సూక్ష్మమయినవాడను అయినను ఆకాశము వలె అనంతమయియున్నవాడను.

నాసాదయన్తి మామేతాః సుఖదుఃఖాదశా దృశః
సంవేదన మసంవేద్య మచేత్యం చేతనం తతమ్.

(" —509-94)

ఈ సుఖదుఃఖములు నన్ను పొందజాలవు. ఏలయనిన నేను వేద్య (దృశ్యవిషయ) రహితమయినట్టి వ్యాపక చైతన్యమునే యగుదును.

యది స్వభావభూతేన వస్తు నా వస్తు నీయతే
హ్రియతే దీయతే వాపి తత్కిం కస్య కిల క్షతమ్.

(" —509-95)

సర్వరూపుడనగు నా స్వరూపమందలి ఒక వస్తువుచే నా స్వరూపమందలి దేయగు మఱియొక వస్తువు పొందింప బడినను, హరింపబడినను, ఈయబడినను దానిచే ఎవనికి ఏమి నశించును? (ఆత్మస్వరూపుడనగు నాకు ఏ హానియుండదని భావము.)

మోక్షమిచ్ఛామ్యహం కస్మాద్బద్ధః కేనాస్మి వై పురా
అబద్ధో మోక్షమిచ్ఛామి కేయం బాలవిడమ్బనా

(" —509-98)

నేను మోక్షమెందుల కిచ్ఛగింపవలెను? ఇంతకు పూర్వము నేను దేనిచేనైన బద్ధుడనై యుంటినా ఏమి? (కాదని భావము) ఏ కాలమందును బద్ధుడను కాకయున్న నేను మోక్షము నిచ్ఛగించుట యనునది బాలుర చేష్టయే యగును.

ధ్యానా ధ్యాన భ్రమౌ త్యక్త్వా పుంస్త్వం స్వమవలోకయత్
యదాయాతి తదాయాతు నమే వృద్ధిర్న వాక్షయః

(" —510-99)

ధ్యాన, అధ్యానము (ధ్యానము లేకుండుట)లను భ్రమలను త్యజించి నా యొక్క ఆత్మస్వరూపము నవలోకించుచు (అనుభవించుచు) నుండెద. ఏది వచ్చునో, అది వచ్చుగాక! ఏది పోవునో, అది పోవుగాక! దానిచే ఆత్మరూపుడనగు నాకు వృద్ధిగాని, క్షయముగాని లేవు

నాహం మృతో న జీవామి న సన్నాసన్న సన్మయః
నేదం మేనైవ చాన్యన్మే నమో మహ్యమహం బృహత్.
(" —510-100)

(శరీరముతో సంబంధము లేనందున) నేను మరణించుట లేదు (ప్రాణముతోటి సంబంధము లేనందున) నేను జీవించుట లేదు. నేను స్థూలరూపుడనుగాను, సూక్ష్మరూపుడనుగాను; స్థూలపదార్థ వికారమునుగాను. నాకు ఈ దేహ లోకాదులు లేవు. ఇతర దేహ, లోకాదులున్ను లేవు అట్టి మహత్తర ఆత్మరూపుడగు నాకు నమస్కారము!

న కించిదపి కర్తవ్యం యది నామ మయాధునా
తత్కస్మాన్నకరోమీదం కించిత్ప్రకృత కర్మ వై.
(" —510-101)

కర్తృత్వముతో గూడిన కార్యమేదియు నాకిపుడు లేనందున రాజ్యపాలనాది ఈ ప్రకృత వ్యవహారములను నేనేల ఆచరింపరాదు?

అహం నామ తావత్స్యాం యోఽస్మిన్ భువనడమ్బరే
పశ్యన్ గచ్ఛామి తిష్ఠామి ప్రయత్నే నాహరామి చ
(" —523-41)

ఈ ప్రపంచ ఆడంబరమున మాట్లాడుచు, కూర్చొనుచు ప్రయత్నపూర్వకముగ విషయముల ననుభవించుచున్న ఈ 'నేను' ఎవడను?

జగత్తావదిదం నాహం సవృక్ష తృణపర్వతమ్
యద్బాహ్యమలత్యన్తం తత్స్యాం కథమహం కిల.
(" —523-42)

వృక్ష, తృణ, పర్వత సహితమగు ఈ జగత్తు నేను కాను. ఏలయనిన, ఏది నాకంటె మిగుల బాహ్యమున నున్నదో, అది నేనెట్లగుదును?

ఆసన్నభ్యుదితో మూకః పవనైః స్ఫురితః క్షణమ్
కాలే నాల్పేన విలయీ దేహో నాహమచేతనః.
(" —523-43)

అస్రద్రూపముగ నుదయించినదియు, మూగదియు, ప్రాణవాయువులచే క్షణకాలము చలింపబడునదియు, అల్పకాలముననే నశించిపోవునదియు, జడమైనది (చేతనము కానిది) యు నగు ఈ దేహము (ఉపాధి) నేను కాను.

నిర్మమోఽమనసః శాన్తో గతపఞ్చేన్ద్రియ భ్రమః
శుద్ధచేతన ఏవాహం కలాకలన వర్జితః. (" —523-44)

మమత్వరహితమై, మనన శూన్యమై, శాంతమై, పంచేంద్రియ భ్రమవర్జితమై, సంకల్ప వికారరహితమయినట్టి శుద్ధచైతన్యమే (ఆత్మయే) నేను

చేత్యవర్జిత చిన్మాత్రామహ మేషోఽవభాసకః
స బాహ్యాభ్యన్తరవ్యాపి నిష్కళామల సన్మయః.

(" —523-45)

విషయవర్జిత చిన్మాత్రమై, సర్వప్రకాశకమై, బాహ్యాభ్యంతరము లందును వ్యాపించినదై, నిష్కళమై, నిర్మలమయినట్టి సన్మయమే (ఆత్మయే) నేను.

అ ఇదానీం స్మృతం సత్యమేతత్తదఖిలం మయా
నిర్వికల్ప చిదాభాస ఏష ఆత్మాస్మి సర్వగః

(" —524-47)

ఓహో! ఇప్పుడు యథార్థము జ్ఞాపకమునకు వచ్చినది. ఈ జగత్తంతయు నిర్వికల్ప చిత్ప్రకాశమగు ఆత్మమాత్రమే అయియున్నది, మఱియు అట్టి సర్వవ్యాపియగు ఆత్మ నేనే అయియున్నాను

అసావేవ హి భూతానాం సర్వేషామేవ జాగ్రతామ్
సర్వానుభవితా భూమిరాత్మా ముకురవత్స్థితః

(" —524-48)

అద్దము ప్రతిబింబము లన్నిటికిని ఆధారమైనట్లు, ఈ ఆత్మయే చేతనా రూపులగు ప్రాణికోట్లందరి యొక్క దేహేంద్రియ మనోబుద్ధ్యాదుల అనుభవము లన్నిటికిని ఆధారభూమియై వెలయుచున్నది.

బ్రహ్మ విష్ణ్విన్ద్ర రుద్రాణాం కారణానాం జగత్స్థితౌ
ఏ తత్కారణమాద్యం తత్కారణం నాన్యవిద్యతే.

(" —524-49)

జగత్తుయొక్క స్థితికి కారణభూతులైనట్టి బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఇంద్రాదులకున్ను ఆదికారణము ఈ ఆత్మయే అయియున్నది, దీనికి కారణము మరేదియును లేదు.

చిచ్చైత్యద్రష్టృ దృశ్యాది నామభిర్వర్జితాత్మనే
స్వయం సకృద్విభాతాయ మహ్యమస్మై నమో నమః.

(" —524-50)

చిత్త, విషయ, ద్రష్టృ, దృశ్యాది రహితమై, నిత్య స్వయంప్రకాశ స్వరూపమైనట్టి ఏ ఆత్మకలదో అట్టి ఆత్మరూపుడనగు ఈ నాకు మరల మరల నమస్కారము!

అదృశ్యం సర్వభూతానాం ప్రాప్యం గలిత చేతసామ్
ఏతత్త ద్దృశ్యతే సద్భిః పరం వ్యోమాతి నిర్మలమ్.

(" —524-51)

ఈ ఆత్మ అజ్ఞానులగు జీవులెవరికిని కానిపించదు చిత్తము నశించిన వారికే ఇయ్యది సంప్రాప్తించును. దృశ్యముకంటె పరమై ఆకాశము కంటెను అతి నిర్మలమైనట్టి ఈ ఆత్మ సత్పురుషులగు జ్ఞానులకు మాత్రమే కనిపించును.

ఏకోఽసావహమాద్యన్త రహితః సర్వగాకృతి
చరాచరాణాం భూతానామన్తః స్వానుభవః స్థితః.

(" —525-52)

ఏకమై, ఆద్యంత రహితమై, సర్వ వ్యాపకమై, చరాచర ప్రాణికోట్ల యొక్క అంతరంగమున స్వానుభవ

రూపమున వెలయుచున్నదైన పరమాత్మ నేనే అయియున్నాను.

అస్య తస్య మమేమాని స్థావరాణి చరాణి చ
పరిసంఖ్యాధి హీనాని శరీరాణి బహూని చ.

(" —525-53)

అట్టి పరమాత్మ స్వరూపుఁడనగు నాయందే అపరిచ్ఛిన్న రూపమున ఈ స్థావర జంగమాత్మకమగు ప్రాణికోట్ల శరీరములన్నియును గలవు.

ఏకోఽసావనుభూత్యాత్మా స్వానుభూతి వశాత్స్వయమ్
సర్వదృగ్ద్రష్టృ దృశ్యత్వాత్సహస్ర కరలోచనః.

(" —525-54)

అనుభవస్వరూపమును, ఏకమునగు ఈ పరమాత్మయే సర్వమునకు దృక్కున్ను. ద్రష్టయు, దర్శనమునగుటచే అసంఖ్యాకములగు హస్త పాదాదులు గలవాడగును.

ఏషోఽసావహమాకాశే సూర్యదేహేన చారుణా
విహరామీతరేణాపి వాయుదేహేన వాయునా.

(" —525-55)

ఆత్మ స్వరూపుఁడనగు ఈ నేను మనోహరమైన సూర్య దేహముతో ఆకాశమున విహరించుచున్నాను. అట్లే ఇతరమగు వాయు దేహముతో సర్వత్ర సంచరించుచున్నాను.

మమైతద్వపురా నీలం శఙ్ఖ చక్ర గదా ధరమ్
సర్వసౌభాగ్యసీమాన్తం హ్యస్మిఞ్జగతి వల్గతి.

(" —525-56)

నీలవర్ణ యుతమై, శంఖ చక్ర గదలను ధరించినదై, సమస్త సౌభాగ్యములకు పరిశాష్ఠమై, ఈ జగత్తున వ్యవహరించుచున్నట్టి ఈ విష్ణు దేహము నాదే.

అహ మస్మిన్సముద్భూతః పద్మాసన గతః సదా
నిర్వికల్ప సమాధిస్థః పరాం నిర్వృతి మాగతః.

(" —526-57)

ఈ జగత్తునందావిర్భవించినవాడును పద్మాసనాసీనుడును సదా నిర్వికల్ప సమాధియందుండువాడును, పరమ శాంతిని బడసినవాడునగు బ్రహ్మదేవుడు నేనే.

అహం త్రినేత్రయాఽఽకృత్యా గౌరీ వక్త్రాబ్జషట్పదః
సర్గాన్తే సంహరామీదం కూర్మోఽబ్జి పటలం యథా.

(" —526-58)

మఱియును నేను త్రినేత్రుఁడగు శివుని రూపమును ధరించి పార్వతి యొక్క ముఖకమలమునకు తుమ్మెదనై, తాఁబేలు తన అవయవములను ముడుచుకొనులాగున సృష్టి యొక్క అంతమున (ప్రళయ కాలమున) ఈ జగత్తును ఉపసంహరించుచున్నాను.

మయి స్ఫారే చిదాదర్శే ప్రతిబిమ్బం యదా గతమ్
తదస్తి నేత రద్యస్మాన్మత్తోఽన్య న్నేహ విద్యతే.

(" —526-59)

విశాల చిద్రూప దర్పణమగు నాయందేది ప్రతిబింబించునో, అదియే స్థితికలది యగును కాని అన్యము కాదు.

ఏలయనిన, నాకంటె వేఱుగ ఈ ప్రపంచమున ఏదియును లేదు కదా!

అహోను వితతాత్మాస్మి న మామ్యప్యాత్మ నాత్మని
కల్పాన్త పవనాధూత ఏకార్ణవ ఇవార్ణవే.

(" —526-61)

ఆహా! నేనెంత విశాలమైన రూపముగలవాడను! ప్రళయ వాయువుచే ప్రకంపితమగు మహాసముద్రము తన పూర్వపు సముద్ర పరిమాణమున పట్టనట్లు—నేనిపుడు నా పూర్వపు పరిచ్ఛిన్న (జీవ) రూపమున పట్టకున్నాను.

స్వల్పేయం మతికా బ్రాహ్మీ జగన్నామ్నీ సుసంకటా
గజో బిల్వఇవ స్వాఙ్గే న మాతి విపులం వపుః.

(" —527-62)

బిల్వ (మారేడు) ఫలమున ఏనుగు పట్టనట్లు బ్రహ్మదేవునిచే నిర్మితమైన "జగత్తు" ను పేరుగల ఈ అతి స్వల్పమగు మఠమున నా విశాల ఆత్మరూపము పట్టుటలేదు.

విరిఞ్చి భవనాత్పారే తత్త్వాన్తేఽప్యాహరత్పదమ్
ప్రసరత్యేవ మే రూపమద్యాపి న నివర్తతే.

(" —527-63)

బ్రహ్మదేవుని భవనమగు ఈ విశాల బ్రహ్మాండము పరిక్రమించియు, ప్రపంచ తత్త్వములన్నింటిని దాటియు జనుచున్నను నా స్వరూపమున ఇంకను నివృత్తి సంభవించుట లేదు.

అయం నామాహ మిత్యన్తః కుతో నిరవలమ్బనా
అపర్యన్తాకృతేరేషా సీత్వల్పతా మమ (" —527-64)

“ఈ దేహాదులు నేను” అను నిరాధారమగు కల్పన నాయందెచటి నుండి ఆవిర్భవించినది! అపార ఆకారము గల నాకీ స్వల్పత్వమెట్లు సంభవించినది!

భావనయ మయం బాహమితి మిథ్యైవ విభ్రమః
కో దేహః కోఽస్య దేహో వా కో మృతః కశ్చ జీవతి.

(" —527-65)

“ఇతడు నీవు, ఇతడు నేను” - ఇత్యాది కల్పన మిథ్యారూపమగు మహాభ్రమయే యగును. కావున (ఈ ప్రకారముగ దేహము మిథ్యయగుటచే) ఇక దేహమేమి! మృతి నొందిన వాడెవరు! జీవించుచున్న వాడెవడు!

వరాకాః పేలవధియో బభూవుర్మే పితామహాః
యే సామ్రాజ్యమిదం త్యక్త్వా రేమిరే భవభూమిషు

(" —527-66)

ఈ ఆత్మ సామ్రాజ్యమును త్యజించి సంసార క్షేత్రములందు (విషయ భోగాదులందు) తిరుగాడిన మా పితరులు నిక్కముగ అధములును క్షుద్రబుద్ధులును అయియుండిరి.

క్వేయం కిల మహాదృష్టి ర్భరితా బ్రహ్మ బృంహితా
క్వ సరీసృప భీమాశా భీమా రాజ్యవిభూతిభిః.

(" —527-67)

బ్రహ్మజ్ఞానముచే ప్రవర్థమానమై, పరిపూర్ణమై వెలయు ఈ మహాదృష్టి (జ్ఞానదృష్టి) ఎచట? సర్పముల వలె భయంకరములైన ఆశలతో గూడి భయదాయకములై యొప్పు ఈ రాజ్య ఐశ్వర్యము లెచట?

అనన్తానన్ద సంభోగా పరోపశమ శాలినీ
శుద్ధేయం చిన్మయీ దృష్టిర్జ యత్యఖిల దృష్టిషు
(" —528-68)

అనంతానందదాయకమై, పరమశాంతి ప్రదమైనట్టి ఈ శుద్ధ చిన్మయ (ఆత్మ) దృష్టి దృష్టులన్నిటియందును మేటియై యున్నది.

సర్వభావాన్తరస్థాయ చేత్యముక్త చిదాత్మనే
ప్రత్యక్చేతన రూపాయ మహ్యమేవ నమో నమః
(" —528-69)

సమస్త పదార్థములందును స్థితి గల్గియున్నదియు, విషయ రహిత చిద్రూపమున్ను అగు ప్రత్యగాత్మయైన నాకు మరల మరల నమస్కారము.

జయామ్యహమజో జాతో జీర్ణసంసార సంసృతిః
ప్రాప్తప్రాప్యో మహాత్మాయం జీవామి చ జయామి చ.
(" —528-70)

నేనిపుడు సంసార బంధము నశించినవాడనగుటచే జన్మ రహితుడనై జయమును (జయింపదగిన ఫలమగు సర్వానర్థ నివృత్తిని) పొందితిని. మఱియు మహత్తర ఆత్మరూపుడనై

పొందదగిన సుఖములన్నింటిని పొందినవాడనై జీవిత సాఫల్యమును బడసి సర్వోత్తముడనై వెలయుచున్నాను.

ఇదముత్తమ సామ్రాజ్యం బోధం సంత్యజ్య శాశ్వతమ్
న రమేఽహమ రమ్యాసు రాజ్యదుఃఖ విభూతిషు
(" —528-71)

అట్టి శాశ్వత చిద్రూప ఆత్మ సామ్రాజ్యమును వదలి నేనిక తుచ్ఛములై దుఃఖప్రదములైనట్టి రాజ్య ఐశ్వర్యములందు క్రీడింపను.

దారువారి దృషన్మాత్రే లుఠితో యోధరాతలే
ధిగ్వరాక మనాత్మజ్ఞం తం కుదానవ కీటకమ్.
(" —528-72)

ఎవడు కాష్ఠ, జల, శిలామాత్రమే యగు (వనదుర్గ జలదుర్గ, గిరిదుర్గములతో గూడిన) ఈ పృథివీ తలమందు అత్యాసక్తి గలిగి యుండునో, అట్టి అధముడును, అనాత్మజ్ఞుడును అగు దుష్ట దానవునకు ధిక్కారమగు గాత!

అనాస్వాద్యేద మానన్దం జగద్రాజ్యశతాన్యపి
సమాస్వాదయతా నేహ కించిదా స్వాదితం భవేత్
(" —529-75)

అట్టి ఆత్మానందమును అనుభవింపక, వందలకొలది జగద్రాజ్యముల యొక్క సుఖముల ననుభవించినను, ఒకింతైనను సుఖమనుభవింపనట్లే యగును. (దృశ్యసుఖము నశ్వరము, మిథ్యయు కావున)

న కించిద్యేన సంప్రాప్తం తేనేదం పరమామృతం
సంప్రాప్యాన్తః ప్రపూర్ణే న సర్వం ప్రాప్తమఖణ్డితమ్.

(" —529-76)

ఎవడు సర్వోత్తమమగు ఈ ఆత్మానందామృతమును అంతఃకరణమున బడయునో అట్టి పరిపూర్ణుడు విషయసుఖము నొకింతైనను బొందక యున్నప్పటికిని, సమస్త సుఖములను, పూర్ణముగా బొందిన వాడే యగును.

త్యక్త్వా పదమిదం మూర్ఖోమితమేతి న పణ్డితః
ఉష్ట్రో హి త్యక్తసులతః కణ్టకం యాతి నేతరః

(" —529-77)

ఇట్టి అపరిచ్ఛిన్నమగు ఆత్మపదమును త్యజించి పరిచ్ఛిన్నమగు (సంసార) పదమును మూర్ఖుడే కోరుకొనును గాని జ్ఞాని కాదు ఉత్తమ ఫలయుక్తములగు ద్రాక్షాది లతలను త్యజించి కంటకముల వైపునకు పరుగిడునది ఒంటెయే కాని మఱియే జంతువును కాదు గదా!

క్వ ఫుల్లానన్దనస్థల్యః క్వ దగ్ధమరుభూమయః
క్వేమా బోధ దృశః శాన్తాః క్వ భోగేష్వాత్మబుద్ధయః

(" —530-80)

వికసితనందన వనభూములెచట, పాడు మరుభూము లెచట! శాంతములగు ఈ ఆత్మ జ్ఞాన దృష్టులెచట! భోగ స్థానములగు దేహాదులందాత్మ బుద్ధి ఎచట!

న కించిదపి త్రైలోక్యే యద్రాజ్యమపి వాఞ్ఛతే
సర్వమస్త్యేవ చిత్తత్త్వే తత్కస్మాన్నానుభూయతే

(" —530-81)

ఈ ముల్లోకములందును వాస్తవ సుఖమొకింతైనను లేదు. ఏలయనగా రాజ్యమును బొందియు మనుజుడింకను కోరుచునేయున్నాడు. సమస్తమున్ను (సమస్త సుఖమున్ను) చిదాత్మయందు కలదు. జనులు దానినేల అనుభవించుట లేదు!

ఆత్మనేఽస్తు నమో మహ్యమవిచ్ఛిన్న చిదాత్మనే
లోకాలోకమణే దేవ చిరేణాధిగతోఽస్యహో.

(" —532-90)

అవిచ్ఛిన్న చిదాత్మరూపమైన నా ఆత్మకు నా నమస్కారము. ఓహో! లోకములన్నింటిని మణివలె ప్రకాశింప జేయువాడా! ఓ దేవా! చిరకాలమునకు నీవిపుడు పొంద బడితివి.

మహ్యం తుభ్యమనన్తాయ మహ్యం తుభ్యం శివాత్మనే
నమో దేవాధి దేవాయ పరాయ పరమాత్మనే.

(" —532-91)

అనంతుడవును, శివ (మంగళ) స్వరూపుడవును, దేవాధి దేవుడవును (దృశ్యమునకు) పరమైనవాడవును, పరమాత్మవు నగు నీకు (ఆత్మకు) నా నమస్కారము. నీవు నా ఆత్మవే యగుటచే అట్టి ఆత్మరూపుడనగు నాకు నమస్కారము.

ఏష ఏవ సదాఽన్వేష్యః స్తోత్యో ధ్యాతవ్య ఏవ తు
జరామరణ సంమోహాదనేనో త్తీర్య గమ్యతే.

(" —533-94)

ఈ ఆత్మనే సదా అన్వేషింపవలయును. దీనినే సదా స్తోత్రము చేయవలెను. మఱియు ధ్యానించవలెను. ఏలయనగా దీని నన్వేషించుటచే మనుజుడు జరామరణరూపమగు సంసార మోహమును దాటి వేయుచున్నాడు.

సుఖదుఃఖ క్రియో దేహే మా పతన్తు పతన్తు వా
తుమ్బకో పరిధారాశ్చ కానః క్షతిరుపస్థితా.

(" —535-104)

సొరకాయ బుఱ్ఱపై జలధారలు వచ్చిపడినను, అందలి ఆకాశమునకు ఏ హానియు లేనట్లు, సుఖదుఃఖములు దేహముపై వచ్చిపడుగాక, లేక పడకుండుగాక, దానిచే ఆత్మరూపులమగు మనకేమి హాని!

దీపాఙ్గాతిగతో రజ్జ్వా నాలోకో బధ్యతే యథా
తథా నాయమహం బద్ధః సర్వభావగణాతిగః

(" —535-105)

దీపము యొక్క అంగములగు తైలము, వత్తి, ప్రమిడె-వీనిని దాటిపోయినట్టి దీప ప్రకాశము త్రాటిచే బంధింపబడజాలనట్లు, సమస్త పదార్థ, భావసమూహమును అతిక్రమించి, వానికి అతీతమై యున్నట్టి ఆత్మరూపుడనగు ఈ నేను దేనిచేతను బంధింపబడజాలను.

శరీరే శతధా యాతే ఖణ్డనా కా శరీరిణః
కుమ్భే భగ్నే క్షతే క్షిణే కుమ్భాకాశస్య కా క్షతిః.

(" —535-107)

శరీరము నూఱు వ్రక్కలైనను ఆత్మకు ఏమి హాని? (ఆత్మ ఎట్లు ఖండింపబడును?" ఘటము వ్రక్కలైనను, చిల్లులు పడినను, పూర్తిగ నశించినను, ఘటాకాశమునకు ఏమి హాని! (ఏమి నాశము గల్గును?)

పిశాచక ఇవాదృశ్యో మనో నామోదితం ముధా
జడే తస్మిన్హతే బోధాత్మనః క్షతిరుప స్థితా.

(" —535-108)

అదృశ్యమగు పిశాచము వలె మనస్సే ఈ సంసార రూపమున వ్యర్థముగ ఉదయించినది. జడమగు ఆ మనస్సు ఆత్మజ్ఞానముచే నశింప (ఆ మనస్సు కంటె వేఱై యున్న చేతన రూపులమగు) మనకు ఏమి హాని (నాశము) గల్గును (ఏమియు గలుగదని భావము.)

అన్యో భుఙ్క్తేఽన్య ఆదత్తేఽప్యన్యస్యానర్థ సంకటః
అన్యః పశ్యత్యహో మౌర్ఖ్యం కస్యేయం ఖలు చక్రికా.

(" —536-109)

ఆత్మకంటె వేఱైనవాడు భుజించుచున్నాడు; ఆత్మ కంటె వేఱైనవాడు గ్రహించుచున్నాడు. ఆత్మ కంటె వేఱైన వాడు చూచుచున్నాడు. కాని "నేను భుజించుచున్నాను, నేను గ్రహించుచున్నాను నేను చూచుచున్నాను" అను

ఈ ప్రకారముగ మనుజుడు ఆ భోక్త్రాదులతో తాదాత్మ్యమును పొందుచున్నాడు. ఆహా! ఇట్టి తాదాత్మ్యాధ్యాసరూపమగు అజ్ఞానము ఏ ఇంద్రజాలకుని మాయయో!

వాసనా వివిధా దేహే త్వస్తం చోదయ మేవవా
ప్రయాస్తు నాహ మేతాసు న చైతా మమ కాశ్చన.

(" —536-111)

వివిధములగు వాసనలు దేహమందుదయించుగాక, లేక నశించుగాక! (ఆత్మయగు) నేను వాని యందు లేను, అవి నాకు లేవు.

అహంకార పిశాచోఽయం శరీర తరుకోటరాత్
పరావబోధమన్త్రేణ మయే దానీమపాకృతః

(" —536-112)

శరీరమను చెట్టు యొక్క తొఱ్ఱనుండి ఈ అహంకారమను పిశాచమును ఆత్మజ్ఞానమను మంత్రముచే తొలగించివైచితిని.

జ్ఞాతం జ్ఞాతవ్యమఖిలం దృష్టా ద్రష్టవ్య దృష్టయః
తత్ప్రాప్త మధునా యేన నాప్రాప్తమవ శిష్యతే.

(" —537-113)

తెలిసికొనదగిన దంతయును నేనిపుడు తెలిసికొంటిని. చూడదగిన దంతయును చూచితిని. మఱియు దేనిని పొందిన పిదప పొందదగిన దెద్దియు శేషింపకుండునో, అట్టి యుత్తమ పదార్థము (ఆత్మజ్ఞానము) ను పొందితిని.

స్తుత్యా ప్రణత్యా విజ్ఞప్త్యా శమేన నియమేవ చ
లబ్ధోఽయం భగవానాత్మా దృష్టశ్చాధిగతః స్ఫుటమ్.

(" —537-114)

విష్ణుభగవానుని గూర్చిన స్తుతిచేతను, ప్రణామము చేతను, ప్రార్థన చేతను, మఱియు శమ (ఇంద్రియ నిగ్రహ) నియమముల చేతను ఈ ఆత్మభగవానుడు నాకు సంప్రాప్తించెను. మఱియు స్పష్టముగ (ప్రత్యక్షముగ) గాంచబడెను

దృష్ట ఏవ త్వయీశానే పలాయన పరాయణః
సంపన్నో మదహంకారశ్చౌరః సూర్యోదయే యథా.

(" —537-115)

ఆత్మ స్వరూపుడవగు ఓ దేవా! సూర్యోదయము కాగా దొంగ పరుగెత్తునట్లు, మీ దర్శన (సాక్షాత్కార) మాత్రముచే నా యహంకారము పలాయనమైనది.

అనదభ్యుత్థితే తస్మిన్నహంకారే పిశాచవత్
గతే తిష్ఠామ్యహం స్వస్థో నిర్ఘనస ఇవ ద్రుమః
శామ్యామి పరినిర్వామి జగత్యస్మిన్ప్రబోధవాన్.

(" —537-116)

పిశాచమువలె మిథ్యారూపముగ ఆవిర్భవించిన ఈ యహంకారము తొలగగా, అజగరము (కొండచిలువ) లేని వృక్షవాటికవలె నేను స్వస్థుడనై యున్నాను. మఱియు ప్రబోధముఁజెంది శాంతియుతుఁడనై సుఖముగ ఈ జగంబున నున్నాను.

తస్కరేణోజ్ఝితోఽస్మీతి నివృతోఽస్మి చిరోదయమ్
శైత్యమాభాగతో స్మశ్శాన్తః శాన్తా శామృగ తృష్ణికః
ప్రావృడంబుధర స్నాతః శాన్త దావ ఇవాచలః
(" —537-117)

ఆత్మాపహారియగు అహంకారము నుండి నేనిపుడు విడుదలబొందితిని. కనుకనే ఉత్తమశాంతిని బడయుచున్నాను. మఱియు ఆశయను మృగతృష్ణ శమించుటచే, వర్షముచే శమించిన దావాగ్నిగల పర్వతమువలె నా యంతఃకరణము అత్యంత శీతలమై యొప్పుచున్నది.

నిరహంకార పఙ్కాయ సంప్రసన్నాన్తరాయ చ
మహ్యమానన్ద సరసే తుభ్యమాత్మన్నమో నమః
(" —538-118)

అహంకార పంకరహితమై, అతిప్రసన్నమై, ఆనంద సరోవరమై, బ్రహ్మరూపమైనట్టి నా ప్రత్యగాత్మకు మరల మరల నమస్కారము!

శాన్తేన్ద్రియోగ్రగ్రాహాయ క్షీణ చిత్తార్వవహ్నయే
ఆనన్దాంబుధయే తుభ్యం మహ్యమాత్మన్నమో నమః.
(" —538-119)

శమించిన ఇంద్రియములను క్రూర జలజంతువులు (మొసళ్ళు) గలదియు, చిత్తమను బడబాగ్ని శమించినదియు, ఆనంద సముద్ర రూపమునైన ప్రత్యగాత్మ స్వరూపమునకు నమస్కారము.

మదనానల సంతప్తే శీతేన మనసా మనః
భగ్నమన్తర్మయా తప్తమయ సేవ బలాదయః
(" 538-121)

చల్లని ఇనుముచే (సుత్తి మున్నగువానిచే) కాలిన ఇనుము ఛేదింపబడునట్లు, శమదమాది యుక్తమగు శీతల మనస్సుచే మన్మథాగ్ని సంతప్తమగు ఉష్ణమనస్సును నేనిపుడు బలాత్కారముగ ఛేదించివైచితిని.

ఇన్ద్రియేణేన్ద్రియం ఛిత్వా ఛిత్వా చ మనసా మనః
అహం కృతిమహం కృత్వా ఛిత్వా శేషో జయామ్యహమ్.
(" —538-122)

ప్రత్యగాత్మ తత్పరములగు (అంతర్ముఖములగు) ఇంద్రియములచే బహిర్ముఖ ప్రవృత్తిగల ఇంద్రియములను ఛేదించి అట్లే ఆత్మతత్పరమగు మనస్సుచే దృశ్యతత్పరమగు మనస్సును, పవిత్ర అహంకారముచే దుష్ట అహంకారమును ఛేదించివైచి శేషించిన సన్మాత్ర ప్రత్యగాత్మయగు నేను సర్వోత్తముడనై వెలయుచున్నాను.

భావేనాభావమాచ్ఛిద్య హిత్వా తృష్ణామతృష్ణయా
నిష్పిష్య ప్రజ్ఞయాఽప్రజ్ఞాం జ్ఞోఽజ్ఞః సత్యోఽసితే నమః.
(" —539-123)

ఆత్మభావముచే దృశ్యభావమును ఛేదించి, తృష్ణా రాహిత్యము (సంతుష్టి)చే తృష్ణను పారద్రోలి, ప్రజ్ఞ (వివేకము)చే అవివేకమును పిండివైచి, జ్ఞాతృత్వ అభిమాన

శూన్యమై, కేవలము జ్ఞప్తి (చిద్రూప) మాత్రమై, సత్య స్వరూపమై వెలయుచున్న ఓ నా ఆత్మా! నీకు నమస్కారము.

మనసా మనసి చ్ఛిన్నే నిరహంకారతాం గతే
భావేన గలితే భావే స్వచ్ఛస్తిష్ఠామి కేవలః.

(" —539-124)

శుద్ధ మనస్సుచే అశుద్ధ మనస్సు ఛిన్నమవ, నిరహంకారత్వము కలుగ బ్రహ్మాహంభావముచే దేహాద్యహంభావము నశింప నేనిపుడు కేవల స్వచ్ఛచిదాత్మరూపుడనై వెలయుచున్నాను.

నిర్భావం నిరహంకారం నిర్మనస్క మనీహితమ్
కేవలం స్పన్దశుద్ధాత్మన్యేవ తిష్ఠతి మే వపుః.

(" —539-125)

భావనారహితమై, అహంకార మనోవర్జితమై, ఏ కోర్కెయు లేక నా శరీరమిపుడు కేవలము ప్రాణక్రియామాత్రముతో గూడి శుద్ధాత్మయందు నెలకొనియున్నది.

అభివన్ద్యాథ చాలోక్య చిరమాలిఙ్గ్యసే మయా
కోఽన్యః స్యాత్త్వద్భృతే బన్ధుర్భగవన్భువనత్రయే.

(" —539-126)

ఓ ఆత్మభగవానుడా! నిన్ను దర్శించి, నమస్కరించి చిరకాలము కౌగలించుకొనుచున్నాను. క్షీరోదకమువలె సమరస వృత్తితో అనుభవించుచున్నాను. ముల్లోకము

లందును నీకంటె వేఱుగ పరమప్రియుడగు బంధువు నాకెవడు గలడు!

స్వసత్తాపూరితాశేష విశ్వవిశ్వజనీన భోః
సర్వత్ర లక్ష్యసే నిత్యమధునా క్వ పలాయసే.

(" —539-127)

స్వసత్తచే ప్రపంచమునంతటిని పూరించినవాడవును లోకమునకు హితమొనర్చువాడవునగు ఓ ఆత్మదేవా! నీవు నాకు నిత్యము సర్వత్ర గోచరించుచున్నావు. కాబట్టి నీవెచటికి పారిపోయెదవు?

నమశ్చక్రాబ్జహస్తాయ నమశ్చన్ద్రార్ధ ధారిణే
నమో విబుధనాథాయ నమస్తే పద్మజన్మనే.

(" —540-128)

చక్ర, కమలములను హస్తములందు ధరించినట్టి విష్ణువును, అర్ధచంద్రధారియగు శివుడును, దేవతలకు ప్రభువగు ఇంద్రుడవును, పద్మమునందు జనించిన బ్రహ్మదేవుడవునగు ఓ ఆత్మదేవా! నీకు నమస్కారము!

సైవేహ దేహ భోగాలీ సుభగాపీయ మధ్యమే
అన్తర్న స్వదతే స్వచ్ఛే త్వయి దృష్టే పరావరే

(" —540-130)

ఓ ఆత్మదేవా! సర్వోత్తముడవును. నిర్మలుడవునగు నీవు వీక్షింపబడిన పిదప, ఆ ఈ దేహ. భోగ సమూహములు

మనోహరములై యున్నను నాకిపుడు అంతఃకరణమున రుచించుట లేదు.

మయ్యాత్మని సమే స్వచ్ఛే సాక్షిభూతే నిరాకృతౌ
దిక్కాలాద్య న వచ్ఛిన్నే స్వాత్మన్యేవేహ తిష్ఠసి.
(" —540-131)

ఓ పరబ్రహ్మమా! సమమై, స్వచ్ఛమై, సాక్షీభూతమై నిరాకారమై, దేశకాల వస్త్వాదులచే పరిచ్ఛిన్నము కానిదై నట్టి నా ప్రత్యగాత్మయందే నీవు స్థితుఁడవై యున్నావు. (తద్రూపమే అయియున్నావని భావము)

మనః ప్రక్షోభమాయాతి స్ఫురన్తీన్ద్రియ వృత్తయః
శక్తిరుల్లసతిస్ఫారా ప్రాణాపాన ప్రవాహిని

వహన్తి దేహయన్త్రాణి కష్టాన్యాశావరత్రయా
చర్మమాంసాస్థిదిగ్ధాని మనః సారథిమన్తి చ

అయం సంవిద్వపురహం న కాచిన్నకృతాస్పదః
దేహః పతతు వోదేతు యథాభిమతయేచ్ఛయా.
(" —540-132,133,134)

"మనస్సు మిక్కుటముగ క్షోభించుచున్నది ఇంద్రియ వృత్తులు స్ఫురించుచున్నవి. ప్రాణాపానములను ప్రవహింపజేయు శక్తి విజృంభించుచున్నది. ఆశాపాశమున లాగబడిన చర్మమాంసాస్థిమయ శరీరయంత్రము, మనస్సారథి వలన తోలబడుచున్నది"- వీనితో నాకెట్టి సంబంధము లేదు. ఈ

శరీరముండుగాక, నశించుగాక, ఈ కార్యములకు మూలమగు ఆత్మను గ్రహించితిని. ఇక నాకెట్టి భయము లేదు.

సర్వాతిశాయ సర్వాయ తుభ్యం మహ్యం నమో నమః
తేభ్యోఽపి నమస్తే యే మాం త్వాం ప్రవదన్తి చ.
(" —541-135)

సర్వాతీతుడవును, సర్వ స్వరూపుడవును, మత్స్వరూపుడవును అగు నీకు నమస్కారము. ఈ స్వరూపజ్ఞానమును తెలుపునట్టి వేదాది శాస్త్రములకును, గురువులకును నమస్కారము.

అఖిలానన్త సంభోగ న స్పృష్టా దోషవృత్తిభిః.
జయత్యకృతసంరమ్భా సాక్షితా పరమాత్మనః.
(" —541-136)

సమస్త అనంత భోగ పదార్థములను ప్రకాశింపజేయునదియు, అయినను తత్పదార్థముల యొక్క దోషములచే అంటబడనిదియు. దృశ్యమందు అభినివేశము నొందనిదియు (ఉదాసీనమైనదియు) నగు పరమాత్మ యొక్క సాక్షిత్వము సర్వోపరిగా వెలయుచున్నది

జహి మానం మహాకోపం కాలుష్యం క్రూరతాం తథా
న మహాన్తో నిమజ్జన్తి ప్రాకృతే గుణసంకటే.
(" —541-139)

ఓ జీవుడా! నీవు అభిమానమును, మహాకోపమును, కలుషత్వమును, క్రూరత్వమును విడనాడుము. వెలయునిన,

మహాత్ములు సంకటదాయకములైన పామరగుణములందెన్నటికిని నిమగ్నులు కారు.

తే ప్రయాతాః సమారమ్భా గతాస్తే దగ్ధవాసరాః
యేషు చిన్తానలజ్వాలాజలాకీర్ణో భవానభూత్

(" —541-141)

ఏనియందు నీవు చింతయను అగ్నిజ్వాల సమూహముచే వ్యాప్తమై యుంటివో, అట్టి సమారంభము లిపుడు గతించిపోయినవి; అట్టి పాడు రోజులిపుడు గడచిపోయినవి.

అద్యేన్ద్రియదురశ్వాంశ్చ జిత్వా జితమనోగజః
భోగారిమభితో భఙ్క్త్వా సామ్రాజ్యమధితిష్ఠసి

(" —542-142)

నీ విపుడు ఇంద్రియములను దుష్ట అశ్వము (గుఱ్ఱము) లను, మనస్సను మదగజమును జయించి భోగములను శత్రువులను నలువైపుల వధించి వైచి ఆత్మ సామ్రాజ్యమును అధిష్ఠించి యున్నావు.

త్వయి స్థితే మయి విగతామయాత్మని
స్వసంస్థితౌ వ్యపగత రాగరఞ్జనే
క్వ బన్ధనం క్వ చ విపదః క్వ సంపదో
భవా భవౌ క్వ శమముపైమి శాశ్వతమ్.

(" —542-143)

ఓ ఆత్మదేవా! దుఃఖరహితుఁడవును, స్వయంస్థితుఁడవు (అన్యాధార రహితుఁడవు)ను, రాగద్వేషాది వికార శూన్యుఁ

డవునగు నీతో అభిన్నమగు రూపమున నేను స్థితిగల్గియుండ (నీవు నేనై యుండ) ఇక నాకు బంధనమెచట! విపత్తులెచట! సంపదలెచట! జనన మరణము లెచట? కాబట్టి శాశ్వతమగు సుఖ విశ్రాంతిని నేనిపుడు పొందుచున్నాను.

ఏకస్మిన్విద్యమానే హి కుతః శోకః కుతః క్షతిః
కుతో దేహః క్వ సంసారః క్వస్థితిః క్వ భయాభయే.

(" —547-164)

ఒకే పరమాత్మ ఉండియుండ (మఱియు ఆ పరమాత్మ నేనై యుండ) ఇక దుఃఖమెచట, నాశమెచట, దేహమెచట, సంసారమెచట, దృశ్య స్థితి ఎచట, భయమెచట. అభయమెచట?

కిం తత్ప్రాప్యం ప్రధానం స్యాద్యద్విశ్రాన్తౌ న శోచ్యతే.
యత్ప్రాప్య జన్మనా భూయః సంబన్ధో నోపజాయతే.

(" —576-5)

దేనియందు విశ్రమించుటచే జీవుడు మరల ఎన్నటికిని దుఃఖము నొందడో, దేనిని పొందుటచే మనుజునకు మరల జన్మతో సంబంధము కలుగదో, అట్టి పొందదగిన ప్రధానమైన వస్తువేది?

కదాహం త్యక్తమననే పదే పరమపావనే
చిరం విశ్రాన్తి మేష్యామి మేరు శృఙ్గ ఇవామ్బుదః

(" —576-6)

మేరు పర్వత శిఖరముపై మేఘమువలె, నేనతి పవిత్రమై మనోవ్యాపార రహితమైనట్టి ఉత్తమ పదమున (ఆత్మయందు) చిరకాల మెపుడు విశ్రమింతునో?

కదా బహులకల్లోలాం నావా పరమయాధియా
పరితీర్ణో భవిష్యామి మత్తాం తృష్ణా తరఙ్గిణీమ్.

(" —576-7)

అతి కల్లోలయుతమై అజ్ఞానముచే ప్రవర్ధమానమైనట్టి తృష్ణయను నదిని, మిగుల ఉత్తమ బుద్ధియను నౌకచే నేనెపుడు తరింతునో?

కదేమాం జాగతైరూప్తైః క్రియమాణా మసన్మయీమ్
క్రియామ సహసిష్యామి బాలలీలామివా కులామ్.

(" —576-8)

లోకమందలి ప్రాణికోట్లొనరుప ఈ అసత్క్రియలను చపల బాలకుని లీలవలె గాంచి నేనెపుడు నవ్వెదనో?

కదోదితవపుర్భాసా విహసజ్జాగతీర్గతీః
అన్తః సంతోషమేష్యామి విరాడాత్మేవ పూర్ణధీః

(" —577-9)

ఆత్మ స్వరూప ప్రకాశముచే ప్రాపంచిక గతిని జూచి నవ్వుచు పూర్ణబుద్ధిగల్గి బ్రహ్మాండ శరీరధారియగు విరాట్పురుషునివలె నా యంతఃకరణమున ఎపుడు సంతుష్టిని బడయుదునో!

అన్తః సమసమాకారః సౌమ్యః సర్వార్థ నిస్పృహః
కదోపశమ మేష్యామి మన్థముక్తామృతాబ్ధివత్

(" —577-10)

అంతఃకరణమున సమరూపము గల్గి పరమాత్మతో ఏకత్వము నొంది, శాంతుడనై సమస్త పదార్థములందును కోరిక లేనివాడనై మందరాచలము లేని క్షీరసముద్రమువలె ఎపుడు శాంతి నొందెదనో!

నబాహ్యాభ్యన్తరం సర్వం శాన్తకల్పనయా ధియా
పశ్యంశ్చిన్మాత్ర మఖిలం భావయిష్యామ్యహం కదా.

(" —577-11)

కల్పనలన్నియు శమించినట్టి బుద్ధిచే బాహ్యాభ్యంతర జగత్తునంతను చిన్మాత్రముగ వీక్షించుచు, అట్టి చిన్మాత్ర భావనచే సుస్థిరుడ నెపుడగుదునో!

కదోపశాన్తమననో ధరణీధర కన్దరే
స మేష్యామిశిలాసామ్యం నిర్వికల్పసమాధినా.

(" —577-12)

మనోవ్యాపార రహితుడనై పర్వత గుహయందు నిర్వికల్ప సమాధిచే శిలాసాదృశ్యమును నేనెపుడు పొందుదునో!

కదా మే మాన మాతఙ్గః స్వాభిమానమహామదః
సత్త్వావబోధహరిణా హతో నాశముపైష్యతి.

(" —577-13)

దేహాభిమానమను మహామదముగల నా యహంకారమను గజము పరమార్థ సన్మాత్ర జ్ఞానమను సింహముచే వధింపబడి ఎపుడు వినాశమొందునో!

నిరంశధ్యాన విశ్రాన్తేర్మూకస్య మమ మూర్ధని
కదా తార్ణం కరిష్యన్తి కులాయం వన ఘూర్ణికాః

(" 577-14)

నిర్వికల్ప ధ్యానమున విశ్రాంతి నొంది, మౌనవ్రతావలంబినై యున్న నా శిరముపై వనమందలి పక్షులు తృణములచే గూటిని ఎపుడు నిర్మించుకొనునో!

అయి మూర్ఖమనః కోఽర్థస్తవ సంసారవృత్తిభిః
ధీమన్తో న నిషేవన్తే పర్యన్తే దుఃఖదాః క్రియామ్

(" —578-18)

ఓ మూర్ఖమనస్సా! ఈ సంసార వృత్తులచే నీ కేమి ప్రయోజనము? అంతమున దుఃఖమును గలుగజేయు క్రియను బుద్ధిమంతు లెన్నటికిని చేయరు గదా!

అనుధావతి యో భోగాంస్త్యక్త్వా శమరసాయనమ్
సంత్యజ్య మన్దారవనం సయాతి విషజఙ్గలమ్.

(" —578-19)

ఎవడు శాంతి (ఇంద్రియ మనంబుల శమనము) అనెడు అమృతమును వదలి విషయ భోగముల వైపునకు పరువిడునో అతడు మందార వనమును త్యజించి విషవృక్షములతో గూడిన అరణ్యము వైపునకు బోవువాడే యగును.

యది యాసి మహీరన్ధ్రం బ్రహ్మలోకమథాపి వా
తన్న నిర్వాణమాయాసి వినోపశమనామృతమ్.

(" —578-20)

ఓ మనస్సా! నీవు పాతాళమున కేగినను, లేక బ్రహ్మలోకమున కేగినను, శాంతి (ఇంద్రియ మనంబుల శమనము) అనెడు అమృతము లేనిచో ఎచటను కూడ నీవు నిర్వాణమును (నిరతిశయ సుఖ విశ్రాంతిని) బొందజాలవు.

ఆశాశతాపపూర్ణత్వే త్వమేవం సర్వదుఃఖదమ్
త్యక్త్వా యాహి పరం శ్రేయః పరమేకాన్తసున్దరమ్.

(" —579-21)

ఓ మనస్సా! ఈ ప్రకారముగ అనేక ఆశలచే పూర్ణమై యుండునపుడు నీవు మహా దుఃఖమునే కలుగజేతువు. కాబట్టి ఇక నుండి నీవు భోగాశలను త్యజించి నిర్దుఃఖ నిరతిశయానంద రూపమగుటచే పరమ సుందరమైనట్టి మహా శ్రేయమైన మోక్షమును బొందుము.

ఇమా విచిత్రాః కలనాభావా భావమయాత్మికాః
దుఃఖాయైవ తవోగ్రాయ న సుఖాయ కదాచన.

(" —579-22)

ఇష్టసంపత్తి, అనిష్ట నివారణములతో కూడిన ఈ పలువిధ విషయములన్నియును నీకు మిగుల దుఃఖమునే కలుగజేయును గాని సుఖమెన్నటికిని గాదు.

మనోమణ్డూకికే వ్యర్థమియన్తం కాలమన్ధయా
భ్రమన్త్యా భువనం క్షిప్రం కిం సమాసాదితం త్వయా.

(" —579-23)

ఓ మనస్సను మండూకమా! (కప్ప)! వ్యర్థముగ ఇంత కాలము నీవీ ప్రపంచమంతటను గ్రుడ్డిగ సంచరించుచు తుదకు ఏమి పొందగలిగితివి?

యస్మాత్కించిదవాప్నోషి యస్మిన్వహసి నిర్వృతిమ్
తస్మింశ్చేతః శమే మూర్ఖనామ బధ్నాసి కిం పదమ్.

(" —579. 24)

ఓ మూర్ఖ చిత్తమా! దేని వలన నీవు అవాఙ్మానసమగు సద్వస్తువును పొందగలవో, దేనియందు నీవు నిరతిశయ సుఖమునుబడయగలవో అట్టి శమము (సర్వదృశ్య వృత్తి రహిత సమాధి) కొఱకై ఏల ప్రయత్నింపక యున్నావు?

అగత్య శ్రోత్రతాం మూర్ఖ వ్యర్థోత్థానేప బృంహితామ్
ధియా శబ్దానుసారిణ్యా మృగవన్మా క్షయం వ్రజ.

(" —579-25)

ఓ మూర్ఖమనస్సా! వ్యర్థ బహిర్ముఖత్వముచే వృద్ధినొందిన శ్రోత్రేంద్రియముతో తాదాత్మ్యమొంది శబ్దానుసారిణియగు బుద్ధిచే—బోయవానిగానముచే విమోహమొందిన లేడివలె నీవు క్షయము నొందకుము.

త్వక్తామాగత్య దుఃఖాయ స్పర్శోన్ముఖతయా ధియా
మూర్ఖమా బద్ధతామేహి గజీలుబ్ధ గజేన్ద్రవత్.

(" —580-26)

ఓ మూర్ఖ చిత్తమా! స్పర్శోన్ముఖమగు బుద్ధిచే త్వగింద్రియత్వమును దుఃఖార్థమే పొందినదానవై, ఆడ ఏనుగును గూర్చిన లోభముచే బంధనమందు తగుల్కొనిన మగ ఏనుగువలె—నీవు బంధమును బొందకుము.

రసనాభావమాగత్య గన్ధేనాన్న దురన్తసామ్
మా నాశమేహి బడిశపిణ్డీలమ్పట మత్స్యవత్.

(" 580-27)

ఓ గ్రుడ్డిమనస్సా అల్పరసనేంద్రియరూపమును బొంది దుష్టభోజనముల మెడలి ఆశచే—గాలమందలి ఎరను గూర్చిన ఆశచే నశించు మత్స్యమువలె వినాశమును బొందకుము.

చాక్షుషీం వృత్తిమాశ్రిత్య ప్రభారూపచయోన్ముఖీమ్
మాగచ్ఛ దగ్ధతాం ముగ్ధ కాన్తిలుబ్ధపతఙ్గవత్.

(" —580-28)

ఓ ముగ్ధమానసమా! ప్రకాశసంబంధములగు నానావిధ రూపములనై పునకు బయిడు నేత్రవృత్తి నాశ్రయించి—రూపముయొక్క లోభముచే అగ్నియందుపడి భస్మమైపోవు మిడతవలె—దగ్ధము కాకుము.

ఘ్రాణమార్గముపాశ్రిత్య శరీరామ్భోజ కోటరే
గన్ధోన్ముఖతయా బన్ధం మాత్వం సంశ్రయ భృఙ్గవత్.

(" —580-29)

ఓ మనస్సా! ఘ్రాణేంద్రియము నాశ్రయించి గంధమును గూర్చిన ఆశచే, శరీరమను పద్మగర్భమున-పద్మమందు తుమ్మెదవలె-నీవు బంధనమును బొందకుము.

కురఙ్గాలిపతఙ్గేభ మీనాస్త్వేకైకశో హతాః
సర్వైర్యుక్తైరనర్థైస్తు వ్యాప్తస్యాజ్ఞ కుతః సుఖమ్.

(" —580-30)

అజ్ఞానివగు మనస్సా! ఈ ప్రకారముగ లేడి, తుమ్మెద, మిడుత, ఏనుగు, చేప-ఇవియన్నియు ఒక్కొక్క ఇంద్రియము యొక్క అనర్థముతో గూడియుండునపుడు హతమైపోయినవి. ఇక పంచేంద్రియముల యొక్కయు అనర్థములతో (అనర్థసాధనములగు శబ్దాదులతో) గూడి యుండువానికి సుఖమెచట?

హే చిత్తవాసనాజాలం బన్ధాయ భవతోహితమ్
స్వాత్మనః సహజః ఫేనస్తతః కుకృమిణా యథా

(" —581-31)

ఓ చిత్తమా! పట్టుపురుగు సహజమగు తన చొంగను కోశరూపముగ విస్తరింపజేసి తన బంధమును తానే కలిగించుకొనునట్లు, నీవున్ను వాసనా సమూహమును నీ బంధము కొఱకే నిర్మించుకొంటివి.

శరదభ్రవదాగత్య శుద్ధిం త్యక్తభవామయామ్
యది శామ్యసి నిర్మూలం తదనన్తో జయస్తవ.

(" —581-32)

ఓ చిత్తమా! మొట్ట మొదట (నిష్కామకర్మ, ఉపాసనాదులద్వారా) శరత్కాల మేఘమువలె నీవు శుద్ధిని బొంది, పిమ్మట శ్రవణాదుల పరిపాకమువలన జ్ఞానోదయముచే సమూలముగ (అజ్ఞాన సహితముగ) శమించిపోవుచో, అత్తఱి నీకు అనంత జయము కలుగును.

క్షయోదయదశాధాత్రీం పర్యన్త పరితాపినీమ్
జానన్నపి జగత్సృష్టిం న త్యక్ష్యసి వినంక్ష్యసి.

(" —581-33)

జనన, మరణ దారిద్ర్యాది దశలతో గూడినదియు, అంతమున మహా దుఃఖమును గలుగజేయునదియునగు ఈ జగత్తుయొక్క ప్రవృత్తి నెఱిఁగియు నీవు దానిని వదలనిచో, నశించిపోదువు.

యావత్తానవమాయాతం శుద్ధం చిత్తం విచారతః
తావత్తత్క్షీణమేవాహం మన్యే శారదమేఘవత్.

(" —581-34)

శుద్ధచిత్తము విచారణద్వారా వాసనాక్షయమువలన ఎంతెంత సూక్ష్మత్వమును బొందునో, అంతంత అయ్యది శరత్కాల మేఘమువలె క్షీణమైనదనియే నేను తలంచుచున్నాను.

తస్మాత్సంక్షీయమాణత్వాత్త్యజామి త్వామసన్మయమ్
మౌర్ఖ్యం పరమమేవాహుః పరిత్యాజ్యానుశాసనమ్.

(" —581-35)

కావున ఓ చిత్తమా! క్షయశీలమగుటచే అసన్మయమగు నిన్ను నేను త్యజించివైచుచున్నాను. (ఇక నీకు ఉపదేశించుట వ్యర్థమేయగును వలయునిన) ఏది పరిత్యజింపదగినదో, దానికి ఉపదేశము చేయుట పరమ మూర్ఖత్వమని యే చెప్పబడినది.

నిర్వికల్పోఽస్మి చిద్దీపో నిరహంకారవాసనః
త్వయాహంకారబీజేన న సంబద్ధోఽస్మ్యసన్మయ.

(" —581-36)

అసద్రూపమగు ఓ చిత్తమా! నేను నిర్వికల్పుడను, అహంకారవాసనా రహితుడను, చిదాత్మదీపుడను, అహంకార బీజమగు నీతో (ఆత్మనగు) నాకు ఏ సంబంధమున్న లేదు. (ఆత్మతో అహంకారాదులకు సంబంధము లేదని ఎఱుగుటయే వాని త్యాగమని భావము.)

అనన్తస్యాత్మతత్త్వస్య తన్వీతి మనసి స్థితిః
న సంభవతి బిల్వాన్తర్వాసితా దన్తినోర్యథా

(" —582-37)

బిల్వ (మారేడు) ఫలమందు ఏనుగులజంట పట్టనట్లు, అనంతమగు ఆత్మతత్త్వమునకు పరిచ్ఛిన్నమైన మనస్సునందు దేహాద్యహంభావ రూపమున పరిచ్ఛిన్నస్థితి సంభవింపనేరదు.

పాదాఙ్గుష్ఠాచ్ఛిరో యావత్కణశః ప్రవిచారితమ్
న లబ్ధోఽసావహం నామకః స్యాదహమితి స్థితః.

(" —582-38)

కాలిబొటనవ్రేలు మొదలుకొని శిరస్సువఱకు ఈ నా ఉపాధియందలి ప్రతిముక్కను బాగుగ విచారించి చూచితిని; కాని 'నేను' అనదగిన పదార్థమేదియు అచట నాకు లభించ లేదు. అట్టిచో ఈ 'నేను' ఎవరు?

భరితాశేషదిక్కుక్షిం యత్స్వాత్మమేకం జగత్త్రయే
సంవేదన మసంవేద్యం సర్వత్ర విగలాత్మకమ్.

(" —582-39)

దిక్కులన్నిటిని పూరించి వ్యాపించియున్నదియు, ముల్లోకములందును ఏకమై వెలయునదియు, అవస్థాత్రయ రూప దృశ్య రహితమైనదియు, సర్వత్ర అన్య (దృశ్య) పదార్థరూప వర్జితమైనదియు (అనగా, దేశకాల వస్తుకృత పరిచ్ఛేద శూన్యమైనదియు)నగు చిద్రూప ఆత్మనే నేను.

వేదత్వాం స్వసంవేద్యమాతరం దుఃఖకారణమ్
వివేకజేన బోధేన తదిదం హన్యసే మయా.

(" —582-40)

ఓ మనస్సా! నేను చిద్రూపాత్మనగుటంబట్టి, సాక్షియగు నాకు దృశ్యమైనట్టి నిన్ను నేనెఱుగుచున్నాను. (చూచుచున్నాను) మఱియు దుఃఖకారణమైనట్టి నిన్ను వివేకజనితమగు (ఈ క్రింది) బోధచే చంపివైచుచున్నాను.

ఇదం మాంసమిదం రక్తమిమాన్యస్థీని దేహకే
ఇమే తే శ్వాసమరుతః కోఽసావహమితి స్థితః.

(" 583-41)

ఈ దేహమందు 'ఇది మాంసము, ఇది రక్తము, ఇవి ఎముకలు, ఇవి ప్రాణవాయువులు, (ఇవి జడములగుటచే నేను కాదు)—ఇకనిచట 'నేను, అనురూపముననున్న దెవరు?

స్పన్దోహివాతశక్తినామవబోధో మహాచితః
జరామృతిశ్చకాయేఽస్మిన్కోఽసావహమితి స్థితః
(" —583-42)

ఈ దేహమునగల సంచలనశక్తి ప్రాణవాయువులది; ఇందుగల జ్ఞానము మహా చైతన్యమునకు సంబంధించినది. జరామరణాద్యవస్థలు శరీరమునకు జెందినవి ఇక ఇందు అహంభావ రూపమున ఏది కలదు?

యథా భూతతయా నాహం మనో న త్వం న వాసనా
ఆత్మా శుద్ధిచిదాభాసః కేవలోఽయం విజృమ్భతే.
(" —583-43)

ఓ చిత్తమా! యథార్థముగ విహరించిన మనస్సు నేను గాను, నీవు (చిత్తము) నేనుగాను; వాసన నేనుగాను; ఈ అహంకారాదులు వేనిచేతను అంటబడక కేవలము సాక్షీ రూపమున విజృంభించుచున్న ప్రకాశరూపమగు శుద్ధ చిదాత్మనే నేను.

అహమేవేహ సర్వత్ర నాహంకించిదపీహ వా
ఇత్యేవ సన్మయీ దృష్టిర్నేతరో విద్యతే భ్రమః
(" —583-44)

"(ఆరోపదృష్టిచే) ఈ జగత్తంతయు ఆత్మరూపుడగు నేనే అయియున్నాను. (అపవాదదృష్టిచే) ఈ జగత్తు ఒకింతయు నేనుగాక నేయున్నాను"—ఇదియే సత్యదృష్టి. ఇతర భ్రమము (దేహమాత్ర పరిచ్ఛిన్నాహంభావ రూపమగు ఇతర అహంకార భ్రమము) ఎద్దియు నిచట లేదు.

దిష్ట్యైదానీం పరిజ్ఞాతో మయైవాజ్ఞాన తస్కరః
పునర్న సంశ్రయా మ్యేనం స్వరూపార్థాపహారిణమ్.
(" —584-45)

కాని సౌభాగ్యవశమున ఇప్పుడీ యజ్ఞానమను చోరుని నేను కనుగొంటిని. పరమార్థమగు ఆత్మధనము నపహరించు నట్టి వీనిని నేనిక యాశ్రయింపను.

నిర్దుఃఖో దుఃఖయోగ్యస్య నాహం తస్య న చైవ మే
కశ్చిద్భవతి శైలస్య తత్స్థ ఏవ యథామ్బుదః
(" —583-46)

పర్వతముపైనున్న మేఘముతో పర్వతమున కేమియు సంబంధము లేనట్లు, దుఃరహితుడనగు నాకు దుఃఖయోగ్యములగు అహంకార చిత్తాదులతో ఏమియు సంబంధము లేదు. నేను వానికి చెందకయున్నాను. అవి నాకు చెందకయున్నవి.

మృగతృష్ణా భ్రమేణైషా భావనా వ్యర్థభావినీ
భావస్తస్యామసత్యాయాం యః సోఽయమితి సంభ్రమః
(" —584-47)

ఈ ప్రకారముగ దేహేంద్రియాదులందలి వ్యర్థ 'అహం' భావన ఏది గలదో అది మృగతృష్ణవలె మిథ్యయే యగును. అట్లు ఆ భావన మిథ్యకాగా ఈ దేహాదులు 'నేను' అనుభావము భ్రాంతిమాత్రమే యగుచున్నది. (కాబట్టి దేహాదులందలి అహంభావము సర్వథా త్యజింపదగినదని అర్థము)

వాసనారహితం కర్మ క్రియతే నను చిత్త హే
కేవలం నానుభూయన్తే సుఖ దుఃఖదృశోఽగ్రగాః

(" —584-48)

ఓ చిత్తమా! వాసనా రహితముగ కర్మచేయబడుచో, తత్కాలమునందలిగాని భావికాలమునందలిగాని సుఖ దుఃఖములెల్లియు అనుభవింపబడ నేరవు.

తస్మాన్మూర్ఖాణీన్ద్రియాణి త్యక్త్వా సర్వాసనాం నిజామ్
కురుధ్వం కర్మ హే సర్వం న దుఃఖం సమవాప్స్యథ

(" —584-47)

కాబట్టి ఓ మూర్ఖ ఇంద్రియములారా! మీరు అంతరంగమున మీ వాసనను త్యజించి సమస్త కర్మలం జేయుడు. అట్టిచో మీరు దుఃఖము నేమియు పొందకయుందురు.

భవద్భి రేవ దుఃఖాయ వాసనా వాసితా ముధా
బాలైః పఙ్కక్రీడనకం వినాశేనేవ ఖిన్నతా.

(" —584-50)

ఓ ఇంద్రియములారా! బాలురు మట్టితో ఆట బొమ్మను జేసి దాని వినాశముచే దుఃఖించునట్లు, మీరున్ను (విషయములను సముపార్జించుచు, వాని నాశముచే దుఃఖించుచు ఈ ప్రకారముగ) వ్యర్థముగ దుఃఖముకొఱకే ఈ వాసనను కల్పించుకొనిరి.

తృష్ణ యైవ వినష్టాః స్థ వ్యర్థ మిన్ద్రియ బాలకాః
కోశకారకు కృమయ స్తన్తునేవ స్వయం భువా.

(" —584-51)

ఓ ఇంద్రియములను బాలకులారా! పాడు పట్టు పురుగులు తనుచే నిర్మితములైన దారములచే తామే నశించునట్లు, మీరున్ను మీచే నిర్మింపబడిన తృష్ణచే వ్యర్థముగ నశించి పోవుచున్నారు.

విషయ విషవిషూచికా మనన్తాం
నిపుణమహం స్థితి వాసనామ పాస్య
అభిమత పరిహార మన్త్రియుక్త్యా
భవ విభవో భగవాన్భియామ భూమిః (" —585-53)

ఓ చిత్తమా! సర్వశాస్త్రములకు, తత్త్వజ్ఞులకు అభిమతమైనట్టి ద్వైతవాసనా పరిహారము అభిలషిత విషయత్యాగము, అను మంత్రయుక్తిచే అసంఖ్య దుఃఖదాయకమైనట్టి విషయరూప విషవిషూచిక (మహామారి)ను, అహంకార వాసనను నైపుణ్యముతో తొలగించి, తొలగిన సంసా

రము గలదానవై, మరణాది సమస్త భయములకు అవిషయ మైనట్టి భగవంతుఁడగు ఆత్మవుకమ్మా.

తత్కృతేభ్యో విచారేభ్యోఽను భూతేభ్యోఽపి భూరిశః
భూయోఽప్యను భవత్యన్త రహం హి చిదలేపికా.

(" —585-55)

జాగ్రత్తునందు మనస్సు, అనేక విషయ విచారములను గావించు చున్నది; అనేక విషయముల ననుభవించుచున్నది. తిరిగి స్వప్నమందు వాసనామయములగు అనేక విషయముల ననుభవించుచున్నది. కాని ఆ మనోబుద్ధ్యాహంకారాదులచే చేయబడినదానితోఁగాని, అనుభవింపబడిన దానితోఁగాని నాకే సంబంధమున్ను లేదు. ఏలయనిన, నేను నిర్లేపమగు చిదాత్మనే గాని మనోబుద్ధ్యాదులను గాను.

స దుర్భావే పరచితాం దేహః సంసారసంస్థితమ్
గృహ్ణాత్వథ త్యజతు వాప్యహం హి చిదలేపికా.

(" —586-56)

దేహము (ఉపాధి) తన దుర్భావములచే రచించిన ఈ సంసార స్థితిని గ్రహించుగాక, లేక త్యజించుగాక! నాకు దానితో ఏ సంబంధమున్ను లేదు; ఏలయనిన నేను నిర్లేపమగు చిదాత్మను.

చితో న జన్మ మరణే సర్వగాయాశ్చితేః కిల
కిం నామ మ్రియతే జన్తుర్మార్యతే కేనవాపి కిమ్

(" —586-57)

చిదాత్మకు జననమరణములు లేవు. సర్వవ్యాపకమై చిద్రూపమై యుండు అద్దానియందు చచ్చునదేమి! కాబట్టి ఆత్మరూపుఁడగు మనుజుఁడిక దేనిచే చంపబడును. అతనియందు చచ్చునదేమి!

జీవ్యతే మ్రియతే చేతి కులికల్పక మాలినీ
కలనా మనసా మేవ నాత్మనో విమలాత్మనః

(" —586-58)

"జీవించుచున్నది, మరణించుచున్నది" — ఇత్యాది కుకల్పన మనస్సునకే గాని, నిర్మలమగు ఆత్మకుగాదు. (జీవన మరణములు మనస్సు)

ఏవం బ్రహ్మాత్మకమిదం యత్కించిజ్జగతి స్థితమ్
స ఏవాస్మి తదేవాస్మి పరిశోచామి కిం ముధా.

(" —587-61)

ఇవ్విధముగ జగత్తంతయును బ్రహ్మాత్మకమే అయి యున్నది. అట్టి సత్స్వరూపుఁడనే యగు నేనేల వ్యర్థముగ శోకింపవలెను? ఏలయనిన, ఇపుడు నేనద్వైత సామ్రాజ్యమున స్థితుఁడనై యుంటిని.

ఆత్మనో వ్యతిరేకేణ న కించిదపి విద్యతే
సర్వం బ్రహ్మేతి మే తత్త్వమే తత్తద్భావయామ్యహమ్

(" —587-65)

ఆత్మకంటె వేఱుగ ఒకింతైనను ఏమియు లేదు. అంతయు

బ్రహ్మమే (ఆత్మయే) — ఇది నాకు అనుభవసిద్ధమైన విషయము. కాబట్టి అట్టి తత్త్వమునే నేను భావించుచున్నాను.

అహంకార భ్రమస్యాస్య జాతస్యాకాశ వర్ణవత్
అపునః స్మరణం మన్యే నూనం విస్మరణం వరమ్.

(" —587-66)

ఆకాశమందలి నీలవర్ణమువలె మిథ్యారూపమున ఆవిర్భవించిన ఈ భ్రమరరూపమగు అహంకారమును మరల ఎన్నటికిని జ్ఞాపకము రాకుండులాగున బాగుగ మఱచిపోవుటయే ఉత్తమమని నేను తలంచుచున్నాను.

ప్రాక్పురస్తాచ్చ సర్వాణి సన్తి వస్తూని నాభితః
మధ్యే స్ఫుటత్వమేతేషాం కైవాస్థా హతరూపిణీ.

(" —588-70)

ఉత్పత్తికి పూర్వమున్ను, వినాశానంతరమున్ను సర్వత్ర (స్థూల సూక్ష్మాది) ఏ పదార్థములున్ను లేకయే యున్నవి. మధ్యకాలమున మాత్రము, అయ్యవి స్ఫుటముగ గోచరించుచున్నవి. అట్టి క్షణిక పదార్థములయెడల నాశనమైన (పాడు) విశ్వాసమేమి?

సంకల్పపాదపం దృష్ణాలతం ఛిత్త్వా మనోవనమ్
వితతాం భువమాసాద్య విహరామి యథాసుఖమ్.

(" —591-83)

ఆత్మాకారణమున నేనిపుడు సంకల్పములను వృక్షములతో కూడినదియు, తృష్ణయను లతలు గల్గియున్నదియునగు

మనస్సను అరణ్యమును ఛేదించివైచి, విశాలమగు ఆత్మభూమిని బొంది సుఖముగ విహరింతును.

నాహం దేహ ఇతిత్యస్మిన్యుక్తి మాకర్ణయత్రమే
సర్వాఙ్గేష్వపి సత్స్వేవ శవః కస్మాన్న వల్గతి.

(" —591-84)

"నేను దేహమునుగాను" — అను ఈ సత్యమును ఋజువు చేయునట్టి యుక్తిని వినుము - అవయవములన్నియు ఉన్నప్పటికిని శవము ఏల గమనాది వ్యవహారమును సలుపుట లేదు!

తస్మాద్దేహదతీతోఽహం నిత్యోఽనస్త మితద్యుతిః
యః సజ్ఞం భాస్వతా ప్రాప్యవేద్మి వ్యోమని భాస్కరమ్.

(" —591-85)

కాబట్టి నేను దేహమునను అతీతుడనై, సదా అస్తమింపని ప్రకాశముగలవాడనై, సర్వవ్యాపినగుటచే సూర్యమండలమందును ఉండుటంబట్టి, సూర్యుని సాంగత్యమును బొంది ఆకాశమున ఆ సూర్యునెఱుంగుచున్నాను. అట్టి సర్వవ్యాపకమగు చిద్రూపాత్మనే నేను.

నాజ్ఞోఽహం న చమే దుఃఖం నానర్థో న చ దుఃఖితా
శరీరమస్తు మా వాస్తు స్థితోఽస్మి విగతజ్వరః

(" —591-86)

నేను అజ్ఞుడనుగాను, నాకు దుఃఖములేదు, అనర్థము లేదు, శరీరముండుగాక, లేకుండుగాక, నేను మాత్రము

(దేహాతీతుఁడనగు ఆత్మనగుటచే) సంతాపరహితుఁడనై యున్నాను.

> ఇదానీమస్మ్యసంబద్ధో మనో దేహేన్ద్రియాదిభిః
> పృథక్కృతస్య తైలస్య తిలైర్విగలనైరివ.
>
> (" —592-88)

నువ్వులనుండి వేఱుచేయబడిన నూనె ఆ నువ్వులతో సంబంధము లేక యుండునట్లు, నేనిపుడు (నాకంటె వేఱై యున్న) మనో దేహేంద్రియాదులతో సంబంధము లేక యున్నాను.

> స్వస్మాత్పదవరాదస్మా ల్లీలయా చలితస్య మే
> పృథక్కృతమతేః కిం చ పరివారో హ్యయం శుభః
>
> (" —592-89)

ఈ నా యొక్క ఉత్తమ ఆత్మ పదమునుండి (ప్రారబ్ధ కర్మ భోగార్థము) లీలామాత్రముగ చలించినట్టియు, దేహేంద్రియ చిత్తాదులనుండి వేఱుగావింపబడినట్టియు నాకు ఈ దేహేంద్రియాదులు శ్రేష్ఠపరివారమువలె వినోద హేతువులై యున్నవి.

> చిత్రమేషోఽస్మి లబ్ధాత్మా జాతః కాలేన కార్యవాన్
> ఏష సోఽవా మనన్తాత్మా నాన్తోఽస్య పరమాత్మనః
>
> (" —616-43)

ఆహా! ఎంత ఆశ్చర్యము! చిరకాలమునుండి నేనాత్మను పొందియున్నను నేఁడు మాత్రమే పరమ పురుషార్థ

లాభయుతుఁడనైతిని. ఈ నేను అనంతరూపుఁడగు ఆత్మనే అయియున్నాను. ఈ పరమాత్మ కంతమే లేదు.

> అహో త్వహం ప్రబుద్ధోఽస్మి గతం దుర్దర్శనం మమ
> దృష్టం ద్రష్టవ్యమఖిలం ప్రాప్తం ప్రాప్యమిదం మయా
>
> (" —618-53)

ఆహా! ఇపుడు నేను జ్ఞానవంతుఁడనైతిని. నా దుర్దృష్టి (శరీరాదులందాత్మ దృష్టి) తొలగిపోయినది. చూడదగినది యంతయు నేను జూచితిని. పొందదగినదియంతయు పొందితిని.

> కిం సుఖం కిం ను వా దుఃఖం సర్వం బ్రహ్మేదమాతతమ్
> అహమాసం ముధా మూఢో దిష్ట్యా మూఢోఽస్మ్యహం స్థితః
>
> (" —618-55)

సుఖమేమి? దుఃఖమేమి? ఇదియంతయు వ్యాపకమగు బ్రహ్మమేయగును, ఇంతకాలము నేను వ్యర్థముగ మూఢుఁడనై యుంటిని. ఇపుడు సౌభాగ్యవశమున జ్ఞానవంతుఁడనైతి.

> కిమస్మిన్నేవ మాలోకే శోచ్యతే కిం విముహ్యతే
> కిం ప్రేక్ష్యతే కిం క్రియతే స్థీయతే వాథ గమ్యతే.
>
> (" —618-56)

ఆనందైకరసపూర్ణ స్వభావముగు ఈ ఆత్మ అనుభూతముకాగా, ఇక దేనినిగూర్చి శోకింపవలెను? దేనికై విమోహమొందవలెను? దేనిని చూడవలెను? ఏమి చేయవలెను? ఎచటనుండవలెను? ఎచటికి పోవలెను? (అత్తరి అట్టి శోకాదుల ప్రసక్తియే యుండదని భావము.)

కించిదేవమిదం నామ చిదాకాశం విరాజతే
నమో నమస్తే నిష్ప్రత్యదిష్ట్యా దృష్టోఽసి సుందర.

(" —619-57)

అలౌకిక చమత్కారమగు చిదాకాశమొక టియే విద్యమానమైయున్నది. భౌతికతత్వ రహితుండవగు ఓ పరమాత్మా! నీకు నమస్కారము! మహద్భాగ్యంబున నీవిపుడు నాకు గన్పట్టితివి.

అహో ను సంప్రబుద్ధోఽస్మి సమ్యగ్జ్ఞాతమలం మయా
నమో మహ్యమనన్తాయ సమ్యగ్జ్ఞానోదయాయ చ.

(" —619-58)

ఆహా! నేను లెస్సగ ప్రబుద్ధుడనైతిని. ఆత్మను బాగుగ నెఱింగితిని. సమ్యగ్-జ్ఞానోదయముకల అట్టి అనంత ఆత్మనగు నాకు నమస్కారము!

నయనే రూపనిర్మగ్నే క్షోభః క ఇవ దేహినః
గర్దభే పల్వలే మగ్నేకైవ సేనా పతేః క్షతిః.

(" —697-300)

నేత్రేంద్రియము రూపమందు నిమగ్నము కాగా, ఆత్మకేమిక్షోభ? గాడిద మడుగులో దిగబడిపోవ ఒడ్డుననున్న సేనాపతి కేమిహాని?

రూపకర్దమ మేతన్మా నయనాస్వాదయాధమ
పశ్యత్యేతన్ని మేషేణ భవన్తమపి హింసతి.

(" —697-301)

ఓ అధమ నేత్రమా! ఈ స్త్రీ పుత్రాది సౌందర్య లక్షణమైన "రూప" మను బురదను ఆస్వాదింపకుము. ఏల యనిన ఇయ్యది ఒక్క నిమిషములో నశించి పోవునదై యున్నది. అంతియేకాక వెనువెంట నిన్ను కూడ హింసించి పోవును.

ఉత్పన్నధ్వంసి చాపాతమాత్ర హృద్యమసన్మయమ్
రూపమాశ్రయ మానేత్ర వినాశాయా వినాశినే

(" —697-302)

ఓ నేత్రమా! ఉత్పత్తి వినాశములు గలదియు, విచారణ లేనిచో రమణీయముగ దోచునదియు, మిథ్యయునగు రూపము నాశ్రయించి (దానిచే) అనివార్యమగు మృత్యు ముఖమున ప్రవేశింపకుము.

సలిలస్పన్దవద్వృష్టిః పిచ్ఛకేవామ్బరోత్థితా
సుజాతిబన్ధా స్ఫురతి తవ చిత్త కిమాగతమ్.

(" —698-303)

ఓ చిత్తమా! గో, అశ్వ, స్త్రీ, పురుషాది సుజాతి దుర్జాతి సంబంధరూపముచే నేత్రమునకు స్ఫురించుచున్నట్టి రూపము, నదీ జలము యొక్క గతివలె అనిత్యమును, ఆకాశమున గన్పట్టు నెమలి కన్నులవలె మిథ్యాభూతమును అయి యున్నది. అట్టిదానిచే నీకేమి లాభము?

కల్పాప్సునీవ శఫరీ చిత్తే స్ఫురణధర్మిణి
స్వయం స్ఫురత్యహం కారస్త్వమయం ప్రోత్థితః కుతః

(" —698-304)

ఓ అహంకారమా! ప్రళయకాల జలమున మత్స్యము వలె, చిత్తమున ఈ జగత్తు స్ఫురించుచున్నది. స్ఫురించుగాక; కాని నీవెటనుండి వచ్చితివి ? (ఆ వస్తువులు నావి యని నీవేల అహంకరించుచున్నావు ?)

స్వయమేమననం తస్మాన్మనోభ్యాసేన యత్నతః
విచారాచ్ఛేదమాయాతిచ్ఛిన్నైవాజ్ఞాన భావనా.

(" —698-305)

మనుజునకు తన మనస్సుయొక్క సంకల్ప వికల్పములే పట్టు పురుగుయొక్క దారమువలె తనకు బంధనమై యున్నవి. యత్నపూర్వకమైన వైరాగ్య శమదమాది మనోభ్యాసముచే విచారణద్వారా ఆ బంధనము ఛేదించి వేయబడుచున్నది. అంతట అజ్ఞాన భావనయు ఛిన్నమైపోయినదే యగుచున్నది.

చిత్తవల్గసి మిథ్యైవ దృష్టోఽన్తే భవతో మయా
ఆద్యన్తయోః సుతుచ్ఛం త్వం వర్తమానే వినశ్యసి

(" —699-307)

ఓ చిత్తమా ! నీవు మిథ్యగనే విజృంభించుచున్నావు. నీయొక్క అంతమును (నివారణోపాయమును) నేనిపుడు కనుగొంటిని. అది ఏదనగా, ఆద్యంతములందు నీవు అసత్తై

యున్నావు. కావున వర్తమాన కాలమందును నీవు అసత్తే (లేనిదానవే) యగుదువు.

తిష్ఠవా గచ్ఛవా చిత్త నాసిమే న చ జీవసి
ప్రకృత్యాసి మృతం నిత్యం విచారాత్సుమృతం స్మృతమ్.

(" —699-308)

ఓ చిత్తమా! నీవిక ఉండుము లేక పొమ్ము, నీతో నా కెట్టి సంబంధమున్ను లేదు. మిథ్యాస్వరూపుడవుగాన నీవు మృతుడవే యగుదువు. మఱియు విచారదృష్టిచే చూడ నీవే కాలమందును లేనివాడవై యున్నావు

నిస్తత్త్వం త్వం జడం భ్రాన్తం శఠం నిత్యమృతాకృతే
మూఢ ఏవ త్వయాజ్ఞేన బాధ్యో న ప్రవిచారవాన్.

(" —699-309)

నిత్యమృత్యు స్వరూపముగు ఓ చిత్తమా! నీవు తత్త్వ రహితమై, భ్రాంతిస్వరూపమై, శఠరూపమై యున్నావు. అజ్ఞానయుక్తమగు నీచే మూఢుడే బాధింపబడునుగాని లెస్సగ తత్త్వవిచారణ సల్పువాడు కాదు.

జడే ప్రేతసమాకారే గతే త్వయి మనఃశఠే
సర్వసజ్జన సంసేవ్యమిదం దేహగృహం మమ.

(" —699-310)

పిశాచమువంటి యాకృతిగల నీచుడవను నీవు వెడలుటచే మా దేహగృహము శమదమాది సర్వసజ్జనులకును సేవనీయ మయ్యెను

పూర్వమేవాసి నాసి త్వం సంప్రత్యేవ శతం జగత్
న భవ్యసి చేదానీం వేతాల కింన లజ్జసే.

(" —699-311)

జగద్రూపధారివియు, శవుడవునగు ఓ చిత్తమను బేతాళమా! నీవు పూర్వమున్ను లేవు. ఇపుడును లేకుంటివి. ముందును యుండబోవు. అట్లయియున్నను నీవింక సిగ్గుపడవేల!

సహ తృష్ణా పిశాచీభిః సహ కోపాదిగుహ్యకైః
నిర్గచ్ఛ చిత్తవేతాల శరీర సదనాన్మమ.

(" —700-312)

ఓ చిత్త పిశాచమా! అట్లు సిగ్గుపడుచో, నా దేహగృహమునుండి తృష్ణా పిశాచములతోటిన్ని, క్రోధాది గుహ్యకులతోటిన్ని గూడి వెడలిపొమ్ము.

కస్తే పరాక్రమః కిం తే బలం కస్తే సమాశ్రయః
యదివల్గసి మామేకం జనానాం బాధసే మృతమ్.

(" —700-315)

ఓ దుష్టమనస్సా! ప్రాణులలో దేహాత్మబుద్ధిచే స్వయముగ మృతినొందినవారినే నీవు బంధించుచున్నావు. ఇందు నీ పరాక్రమేమి? బలమేమి? ఆశ్రయమేమి! అద్వితీయమైన ఆత్మస్వరూపుడనగు నన్ను బాధింప సమర్థమైనచో, అపుడు గదా నీ పరాక్రమము!

సర్వార్థైవాసి న మయా దీనచిత్తక మార్యసే
మృత మిత్యవబుద్ధం త్వమద్య కేవలమజ్ఞ హే.

(" —700-316)

ఓ అజ్ఞ దీన చిత్తమా! ఇక నేను నిన్నిపుడు చంపను' వలయునగా, నీవు పూర్వమే లెస్సగ చనిపోయియుంటివని నే నెఱిఁగితిని.

ఏతావన్త మహం కాలం త్వాం జ్ఞాత్వా జీవదాస్థితః
శ్లిష్టః ప్రభూతసజ్జానుచిరం సంసారరాత్రిషు

(" —700-317)

ఓ చిత్తమా! ఇంతకాలము వఱకు నీవు జీవించియున్నావని తలంచి సంసారమను రాత్రులందు చిరకాలము నీతో మిగుల అభేదబుద్ధితో కలిసియుంటిని. (తాదాత్మ్యము నొంది యుంటిని)

చిత్తం మృతం హి నాస్తిదమిత్యద్యాధిగతం మయా
తేన త్వదాశాం సంత్యజ్య తిష్ఠామ్యాత్మని కేవలమ్.

(" —700-318)

ఓ చిత్తమా! "నీవు వాస్తవముగ లేవు, మరణించియున్నావు" అని ఇపుడు తెలిసికొంటిని; కావున నీ ఆశనింక వదలిపెట్టి కేవలము ఆత్మయందే స్థితిగల్గి యున్నాను.

దిష్ట్యా చిత్తం మృతమితి జ్ఞాతమద్య మయా స్వయమ్
న శతేన సమం నేయం సమగ్రం జీవితం నిజమ్.

(" —701-319)

నేనిపుడు చిత్తమును మృతునిగ గనుగొంటిని. ఆహా! ఇది నా పరమ సౌభాగ్యమే అయియున్నది. జీవన్ముక్తుడనగు నేను దుష్టమగు ఈ చిత్తముతో గూడి నా జీవితమంతయు వ్యర్థముగ గడుపరాదు.

ఉత్సార్య దేహ సదనాన్మనః శఠమహం క్షణాత్
అహం స్వస్థః స్థితోఽస్మ్యన్తర్వేతాల పరివర్జితః
(" —701-320)

కామక్రోధాది రూపమగు ఈ దుష్టమనస్సును దేహమను గృహమునుండి వెడలగొట్టి, పిశాచము తొలగిన జీవుని వలె నేనిపుడు నా యంతఃకరణమున స్వస్థుడనై యున్నాను.

చిత్తవేతాలలబ్ధేన చిరం కాలం మయాత్మనా
కృతా వికారా వివిధాః స్వయం స్మృత్వా హసామ్యహమ్
(" —701-321)

చిత్తమను బేతాళముచే మోసగింపబడి దానితో తాదాత్మ్యమును బొంది పూర్వము నేను గావించినట్టి వివిధ దుష్కర్మ లన్నింటిని స్వయముగ పదార్థాత్మ భూతుండనైన నేనిపుడు స్మరించుకొని నవ్వుచున్నాను.

చిరాన్నిపాతితో దిష్ట్యా విచారాసిపరార్థితః
హృద్గేహాచ్చిత్తవేతాలస్తాలోత్తాలసమున్నతిః.
(" —701-322)

తాటివృక్షమువలె దీర్ఘాకారము గల్గియున్న ఈ చిత్తమను బేతాలమును విచారణయను ఖడ్గముచే ఛేదించి చిర

కాలమున కిపుడద్దానిని నా హృదయ గృహమునుండి త్రోసి వైచి నిర్మూలించితిని. ఆహా! ఇది నా పరమ సౌభాగ్యము.

ప్రశాన్తే చిత్తవేతాలే పవిత్రాం పదవీం గతే
దిష్ట్యా శరీరనగరే సుఖం తిష్ఠామి కేవలమ్.
(" —701-323)

సౌభాగ్యవశమున చిత్తమను భేతాళము లెస్సగ శమింప, పవిత్రమగు (ఆత్మ) స్థితిని బొందినట్టి శరీరమను నగరమున నేనిపుడు కేవలము సుఖముగ వసించుచున్నాను.

మృతం మనో మృతా చిన్తామృతోఽహంకారరాక్షసః
విచారమన్త్రేణ సమః స్వస్థస్తిష్ఠామి కేవలమ్.
(" —702-324)

విచారణయను మంత్రముచే మనస్సు చచ్చినది; చింత నశించిపోయినది; అహంకారమను రాక్షసుడు మరణించినాడు, కాబట్టి ఇక నేను ఏవిధమైన వైషమ్యము లేక కేవలము సమరూపుడనై, స్వస్థుడనై యుండుచున్నాను.

కిం మనో మే మమాశా కా కో మేఽహం కా కో భవేత్
దిష్ట్యా వ్యర్థం కలత్రం మే నష్టమే తదశేషతః
(" —702-325)

నాకు మనస్సేమి! ఆశ ఏమి! తుచ్ఛమగు అహంకార మేమి? సౌభాగ్యవశమున ఇపుడు స్త్రీ పుత్రాదు లన్నియు వ్యర్థములని నాకు తోచినది. మఱియు మనస్సు మున్నగునవి యన్నియు నాశ మొందినవి.

ఏకస్మై కృతకృత్యాయ నిత్యాయ విమలాత్మనే
నిర్వికల్పచిదాఖ్యాయ మహ్యమేవ నమోనమః

(" —702-326)

ఏకమై, కృతకృత్యమై, నిత్యమై, నిర్మలమై, నిర్వికల్పమై, చిద్రూపమైనట్టి ఆత్మయగు నాకు నా నమస్కారము!

న మమాశా న కర్మాణి న సంసారో న కర్తృతా
న భోక్తృతా దేహో మే మహ్యమేవ నమో నమః

(" —702-327)

నాకు ఆశలేదు, కర్మలు లేవు, సంసారము లేదు, కర్తృత్వము లేదు, భోక్తృత్వము లేదు, దేహము లేదు. అట్టి ఆత్మరూపుడనగు నాకు నా నమస్కారము!

అహమాదిరహం ధాతా చిదహం భువనాన్యహమ్
మమ నాస్తివ్యవచ్ఛేదో మహ్యమేవ నమోనమః

(" —702-328)

నేను జగత్తులకు ఆది కారణుడను; జగంబుల ధరించువాడను; చిద్రూపుడను; సమస్త లోకములు నేనే; నాకు దేశ, కాల వస్తువులచే పరిచ్ఛేదము లేదు; అట్టి ఆత్మరూపుడనగు నాకు నా నమస్కారము!

నిర్వికారాయ నిత్యాయ నిరంశాయ మహాత్మనే
సర్వస్మై సర్వకాలాయ మహ్యమేవ నమో నమః

(" —703-329)

నిర్వికారుడను, నిత్యుడను, అంశరహితుడును, మహాత్ముడను, సర్వరూపుడను, సర్వకాల స్వరూపుడు (సనాతనుడు) నగు నాకు (నా ఆత్మకు) నా నమస్కారము!

సమాం సర్వగతాం సూక్ష్మాం జగదేక ప్రకాశినీమ్
సత్తా ముపగతోఽస్మ్యహ మహ్యమేవ నమో నమః

(" —703-330)

సమరూపమై, సర్వవ్యాపకమై, సూక్ష్మమై, జగత్తును ప్రకాశింప జేయునట్టి చైతన్యసత్తను నేను బొందితిని. అట్టి ఆత్మస్వరూపుడగు నగు నా కనేక వందనములు.

సాద్ర్యబ్ధ్యుర్వీ నదీసేయం నాహమేవాహమేవవా
జగత్సర్వం పదార్థాఢ్యం మహ్యమేవ నమో నమః

(" —703-331)

పర్వత, సముద్ర, పృథివీ, నదీసహితమై, అనేక పదార్థములచే పరిపూర్ణమైనట్టి ఈ జగత్తు అంతయు (అధిష్ఠాన దృష్టిచే) నేనే; లేక. (ఆరోప దృష్టిచే) అది ఏదియు నేను కాను. అట్టి ఆత్మరూపుడనగు నాకు నా నమస్కారము!

వ్యపగతమననం సమాభిరామం
ప్రకటిత విశ్వమ విశ్వమప్యనన్తమ్
స్వయమజ మజరం గుణాదతీతం
వపురహ మచ్యుత మీశ్వరం నమామి. (" —703-332)

మనోవికల్ప రహితుడును, సమత్వముచే శోభితుడును, విశ్వమును ప్రకటిత మొనర్చువాడును. జగద్రహితుడును,

అనంతుడును, జరాజన్మ వర్జితుఁడును, అచ్యుతుడును, గుణాతీతుడును, చిత్స్వరూపుడును నగు ఈశ్వరునకు నమస్కరించుచున్నాను.

అహో ను చఞ్చలమిదం ప్రత్యాహృతమపి క్షణాత్
న మనః స్థైర్యమాయాతి తరఙ్గప్రోథ పర్ణవత్.
(" —708-8)

ఆహా! మనస్సు ఎంత చంచలమైనది, విషయముల నుండి లాగి పట్టియుంచినను-గొప్ప తరంగములందు కొట్టుకొనిపోవు ఆకువలె-క్షణకాలమైనను స్థిరత్వమును బొందక యేయున్నదే!

మా కురుధ్వమనర్థాయ చాపలం చపలాశయాః
స్మరతాతీతవృత్తీని దుఃఖజాలాలని భూరిశః
(" —709-11)

ఆశాయుక్తములును, చపలములునగు ఓ ఇంద్రియములారా! అనర్థకారకమగు మీ చాపల్యమును వీడి, దుఃఖజాలమయములగు మీ పూర్వక్రియలను స్మరింపుడు.

అహం చిద్వదితి వ్యర్థమసత్యా తవ వాసనా
అత్యన్త భిన్నయోరైక్యం నాస్తి చిన్మనసోః శఠ.
(" —709-12)

ఓ మూర్ఖమనస్సా! "నేను చేతనుడను" అను నీయొక్క వాసన అసత్యమున్ను, వ్యర్థమునై యున్నది. అత్యంత భిన్నములగు చిదాత్మకు, మనస్సునకు ఏకత్వమెన్నటికిని లేదు.

అహంకారోదయే సోఽస్మీత్యేతాం సంరబ్ధతాం త్యజ
న కించిదపి మూర్ఖత్వం కిం వ్యర్థం తరలాయసే.
(" —709-13)

అహంకారోదయముచే నేనుందునను నీ గర్వమును వదులుము. ఓ మూర్ఖచిత్తమా! నీవు వాస్తవముగ లేనే లేవు. వ్యర్థముగ ఏల చపలత్వము గల్గియున్నావు.

మోహహాసపదం గచ్ఛ మూర్ఖేన్ద్రియగణాశ్రయమ్
న కర్తా త్వం న భోక్తా త్వం జడోఽన్యస్త్వేన బోధ్యసే.
(" —709-14)

ఓ మూర్ఖమనస్సా! ఇంద్రియ సమూహము నాశ్రయించి నీవు హాస్యాస్పదుడవు కాకుము; నీవు వాస్తవముగ కర్తవు కావు; భోక్తవు కావు. జడుడవు; మఱియొకదానిచే (సాక్షియగు ఆత్మచే) నీవు బోధింపబడుచున్నావు (ప్రకాశింపబడుచున్నావు).

కస్త్వం భవసి భోగానాం కే వా భోగా భవన్తి తే
జడస్యాసత్త్వైవ తే నాస్తి బన్ధు మిత్రాది తత్కుతః
(" —710-15)

ఓ మనస్సా! జడమై, మిథ్యాభూతమైనట్టి నీకు భోగములకు ఏమి సంబంధము? కావున నీయొక్క భోగాశ వ్యర్థమేయగును. మఱియు జడమగు నీకు స్వరూపమే లేక యుండ ఇక బంధుమిత్రాదులెచట?

స్వయం తావద్భవానేష జడో నాస్త్యత్ర సంశయః
జడస్య కీ దృక్కర్తృత్వం నృత్యన్తీహ కథం శిలాః

(" —710-16)

ఓ చిత్తమా! (చైతన్య ప్రతిబింబము లేనిచో) నీవు స్వయముగ జడుడవే అయియున్నావు. ఇందు సంశయమేమియును లేదు. జడవస్తువునకు కర్తృత్వభోక్తృత్వము లెట్లు సంభవించును? శిలాప్రతిమ ఎచటనైన నాట్యము సల్పునా?

అనారతం బోధయతి త్వామాత్మా పరమేశ్వరః
బోధనీయా బుధైర్మూఢాః కిలావృత్తిశతైరపి

(" —710-17)

ఓ మనస్సా! ఆత్మయగు పరమేశ్వరుడు నిన్ను నిరంతరము ప్రబోధించుచున్నాడు; (ప్రకాశింప జేయుచున్నాడు); వేలయునిన, విజ్ఞులగువారు మూఢులకు మరల మరల అనేక పర్యాయములు బోధింపవలసియున్నది గదా!

ఆత్మసత్తైవ బోధైకరూపిణీ స్ఫురతీహ హి
తయైవ చిత్తశబ్దార్థాపఙ్గీకృత్య త్వయా స్థితమ్.

(" —710-18)

బోధస్వరూపమగు ఆత్మయొక్క సత్తవలననే నీయొక్క సత్తయు స్ఫురించుచున్నది. ఆ యాత్మనుండియే చిత్తశబ్దార్థ సత్తలనంగీకరించి నీవు స్థితినిబొంది యున్నావు.

తస్మాన్మృతం త్వం మూఢం త్వం నాసి త్వం పరమార్థతః
తదేవాహమితి వ్యర్థమతో మా స్వసుఖాయతే.

(" —710-19)

కావున ఓ చిత్తమా! నీవు మృతుడవు; మూఢుడవు; పరమార్థమున ఏమియు కానివాడవు; కాబట్టి "ఈ దేహాదులు నేను" అను తాదాత్మ్యభానముచే జన్మాది దుఃఖములను గలిగింపకుము.

సర్వగం సర్వభావస్థం సర్వరూపం హి తత్పదమ్
తత్రాప్తౌ సర్వమేవాఙ్గప్రాప్తం భవతి సర్వదా.

(" —711-20)

ఓ అజ్ఞచిత్తమా! ఆ చిద్రూపమగు ఆత్మపదము సర్వవ్యాపకమై, సమస్త భూతభవిష్యద్వర్తమాన పదార్థములందున్నదై, సర్వరూపమై వెలయుచున్నది కావున అద్దాని ప్రాప్తిచే సమస్తము సదా ప్రాప్తించినదే యగును.

న త్వమస్తి న దేహోఽస్తి బ్రహ్మాస్తీహ మహత్స్ఫురత్
అహం. త్వమితి నిఃస్పన్దే స్ఫురత్యార్థికస్యకా.

(" —711-21)

ఓ మనస్సా! వాస్తవముగ నీవు లేవు; ఈ దేహమున్ను లేదు; మహత్తరమై ప్రకాశించుచున్న బ్రహ్మము (ఆత్మ) మాత్రమే ఈ ప్రపంచమున కలదు. నిశ్చలమగు అట్టి బ్రహ్మమందు అహంకారమను మిథ్యయగు ఆభాసము స్ఫురించుచున్నది. అట్టిచో ఇక దుఃఖమెవనికి? ఏమి దుఃఖము?

అహం త్విదమహం తన్మ ఇతి వ్యర్థం కి మిహాసే
అసద్వపుః కిం స్ఫురతి శశశృఙ్గేణ కో హతః

(" —711-22)

ఓ చిత్తమా! "నే నీ బాలశరీరమును, నే నీ వృద్ధ శరీరమును, ఈ శరీరమునకు సంబంధించిన పుత్ర పౌత్ర ధనాది పదార్థములు నావి"—అను ఈ ప్రకారముగ ఏల వ్యర్థముగ చింతించుచున్నావు? ఆత్మకు శరీరాదులు లేవు కావున ఈ కానిపించు శరీరాదులు అసద్రూపములే యగును. అట్టివి ఎట్లు స్ఫురించగలవు? కుందేటి కొమ్ముచే ఎవడు చంపబడెను?

సత్యావలోకనాజ్ఞాతే చిత్త జాడ్యదృశోః క్షయే
సంపద్యతే యత్తు తజ్జం స్వసంవేదన మాత్రకమ్.

(" —711-23)

ఓ మనస్సా! సత్యపదార్థమగు ఆత్మయొక్క జ్ఞానముచే చిత్త (చిదాభాస), జడత్వ దృష్టులు క్షయింప, స్వప్రకాశ చిన్మాత్ర రూపమగు ఏ ఆత్మవస్తువు శేషించునో, అట్టి పరబ్రహ్మమే నీవు. కాబట్టి అజ్ఞానమును వీడి ఆత్మవంతుడవు కమ్ము.

తస్మాన్నాసి సఖే కర్తృ మా వ్యర్థం దుఃఖభాగ్భవ
పరార్థంక్లేశితా మూర్ఖప్రాకృతేషు న శోభతే.

(" —712-24)

కావున సఖుడవగు ఓ చిత్తమా! నీవు కర్తవు కావు. వ్యర్థముగ దుఃఖభాజుడవు కావలదు. ఓ మూర్ఖా! నీచములగు ప్రకృతి కార్యములందు మఱొకనికై క్లేశపడుట శోభించ (బోలదు.

ఏతావత్యేక ధ్యానేన నిత్యధ్యానేఽథవాత్మదృక్
అభావే దుఃఖదస్యాస్య సర్వస్య దృశ్యస్య వస్తునః

(" —712-26)

ఓ మనస్సా! అంతర్దృష్టిరూప జ్ఞానముచే నీవు మొదలుగా గల ఈ దుఃఖప్రదమైన దృశ్యమంతయు నశింప దుఃఖరహిత నిరతిశయానంద రూపమగు ఆత్మమాత్రమే శేషించును. ఇది నీకు సంతుష్టికరమగుచో, ఇక ఏకాగ్ర ధ్యానముచే చిరకాలము సమాధి నిష్ఠుడవై ఆత్మదర్శివి కమ్ము.

సంకల్పోన్ముఖతాం విద్ధి దుఃఖదాం సంవిదశ్చ్యుతిమ్
జడేషూపలభూతేషు మనో దేహేన్ద్రియాదిషు.

(" —712-27)

ఓ చిత్తమా! జడములును, శిలారూపములును అగు మనో దేహేంద్రియాదులం గూర్చిన సంకల్పోన్ముఖత్వమను "ఆత్మనుండి జారుట" ఏది కలదో, అది దుఃఖప్రదమనియే నీ వెఱుంగుము.

స్వాత్మభావస్తవ సుఖం మనవతాం వర
తమేవ భావయాభావం సుఖత్యాగో హి మూఢతా

(" —713-32)

మానవంతులలో శ్రేష్ఠుడవగు ఓ చిత్తమా! స్వాత్మరూపమే నీకు సుఖమని నేను తలంచుచున్నాను. కాబట్టి ఇతర పదార్థ రహితమగు ఆ యాత్మనే నీవు భావింపుము. ఏలయనిన, సుఖమును త్యజించుట మూఢత్వమే కదా!

కిం నాస్త్యసి సత్యేన వదామి తవ సున్దర
తేన మిథ్యైవ జీవామీత్యాశయా మా సుఖీ భవ
పూర్వమేవాసి నాస్త్యేవ యావద్భ్రాన్త్యా త్వదస్తితా.
(" —714-33)

ఓ సుందర చిత్తమా! "నీవు వాస్తవముగ లేవు" అని నేను సత్యముగ (శ్రుతి, అనుభవాదుల ద్వారా) నీకు వచించుచున్నాను. కాబట్టి "నేను జీవించియున్నాను" అను మిథ్యయగు ఆశచే నీవు సుఖమును బొందకుము, నీవు మొదటి నుండియు కల్పితుడవై యున్నావు. భ్రాంతి ఎంతవఱకుండునో, అంతవఱకు మాత్రమే నీ యొక్క అస్తిత్వముండును.

సైవేదానీం విచారేణ భృశం క్షయముపాగతా
ఏతావదేవ తే రూపం సాధో యదవిచారమ్.
(" —714-34)

ఆ భ్రాంతియో! ఇపుడు విచారణచే లెస్సగ క్షయించి పోయినది. సాధువగు ఓ మనస్సా! నీ యొక్క రూపము అవిచారణ మాత్రమే అయియున్నది

చిత్తతాయాం ప్రనష్టాయాం స్థితస్త్వం పరమేశ్వరః
ప్రాక్స్వరూపవిలాసస్తే శ్రేయసే స్థితిమాగతః
సమస్తవాసనేన్ముక్తః సంప్రత్యసి మహేశ్వరః
(" —714-36)

ఓ చిత్తమా! నీ యొక్క చిత్తత్వము బాగుగ నశింప నీవు కేవలము పరమేశ్వరుడవే అయి వెలయుదువు. నీవు

పూర్వమున్న పరమేశ్వరుడవే అయియుంటివి. ఇపుడున్న ప్రబోధవశమున సమస్త వాసనారహితుడవుకాగా శ్రేయము కొఱకై నీ యొక్క పూర్వపు ఆత్మస్వరూప విలాసము స్థితిఁ బొంద నీవు మహేశ్వరుడవే అయి వెలయుచున్నావు.

అనిచ్ఛతోఽపి తే సాధో విచారే స్థితిమాగతే
సర్వతోఽయముపాయాతో వినాశః సుఖసిద్ధయే.
(" —715-38)

సాధువగు ఓ చిత్తమా! నీ యందెపుడు విచారణ స్థితిఁబొందునో, అపుడు నీవిచ్ఛయించకున్నను, సుఖసిద్ధికొఱకై నీ వినాశము నలువైపులనుండి వచ్చి లటస్థించును.

భోభో ఇన్ద్రియచౌరా హేహతాశాహత నామకాః
యుష్మాకం నాయమాత్మాస్తి న భవన్తస్తథాత్మనః
వ్రజతాం వో వినాశాంశమాశా వో విపలీకృతాః
న సమర్థాః సమాక్రాన్తే భవన్తే భఙ్గురాశ్రయాః
(" —717-51,52)

ఓ ఇంద్రియ చోరులారా! హతుఁడవగు ఓ ఆశా! ఈ ఆత్మ మీది కాదు. మీ రాత్మకును జెందరు. ఆత్మతో సంబంధము లేక యున్నందునసే మీరు వినాశమును బొంతివిరి. మీ యాశలన్నియు వ్యర్థములైనవి. అట్టి విఫలురగు మీరు నాపై యాక్రమణము సల్ప సమర్థులు కారు.

పుష్పస్యాన్తరివామోదః ప్రాణస్యాన్తరవస్థితమ్
న చ ప్రాణం న వాఽపానం చిదాత్మాన ముపాస్మహే.
(" —780-39)

పుష్పములోన సుగంధమువలె ప్రాణములోన (సాక్షిరూపమున) స్థితి గల్గియున్నదియు, ప్రాణముగాని, అపానముగాని కానిదియునగు చిదాత్మను మేము ఉపాసించుచున్నాము.

మనసో మననం సత్యం బుద్ధేరేకావబోధనమ్
అహంకృతే రహంకారం చిదాత్మాన ముపాస్మహే.
(" —780-40)

మనస్సును గూడ ఎఱుఁగునదియు, సత్యమైనదియు, బుద్ధిని అహంకారమును (సాక్షియై) ప్రకాశింపజేయునదియు నగు చిదాత్మను మేము ఉపాసించుచున్నారము!

యస్మిన్సర్వం యతః సర్వం యత్సర్వం సర్వతశ్చయత్
యచ్చసర్వమయం నిత్యం తచ్చితత్త్వ ముపాస్మహే.
(" —780-41)

దేనియందు సమస్తము (సమస్త ప్రపంచము) కలదో, దేనినుండి సమస్తము ఆవిర్భవించుచున్నదో, ఏది సమస్తము అయియున్నదో, ఏది సర్వత్ర వ్యాపించియున్నదో, ఏది సర్వమయమై యొప్పుచున్నదో, అట్టి చిదాత్మను మేము ఉపాసించుచున్నాము!

ఆలోకాలోకనం పుణ్యం సర్వపావన పావనమ్
న చ భావనమన్వానం తచ్చితత్త్వ ముపాస్మహే.
(" —780-42)

సూర్యాది ప్రకాశక వస్తువులఁగూడ ప్రకాశింపజేయునదియు, పుణ్యరూపమైనదియు, పవిత్రమైన వానినన్నింటిని గూడ పవిత్రమొనర్చునదియు, నిశ్చయముగ మనోబుద్ధ్యాది వికారములకు స్రమము కానిదియు (వానివలన తన పూర్వసిద్ధ స్వభావము నుండి జారనిదియు) నగు చిదాత్మను మేము ఉపాసించుచున్నాము!

నిత్యా నిత్యాసు లోలాసు జగత్స్థితిషు సుస్థితః
అన్తర్ముఖోఽస్మి తిష్ఠామి స్వకామేనాత్మనాత్మని
(" —781-43)

నిత్య, అనిత్య, ఇష్ట, అనిష్ట రూపములును, చంచలములు నగు ఈ జగత్స్థితులందు నేను విక్షేపరహితుడనై యున్నాను. మఱియు అంతర్ముఖుడనై, స్వేచ్ఛగ ఆత్మయందు నెలకొని యున్నాను.

అపి సంరుధ్యతే వాయురపి వాసలిలం గతేః
నైతస్మాత్సుసమాధానా ద్విరుద్ధం సంస్మరామ్యహమ్.
(" —781-44)

వాయువు నిరోధింపబడిన నిరోధింపబడుగాక, ప్రబల నదీ స్రోతము అడ్డగింపబడిన అడ్డగింపబడుగాక; అయినను నా ఈ ఆత్మ సమాధిని ఎవ్వరును అడ్డగింపజాలరు; మఱియు ఈ సమాధికి విరుద్ధమగు విషయమును గూడ నేను స్మరింపజాలను.

న భూతం న భవిష్యం చ చిన్తయామి కదాచన
దృష్టిమాలమ్బ్య తిష్ఠామి వర్తమానమిహాత్మనా.
(" —781-45)

గడచినదానినిగాని లేక రాబోవుదానిని గుఱించిగాని నే నెన్నడును చింతింపను. వర్తమాన దృష్టిని—నిత్యవర్తమాన స్వభావమగు సాక్షి దృష్టిని-అవలంబించి, ఆత్మయందు నేను వెలయుచున్నాను.

యథాప్రాప్తేషు కార్యేషు పరిత్యక్తఫలైషణః
సుషుప్తసమయా బుద్ధ్యా పరితిష్ఠామి కేవలమ్.
(" —781-46)

యథా ప్రాప్తములగు కార్యములను ఫలాపేక్షా రహితముగ కేవలము సుషుప్తియందలి (నిర్వికార) బుద్ధితో ఆచరించుచున్నాను.

భావాభావమయీం చిన్తా మీహితానీహితాన్వితామ్
విమృశ్యాత్మని తిష్ఠామి చిరంజీవామ్యనామయః.
(" —781-47)

భావ, అభావమయమై, ఇష్ట, అనిష్ట సహితమైనట్టి చింతను విమర్శించి, (అవి తుచ్ఛములని నిశ్చయించి) ఆత్మయందు స్థితి గల్గియున్నాను; ఇక్కారణమున నేను సంతాన రహితుడనై చిరకాలము జీవించుచున్నాను.

ఇదమద్య మయా లబ్ధమిదం ప్రాప్స్యామి సున్దరమ్
ఇతి చిన్తా న మే తేన చిరం జీవామ్యనామయః
(" —781-48)

'నేను దీనిని పొందితిని; రేపు ఆ సుందర వస్తువును పొందెదను—అను ఈ ప్రకారమగు చింత నాకు లేదు. కావున నేను సంతాపరహితుడనై చిరకాలము జీవించుచున్నాను.

న తుష్యతి శుభప్రాప్తౌ నాశుభేష్వపి ఖిద్యతే
మనో మమ సమం నిత్యం తేనాహం శుభమాగతః
(" —782-49)

నా మనస్సు శుభము ప్రాప్తించినపుడు సంతోషము నొందదు; అశుభము ప్రాప్తించినపుడు దుఃఖపడదు; సదా సమముగనే యుండును. ఇక్కారణమున శుభజీవితము గలిగి యున్నాను.

పరమం త్యాగమాలమ్బ్య సర్వమేవ సదైవ హి
జీవితాది మయా త్యక్తం తేనాహం శుభమాగతః
(" —782-50)

సర్వదృశ్య త్యాగరూపమగు మహాత్యాగమును సదా అవలంబించినవాడనై జీవితాదులను (జీవన అభిమానాదులను) గూడ త్యజించివైచితిని. కావున నేను శుభమునే పొందితిని.

ప్రశాన్తచాపలం వీతశోకం స్వస్థం సమాహితమ్
మనో మమ మునే శాన్తం తేన జీవామ్యనామయః
(" —782-51)

మునీంద్రా! నా మనస్సు చపలత్వము నశించినదై, శోకవర్జితమై, స్వస్థమై, ఆత్మయందు సమాధాన మొందినదై, శాంతమైయున్నది. కాబట్టి సంతాపరహితుడనై జీవించుచున్నాను.

కాష్ఠం విలాసినీం శైలం తృణమగ్నిం హిమం నభః
సమం సర్వత్ర పశ్యామి తేన జీవామ్యనామయః.

(" —782-52)

కొయ్యను-సుందర స్త్రీని, పర్వతమును-తృణమును, అగ్నిని-మంచును, ఆకాశమువలె సమముగ సర్వత్ర కాంచుచున్నాను. ఇక్కారణమున నేను సంతాపరహితుడనై జీవించుచున్నాను.

జరామరణదుఃఖేషు రాజ్యలాభసుఖేషు చ
న బిభేమి నహృష్యామి తేన జీవామ్యనామయః

(" —782-53)

వార్ధక్యమరణాది దుఃఖములందు నేను భయపడను; రాజ్యలాభాది సుఖములందు సంతోషింపను; కావుననే సంతాపరహితుడనై జీవించుచున్నాను.

అయం బన్ధుః పరశ్చాయం మమాయమయమన్యతః
ఇతి బ్రహ్మన్నజానామి తేన జీవామ్యనామయః

(" —783-54)

మహాత్మా! 'ఈతడు బంధువు, ఈతడు బంధువు ఈతడు నావాడు, ఈతడు వానివాడు' — అను ఈ

ప్రకారమగు భేదమును నేనెఱుంగను. కావుననే ఏ సంతాపమున్ను లేక జీవించుచున్నాను.

సర్వం సర్వపదాభాస మనాద్యన్త మనామయమ్
అహం చిదితి జానామి తేన జీవామ్యనామయః.

(" —783-55)

నానా పదార్థరూపమున భాసించు ఈ సమస్తమున్ను ఆద్యంతరహితమై, నిర్వికారమైనట్టి చైతన్యమే యనియు, ఆ చైతన్యము నేనే యనియు ఎఱిఁగి యుండుట వలన సంతాప వర్జితుడనై నేను జీవించుచున్నాను.

ఆహరన్విహరం స్తిష్ఠన్నుత్తిష్ఠన్నుచ్ఛ్వసన్స్వపన్
దేహోఽహమితి నోవేద్మి తేనాస్మి చిరజీవితః

(" —783-56)

గ్రహించుచున్నను, విహరించుచున్నను, కూర్చొనుచున్నను, నిలబడుచున్నను, నిద్రించుచున్నను "నేను దేహమును" అని ఎఱుఁగను గావున చిరంజీవియై విలసిల్లుచున్నాను.

ఇమం సంసారమారమ్భం సుషుప్తపదవత్స్థితః
అసన్తమివ జానామి తేన జీవామ్యనామయః.

(" —783-57)

సుషుప్తియందువలె నున్నవాడనై, ఈ సంసార కార్యమును లేనిదిగ (మిథ్యగ) ఎఱుఁగుచున్నాను అందుచే సంతాపరహితుడనై జీవించుచున్నాను.

యథాకాలముపాయాతౌ వర్ధానర్థౌ సమౌ మమ
హస్తావివ శరీరస్థౌ తేన జీవామ్యనామయః.

(" —783-58)

(ప్రారబ్ధానుసారము) భోగకాలము ననుసరించి సంప్రాప్తించు అర్థ, అనర్థముల రెండిటిని శరీరమందలి హస్తముల చందమున సమముగ జూచుచున్నాను. ఈ కారణమున ఏ చింతయు లేక జీవించుచున్నాను.

అపరిచలయా శక్త్యా సుదృశాస్నిగ్ధముగ్ధయా
ఋజు పశ్యామి సర్వత్ర తేన జీవామ్యనామయః

(" —783-59)

ఆత్మ స్వరూపము నుండి చలింపని మనస్సు యొక్క స్థిరశక్తిచే సర్వ భూతములందును ఆత్మౌపమ్య దృష్టితో గూడి అతి ప్రేమయుక్తముగ, కుటిలత్వరహితముగ సర్వత్ర వీక్షించుచున్నాను. కాబట్టి సంతాపరహితుడనై జీవించుచున్నాను.

ఆపాదమస్తకాన్తేఽస్మిన్న దేహే మమతా మమ
త్యక్తాహంకార పఙ్కస్య తేన జీవామ్యనామయః

(" —784-60)

అహంకారమను బురదను వదలివైచినట్టి నాకు ఆపాద మస్తకమగు ఈ దేహమున మమత్వము లేనే లేదు. ఈ కారణమున ఏ సంతాపమున్ను లేక జీవించుచున్నాను.

యత్కరోమి యదశ్నామి తత్త్యక్త్వా తద్వతోఽపి మే
మనో నైష్కర్మ్యమాదత్తే తేన జీవామ్యనామయః

(" —784-61)

నేనేమి చేసినను, ఏమి భుజించినను, నా మనస్సు వానిం గూర్చిన అభిమానమును త్యజించినదై, ఆయా కార్యములతో గూడియున్నను, నైష్కర్మ్యమునే (అకర్తృత్వ, అభోక్తృత్వ భావమునే) కలిగియుండుచున్నది. ఈ హేతువుచే నేనే ఏ సంతాపమున్ను లేక జీవించుచున్నాను.

కరోమీశోఽపి నాక్రాన్తిం పరితాపే న ఖేదవాన్
దరిద్రోఽపి న వాఞ్ఛామి తేన జీవామ్యనామయః

(" —784-62)

ఇతరులను జయింప సమర్థుడనై యున్నను నేనెవరి మీదికిని పోను; ఇతరులు నాకు పరితాపమును గలిగించినను (సహనశీలుండనై) దుఃఖింపను; దరిద్రుడనైనను దేనిని వాంఛింపను; ఈ కారణమున ఏ చింతయు లేక సుఖముగ నేను జీవించుచున్నాను.

పశ్యద్రూపే శరీరేఽస్మిన్నూతస్థాత్మా చిదాస్పదః
భూతవృన్దమహం సామ్యాత్తేన జీవామ్యనామయః

(" —784-63)

చేతన ప్రాయముగ కానిపించు ఈ జడశరీరమున ఉన్నప్పటికిని నేను శరీరాత్మదర్శిని కాను. చిన్మాత్రాత్మ దర్శినే అయియున్నాను. మరియు చిదాత్మ సర్వ ప్రాణు

లందును సమముగ నుండుటఁ బట్టి నేను సర్వభూతములందలి ఆత్మయే అయి, ఆ భూత సమూహమును నా శరీరమువలె గాంచుచున్నాను. దానిచే నేను సంతాపరహితుడనై జీవించుచున్నాను.

అసత్తాం జగతః సత్తామాత్మనః కర బిల్వవత్
సుప్తః ప్రబుద్ధః పశ్యామి తేనాస్మి చిరజీవితః
(" —785-64)

నేను జగద్విషయుమై నిద్రించియు, ఆత్మ విషయుమై మేలుకొనియు నుందును; మఱియు ఈ జగత్తుయొక్క లేమిని ఆత్మయొక్క ఉనికిని అరచేతియందలి మారేడు పండునువలె ప్రత్యక్షముగ గాంచుదును. ఈకారణమున నేను చిరంజీవినై వెలయుచున్నాను.

ఆపద్య చలధీరోఽస్మి జగన్మిత్రం చ సంపది
భావాభావేషు నైవాస్మి తేన జీవామ్యనామయః
(" —785-65)

ఆపదలందు నేను పర్వతము మాడ్కి అచంచలుడనై, ధీరుడనై యుందును. సంపదలందు జగత్తునకు మిత్రుడనై యుందును. మరియు ధనాది పదార్థముల సంపాదన, క్షయములందు నేను అభినివేశము గలిగియుండను. కావున నేను సంతాపరహితుడనై జీవించుచున్నాను.

నాహమస్మి న చాన్యోమే నాహమన్యస్య కస్యచిత్
ఇతి మే భావితం చిత్తం తేన జీవామ్యనామయః
(" —785-66)

'నా ఈ ఉపాధిలేదు; నాకు మరియొక డెవడును లేడు; నే నెవనివాడను కాను' — అను ఈ ప్రకారముగ నా చిత్తము నిశ్చయించి యున్నది. కాబట్టి నేను సంతాపరహితుడనై జీవించుచున్నాను.

అహం జగదహం వ్యోమ దేశకాల క్రమావహమ్
అహం క్రియేతి మే బుద్ధిస్తేన జీవామ్యనామయః
(" —785-67)

ఈ జగత్తు నేనే, ఆకాశము నేనే, దేశకాలములు నేనే, క్రియ నేనే, అని యీ ప్రకారముగ నా బుద్ధి నిశ్చయించినది. కావున నేను దుఃఖరహితుడనై జీవించుచున్నాను.

———